
'ఎన్ని కరువులనైనా ఎదుర్కోగలగాలి
దీని కోసం ఆర్థికంగా ఎదగాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 107

సోమవారం 8-7-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



అభిషేక్ అదరహో...

'శత'క్కొట్టిన భారత ఓపెనర్. రెండో టి20లో జింబాబ్వేపై విజయం - 16లో



మహోన్నత నాయకత్వం


మహానేత వైఎస్సార్ జయంతి సందర్భంగా ప్రత్యేక వ్యాసం - 4లో



ఉత్తరాదిని ముంచెత్తిన వర్షాలు

ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, బిహార్, పశ్చిమ బెంగాల్, అస్సాం, మహారాష్ట్రసహా పలు రాష్ట్రాలను భారీ వర్షాలు ముంచెత్తాయి.

- వివరాలు 6లో



డేంజర్ మార్కు భుగభుగలు

భూతాపం ఈ శతాబ్దంలో 2.5 డిగ్రీలకు పైగా పెరిగి మానవాళిని వినాశనం వైపు నెట్టవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

- వివరాలు 6లో



బైక్‌ను ఢీకొట్టి..

ముంబైలో ఓ బీఎండబ్ల్యూ కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో బైక్‌పై ఉన్న మహిళ మృతి చెందింది.

- వివరాలు 6లో



రష్యాకు ప్రధాని మోదీ

ఇండో–రష్యా వార్షిక శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం రష్యాకు వెళ్లనున్నారు.

- వివరాలు 6లో

న్యూస్‌రీల్

గ్రూప్‌-1 ప్రిలిమినరీ పరీక్ష ఫలితాలు విడుదల



రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో 563 గ్రూప్‌–1 ఉద్యోగాల భర్తీకి సంబంధించి జూన్‌ 9న నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్ష ఫలితాలు ఆదివారం విడుదలయ్యాయి. ఈ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థుల జాబితా తెలంగాణ పబ్లిక్‌సర్వీస్‌ కమిషన్‌ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంది.

- వివరాలు 14లో

పిల్లలమర్రికి పూర్వవైభవం



పురాతన పిల్లలమర్రి పూర్వస్థితికి తిరిగొచ్చేలా అటవీ శాఖ చేసిన కృషి ఫలించింది. సుమారు 700 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన ఈ చెట్టు మళ్లీ పూర్వ వైభవం సంతరించుకుంటోంది.

- వివరాలు 18లో



ఆదివారం ఒడిశాలోని పూరీలో నిర్వహించిన జగన్నాథ రథయాత్రలో పాల్గొన్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము 6లో



హైదరాబాద్‌లో నిర్వహించిన జగన్నాథ రథయాత్ర సందర్భంగా రథం ముందు చీపురుతో ఊడుస్తున్న సీఎం రేవంత్ 2లో



హైదరాబాద్‌లో గోల్కొండ బోనాల సందర్భంగా పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న స్పీకర్ ప్రసాద్, మంత్రులు పొన్నం, సురేఖ, ఎమ్మెల్యే దానం, బంగారు బోనంతో జోగిని నిశాక్రాంతి 3లో

వారానికో జిల్లాకు సీఎం

క్షేత్రస్థాయి పర్యటనలకు సిద్ధమవుతున్న ముఖ్యమంత్రి రేవంత్

అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుపై సమీక్షలకు నిర్ణయం

- సొంత జిల్లా పాలమూరు నుంచి షురూ.. 9న ఉమ్మడి మహబూబ్‌నగర్ సమీక్ష
- విద్య, వైద్యం, సాగునీటి రంగాలు, శాంతిభద్రతలపై ప్రధానంగా దృష్టి
- జిల్లాల్లో పెండింగ్‌లో ఉన్న సమస్యలపైనా నజర్
- 7 నెలల పాలనపై ప్రజాభిప్రాయాన్ని తెలుసుకునే ఆలోచనలో సీఎం



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి క్షేత్రస్థాయి పర్యటనలపై దృష్టి పెట్టారు. ఇకపై ప్రతి వారం ఒక జిల్లాకు వెళ్లాలని, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలును సమీక్షించడంతో పాటు ఆయా జిల్లాల వారీగా పెండింగ్‌లో ఉన్న పనులన్నింటినీ త్వరితగతిన పూర్తి చేసేలా అధికారులకు దిశానిర్దేశం చేయాలని ఆయన నిర్ణయించుకున్నారు. తన సొంత జిల్లా పాలమూరు నుంచి ఆయన పర్యటనలు ప్రారంభించనున్నారు. ఈ నెల 9వ తేదీన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా సమీక్ష నిర్వహించనున్నారు. జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాల అమలును సీఎం సమీక్షిస్తారని, ఈ మేరకు అన్ని వివరాలతో సమావేశానికి రావాలని క్షేత్రస్థాయి యంత్రాంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఉమ్మడి జిల్లా పరిధిలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, వివిధ శాఖల అధిపతులు కూడా ఈ కార్యక్రమానికి హాజరు కావాలని ఇప్పటికే ప్రభుత్వ వర్గాల నుంచి సమాచారం అందింది.

కీలక రంగాలపై ఫోకస్

జిల్లాల పర్యటనలో భాగంగా కీలక రంగాలపై ఫోకస్ పెట్టాలని ముఖ్యమంత్రి నిర్ణయించినట్టు తెలిసింది. విద్యాసంవత్సరం ప్రారంభం కానుండడం, వర్షాకాలం నేపథ్యంలో విద్య, వైద్యం, సాగునీటి రంగాల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలు, తీసుకోవాల్సిన చర్యలపై ఆయన సమీక్ష జరుపుతారని సీఎంవో వర్గాల ద్వారా తెలిసింది. ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయడంపై ఇప్పటికే దృష్టి పెట్టిన సీఎం.. ఆ దిశలో చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు సూచనలు చేయనున్నారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్ కాంప్లెక్సుల నిర్మాణం, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లుగా ఐటీఐల అప్‌గ్రేడేషన్ తదితర అంశాలపై కూడా ఆయన దృష్టి పెట్టనున్నారు. వర్షాకాలంలో వచ్చే అంటు వ్యాధులు, వైద్య శాఖ తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రభుత్వ వైద్యరంగ బలోపేతం తదితర అంశాలపై కూడా సూచనలు చేయనున్నారు. ఇక ప్రతి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల గురించి స్థానిక అధికారులతో సీఎం ప్రత్యేకంగా మాట్లాడతారని, త్వరగా పూర్తయ్యేందుకు అవకాశం ఉన్న ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించడం

మిగతా 2వ పేజీలో ▶



వచ్చే మార్చిలోగా 6 ప్రాజెక్టులు రెడీ

- తక్కువ ఖర్చుతో తక్కువ సమయంలో పూర్తయ్యే ప్రాజెక్టులపై సర్కారు దృష్టి.. గోదావరి బేసిన్‌లోని ప్రాజెక్టులు ఎంపిక
- రూ.241 కోట్ల అంచనా వ్యయం..

2లో

బదిలీల ఫీవర్



ఉద్యోగుల సాధారణ బదిలీలకు అవకాశం కల్పించిన ప్రభుత్వం

- 5 నుంచి మొదలైన ప్రక్రియ.. శాఖల వారీగా మార్గదర్శకాలు విడుదల
- సీనియార్టీ, ఖాళీల స్థితిని అంచనా వేసుకుంటున్న ఉద్యోగులు..
- 'గరిష్టంగా 40%' నిబంధనతో సీనియర్లకే బదిలీ చాన్స్!

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల్లో బదిలీల ఫీవర్ మొదలైంది. దాదాపు ఆరేళ్ల తర్వాత సాధారణ బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతివ్వడంతో హడావుడి కనిపిస్తోంది. ప్రధానంగా ఏళ్ల తరబడి ఒకే చోట పనిచేస్తున్న వారు స్థానచలనం కోసం కసరత్తు మొదలుపెట్టారు. సీనియార్టీ, ఖాళీల స్థితిని అంచనా వేసుకుంటూ బదిలీలకు ఉన్న అవకాశాలను విశ్లేషించుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగుల సాధారణ బదిలీలకు అవకాశం కల్పిస్తూ ఈనెల 3వ తేదీన ఉత్తర్వులు జారీ

మిగతా 3వ పేజీలో ▶

టార్గెట్ బీఆర్ఎస్!

తెలంగాణలో 'బాబు' రాజకీయం షురూ



చంద్రబాబుతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రకాశ్‌గౌడ్, అరికెపూడి గాంధీ

- రేవంత్‌తో సమావేశం తర్వాత యాక్టివ్ అయిన ఏపీ సీఎం
- రెండుకళ్ల సిద్ధాంతం మరోమారు తెరపైకి
- చంద్రబాబును కలిసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గాంధీ, ప్రకాశ్‌గౌడ్
- మంత్రి తుమ్మలతోనూ ప్రత్యేక సమావేశం

5లో

క్లుప్తంగా...

ఫిరాయింపులపై బీఆర్ఎస్ మాట్లాడటమా?

- ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి



సాక్షి, హైదరాబాద్: రాజకీయ ఫిరాయింపుల గురించి మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్ నేతలకు లేదని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఏర్పడిన ప్రభుత్వాన్ని కూలుస్తామని బీఆర్ఎస్ నేతలు పదేపదే మాట్లాడుతుంటే.. చూస్తూ కూర్చోవాలా? అని ప్రశ్నించారు. సీఎల్పీ కార్యాలయంలో ఆదివారం షాద్‌నగర్ ఎమ్మెల్యే ఈర్లపల్లి శంకర్‌తో కలిసి మంత్రి జూపల్లి మాట్లాడుతూ రాష్ట్రంలో సుస్థిర ప్రభుత్వం కోసమే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని తెలిపారు. మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ఇప్పుడు రాహుల్‌గాంధీకి లేఖ రాయడం విడ్డూరంగా ఉందన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉండి ఇతర పార్టీల నేతలను తన పార్టీలోకి గుంజుకున్నప్పుడు.. ఆయనకే నిరంజన్‌రెడ్డి లేఖ రాయాల్సిందని వ్యాఖ్యానించారు. అధికారంలో ఉన్నప్పుడు చేసిన నిర్వాకాల వల్లే ప్రజలు కేసీఆర్, నిరంజన్‌రెడ్డిలను ఓడించారని తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విలువల గురించి బీఆర్ఎస్ నేతలు మాట్లాడడం దయ్యాలు వేదాలు వల్లించినట్టుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్ ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్‌కు మనుగడ లేదని ఆ పార్టీ కార్యకర్తలే భావిస్తున్నారని చెప్పారు. అందుకే ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలోకి వస్తున్నారని శంకర్ వ్యాఖ్యానించారు.

అధికారం లేకుంటే బతుకులేదా?: కొప్పుల



పెద్దపల్లి రూరల్: పోచారం శ్రీనివాసరెడ్డి, కడియం శ్రీహరి లాంటి నేతలు బీఆర్ఎస్ హయాంలో పదేళ్లపాటు పదవులు అనుభవించి ఇప్పుడు పార్టీని వీడడం బాధాకరమని మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. పెద్దపల్లిలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్, మాజీ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. పదేళ్లపాటు బీఆర్ఎస్ సర్కారులో పదవులు అనుభవించి.. అధికారం ఎటు ఉంటే అటువైపు మారుతారా?... థూ.. మీ బతుకులు చెడ.. అని శాపనార్థాలు పెట్టారు. వారసుల కోసం పార్టీ మారామని చెబుతున్న నేతలు వారిని పంపి.. బీఆర్ఎస్‌లో ఉండవచ్చు కదా? అన్నారు. కాంగ్రెస్ మోసాలు, అబద్ధాలు అనతికాలంలో ప్రజలకు అర్థమయ్యాయన్నారు. ఇప్పుడు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన ప్రజాప్రతినిధులు, నేతలకు సైతం కనీస గౌరవం లభించక అవమానాలపాలవుతున్నారన్నారు.

రేపు బీజేపీ మహిళా మోర్చా ధర్నా

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 200 రోజులైనా ఆరు గ్యారంటీలు అమలు కాలేదని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వంతో ఆరు గ్యారంటీలు అమలు చేయించేంతవరకు ఆందోళన చేపడతామని పేర్కొన్నారు. ఈ నెల 9న ఇందిరా పార్క్ వద్ద మహిళామోర్చా ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. ధర్నాలో కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి పాల్గొంటారని పేర్కొన్నారు.

రేవంత్ హామీలు నెరవేర్చాలి



పంజగుట్ట (హైదరాబాద్): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్యమకారులను అణచివేయడం మాని.. ఎన్నికల హామీలను నెరవేర్చాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. కులగణన జరిపి, స్థానిక సంస్థల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు ఇవ్వాలని, రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలని, కోరుతూ ఈ నెల 15న నిర్వహించనున్న సెక్రటేరియట్ ముట్టడి కార్యక్రమ పోస్టర్‌ను ఆదివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాం యాదవ్‌తో కలిసి ఆర్.కృష్ణయ్య ఆవిష్కరించారు. కార్యక్రమంలో హిందు బీసీ మహాసభ అధ్యక్షుడు సిద్దేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఇదంజగత్



..ఇప్పుడు మళ్లీ దీనితో ఏం అవసరమొచ్చింది సార్!

అన్ని మతవిశ్వాసాలను గౌరవిస్తాం

- ఇస్కాన్ ఆధ్వర్యంలో జరిగిన జగన్నాథ రథయాత్ర ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్
- పాడిపంటలతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని దేవుడిని ప్రార్థించినట్లు వెల్లడి
- రథానికి దిష్టి తీసి, చీపురుతో రోడ్డు ఊడ్చి యాత్రను ప్రారంభించిన ముఖ్యమంత్రి

కవాడిగూడ: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అందరిదీ అని.. తమ సర్కారు మతసామరస్యాన్ని కాపాడుతుందని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. సర్వ మతాలకు స్వేచ్ఛ, భావజాలం వ్యాప్తికి అవకాశం ఇవ్వడంతోపాటు భక్తులకు సౌకర్యాలు కల్పించడాన్ని బాధ్యతగా తీసుకుంటోందన్నారు. అన్ని మతాల ఆచార, సంప్రదాయాలను గౌరవిస్తామన్నారు. మానవ సేవే మాధవ సేవ అనే సూక్తిని అందరికీ చేరే విధంగా తమ ప్రభుత్వం ప్రయత్నిస్తుందని చెప్పారు. ఆదివారం అబిడ్స్ ఇస్కాన్ (అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం) ఆధ్వర్యంలో ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన పూరీ జగన్నాథ రథయాత్రకు సీఎం రేవంత్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గుమ్మడికాయతో దిష్టి తీసి హారతి ఇచ్చి రథం ముందు చీపురుతో రోడ్డు ఊడ్చి రథయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ రాజుల కాలం నుంచి వస్తున్న పూరీ సంప్రదాయాన్ని తాను సీఎం హోదాలో ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. పాడిపంటలు బాగా పండి తెలంగాణ సుభిక్షంగా ఉండాలని భగవంతుడిని వేడుకుంటున్నానని తెలిపారు. అనంతరం భాగవతం కాపీలను అర్చకులకు అందజేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ఇస్కాన్ నిర్వాహకులు ప్రసాదం అందజేసి జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీ మందడి అనిల్ కుమార్‌యాదవ్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుడు రోహిణ్‌రెడ్డితోపాటు భక్తులు పాల్గొన్నారు.



ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

వచ్చే మార్చిలోగా 6 ప్రాజెక్టులు రెడీ

- తక్కువ ఖర్చుతో స్వల్ప కాలంలో పూర్తయ్యే ప్రాజెక్టులపై సర్కారు దృష్టి
- గోదావరి బేసిన్‌లోని ఆరు ప్రాజెక్టులు ఎంపిక
- రూ.241 కోట్ల అంచనా వ్యయం.. 48 వేల కొత్త ఆయకట్టుకు సాగునీరు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అర్ధాంతరంగా ఆగిపోయిన ఆరు సాగునీటి ప్రాజెక్టులను వీలైనంత త్వరగా పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టులు గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నిర్లక్ష్యానికి గురయ్యాయని రేవంత్‌రెడ్డి సర్కారు ఆరోపిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో చివరి దశలో ఉన్న పాత ప్రాజెక్టులను, ప్రధానంగా తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు సాగునీటిని అందించే ప్రాజెక్టులను ప్రాధాన్యతగా తీసుకుని సత్వరంగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నారు. అందుకు అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని ఇటీవల నిర్వహించిన సమీక్షలో ఆయన నీటిపారుదల శాఖ అధికారులకు సూచించారు. గోదావరి పరీవాహకంలోని నీల్వాయి, పింప్రి, పాలెంవాగు, మత్తడివాగు, ఎస్సారెస్పీ స్టేజీ- 2, సదర్మట్ ప్రాజెక్టులను వేగంగా తక్కువ ఖర్చుతో తక్కువ సమయంలో పూర్తిచేయవచ్చని నీటిపారుదల శాఖ ప్రతిపాదించగా, ప్రభుత్వం ఆమోదించింది. ఈ ప్రాజెక్టుల పూర్తికి దాదాపు రూ.241 కోట్లు ఖర్చవుతుందని, 48 వేల ఎకరాల ఆయకట్టుకు నీరు అందుతుందని నీటిపారుదల శాఖ అంచనా వేసింది. రూ.18.47 కోట్లు ఖర్చు పెడితే నీల్వాయి ద్వారా మంచిర్యాల జిల్లాలో 2,632 ఎకరాలకు సాగునీరు అందనుంది. రూ.17.02 కోట్లతో పాలెంవాగు ప్రాజెక్టు ద్వారా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 2,632 ఎకరాలకు నీరు అందనుంది. పింప్రి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ ద్వారా నిర్మల్ జిల్లా, మత్తడివాగుతో ఆదిలాబాద్ జిల్లా, ఎస్సారెస్పీ స్టేజీ 2తో వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, జనగాం, సూర్యాపేట జిల్లాలకు, సదర్మట్ ప్రాజెక్టుతో నిర్మల్ జిల్లాలోని రైతులకు సాగునీరు అందుతుంది. ఈ నేపథ్యంలో వచ్చే ఏడాది 2025 మార్చి నాటికి ఈ ప్రాజెక్టులకు సంబంధించిన వంద శాతం పనులు పూర్తి చేయాలని గడువు నిర్దేశించుకున్నారు.

కాల్వలు, డిస్ట్రిబ్యూటరీలపై దృష్టి

కృష్ణా, గోదావరి బేసిన్లలో ఆగి పోయిన ప్రాజెక్టుల వివరాలను సీఎం రేవంత్‌రెడ్డి తెప్పించుకుని పరిశీలించారు. ప్రాజెక్టుల హెడ్‌వర్క్స్ నిర్మాణం పైనే కాకుండా ఆయకట్టు భూములకు నీళ్లను పారించే డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థలపై సైతం ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టులన్నీ బ్యారేజీలు, పంప్ హౌసులకే పరిమితమైన ట్లు విమర్శలున్నాయి. అప్పులు తెచ్చి నిర్మించిన కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టులో భాగంగా హెడ్‌వర్క్స్ మాత్రమే పూర్తి కాగా, ఆయకట్టుకు నీటిని అందించే మెయిన్ కాల్వలు, డిస్ట్రిబ్యూటరీల నిర్మాణాన్ని ప్రారంభించనే లేదు. దీంతో కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా లక్షిత కొత్త ఆయకట్టుకు సాగునీరు అందడం లేదు. దీంతో ఇకపై కాల్వ లు, డిస్ట్రిబ్యూటరీలపై దృష్టి పెట్టాలని ప్రభుత్వం ఆదేశించింది.

వారానికో జిల్లాకు సీఎం

▶ మొదటి పేజీ తరువాయి

ద్వారా వీలైనంత వేగంగా వాటిని పూర్తి చేసి రైతాంగానికి సాగునీరు అందించేలా అధికారులకు మార్గదర్శనం చేస్తారని సమాచారం. వీటితో పాటు వ్యవసాయ సీజన్‌కు సంబంధించిన కార్యాచరణ, ఎరువుల లభ్యత, ఉపాధి హామీ పనులను సమీక్షించనున్న సీఎం.. రైతుభరోసా అమలు విధివిధానాలపై కూడా అధికారులతో చర్చించనున్నారు. ఎక్కడికక్కడ జిల్లాల వారీగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను స్థానిక అధికారులను అడిగి తెలుసుకోనున్న ముఖ్యమంత్రి, జిల్లా స్థాయిలో అమలు కావాల్సిన అన్ని కార్యక్రమాల అమలుపై అధికారులకు దిశానిర్దేశం చేయనున్నారు. అదే సమయంలో జిల్లాల్లోని శాంతిభద్రతల పరిస్థితిని కూడా సీఎం సమీక్షించనున్నారు.

ఏడు నెలల పాలనపై ఏమంటారు?

గత ఏడాది డిసెంబర్ 7వ తేదీన ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం పాలనా పరంగా సాధారణ కార్యక్రమాలు కొనసాగుతున్నప్పటికీ, సీఎం ఎక్కువగా రాజకీయ అంశాలపైనే దృష్టి సారించాల్సి వచ్చింది. ముఖ్యంగా లోక్‌సభ ఎన్నికలు, ఆ తర్వాత టీపీసీసీ అధ్యక్షుడి నియామకం, కేబినెట్ విస్తరణ లాంటి అనివార్య రాజకీయ కార్యకలాపాల్లో నిమగ్నమయ్యారు. అదే సమయంలో పార్టీలో చేరికలపై కూడా దృష్టి పెట్టారు. ఇక వీలున్నంత మేరకు ప్రభుత్వ పాలనపై కూడా సమీక్షలు నిర్వహించారు. ఇటీవలే అన్ని శాఖల ఉన్నతాధికారులతో సమావేశమైన సీఎం ప్రజలతో మమేకం కావాలని వారికి సూచించారు. ఆఫీసుల్లో కూర్చుని పనిచేయడం కన్నా క్షేత్రస్థాయికి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకోవడానికి ప్రాధాన్యమివ్వాలని స్పష్టం చేశారు. కేబినెట్ విస్తరణ, పీసీసీ అధ్యక్షుడి నియామకం లాంటివి తాత్కాలికంగా వాయిదా పడిన నేపథ్యంలో ప్రస్తుతానికి పాలన వ్యవహారాలపై రేవంత్ దృష్టి సారించారు. తాను సైతం క్షేత్రస్థాయికి వెళ్లాలని నిర్ణయించారు. తొలుత గత ఏడు నెలల పాలనపై అధికారుల నుంచి అభిప్రాయాలు సేకరించడంతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై ప్రజల మనోగతం ఎలా ఉందన్న దానిపై కూడా జిల్లాల పర్యటనల సందర్భంగా ఆయన ఫీడ్‌బ్యాక్ తీసుకోనున్నారు. ముఖ్యంగా రైతు రుణమాఫీ, రైతు భరోసా లాంటి ప్రతిష్టాత్మక కార్యక్రమాల అమలుపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకోవాలని భావిస్తున్నారు. స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నందున క్షేత్రస్థాయిలో ప్రజల మూడ్ ఎలా ఉందన్న దానిపై కూడా ఆయన ఫోకస్ పెట్టారని, అందులో భాగంగానే జిల్లాల పర్యటనకు శ్రీకారం చుడుతున్నారని సీఎంవో వర్గాలు చెబుతున్నాయి.

నేడు మంగళగిరికి రేవంత్

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 75వ జయంతి వేడుకల్లో పాల్గొనేందుకు గాను ముఖ్యమంత్రి సోమవారం ఏపీకి వెళ్లనున్నారు. మధ్యాహ్నం 3:15 నిమిషాలకు బేగంపేట విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో మంగళగిరికి వెళ్లి సీకే కన్వెన్షన్‌లో జరిగే వైఎస్సార్ జయంతి వేడుకల్లో పాల్గొంటారని, కార్యక్రమం ముగిసిన తర్వాత గన్నవరం నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి రాత్రి 7:45 నిమిషాలకు హైదరాబాద్ వస్తారని సీఎంవో వర్గాలు వెల్లడించాయి.

మైండ్‌గేమ్‌తో నాడు బాబు.. నేడు రేవంత్ మాయ

- ఇరు రాష్ట్రాల సీఎంల భేటీలో ఏం సాధించారు?
- కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్
- బీఆర్ఎస్‌ను టీఆర్ఎస్‌గా మారుస్తాం :మాజీ ఎంపీ వినోద్ కుమార్



మానకొండూర్ (కరీంనగర్): మైండ్‌గేమ్‌తోనే నాడు చంద్రబాబు అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ ప్రభుత్వాన్ని కూల్చారని, ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి కూడా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో మైండ్‌గేమ్ ఆడుతున్నారని కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. కరీంనగర్ జిల్లా మానకొండూర్ జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీల వీడ్కోలు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన గంగుల మాట్లాడుతూ..'1995 ఆగస్టు 26న చంద్రబాబును బలపరుస్తూ ఇప్పుడే 110 మంది ఎమ్మెల్యేలు హైదరాబాద్‌లోని వైస్రాయ్ హోటల్‌కు చేరుకున్నారని ఈనాడు పత్రిక ఓ కథనాన్ని ప్రచురించింది. అది చూసిన 110 ఎమ్మెల్యేలు అప్పుడు వైస్రాయ్ హోటల్‌కు చేరుకున్నారు. అలా ఎమ్మెల్యేలందరూ వెళ్లి ఎన్టీఆర్ ప్రభుత్వాన్ని కూలదోశారు..ఇప్పుడు అదేవిధంగా బీఆర్ఎస్ తరఫున గెలిచిన ఎమ్మెల్యేల్లో 22 మంది చేరుతున్నారని కాంగ్రెస్ పార్టీ మైండ్‌గేమ్ ఆడుతోంది'అని తెలిపారు.

టీఆర్ఎస్‌గా మారుస్తాం..

బీఆర్ఎస్ పార్టీని తిరిగి టీఆర్ఎస్‌గా మారుస్తామని ఇందుకోసం పార్టీ అధినేత కేసీఆర్‌తో చర్చిస్తామని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ పేర్కొన్నారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి శనివారం నాటి సమావేశంలో హడావుడే తప్ప ఏం సాధించారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు, వొడితెల సతీశ్‌కుమార్, రసమయి బాలకిషన్, సుంకె రవి శంకర్, మేయర్ సునీల్‌రావు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

బీజేపీలోకి రావాలంటే.. రాజీనామా చేయాల్సిందే



ఈడీ కేసులున్న నేతలు బీజేపీలోకి రారు • మీడియాతో కేంద్ర సహాయమంత్రి సంజయ్

కరీంనగర్‌టౌన్: ఇతర పార్టీల తరఫున గెలిచిన ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు బీజేపీలోకి రావాలంటే.. తప్పనిసరిగా వారి పదవులకు రాజీనామా చేయాల్సిందేనని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు. ఆదివారం కరీంనగర్‌లోని ఎంపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. గత కేసీఆర్ ప్రభుత్వం విభజన చట్టంలోని పలు అంశాలకు పరిష్కారం లభించే అవకాశాలున్నా, రాజకీయ లబ్ధి కోసం మరింత జటిలం చేసి సమస్యను నాన్చుతూ వచ్చిందన్నారు. ఇప్పుడు ఆ అవసరం లేదని, రెండు రాష్ట్రాల సీఎంలు సఖ్యతతో ఉన్నారని, చిత్తశుద్ధితో వ్యవహరిస్తే విభజన సమస్యల పరిష్కారం లభించే అవకాశముందని చెప్పారు. ఇప్పటికే కేసీఆర్ గోతి కాడ నక్కలా ఈ భేటీని అడ్డం పెట్టుకొని మళ్లీ ప్రజలను ఎట్లా రెచ్చగొట్టాలా అని ప్రయత్నిస్తున్నారు.

ఈడీ కేసులు, ఇతర పార్టీల ఎమ్మెల్యేల చేరికపై..

ఈడీ, సీబీఐ సంస్థల విచారణకు, బీజేపీకి సంబంధమే లేదని నరేంద్రమోదీ ప్రభుత్వం అవినీతిపరులను ఉపేక్షించే ప్రసక్తే లేదని చెప్పారు. ఈడీ, సీబీఐ విచారణ ఎదుర్కొంటున్న నేతలు బీజేపీలోకి వచ్చే అవకాశాలు లేవన్నారు. ఎంపీ కేశవరావుతో రాజీనామా చేయించిన నేతలు..కాంగ్రెస్‌లో చేరిన ఇతర పార్టీల ఎమ్మెల్యేలతో ఎందుకు రాజీనామా చేయించలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలన నిజంగా బాగుంటే పార్టీ ఫిరాయించే ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి ప్రజా/తీర్పు కోరాలని, ఒకవేళ ఉపఎన్నికలు జరిగితే కచ్చితంగా అన్ని స్థానాల్లో బీజేపీనే గెలుస్తుందన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్ష మార్పుపై..

స్టేట్ ప్రెసిడెంట్ మార్పు, నూతన అధ్యక్షుడి ఎంపిక అంశం పార్టీ జాతీయ నాయకత్వం చూసుకుంటుందన్నారు. కొత్త నేతలకు అధ్యక్ష పదవి ఇవ్వకూడదనే నిబంధన ఏమీ లేదని, ఒక్కోరాష్ట్రంలో ఒక్కో విధమైన పరిస్థితులుంటాయని చెప్పారు. ఆ పరిస్థితులకు అనుగుణంగా ఎవరిని అధ్యక్షుడిని చేయాలనే దానిపై అన్నీ ఆలోచించి జాతీయనాయకత్వం నిర్ణయం తీసుకుంటుందన్నారు.

రామాయణ్ సర్క్యూట్, రైల్వేలైన్‌పై..

రామాయణ్ సర్క్యూట్ కింద ఇల్లందకుంట, కొండగట్టు ఆలయాలను అభివృద్ధి చేసే అవకాశముందని బండి సంజయ్ చెప్పారు. వేములవాడ రాజన్న ఆలయాన్ని ప్రసాద్ స్కీంలో చేర్చుతామని.. ప్రతిపాదనలు పంపాలని గత ప్రభుత్వాన్ని అనేకమార్లు కోరినా కేసీఆర్ మూర్ఖంగా వ్యవహరించారన్నారు. కరీంనగర్ -హసన్‌పర్తి రైల్వేలైన్ నిర్మాణానికి సంబంధించి సర్వే జరిగిందని, త్వరలోనే దీని నిర్మాణంపై నిర్ణయం తీసుకుంటారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అడిగితే స్మార్ట్‌సిటీ మిషన్ గడువు పొడిగించలేదని, రాజస్తాన్, మధ్యప్రదేశ్ సహా దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల నుంచి వచ్చిన విజ్ఞప్తి మేరకే కేంద్రం గడువు పొడిగించిందన్నారు. గడువు పొడిగింపుతో కరీంనగర్ కార్పొరేషన్‌కు మరిన్ని నిధులు వచ్చే అవకాశముందని చెప్పారు.

రైతు ప్రభాకర్ ఆత్మహత్య బాధాకరం

- ఈ ఘటనలో బాధ్యులపై చర్యలు తీసుకుంటాం
- డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క
- బాధిత కుటుంబానికి పరామర్శ.. అండగా ఉంటామని భరోసా



ప్రభాకర్ కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క

చింతకాని: సమస్య వస్తే పరిష్కార మార్గం కోసం ప్రయత్నించాలే తప్ప ఆత్మహత్యలకు పాల్పడవద్దని, రైతు ప్రభాకర్ ఆత్మహత్య బాధాకరమని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క అన్నారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం ప్రొద్దుటూరులో భూ వివాదంతో ఆత్మహత్య చేసుకున్న బోజెడ్ల ప్రభాకర్ కుటుంబాన్ని ఆదివారం ఆయన పరామర్శించారు. ప్రభాకర్ కుటుంబ సభ్యులతో మాట్లాడి ఆత్మహత్యకు దారితీసిన కారణాలు, కుటుంబ పరిస్థితిపై చర్చించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభాకర్ ఆత్మహత్య ఘటనలో బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ మేరకు పోలీసు అధికారులకు ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. ఈ నియోజకవర్గంలో అందరూ తనవారేనని, ప్రభాకర్ కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తానని అన్నారు. మత్స్య సొసైటీ, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి ప్రభాకర్‌కు చెందిన భూ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని కలెక్టర్‌ను ఆదేశించినట్లు తెలిపారు. ప్రభాకర్ పిల్లల చదువుకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. కావాలనే బీఆర్ఎస్ నాయకులపై కేసులు నమోదు చేశారనే ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ.. ఇలాంటి కేసులకు, పార్టీలకు సంబంధం లేవని, ఈ ఘటనను ప్రతి ఒక్కరూ మానవత్వంతో చూడాల్సిన అవసరం ఉందని అన్నారు. ఆయన వెంట ఖమ్మం కలెక్టర్ ముజిమ్మిల్ ఖాన్, ఆర్డీఓ గణేశ్, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు ఉన్నారు.

రైతు ఆత్మహత్యలు పట్టవా?

- బీఆర్ఎస్ నేతలు పల్లా, సింగిరెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి. చిత్రంలో సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి తదితరులు

చింతకాని: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరరెడ్డి, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులున్నా బాధిత రైతులకు న్యాయం జరగడం లేదని విమర్శించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాలతో వారు ఆదివారం ఖమ్మం జిల్లాలో పర్యటించారు. చింతకాని మండలం ప్రొద్దుటూరులో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న రైతు బోజెడ్ల ప్రభాకర్ కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రభాకర్ కుటుంబానికి చెందిన భూమిలో నెలకొన్న వివాదంపై కలెక్టర్, తహసీల్దార్, ఎస్ఐకి ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం వల్లే బలవన్మరణానికి పాల్పడ్డాడని తెలిపారు. తన భూమికి 11 సార్లు రైతుబంధు తీసుకున్నాడని చెప్పారు. భూ వివాదంతో రైతు ఆత్మహత్య చేసుకున్నా జిల్లాలోని వ్యవసాయ, రెవెన్యూ మంత్రులెవరూ పరామర్శించలేదని విమర్శించారు. జిల్లాలో రైతులు చనిపోతుంటే వ్యవసాయ మంత్రి తన వ్యవసాయ క్షేత్రంలో సేద దీరుతున్నారని ఆరోపించారు. ప్రభాకర్ కుటుంబాన్ని పరామర్శించేందుకు వస్తున్నామని తెలిసి.. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క హడావుడిగా రైతు కుటుంబాన్ని పరామర్శించారని పేర్కొన్నారు. ప్రభాకర్ ఆత్మహత్యకు ఎలాంటి సంబంధం లేని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడిపై అక్రమంగా కేసు పెట్టారని ఆరోపించారు. ప్రభాకర్ కుటుంబానికి రూ.25 లక్షల నష్టపరిహారం చెల్లించాలని, ఆయన పిల్లల చదువుకు ప్రభుత్వం సహాయం అందించాలని డిమాండ్ చేశారు. ప్రభాకర్ కుటుంబ సభ్యులకు బీఆర్ఎస్ తరఫున రూ.2 లక్షల సాయం అందజేశారు. అనంతరం ఖమ్మంలో పోలీసు కమిషనర్ సునీల్‌దత్‌ను కలిసి రైతు ఆత్మహత్య ఘటనలో బాధ్యులను శిక్షించాలని కోరారు. ఇటీవల ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన కారేపల్లి మండలం ఉసిరికాయలపల్లికి చెందిన రైతు పచ్చిపాల భద్రయ్యను ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో బీఆర్ఎస్ నేతలు పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల వరకే బీఆర్ఎస్





ఎమ్మెల్యేలు మేఘారెడ్డి, మధుసూదన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ పార్టీ కృష్ణా నదిలో కొట్టుకుపోయిందని, స్థానిక సంస్థలకు ఎన్నికలు జరిగిన తర్వాత ఆ పార్టీ తెలంగాణలో కనిపించబోదని వనపర్తి, దేవరకద్ర ఎమ్మెల్యేలు మేఘారెడ్డి, మధుసూదన్‌రెడ్డిలు వ్యాఖ్యానించారు. రేవంత్‌రెడ్డి ప్రజాపాలనకు ఆకర్షితులై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరుతుంటే.. ఆ పార్టీ నేతలు సిగ్గు లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. వారు ఆదివారం అసెంబ్లీ మీడియా హాల్‌లో విలేకరులతో మాట్లాడుతూ పదేళ్లలో 60 మంది ఇతర పార్టీల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను బీఆర్ఎస్‌లో చేర్చుకున్నప్పుడు నిరంజన్‌రెడ్డి గాడిదలు కాశారా? అని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ప్రశ్నించారు. వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ ఖాదీ బోర్డు చైర్మన్‌గా ట్రాక్టర్ల స్కామ్‌కు పాల్పడినందుకు నిరంజన్‌రెడ్డిని చంద్రబాబు మెడపట్టి బయటకు నెట్టారని, గతిలేక ఆయన టీఆర్ఎస్‌లో చేరారని గుర్తు చేశారు.

కేంద్రం వైఖరి వల్లే ఎస్సీ వర్గీకరణలో జాప్యం

- వంగపల్లి శ్రీనివాస్ మాదిగ




నిరసన దీక్షలో మాట్లాడుతున్న వంగపల్లి. చిత్రంలో ఎర్రోళ్ల శ్రీనివాస్, కోదండరాం తదితరులు

కవాడిగూడ (హైదరాబాద్): కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఎస్సీలను ఏబీసీడీలుగా వర్గీకరిస్తామని హామీ ఇచ్చి పదేళ్లు దాటిపోయినా వర్గీకరణ చేయకపోవడం వల్లే మాదిగలు విద్యా, ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నారని ఎమ్మార్పీఎస్ టీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణపై కేంద్ర ప్రభుత్వం చేసిన జాప్యానికి నిరసనగా ఎమ్మార్పీఎస్ 30వ వార్షికోత్సవం పురస్కరించుకుని వర్గీకరణ సాధనకు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ ఆదివారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ జనసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం, ఎంపీ ఆర్.కృష్ణయ్య, విమలక్క, ఎస్సీ ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ ఎర్రోళ్ళ శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కోదండరాం దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ... వర్గీకరణ సాధించేవరకు మీ పోరాటానికి సంపూర్ణ మద్దతునిస్తామన్నారు. వర్గీకరణ అంశంపై కేంద్రంపై ఒత్తిడి పెట్టాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. ఎస్సీల వర్గీకరణ డిమాండ్‌కు బీసీల మద్దతు ఉంటుందని, బీసీలు, ఎస్సీలు ఏకమై హక్కులు, అధికారం సాధించే దిశగా పోరాటాలు చేయాలని ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. విమలక్క మాట్లాడుతూ... అణచివేత ఉన్న చోటఉంటుందో అక్కడ తిరుగుబాటు తప్పదన్నారు. పోరాటాల ద్వారా మాత్రమే హక్కులు సాధించుకోవాలని చెప్పారు. ఎస్సీలను ఏబీసీడీలుగా వర్గీకరించే అధికారాన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు కల్పించాలని ఎర్రోళ్ల శ్రీనివాస్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రముఖ గాయకుడు ఏపూరి సోమన్న దీక్షకు సంఘీభావం ప్రకటించి మాదిగ జాతి మోసపోతున్న విధానాన్ని పాటల ద్వారా వివరించారు. కార్యక్రమంలో మాదిగ యువసేన రాష్ట్ర అధ్యక్షులు పొట్ట పెంజర రమేశ్, కోర్ కమిటీ నాయకులు బల్గరి హుస్సేన్, బంగారి శ్రీను, ఎస్.వేణుగోపాల్, ఎంఎస్ఎఫ్ వ్యవస్థాపకులు కొల్లూరి వెంకట్ పాల్గొన్నారు.

8 సీట్లు గెలిచినప్పుడే మీ దమ్మేంటో అర్థమైంది

- రాష్ట్రానికి నిధులు తెచ్చి మీ దమ్ము చూపించండి
- కేంద్రమంత్రి బండి సంజయ్‌కి ఎంపీ మల్లురవి హితవు



సాక్షి, హైదరాబాద్: ఎన్నికలు ఎప్పుడంటే అప్పుడు పెట్టరని కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి తెలియకపోవడం విడ్డూరంగా ఉందని నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ ఎంపీ డాక్టర్ మల్లురవి ఎద్దేవా చేశారు. ఇప్పటికే ఒకసారి అసెంబ్లీకి, మరోమారు పార్లమెంటుకు ఎన్నికలు జరిగాయని, మళ్లీ ఇప్పుడు దమ్ముంటే ఎన్నికలు పెట్టాలని, మొత్తం సీట్లు తామే గెలుస్తామని బండి సంజయ్ వ్యాఖ్యానించడం ఆయన అవివేకానికి నిదర్శనమని ఆయన అభిప్రాయపడ్డారు. రాజ్యాంగం ప్రకారం ఎన్నికలు జరుగుతాయని, ఎన్నికలు జరిగినప్పుడు దమ్ము చూపించాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే దమ్ము చూపించిందని ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అన్నారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో 119 సీట్లలో 8 స్థానాలు గెలిచినప్పుడే తెలంగాణలో బీజేపీ దమ్ము ఎంత ఉందో అర్థమైందని, అయినా దమ్ము గురించి మాట్లాడుతున్నారని విమర్శించారు. బీజేపీ తన సత్తాను మళ్లీ ఎన్నికల వరకు దాచిపెట్టుకోవాలని, అప్పుడు తమ బలం చూపించాలని సూచించారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌తో చీకటి ఒప్పందాలు కుదుర్చుకున్న తర్వాత కూడా 8 చోట్ల గెలిచేందుకు బీజేపీ ఆపసోపాలు పడిందని వ్యాఖ్యానించారు. నిజంగా బీజేపీ నేతలకు దమ్ముంటే తెలంగాణ హక్కుల పరిరక్షణ, అభివృద్ధి కోసం కేంద్రం నుంచి నిధులు తీసుకురావడంలో చూపించాలని మల్లురవి హితవు పలికారు.

బస్సులో బంగారం రవాణా..

- అక్రమంగా తరలిస్తున్న రూ. 2.89 కోట్ల విలువైన 3.9 కిలోల బంగారం స్వాధీనం
- కోల్‌కతా నుంచి హైదరాబాద్‌కు తరలిస్తుండగా పట్టుకున్న డీఆర్‌ఐ
- ఇద్దరు వ్యక్తుల అరెస్టు



సాక్షి, హైదరాబాద్‌: గుట్టుచప్పుడు కాకుండా బస్సు లో బంగారాన్ని అక్రమంగా తరలిస్తున్న కేటుగాళ్లకు డైరెక్టరేట్‌ ఆఫ్‌ రెవెన్యూ ఇంటెలిజెన్స్‌ (డీఆర్‌ఐ) హైదరాబాద్‌ యూనిట్‌ అధికారులు చెక్‌ పెట్టారు. కోల్‌కతా నుంచి హైదరాబాద్‌కు రవాణా చేస్తున్న 3.9 కిలోల బంగారాన్ని శనివారం స్వాధీనం చేసుకున్నట్టు డీఆర్‌ఐ అధికారులు తెలిపారు. పట్టుబడిన బంగారం విలువ రూ.2,89,90,780 ఉంటుందని వెల్లడించారు. బంగారం తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్టు పేర్కొన్నారు. పెద్ద మొత్తంలో అక్రమంగా బంగారాన్ని కోల్‌కతా నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్నట్టుగా డీఆర్‌ఐ అధికారులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో రంగంలోకి దిగిన అధికారులు బస్సులో ప్రయాణిస్తున్న ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకుని తనిఖీ చేశారు. ఆ ఇద్దరు వ్యక్తులు బంగారు బిస్కెట్లను ఒక వస్త్రంలో చుట్టి దాన్ని నడుము చుట్టూ కట్టుకుని ఎవరికీ అనుమానం రాకుండా జాగ్రత్త తీసుకున్నట్టు అధికారులు తెలిపారు. వారి నుంచి బంగారాన్ని స్వాధీనం చేసుకుని కస్టమ్స్‌ యాక్ట్‌ 1962 కింద కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్టు వివరించారు. అయితే, బంగారం తరలిస్తున్న వ్యక్తులు ఎవరు? కోల్‌కతా నుంచి వారు ఏ బస్సులో హైదరాబాద్‌కు వస్తున్నారు? వారిని ఎక్కడ అరెస్టు చేశారన్న విషయాలు మాత్రం వెల్లడించలేదు. కేసు దర్యాప్తు కొనసాగుతున్నందున ఈ దశలో వివరాలు వెల్లడించలేమని డీఆర్‌ఐ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

'ఇస్టా'తో ఆహార భద్రత

సాక్షి, హైదరాబాద్‌: వ్యవసాయానికి మద్దతు ఇవ్వడంతో పాటు ఆహార భద్రతను పెంపొందించేందుకు 'ఇస్టా' దోహదపడుతుందని తెలంగాణ విత్తన ధ్రువీకరణ సంస్థ సంచాలకుడు డాక్టర్‌ కేశవులు అన్నారు. రాబోయే తరాలకు మెరుగైన ఆహారం, పోషకాహార భద్రతకు సహకారం అందించేందుకు 'ఇస్టా' కృషి చేస్తుందన్నారు. అంతర్జాతీయ విత్తన ధ్రువీకరణ సంస్థ (ఐఎస్‌టీఏ) శతాబ్ది వేడుకలు యునైటెడ్‌ కింగ్‌డమ్‌లోని కేంబ్రిడ్జిలో ఘనంగా జరిగాయి. 'ఇస్టా' అధ్యక్షునిగా తెలంగాణ విత్తన ధ్రువీకరణ సంస్థ డైరెక్టర్‌ కేశవులు వ్యవహరిస్తున్నారు. ఈనెల ఒకటో తేదీ నుంచి ఐదో తేదీ వరకు శతాబ్ది వేడుకలు కేశవులు ఆధ్వర్యంలో జరిగాయి. ముగింపు వేడుకల్లో భాగంగా కేశవులు కేంబ్రిడ్జిలో మొక్క నాటారు.

వైద్య ఆరోగ్యశాఖ బదిలీలకు మార్గదర్శకాలు

ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్‌: వైద్య ఆరోగ్యశాఖలోని వైద్యులు, ఇతర ఉద్యోగుల బదిలీలకు సంబంధించి ఆ శాఖ ప్రత్యేక మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈ మేరకు ఆ శాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్‌ చోంగ్తు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. వైద్య శాఖలో వందకు మించిన కేడర్స్‌, సబ్‌ కేడర్స్‌, ఇతర స్పెషలిస్టు వైద్యులు ఉన్నారని, ఈ నేపథ్యంలో బదిలీల ప్రక్రియపై హెచ్‌వోడీల వారీగా మొత్తం ఏడు కమిటీలను వేస్తున్నట్లు అందులో పేర్కొన్నారు. అందులో ఐదు కమిటీలకు చైర్మన్‌ గా వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్‌ను నియమించారు. ఫ్యామిలీ వెల్ఫేర్‌ విభాగంలో చైర్మన్‌తోపాటు ఇద్దరు సభ్యులుండగా...డీఎంఈలో చైర్మన్‌, మెంబర్‌ సభ్యులుగా డీఎంఈ, అదనపు కార్యదర్శి ఉన్నారు.

సీఎం రేవంత్‌ ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి

- శాసనసభ స్పీకర్‌ గడ్డం ప్రసాద్‌
- గోల్కొండ జగదాంబిక అమ్మవారి బోనాలు ప్రారంభం
- పాల్గొన్న మంత్రులు, ఇతర ప్రముఖులు



ఆదివారం గోల్కొండ జగదాంబిక అమ్మవారి బోనాల జాతరలో స్పీకర్‌ గడ్డం ప్రసాద్‌, మంత్రి పొన్నం ప్రభాకర్‌, దానం నాగేందర్‌ తదితరులు

లంగర్‌హౌస్‌ (హైదరాబాద్‌): గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందని, అయితే సీఎం రేవంత్‌రెడ్డి అమ్మవారి ఆశీర్వాదాలతో తెలంగాణను అభివృద్ధిపథంలోకి తీసుకెళ్తారని శాసనసభ స్పీకర్‌ గడ్డం ప్రసాద్‌ అన్నారు. రాష్ట్రంలో మెదటి బోనాల పూజలు అందుకునే గోల్కొండ జగదాంబిక అమ్మవారి బోనాల ఉత్సవాలను ఆదివారం లంగర్‌హౌస్‌లో ప్రారంభించారు. దేవాదాయ శాఖ ప్రిన్సిపల్‌ సెక్రెటరీ శైలజారమ్యన్‌, గోల్కొండ జగదాంబిక ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్‌ కాంత అరవింద్‌ల ఆధ్వర్యంలో మంత్రులు లంగర్‌హౌస్‌ చౌరస్తాలో అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం నజర్‌బోనంతో, తొట్టెలను ఊరేగింపుగా గోల్కొండ కోటకు తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా స్పీకర్‌ ప్రసాద్‌ మాట్లాడుతూ.. ఉచిత బస్సు సౌకర్యం వల్ల ఈ సంవత్సరం రాష్ట్రం నలుమూలల నుంచి మహిళలు పెద్ద ఎత్తున గోల్కొండకు తరలి వచ్చే అవకాశం ఉందన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

20 కోట్లు మంజూరు..

అనంతరం దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. బోనాల ఉత్సవాల నిర్వహణకోసం రాష్ట్రవ్యాప్తంగా ఆలయాలకు గత సంవత్సరం కంటే రూ.5 కోట్లు ఎక్కువగా అంటే ఈ సంవత్సరం రూ.20 కోట్లు మంజూరు చేశామని తెలిపారు. ఒక వేళ ఈ నిధులు సరిపోకపోతే మరింత అందజేస్తామని వివరించారు. గోల్కొండ బోనాలు నిర్వహించే కార్వాన్‌ నియోజకవర్గానికి 73 లక్షల 15 వేల రూపాయలు మంజూరు చేశామన్నారు. అనంతరం ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌ మాట్లాడుతూ.. జంట నగరాల బోనాల ఉత్సవాలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ఆనందోత్సాహాలతో జరుపుకోవాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తరఫున రాష్ట్ర ప్రజలకు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తున్నామన్నారు. దానం నాగేందర్‌, చిన్నారెడ్డి, మధుయాష్కీ గౌడ్‌, వి.హనుమంతరావు, మేయర్‌ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్‌ శ్రీలతారెడ్డి, దేవాదాయశాఖ కమిషనర్‌ హనుమంత రావు, సీపీ శ్రీనివాస్‌రెడ్డి ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు.

'రింగు' చెరిసగం!

- ఉత్తరభాగం పనులు కేంద్రప్రభుత్వ పర్యవేక్షణలో
- దక్షిణభాగం రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో..
- ఇటీవల సీఎం రేవంత్‌, కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ మధ్య చర్చల్లో ప్రస్తావన
- కేంద్రం నుంచి తుదినిర్ణయం వెల్లడయ్యాక తదనుగుణంగా కసరత్తు



సాక్షి, హైదరాబాద్‌: రీజినల్‌ రింగురోడ్డు పనుల నిర్వహణ బాధ్యతను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరిసగం చూసుకునే అవకాశాలున్నాయి. ప్రస్తుతం టెండర్ల దశకు చేరువలో ఉన్న ఉత్తరభాగాన్ని కేంద్రప్రభుత్వం నిర్వహించనుంది. ఇక అలైన్‌మెంట్‌ దశలోనే ఆగిపోయిన దక్షిణభాగాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించాలన్న అంశాన్ని కేంద్రం పరిశీలిస్తోంది. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీలో కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీతో నిర్వహించిన భేటీలో చర్చకు వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వమే ఈ మేరకు ప్రతిపాదించినట్టు సమాచారం. దీనిపై కేంద్రం తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

భారత్‌మాల పరియోజనలో చోటు దక్కకపోవటంతో..

రీజినల్‌రింగ్‌ రోడ్డులో 162.4 కి.మీ నిడివి ఉండే ఉత్తరభాగాన్ని, 189.2 కి.మీ. నిడివి ఉండే దక్షిణభాగాన్ని ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఎన్‌హెచ్‌ఏఐ పర్యవేక్షిస్తున్న విషయం తెలిసిందే. ఉత్తర భాగం భూపరిహారం పంపిణీకి సంబంధించిన అవార్డులు పాస్‌ చేసే దశలో ఉంది. మరో రెండుమూడు నెలల్లో టెండర్ల ప్రక్రియ జరగనుంది. కానీ, దక్షిణభాగానికి ఏడాది క్రితం అలైన్‌మెంట్‌ పూర్తయినా, ఇప్పటికీ కేంద్రం నుంచి ఆమోదం లభించలేదు. ఆ భాగానికి సంబంధించి ఎలాంటి కసరత్తు జరగటం లేదు. నిజానికి ఈ రెండు భాగాలను భారత్‌మాల పరియోజన కార్యక్రమంలో చేర్చాల్సి ఉంది. ఉత్తర భాగాన్ని గతంలోనే ఆ జాబితాలో చేర్చారు. కానీ, గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వానికి మధ్య సమన్వయం లోపించటం, భూసేకరణ పరిహారంలో రాష్ట్ర ప్రభుత్వ వాటా చెల్లించే విషయంలో అగాధం ఏర్పడటంతో రోడ్డు ప్రక్రియలో జాప్యం జరిగింది. భారత్‌మాల పరియోజనపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత రాకపోవటంతో రీజినల్‌ రింగురోడ్డును దాని నుంచి మినహాయించారు. దీంతో మిగిలిపోయిన 7500 కి.మీ. నిడివి గల ఎక్స్‌ప్రెస్‌వే పనులతోపాటు మరో 5000 కి.మీ. ఎక్స్‌ప్రెస్‌ వే ప్రాజెక్టులను చేరుస్తూ 2047 సంవత్సరం లక్ష్యంతో కొత్త ప్రోగ్రామ్‌ను ప్రారంభించాలని కేంద్రం నిర్ణయించింది. భారత్‌మాల పరియోజనలో చోటు దక్కిన వాటిని ముందు నిర్వహించి, రెండో ప్రోగ్రామ్‌లో ఉన్న వాటిని తర్వాత నిర్వహించాలని నిర్ణయించారు. దీనికి తగ్గట్టుగానే నిధుల కేటాయింపు ఉంటుంది. రింగు ఉత్తరభాగాన్ని తొలుత భారత్‌మాలలో చేర్చినందున, దానిని అలాగే కొనసాగిస్తూ దక్షిణభాగాన్ని రెండో ప్రోగ్రామ్‌లో చేర్చారు. ఫలితంగా దక్షిణ భాగం పనులు ఇప్పట్లో ప్రారంభమయ్యే సూచనలే లేవు. దీనిని ఇటీవల ముఖ్యమంత్రి కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ దృష్టికి తీసుకెళ్లారు. దక్షిణ భాగాన్ని మరో రకంగానైనా చేపట్టాలని కోరారు. దీనిపై అధికారులతో చర్చించిన మీదట, పీడబ్ల్యూడీ ద్వారా నిర్వహించే అంశాన్ని తెరపైకి తెచ్చారు. ప్రస్తుతం రాష్ట్రప్రభుత్వం ఆధ్వర్యంలో పనిచేస్తున్న జాతీయ రహదారుల విభాగం(ఎన్‌హెచ్‌)ను పీడబ్ల్యూడీకి స్థానిక ప్రత్యామ్నాయంగా వ్యవహరిస్తున్నది. ఈ విభాగం ద్వారా నిర్వహించే రోడ్డు పనులకు కేంద్రమే నిధులు సమకూరుస్తున్నా, పనుల నిర్వహణ మాత్రం పూర్తిగా రాష్ట్రప్రభుత్వం ఆధ్వర్యంలో జరుగుతాయి. భారత్‌మాల పరియోజన కింద కేంద్రప్రభుత్వ ప్రత్యక్ష పర్యవేక్షణ ఉండే ఎన్‌హెచ్‌ఏఐ ఆధ్వర్యంలో ఉత్తరభాగం, రాష్ట్రప్రభుత్వ ప్రత్యక్ష పర్యవేక్షణ ఉండే ఎన్‌హెచ్‌ విభాగం ఆధ్వర్యంలో దక్షిణభాగం పనుల నిర్వహణ ఉంటుందన్నమాట. దీనిపై కేంద్రప్రభుత్వం స్పష్టత ఇచ్చాక తదుపరి కార్యాచరణ ఉంటుంది. అదే జరిగితే ఎన్‌హెచ్‌ఏఐ ఆధ్వర్యంలో ఉత్తరభాగం పనులు ప్రారంభమైన వెంటనే ఎన్‌హెచ్‌ ఆధ్వర్యంలో దక్షిణభాగం పనులు పట్టాలెక్కుతాయి.

ఆ విభాగానికి పెద్ద టాస్కే..

రింగురోడ్డు దక్షిణ విభాగం పనుల అంచనా దాదాపు రూ.19 వేల కోట్లు ఉంటుంది. ఇప్పటి వరకు ఎన్‌హెచ్‌ విభాగం ఇంత పెద్ద పనులు చేపట్టలేదు. దాదాపు 2500 హెక్టార్ల భూసేకరణ చేపట్టాల్సి ఉంది. తక్కువ నిడివి ఉండే జాతీయ రహదారులను ఆ విభాగం చేపడుతూ వచ్చింది. ఇప్పుడు రీజినల్‌ రింగురోడ్డు బాధ్యత వస్తే ప్రత్యేకంగా అంతర్గతంగా కొన్ని విభాగాలనే ఏర్పాటు చేసుకోవాలి. ఇందుకు సిబ్బందిని కూడా సమకూర్చుకోవాల్సి ఉంటుంది.

బదిలీల ఫీవర్‌

▶ మొదటి పేజీ తరువాయి

చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఈ నెల 5వ తేదీ నుంచి బదిలీల ప్రక్రియను ప్రభుత్వ శాఖలు మొదలు పెట్టాయి.

20లోగా పూర్తి చేయాలి

ఉద్యోగుల సాధారణ బదిలీలపై ఉన్న నిషేధాన్ని ఈనెల 20వ తేదీ వరకు సడలిస్తూ.. నిర్దేశించిన షెడ్యూల్‌లోగా అన్ని శాఖలు ఉద్యోగుల బదిలీల ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఉత్తర్వులకు అనుగుణంగా ప్రభుత్వ శాఖలు విడివిడిగా బదిలీల మార్గదర్శకాలు జారీ చేస్తున్నాయి. ఇప్పటికే పలు విభాగాలు మార్గదర్శకాలు విడుదల చేయగా... ఒకట్రెండు రోజుల్లో దాదాపు అన్ని శాఖలు కూడా ఈ ప్రక్రియను పూర్తి చేయనున్నాయి. బదిలీలకు సంబంధించిన రోజువారీ షెడ్యూల్‌ను సైతం రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది. ఈ మేరకు ఈనెల 9వ తేదీ నుంచి 12వ తేదీ వరకు ఉద్యోగుల నుంచి బదిలీల దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఈ నెల 13వ తేదీ నుంచి 18వ తేదీ వరకు వాటిని పరిశీలించడం, అర్హుల జాబితాను విడుదల చేయడం పూర్తి చేసిన తర్వాత ఈనెల 19, 20 తేదీల్లో బదిలీ ఉత్తర్వులు జారీ చేయనున్నారు. పెద్ద సంఖ్యలో ఉద్యోగులున్న పాఠశాల విద్యాశాఖలో బదిలీల ప్రక్రియ ఇప్పటికే ప్రశాంతంగా ముగిసింది. రంగారెడ్డి జిల్లాలో ఒకట్రెండు కేటగిరీలు మినహా టీచర్ల బదిలీ దాదాపు పూర్తయింది. ప్రస్తుత బదిలీల్లో జీఓ 317 కింద నూతన కేటాయింపులు జరిగిన ఉద్యోగులు మినహా మిగతా వారిలో చాలామందికి, ప్రధానంగా స్థానచలనం కలిగే అవకాశం ఉంది. మరోవైపు 317 కింద కేటాయింపుల్లో అన్యాయం జరిగిందంటూ కొందరు ప్రభుత్వానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు పెట్టుకున్నారు. వారికి కేబినెట్‌ సబ్‌ కమిటీ ఇచ్చే నివేదికను బట్టి మార్పులు జరిగే అవకాశం ఉంటుంది.

సీనియర్లకే స్థానచలనం!

ఉద్యోగుల బదిలీలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిబంధనలు విధించింది. గరిష్ఠంగా 40 శాతానికి మించి ఉద్యోగులను బదిలీ చేయొద్దని ఆదేశించింది. ఈ నిబంధన జూనియర్‌ ఉద్యోగుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. వాస్తవానికి ప్రభుత్వం ఒకేచోట రెండేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఉద్యోగులు బదిలీ దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. మరోవైపు ఒకేచోట నాలుగేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న అధికారి/ఉద్యోగి తప్పనిసరి బదిలీల జాబితాలోకి చేరతాడు. ప్రస్తుతం రాష్ట్రంలో సాధారణ బదిలీలు జరిగిన ఆరేళ్లు కావస్తోంది. దీంతో కొత్తగా నియమితులైన ఉద్యోగులు, జీఓ 317 కింద నూతన కేటాయింపుల్లో భాగంగా మారిన వారు, ఎన్నికల బదిలీలు మినహాయిస్తే దాదాపు ఉద్యోగులందరికీ బదిలీ కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. అలాగే మెజార్టీ ఉద్యోగులు బదిలీ జాబితాలోకి వచ్చే అవకాశాలు కూడా ఎక్కువగా ఉన్నాయి. అయితే 40 శాతానికి మించి ఉద్యోగుల బదిలీలు చేయొద్దనే నిబంధన కారణంగా పలువురు తప్పనిసరి బదిలీల జాబితాలో ఉన్నప్పటికీ స్థానచలనం కలిగే అవకాశం లేకుండా పోయే పరిస్థితి ఏర్పడనుంది.

పాలనకు తాత్కాలిక విరామం!

రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు మొదలు జిల్లా స్థాయి, మండల స్థాయి కార్యాలయాల్లో ప్రస్తుతం ఉద్యోగుల బదిలీలపైనే చర్చ జరుగుతోంది. శాఖల వారీగా మార్గదర్శకాలు వెలువడిన తర్వాత దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమవుతుంది. రానున్న రెండు వారాల పాటు ఉద్యోగులంతా ఈ ప్రక్రియలోనే బిజీ అయ్యే అవకాశాలున్నాయి. దీంతో ఈనెల 20 వరకు ప్రభుత్వ కార్యాలయాల్లో ఇతర కార్యకలాపాలకు తాత్కాలికంగా బ్రేక్‌ పడే అవకాశాలున్నాయి.

ఆన్‌లైన్‌.. మాన్యువల్‌

ప్రస్తుతం బదిలీల ప్రక్రియ ప్రారంభ దశలోనే ఉంది. ఉద్యోగుల నుంచి దరఖాస్తులు స్వీకరించిన తర్వాత సీనియార్టీ జాబితా ప్రకారం బదిలీలకు ఎంతమందికి అవకాశం దక్కుతుందో ఓ అంచానా వేసేందుకు అవకాశం ఉంటుంది. 100 మంది ఉద్యోగుల కంటే ఎక్కువ సంఖ్యలో బదిలీ అయ్యే చోట వెబ్‌ ఆధారిత కౌన్సెలింగ్‌ నిర్వహించేందుకు ప్రభుత్వ శాఖలు ఏర్పాట్లు చేసుకున్నాయి. రాష్ట్రస్థాయి కార్యాలయంలో మాన్యువల్‌ కౌన్సెలింగ్‌కు అవకాశం ఉండగా... క్షేత్రస్థాయిలో మాత్రం ఆన్‌లైన్‌ కౌన్సెలింగ్‌ జరగనుంది. పారదర్శకత కోసం సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఈ క్రమంలోనే ప్రభుత్వ శాఖలు ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించుకున్నాయి.

తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక బోనాలు

- కట్టమైసమ్మ ఆలయంలో బోనాల జాతరకు హాజరైన పలు రాజకీయ పార్టీల నేతలు
- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు కొండాసురేఖ, పొన్నం ప్రభాకర్‌ ప్రత్యేక పూజలు



బోనాల వేడుకలలో పాల్గొన్న కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి



అమ్మవారికి బోనం సమర్పిస్తున్న మంత్రి కొండా సురేఖ

కవాడిగూడ (హైదరాబాద్‌): తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక బోనాల పండుగని, ఈ పండుగ సందర్భంగా ప్రభుత్వం తరఫున మట్టికుండల్లోనే బోనాలు తీసుకెళ్లి అమ్మవారికి మొక్కులు చెల్లించేలా చర్యలు తీసుకుంటామని మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్‌లు పేర్కొన్నారు. ఆషాఢ మాసం బోనాల పండగ సందర్భంగా ఆదివారం తెలంగాణ రాష్ట్ర కుమ్మర్ల బోనాల జాతరను అంగరంగ వైభవంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లోయర్‌ ట్యాంక్‌లోని జగదీశ్‌ మందిరం నుండి ట్యాంక్‌బండ్‌ మీదుగా లోయర్‌ ట్యాంక్‌ బండ్‌లోని శ్రీ కనకాల కట్టమైసమ్మ దేవాలయానికి ఆనవాయితీగా వస్తున్న కుమ్మర్ల బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ బోనాల జాతరకు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్‌, ముషీరాబాద్‌ ఎమ్మెల్యే ముఠాగోపాల్‌, నగర మేయర్‌ గద్వాల విజయలక్ష్మీ, డిప్యూటి మేయర్‌ శ్రీలతరెడ్డి, బీసీ కమిషన్‌ చైర్మన్‌ వకుళా భరణం కృష్ణమోహన్‌ హాజరై బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ...ఆనాది అమ్మవారి బోనాల పండగకు మట్టికుండలలోనే బోనాలు సమర్పించి మొక్కుల తీర్చుకునే వారన్నారు. త్వరలోనే మట్టికుండల్లో బోనాలు తీసుకెళ్లేలా చర్యలు తీసుకుంటే కుమ్మరుల ఉపాధి పెరిగి వారు అన్ని రంగాలతో అభివృద్ధి చెందేందుకు దోహదపడతాయని వివరించారు. కార్యక్రమంలో బోనాల జాతర ఉత్సవ కమిటీ కన్వీనర్‌ ఎగిరిశెట్టి వీరయ్య మహిళా కన్వీనర్‌ రాధారపు లక్ష్మీ, కుమ్మర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నడికుండి జయంత్రారావు, ప్రధాన కార్యదర్శి దయానంద్‌, కోశాధికారి ఆమంచి రాజలింగం తదితరులుపాల్గొన్నారు.

భాగ్యనగరంలో 800 మంది సీఏలు

కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని



సీఏ ఉత్తీర్ణులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని

గచ్చిబౌలి (హైదరాబాద్‌): దేశవ్యాప్తంగా 9వేల మంది సీఏ పూర్తి చేసుకోగా.. హైదరాబాద్‌ నగరంలో 800 మంది పూర్తి చేసుకున్నారని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఇండోర్‌ స్టేడియంలో ది ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ చార్టెడ్‌ ఎకౌంట్స్‌ ఆఫ్‌ ఇండియా (ఐసీఏఐ) ఆధ్వర్యంలో చార్టెడ్‌ అకౌంటెంట్‌(సీఏ) కోర్సులో ఉత్తీర్ణులైన విద్యార్థుల స్నాతకోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో చంద్రశేఖర్‌ మాట్లాడుతూ భవిష్యత్తులో విద్యార్థులు తమ వృత్తిని చక్కగా మలుచుకోవడానికి తగిన ప్రణాళికతో ముందుకుసాగాలన్నారు. కార్యక్రమంలో ఐసీఏఐ సెంట్రల్‌ కౌన్సిల్‌ సభ్యులు ముప్పాల శ్రీధర్‌, దయానివాస్‌శర్మ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యవర్గం ఏర్పాటు




పీడీఎస్‌యూ రాష్ట్ర నూతన అధ్యక్షుడు మధు



రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోడపంగి నాగరాజు

ముషీరాబాద్‌ (హైదరాబాద్‌): ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) రాష్ట్ర జనరల్‌ కౌన్సిల్‌లో నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పీడీఎస్‌యూ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు పరశురాం ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో అధ్యక్షుడిగా భువనగిరి మధు (మహబూబాబాద్‌), ఉపాధ్యక్షులుగా ప్రణయ్‌ (భద్రాద్రి కొత్తగూడెం), మంద నవీన్‌ (హైదరాబాద్‌), ప్రధాన కార్యదర్శిగా పొడపంగి నాగరాజు (హైదరాబాద్‌), సహాయ కార్యదర్శులుగా నర్సింహారెడ్డి(సంగారెడ్డి), అజయ్‌ (వరంగల్‌), కోశాధికారిగా మహేశ్‌ (యాదాద్రి భువనగిరి), కార్యవర్గ సభ్యులుగా మాదారపు నాగరాజు, తీగల శ్యామ్‌, టి.సందీప్‌, ఎం.ప్రవీణ్‌, ఆరుగురు కోఆప్షన్స్‌ సభ్యులతో మొత్తం 17 మందితో నూతన కార్యవర్గాన్ని కౌన్సిల్‌ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ నూతన అధ్యక్షుడు మధు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ.. గత మహాసభ నుంచి ఈ కౌన్సిల్‌ వరకు జరిగిన కార్యక్రమాలను సమీక్షించుకొని భవిష్యత్‌ కార్యాచరణకు పలు తీర్మానాలను చేశామన్నారు. నీట్‌ పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని, పరీక్ష నిర్వహించే బాధ్యతలను రాష్ట్రానికి ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. జాబ్‌ కేలండర్‌ను తక్షణమే విడుదల చేయాలన్నారు. రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలకు శాశ్వత వీసీలను వెంటనే నియమించాలన్నారు. ప్రైవేటు యూనివర్సిటీల బిల్లును రద్దు చేస్తూ ప్రభుత్వ యూనివర్సిటీలను పటిష్ఠం చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్‌, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ నిధులను వెంటనే విడుదల చేయాలన్నారు. జూనియర్‌ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించాలని, సంక్షేమ హాస్టళ్లలో మెస్‌, కాస్మోటిక్‌ చార్జీలు పెంచాలన్నారు.

మాజీ సభ్యుడిని హతమార్చిన మావోయిస్టులు



బర్సె మాస

దుమ్ముగూడెం: ఛత్తీస్‌ గఢ్‌లోని సుకుమా జిల్లా సున్నం పెంట గ్రామానికి చెందిన మాజీ మావోయిస్టు బర్సె మాస(43)ను మావోయిస్టులు ఇన్‌ఫార్మర్‌ నెపంతో హతమార్చారు. మాస కిష్టారం ఏరియా కమిటీ సభ్యుడిగా దళంలో పనిచేసి కొన్ని రోజుల క్రితం భార్య, మరికొందరు దళ సభ్యులతో కలిసి ఏపీ పోలీసుల ఎదుట లొంగిపోయారు. కాగా, శనివారం రాత్రి కొందరు మావోయిస్టులు అతడిని ఇంటి నుంచి కిడ్నాప్‌ చేసి అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లారు. పోలీ సుల ఎదుట లొంగిపోవడమే కాక వారికి ఇన్‌ఫార్మర్‌ గా మారి సమాచారం అందజేస్తున్నారని, ఆ సమాచారంతోనే పోలీసులు పార్టీ సానుభూతి పరులను ఇబ్బందులకు గురి చేస్తున్నా రంటూ కత్తులతో పొడిచి హతమార్చారు. మృతదేహాన్ని అటవీ ప్రాంతంలో వదిలేసి వెళ్లగా, స్థానికుల సమాచారంతో కుటుంబసభ్యులు వెళ్లి స్వాధీనం చేసుకున్నారు.

ఇంజనీరింగ్‌ సీట్లు 98,296

వాటిలో కన్వీనర్‌ కోటా కింద భర్తీ కానున్నవి 70,307 సీట్లు

- ఎట్టకేలకు విడుదలైన కాలేజీలు, సీట్ల జాబితా
- నేటి నుంచి ఇంజనీరింగ్‌ సీట్లకు వెబ్‌ ఆప్షన్లు
- కంప్యూటర్‌ కోర్సుల్లోనే 60% సీట్లు
- పెరిగే సీట్లపై ఇంకా రాని స్పష్టత

సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్రంలో ఇంజనీరింగ్‌ సీట్ల లెక్క పాక్షికంగా తేలింది. ఆఖరి నిమిషంలో కాలేజీలకు విశ్వవిద్యాలయాల అనుబంధ గుర్తింపు లభించింది. దీంతో ఈఏపీసెట్‌ అర్హత పొంది, కౌన్సెలింగ్‌ కోసం రిజిస్ట్రేషన్‌ చేసుకున్న విద్యార్థులు సోమవారం నుంచి వెబ్‌ ఆప్షన్లు ఇవ్వొచ్చు. ఈ నెల 15 వరకు ఈ అవకాశం ఉంటుంది. సాంకేతిక విద్యా విభాగం అందించిన సమాచారం ప్రకారం తొలిదశ ఆప్షన్లు ఇచ్చే నాటికి 173 కాలేజీలు కౌన్సెలింగ్‌లో పాల్గొంటున్నాయి. మొత్తం 98,296 సీట్లు అందుబాటులోకి వచ్చాయి. ఇందులో కన్వీనర్‌ కోటా కింద 70,307 సీట్లు భర్తీ చేయనున్నారు. వాస్తవానికి రాష్ట్రంలో 1.18 లక్షల ఇంజనీరింగ్‌ సీట్లు వివిధ విభాగాల్లో ఉండాలి. కానీ కొన్ని కాలేజీలు సివిల్‌, మెకానికల్‌, ఈఈఈ, ఈసీఈ వంటి బ్రాంచీల్లో సీట్లు, సెక్షన్లు తగ్గించుకున్నాయి. వాటి స్థానంలో కంప్యూటర్‌ సైన్స్‌ ఇంజనీరింగ్‌, ఇతర కంప్యూటర్‌ కోర్సులు కావాలని దరఖాస్తు చేసుకున్నాయి. పెరిగే సీట్ల వివరాలకు ఇంకా ప్రభుత్వం అనుమతి లభించలేదు. దీంతో కోత పడే సీట్లుపోను మిగతా వాటిని కౌన్సెలింగ్‌లో చేర్చారు. సాంకేతిక విద్య కమిషనర్‌ దేవసేన ఆదివారం ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఇందులో 60 శాతానికిపైగా సీట్లు కంప్యూటర్‌ కోర్సుల్లోనే ఉన్నాయి.

ఏ వర్సిటీ పరిధిలో ఎన్ని కాలేజీలు, ఎన్ని సీట్లు?

యూనివర్సిటీ	కాలేజీలు	సీట్లు	కన్వీనర్‌ కోటా సీట్లు
ఉస్మానియా	15	8,970	6,528
జేఎన్‌టీయూహెచ్‌	134	80,913	56,564
కాకతీయ	3	1,260	882
ప్రైవేటు వర్సిటీలు	21	7,153	6,603
మొత్తం	173	98,296	70,703

ఏ బ్రాంచీలో ఎన్ని సీట్లు?

బ్రాంచీ	సీట్లు	బ్రాంచీ	సీట్లు
అగ్రికల్చర్‌ ఇంజనీరింగ్‌	30	డైరీయింగ్‌	23
ఆర్టిఫిషియల్‌ ఇంటెలిజెన్స్‌	42	డిజిటల్‌ టెక్నాలజీ ఫర్‌ డిజైన్‌ ప్లానింగ్‌	60
ఆర్టిఫిషియల్‌ ఇంటెలిజెన్స్‌ అండ్‌ డేటా సైన్స్‌	1,365	ఈసీఈ	10,398
		ఈసీ-ఇనుస్ట్రుమెంట్‌ ఇంజనీరింగ్‌	42
ఏఐఎంఎల్‌	606	ఎలక్ట్రానిక్స్‌ అండ్‌ కంప్యూటర్‌ ఇంజనీరింగ్‌	42
ఏరోనాటికల్‌ ఇంజనీరింగ్‌	168		
ఆటోమొబైల్‌ ఇంజనీరింగ్‌	42	ఈఈఈ	4,202
బయో మెడికల్‌	59	ఎలక్ట్రానిక్స్‌, ఇనుస్ట్రుమెంటేషన్‌	126
బిల్డింగ్‌ సర్వీసెస్‌ ఇంజనీరింగ్‌	60	ఎలక్ట్రానిక్స్‌, టెలి కమ్యూనికేషన్‌	21
కెమికల్‌ ఇంజనీరింగ్‌	204	ఎలక్ట్రానిక్స్‌ అండ్‌ టెలిమ్యాటిక్స్‌	42
సీఎస్‌ఈ (ఐవోటీ అండ్‌ సైబర్‌ సెక్యూరిటీ బ్లాక్‌ చైన్‌ టెక్నాలజీ)	126	ఫుడ్‌ టెక్నాలజీ	90
		జీయో ఇన్‌ఫ్రామాటిక్స్‌	60
సివిల్‌ ఇంజనీరింగ్‌	3,231	ఇన్ఫర్మేషన్‌ టెక్నాలజీ	3,705
కంప్యూటర్‌ ఇంజనీరింగ్‌	84	మెకానికల్‌ (మెకట్రానిక్స్‌) ఇంజనీరింగ్‌	42
కంప్యూటర్‌ సైన్స్‌, బిజినెస్‌ సిస్టం	252	మెకానికల్‌ ఇంజనీరింగ్‌	2,979
కంప్యూటర్‌ సైన్స్‌ ఇంజనీరింగ్‌ (సైబర్‌ సెక్యూరిటీ)	1,418	మెటలర్జికల్‌ ఇంజనీరింగ్‌	60
		మైనింగ్‌ ఇంజనీరింగ్‌	264
సీఎస్‌ఈ (డేటాసైన్స్‌)	6,516	బీటెక్‌ మెకానికల్‌ విత్‌ ఎంటెక్‌ మాన్యుఫ్యాక్చరింగ్‌ సిస్టం	30
సీఎస్‌సీ	21,599		
కంప్యూటర్‌ సైన్స్‌ అండ్‌ డిజైన్‌	84	మెటలర్జి, అండ్‌ మెటీరియల్‌	42
కంప్యూటర్‌ సైన్స్‌ అండ్‌ ఐటీ	210	బిటెక్‌ మెకానికల్‌ విత్‌ ఎంటెక్‌ థర్మల్‌ ఇంజనీరింగ్‌	30
సీఎస్‌ఈ (ఏఐఎంఎల్‌)	11,196		
సీఎస్‌ఈ (నెట్‌వర్క్‌)	42	ఫార్మాస్యూటికల్స్‌ ఇంజనీరింగ్‌	42
సీఎస్‌ఈ (ఐవోటీ)	315	బి ప్లానింగ్‌	40
కంప్యూటర్‌ ఇంజనీరింగ్‌ (సాఫ్ట్‌వేర్‌)	126	టెక్స్‌టైల్‌ టెక్నాలజీ, ఇంజనీరింగ్‌	120



జీవితం అనేది ఏమిటో ఎవరూ ఎప్పటికీ కనుక్కోలేరు. అది పెద్ద విషయం కాదు. ప్రపంచాన్ని అన్వేషించండి. లోతుగా వెళ్లినకొద్దీ దాదాపుగా ప్రతిదీ ఆసక్తికరంగానే ఉంటుంది.
– రిచర్డ్ పి. ఫెయిన్‌మాన్

సాక్షి
సోమవారం, 8 జూలై 2024

నూరేళ్ల గురుదత్

'నువ్వు కమ్యూనిస్టువా?'... 'కాదు. కార్టూనిస్టుని'.... 'నీకు మంచి జీవితం తెలియక ఈ దిక్కుమాలిన కొంపను ఇల్లు అనుకుంటున్నావు'... 'దాన్దేముంది... మీకు ఫుట్‌పాత్‌ల మీద బతుకుతున్న లక్షల మంది గురించి తెలియదు. నేను వాళ్ల కంటే మెరుగే'... 'నువ్వు నౌకరువి! గుర్తుంచుకో'... 'నౌకర్‌నైతే? తల ఎత్తి మాట్లాడకూడదా?'... గురుదత్ సినిమాల్లోని డైలాగ్స్ ఇవి.

దేశానికి స్వతంత్రం వచ్చి గొప్ప జీవితాన్ని వాగ్దానం చేశాక కూడా, ఎక్కడా ఆ వాగ్దానం నెరవేరే దారులు లేక, ఉద్యోగ ఉపాధులు లేక, పేదరికం పీడిస్తూ, మనుషుల్లో స్వార్థం, రాక్షసత్వం దద్దరిల్లుతున్న కాలంలో 'ఇన్‌సాన్ కా నహీ కహీ నామ్ ఔర్ నిషాన్' అనిపించిన ఒక భావుకుడు, దయార్ద్ర హృదయుడు, ఎదుటి వారి కళ్లల్లో నాలుగు కన్నీటి చుక్కలు చూడగానే సొమ్మసిల్లే దుర్బల మానసిక స్వరూపుడు గురుదత్ వచ్చి ఆడిన కళాత్మక నిష్ఠూరమే అతడి సినిమాలు. స్వతంత్రం వచ్చిన పదేళ్లకు 'ప్యాసా' తీసి 'జిన్హే నాజ్ హై హింద్ పర్ ఓ కహా హై' అని ప్రశ్నించాడు. స్వతంత్రం వచ్చిన 75 ఏళ్ల తర్వాత కూడా ఏదో ఒక పాదధూళి దొరికితే కష్టాల నుంచి బయట పడదామనుకునే కోట్లాది నిరుపేదలను చూసి నేటికీ అనవలసిందే కదా– 'దేశాన్ని చూసి గర్వపడే పెద్దలారా... మీరెక్కడ?'

కలకత్తాలో బాల్యం గడిపిన గురుదత్ ఇంటెదురు ఖాళీ జాగాలో జరిగే తిరునాళ్లలోని పేద కళాకారుల ఆటపాటలతో స్ఫూర్తి పొందాడు. అతనూ డాన్స్ చేస్తే ఆ సుకుమార రూపం అద్భుతంగా మెలికలు తిరిగేది. డాన్స్ అతణ్ణి నాటి ప్రఖ్యాత డాన్సర్ ఉదయ్‌శంకర్ దగ్గరకు చేర్చింది. ఆ తర్వాత పూణేకు! అక్కడ ప్రభాత్ థియేటర్‌లో డాన్స్‌మాస్టర్‌గా, అసిస్టెంట్ డైరెక్టర్‌గా అన్నింటికీ మించి దేవ్ ఆనంద్ స్నేహితుడిగా దారి మొదలెట్టాడు. బెంగాల్ పురోగామి ధోరణి, చదివిన పుస్తకాలతో ఏర్పరుచుకున్న బౌద్ధిక విమర్శ కళలో ఏం చెప్పాలో తెలిపాయి. అయితే సినిమా వ్యాపారకళ. వ్యాపారాన్నీ, కళనూ, ఆదర్శాన్నీ కలిపి నడిపించడం కష్టమైన పని. కాని ఆ పనిని గొప్పగా చేయగలిగిన జీనియస్ గురుదత్. అతనికి ముందు సినిమాల్లో డైలాగ్ ఉంది. గురుదత్ వచ్చి... ఆ డైలాగ్ చెప్పే సందర్భంలో తెర కవిత్వాన్ని చిందడం చూపగలిగాడు. అతనికి ముందు సినిమాల్లో వెలుతురూ చీకటీ ఉంది. గురుదత్ వచ్చి... వెలుగునీడల గాఢ పెనవేతను తెర్పై నిలిపాడు. అతనికి ముందు సినిమాల్లో పాత్రలున్నాయి. గురుదత్ వచ్చి ఆ పాత్రల ప్రాంతం, మాట, నడత నిక్కచ్చి చేశాడు. 'ఆర్ పార్' (1954)తో ఈ ముద్ర మొదలైంది. 'మిస్టర్ అండ్ మిసెస్ 55' (1955), 'ప్యాసా' (1957), 'కాగజ్ కే ఫూల్' (1959), 'చౌద్‌వీ కా చాంద్' (1960), 'సాహిబ్ బీబీ ఔర్ గులామ్' (1962)ల వరకూ ఇదే ధోరణి కొనసాగింది. గాయని షంషాద్ బేగం అంది– 'ఏ సినిమా తీసినా నిజాయితీతో తీశాడు. తప్పుడుతనంతో ఒక్కటీ తీయలేదు'.

'ప్యాసా' క్లయిమాక్స్‌లో కవి పాత్రలో ఉన్న గురుదత్ పునరుత్థానం చెందుతాడు. సినిమాలో అతడు మరణించాడని జనం భావించాకే గుర్తింపు పొందుతాడు. నిజజీవితంలో కూడా అదే జరిగింది. పెద్ద హీరోల, దర్శకుల సినిమాల మధ్యలో... గురుదత్ జీవించి ఉండగా పేరు రాలేదు. మరణించాక కూడా రాలేదు. 1980లలో విదేశాలలో అతడి సినిమాలు ప్రదర్శింపబడి ప్రశంసలు దక్కాకే గురుదత్ పేరుకు ఉన్న మసి తొలిగింది. రాజ్‌కపూర్ 'కాగజ్ కే ఫూల్' చూసి 'ఇది కాలం కంటే ముందే తీశాడు. రాబోయే తరాలే దీనిని పూజిస్తాయి' అన్నాడు. అదే జరిగింది. నేడా సినిమా ప్రపంచంలోని ఎనిమిది యూనివర్సిటీల్లో పాఠ్యాంశంగా ఉంది.

'80 శాతం నటన నటీనటుల కళ్లతోనే పూర్తవుతుంది. మనం మనిషి కళ్లల్లో చూస్తాం. నటన కూడా అక్కడే తెలియాలి' అనేవాడు గురుదత్. అతని సినిమాల్లో టైట్ క్లోజప్స్, కళ్లు చేసే అభినయం పాత్రలను ప్రేక్షకులతో కనెక్ట్ చేస్తాయి. తీయబోయే పాట ఎలా ఉంటుందో ముందే తెలుసు కనుక రికార్డింగ్ సమయంలో ఆశా భోంస్లే ఎదురుగా నిలబడి గురుదత్ ఎక్స్‌ప్రెషన్స్ ఇస్తూ ఉంటే ఆమె వాటికి తగినట్టుగా ఒయ్యారాలు పోతూ పాడిందట. 'భవరా బడా నాదాన్ హై' వినండి తెలుస్తుంది. గురుదత్ మన తెలుగు వహీదా రెహమాన్‌ను స్టార్‌ని చేశాడు. బద్రుద్దీన్ అనే బస్ కండక్టర్‌ని జానీవాకర్ అనే స్టార్ కమెడియన్‌ని చేశాడు. ఎస్.డి.బర్మన్, ఓపి నయ్యర్‌లతో సాహిర్ లుధియాన్వీ, మజ్రూ సుల్తాన్‌పురి, కైఫీ ఆజ్మీలతో అత్యుత్తమమైన పాటలను ఇచ్చాడు. సినిమాటోగ్రాఫర్ వి.కె.మూర్తి, రచయిత అబ్రార్ అల్వీల గొప్పతనం చాటాడు.

వసంత కుమార్ పడుకోన్ అలియాస్ గురుదత్ జూలై 9, 1925న జన్మించి కేవలం 39 సంవత్సరాలు జీవించాడు. 14 ఏళ్ల కెరీర్‌లో గొప్ప గొప్ప క్లాసిక్స్ తీశాడు. గాయని గీతాదత్‌ను వివాహం చేసుకుని, వహీదా రెహమాన్ సాన్నిహిత్యం కోరి ఛిద్ర గృహజీవనం సాగించాడు. కాగితపు పూలకే అందలం దక్కే సంఘనీతికి కలత చెంది అర్ధంతరంగా జీవితం నుంచి నిష్క్రమించాడు.

రేపటి నుంచి అతని శత జయంతి సంవత్సరం మొదలు. 'ప్యాసా' క్లయిమాక్స్‌లో 'మనిషి నుంచి మనిషితనాన్ని లాక్కునే సమాజం మీదే నా ఫిర్యాదు' అంటాడు గురుదత్. ఆ ఫిర్యాదు అవసరం మరింతగా పెరిగిన రోజులివి. గురుదత్‌ను పునర్ దర్శించాల్సిన సందర్భం. అవును. మెడలో ముళ్లహారం పడినా ముందుకేగా నడక.

హమ్‌నెతో జబ్ కలియా మాంగీ కాంటోంకా హార్ మిలా
జానే ఓ కైసే లోగ్ థే జిన్ కే ప్యార్ కో ప్యార్ మిలా...

మహోన్నత నాయకత్వం

సందర్భం



కొప్పోలు ప్రభాకర్ రెడ్డి

విలక్షణ నాయకుడు వై.ఎస్.ఆర్. విపక్షాలు సైతం కొనియాడిన వ్యక్తిత్వం ఆయనది! ఇచ్చిన మాట తప్పని నైజం. 'పేదల కోసమే పాలన' అన్నది ఆయన సిద్ధాంతం. అన్నదాతకు ఆపద్బాంధవుడు. విద్య, వైద్యం, ఉద్యోగం అందరికీ అందుబాటులోకి తెచ్చి, అసమానతలను రూపుమాపిన క్రాంతదర్శి. జన జీవితంతో ఆయన మమేకం అయ్యారు. జయాపజయాలకు అతీతంగా పాలన సాగించారు. ఏం చేసినా అది ప్రజల కోసమే! ఎన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నా అది ప్రజా సంక్షేమం కోసమే! తెలుగు నేలను సస్యశ్యామలం చేయటానికి జలయజ్ఞం తలపెట్టారు. విశ్వసనీయతే తన సైన్యంగా విమర్శలను తిప్పికొట్టారు. తెలుగు ప్రజల గుండె చప్పుడుగా ఆదర్శప్రాయుడైన ప్రజా నాయకుడిగా నిలబడ్డారు. నేడు ఆయన జయంతి.



అధికారం కోసం వెన్నుపోటుకైనా వెనుకాడని నేతలుండొచ్చు. పదవి కోసం ఎలాంటి వంచనకైనా నిస్సిగ్గుగా సిద్ధపడే పార్టీలుండొచ్చు. కానీ జయాపజయాలతో సంబంధం లేకుండా, జన జీవితంతోనే పెనవేసుకున్న నాయకత్వాన్ని వైఎస్ రక్తంలోనే చూస్తాం. అందుకే వైఎస్ఆర్ అనే మూడక్షరాలు తెలుగువాడి గుండె గొంతుకయ్యాయి. దశాబ్దకాలం దాటినా వైఎస్ రాజశేఖర రెడ్డి పాలనలోని పున్నమి వెలుగులే పేదవాడి చిరునవ్వుగా మారాయి. ఎంత పెద్ద ఆపదొచ్చినా పెద్దాయన ఉన్నాడనేది వైఎస్ పాలనలో ప్రజలకు ఉన్న నమ్మకం. మాటిస్తే మడమ తిప్పడనేది వైఎస్‌పై జనానికి ఉన్న విశ్వాసం. మేలు చేసేటప్పుడు వైఎస్ రాజకీయాలు చేయడనేది విపక్షాలే ఒప్పుకున్న నిజం. ఓ బ్యూరోక్రాట్‌గా నేను ఆయన్ని దగ్గర్నుంచీ చూశాను. ప్రజల కోసమే బతికిన విలక్షణ నాయకుడే వైఎస్ఆర్‌లో నాకు కన్పించాడు. కార్యకర్తలే కుటుంబం అనుకున్న గొప్ప వ్యక్తిత్వం వైఎస్‌లోనే చూశాను. దశాబ్దాల రాజకీయ అనుభవం కావచ్చేమో... ప్రజలకు ఏం కావాలో నిక్కచ్చిగా నిర్ణయించే సామర్థ్యం వైఎస్‌కే సొంతం. ఆయన పాలనలో ఎన్నో ఘటనలు... ఇంకెన్నో జ్ఞాపకాలు... మరెన్నో మరపురాని ఘట్టాలు..!

విన్నాడు... ఉన్నానని ధైర్యమిచ్చాడు!

పాదయాత్ర వైఎస్‌ను పూర్తిగా ప్రజల పక్షానికి చేర్చింది. ఊరూ వాడా జనం గుండె చప్పుళ్లు విన్నాడు. అప్పుడే 'నేనున్నా'ననే భరోసా ఇచ్చాడు. వాళ్ళ కోసం ఏమైనా చేయాలనే పట్టుదల ఆయనలో బహుశా అప్పుడే మొదలైందేమో! పాలనలో అది స్పష్టంగా కన్పించింది. పేదవాడికి పెద్ద జబ్బొస్తే ఊపిరి పోవడమే వైఎస్ వచ్చే నాటికి ఉన్న పరిస్థితి. ముద్ద పెట్టే పొలం, తలదాచుకునే ఇల్లు అమ్మేసి వైద్యం చేయించుకునే దయనీయ పరిస్థితి అది. ఇది వైఎస్ మనసును చలించేలా చేసింది. సీఎంగా పగ్గాలు చేపట్టాక ఈ పరిస్థితే ఉండకూడదని ఆశించారు. చిన్న అర్జీ తీసుకొస్తే చాలు ఎన్ని లక్షలైనా వైద్యం కోసం ఇవ్వాలని ఆదేశించారు. ఇలా రోజుకు రూ. 1.20 కోట్లు ఖర్చయ్యేది. ఇదంతా ఖజానాకు భారం అని బ్యూరోక్రాట్స్ చెప్పబోతే వారించారాయన. 'పేదవాడి ఆపద తీర్చలేకపోతే ఎందుకయ్యా? బేవరేజ్ మీద సెస్ 1 నుంచి 2 శాతానికి పెంచితే సరిపోదా?' అంటూ తేలికగా చెప్పేవారు. పనుల్లో బిజీగా ఉండి, రాత్రి 8 గంటలకు ఇంటికొచ్చినా.. 'సీఎం రిలీఫ్ ఫండ్ దరఖాస్తులన్నీ క్లియర్ అయ్యాయా?' అని అడిగేవారు. పేదవాడిపై ఇంత ప్రేమ ఎంతమందికి ఉంటుంది? గ్రేట్ అన్పించేది. ఇలా ఎంతకాలం సీఎం ఆఫీసుకు పేదవాళ్ళు అర్జీలు పట్టుకుని రావాలి? శాశ్వత పరిష్కారం లేదా? వైఎస్ వేసిన ఈ ప్రశ్నల్లోంచే 'ఆరోగ్య శ్రీ' పథకం ఆవిర్భవించింది. దీనిపైనా విపక్షాలు విమర్శలు చేశాయి. విషయం ఏమిటంటే విమర్శించిన విపక్ష నేతలే ఈ పథకం ద్వారా లబ్ధి పొందడం! వాళ్ళే వైఎస్ తమకు ప్రాణ భిక్ష పెట్టారని చెప్పటం!

తప్పు చేయను... ఏం చేసినా మీ కోసమే!

ఇది వైఎస్ గట్టిగా నమ్మిన సిద్ధాంతం. జలయజ్ఞం పేరుతో భారీగా సాగునీటి ప్రాజెక్టులు చేపట్టారు. ప్రతీ ప్రాజెక్టుపైనా విపక్షాలు రాద్ధాంతం చేశాయి. ఈ నేపథ్యంలో ఆయన అనుసరించిన విధానం విపక్షాల నోటికి తాళం వేసింది. ప్రతీ ప్రాజెక్టు దగ్గరకు విపక్ష నేతలను పిలిపించి, వాస్తవాలు అర్థమయ్యేలా చెప్పే ఏర్పాటు చేయడం వైఎస్ విజ్ఞతకు నిలువుటద్దం. "నేను తప్పు చేయనయ్యా... ఏం చేసినా ప్రజలకోసమేనయ్యా..." అని వైఎస్ చెప్పిన ఈ మాటలను ప్రజలు విశ్వసించారు. కాలగర్భంలో కలిసిన పోలవరం ప్రాజెక్టుకు ఫౌండేషన్ వేసినా... పోతిరెడ్డిపాడుతో వరద జలాలు వాడుకునే ప్రయత్నం చేసినా ఆయనకు ప్రజాభిష్టమే లభించింది. ప్రాణహిత ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసినప్పుడు 'ఇక మిమ్మల్ని విమర్శించలేను' అంటూ జి. వెంకటస్వామి కృతజ్ఞతా పూర్వకంగా అనడం ఇప్పటికీ చాలామంది గుర్తు చేస్తారు. ఒక ప్రాంతం కాదు... ఒక పార్టీ కాదు... ప్రజలకు ఉపయోగపడేది ఏదైనా చేసి తీరాల్సిందే అనేది వైఎస్ సిద్ధాంతం. అద్భుతమైన తెలివితేటలుండీ ఆర్థిక ఇబ్బందులతో చదవలేని పేదలకు ఫీజు రీ-ఎంబర్స్‌మెంట్ తీసుకొచ్చిన వైఎస్ వల్ల... డాక్టర్లు, ఇంజనీర్లు అయిన పేదవాళ్ళున్నారు. అలా కొత్త వెలుగులు విరజిమ్ముతున్న జీవితాలు ఎన్నో! పేదవాడి నోటికాడికి ముద్ద చేర్చాలన్న లక్ష్యంతో రూ. 5.30 కిలో బియ్యం ధరను రూ. 2కు తగ్గించాలని భావించారు. దీన్ని బ్యూరోక్రాట్స్ వ్యతిరేకించారు. "మీ అభ్యంతరాలు మీరు చెప్పండి... కానీ ఇది అమలు చేయడం నా బాధ్యత" అంటూ... నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడ్డ గొప్ప వ్యక్తి వైఎస్ అనడం అతిశయోక్తేమీ కాదు.

తిరుగులేని నిర్ణయాలు

వైఎస్ సీఎంగా బాధ్యతలు చేపట్టినప్పుడు అంతర్జాతీయ పరిణామాల వల్ల మిర్చి ధర ఒక్కసారిగా పడిపోయింది. ఆ సమయంలో మిర్చి రైతుల ఆవేదన అంతా ఇంతా కాదు. జిల్లాల నుంచి అందిన ఈ సమాచారంతో వైఎస్ అప్పటికప్పుడే అధికారులను సమావేశపర్చారు. మార్కెట్లో రూ. 800 క్వింటాలున్న మిర్చిని, రూ.1500కు కొనాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. ఈ నిర్ణయంతో కొన్ని వేల మంది మిర్చి రైతుల కళ్ళల్లో ఆనందం చూశాం. ఇలాంటిదే మరో ఘటన. నిజామాబాద్‌లో రైతులు పండించే ఎర్ర జొన్నలు పంజాబ్, హర్యానాలకు సరఫరా అవుతాయి. వీటిని సేకరించే దళారులకు కేజీకి రూ. 12 వస్తే, రైతుకు వచ్చేది రూ. 4. రైతులకు ఎక్కువ ధర చెల్లించే ఓ దళారికి అవసరమైన బ్యాంకు లోన్ ఇప్పించడంలో అధికారులు కాదన్నా, వైఎస్ఆర్ నిర్ణయం తీసుకుని రైతులకు మేలు చేయడాన్ని ఇప్పటికీ అక్కడి రైతులు మరిచిపోరు. మరొక సందర్భం – వైఎస్ఆర్ హయాంలో దేశవ్యాప్తంగా గ్యాస్ ధరలు పెరిగాయి. ప్రతీ సిలిండర్‌కు రూ. 50 సబ్సిడీ ప్రకటించారు. రూ. 50 సబ్సిడీ ఇవ్వడం మామూలు విషయమేమీ కాదు. ఆర్థిక భారం పడుతుందని అధికారులు, ఆర్థిక మంత్రి చెప్పినా 'ప్రతీ ఇంట్లో మేలు జరుగుతుంది కదా' అని తన నిర్ణయంతో ముందుకు వెళ్లారు వైఎస్ఆర్. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు వేసేప్పుడు స్వపక్షం నుంచే అనేక రకాల ఒత్తిడి వచ్చింది. ఇవేవీ లెక్క చేయలేదు. 150 కిలోమీటర్ల ఔటర్ రింగ్ రోడ్డును అంత ధైర్యంగా చేపట్టడం వల్ల రాజధాని రూపురేఖలే మారాయి. హైదరాబాద్ విమానాశ్రయం పరిశీలనకు వెళ్ళినప్పుడు ఓ ముఖ్య విషయం ఆయన దృష్టికి వచ్చింది. విమానాల హబ్ ఏర్పాటు వల్ల అనేక రకాల అభివృద్ధి ఉంటుంది, దీనికి టాక్స్‌ను 14 నుంచి ఒక్క శాతానికి తగ్గించాలన్న విజ్ఞప్తి అది. అప్పటికప్పుడే ఆయన దానిపై అనుకూలంగా నిర్ణయం తీసుకున్నారు. దీనివల్ల విమానాశ్రయం ఆర్థిక పురోగతే మారింది.

విశ్వసనీయతే ఆయన సైన్యం

ఇంటెలిజెన్స్ కన్నా ముందే వైఎస్‌కు రాష్ట్రంలో ఏం జరుగుతోందో తెలిసేది. ఒకసారి గుంటూరు దగ్గర రైలు ప్రమాదం జరిగితే అధికారుల కన్నా ముందే ఆయన అప్రమత్తమయ్యారు. ఆయనే అందరికీ ఫోన్లు చేసి బాధితులకు అండగా ఉండమని చెప్పారు. ప్రతీ ఊళ్ళో ఆయనకు నెట్‌వర్క్ ఉండేది. ఏ జిల్లాకు వెళ్ళినా కనీసం 40 మంది కార్యకర్తలతో ఆయన విడిగా మాట్లాడేవారు. ఏ అర్ధరాత్రయినా ఆయనకు వాళ్ళు ఫోన్లు చేసేవాళ్ళు. విషయం చెప్పేవాళ్లు. ఆయన కూడా వినేవాడు. దీంతో కచ్చితమైన సమాచారం వచ్చేది. చుట్టూ ఉన్న కోటరీపై ఆయన ఎప్పుడూ ఆధారపడేవాడే కాదు. ఎంత పెద్ద ఆందోళన జరిగినా రైతులు, ప్రజలపై తుపాకులు ఎక్కుపెట్టొద్దని స్పష్టమైన సంకేతాలు ఇచ్చేవాడు. నిజామాబాద్‌లో ఎర్ర జొన్నల వివాదం సందర్భంగా, ముదిగొండలో కాల్పుల సందర్భంగా... 'రైతులకు ఏమైనా జరిగిందా?' అంటూ ఆయన పడ్డ కంగారు మాటల్లో చెప్పలేనిది. విపక్ష నేతలను అసెంబ్లీలోనూ పేర్లు పెట్టి పిలిచే స్వతంత్రం... చంద్రబాబు బీజేపీతో పొత్తు పెట్టుకున్నా– మళ్ళీ సెక్యులర్ మాటలు చెప్పినా తేలికగా కొట్టిపారేసే ధైర్యం... ఓడిపోయినా ప్రతీ క్షణం ప్రజా క్షేత్రంలోనే ఉండే గొప్ప నైజం... వైఎస్ ఉన్నతిని పెంచాయి. ఈనాటికీ ఏ నేతకూ లేని ప్రజాదరణను తెచ్చి పెట్టింది. వైఎస్ మన మధ్య లేకపోవచ్చు. సడలని విశ్వాసం... చెదిరిపోని ప్రజల కలల స్వప్నంలో పథకాల రూపంలో ఎప్పటికీ ఆయన చిరస్థాయిగా నిలిచిపోతారు.

వ్యాసకర్త రిటైర్డ్ ఐఏఎస్ అధికారి
(వై.ఎస్.ఆర్. సీఎంగా ఉన్నప్పుడు సీఎంవో కార్యదర్శి)


పని చేస్తోందా? పట్టు తప్పుతోందా?!

కామెంట్



కరణ్ థాపర్

ఇప్పుడిక మనం 18వ లోక్‌సభను ఎన్నుకున్నందున ప్రాథమికమైన రెండు ప్రశ్నలను లేవనెత్తాల్సిన సమయం ఆసన్నమయింది. మొదటిది– లోక్‌సభ మన ఆశలకు అనుగుణంగానే పని చేస్తోందా? రెండవది – కేవలం పాలక పక్షాలు చెప్పింది వినడం వరకే కాక, భారత ప్రజల గొంతును కూడా వినిపించేందుకు తగినంతగా సమయాన్ని సాధించేలా ప్రతిపక్షాన్ని ఒప్పించటానికి ఎలాంటి మార్పులు అవసరం?



17వ లోక్‌సభ కేవలం 1,354 గంటలు మాత్రమే పని చేసిందని పీఆర్ఎస్ (పాలసీ రీసెర్చ్ స్టడీస్) లెజిస్లేటివ్ రీసెర్చ్ ప్రచురించిన వాస్తవాలు తెలియజేస్తున్నాయి. మొత్తం అన్ని పూర్తి–కాల లోక్‌సభల పని గంటల సగటు కంటే నలభై శాతం తక్కువగా 1,615 గంటలు మాత్రమే పని చేసిన 16వ లోక్‌సభ కన్నా కూడా ఇది తక్కువ. నిజానికి 17వ లోక్‌సభ 15 సమావేశాలలో 11 సమావేశాలు నిర్దిష్ట సమయానికి ముందే వాయిదా పడ్డాయి. మొత్తం అన్ని పూర్తి–కాల లోక్‌సభలలో ఒక్క 17వ లోక్‌సభ మాత్రమే అతి తక్కువగా కేవలం 274 సార్లు మాత్రమే సమావేశం అయింది.

ఏడాదికి 135 రోజులు సమావేశం అయిన తొలి లోక్‌సభతో పోల్చి చూస్తే 17వ లోక్‌సభ ఏడాదికి కేవలం 55 రోజులు మాత్రమే సమావేశమైంది. ఇది చట్ట నిర్వహణ విధానంపై స్పష్టమైన ప్రభావం చూపింది. బిల్లులు చాలావరకు వాటిని ప్రవేశపెట్టిన రెండు వారాల లోపే ఆమోదం పొందాయి. 35 శాతం బిల్లులు గంట కంటే తక్కువ చర్చతోనే చట్టరూపం దాల్చాయి. పార్లమెంటరీ కమిటీల పరిశీలన కోసం కేవలం 16 శాతం మాత్రమే వెళ్లాయి. ఆ ముందరి మూడు లోక్‌సభలలో పరిశీలనకు వెళ్లినవాటి కంటే ఇది తక్కువ.

అంటే, లోక్‌సభ పని గంటలు తగ్గిపోతుండటమే కాకుండా, అందులోనూ మళ్లీ... బిల్లుల నిశిత పరిశీలన, బిల్లులపై జరగవలసిన అర్థవంతమైన చర్చల విషయంలో లోక్‌సభ సామర్థ్యం క్షీణించిపోతోంది! లోక్‌సభ అతి ముఖ్యమైన విధులలో ఈ బిల్లుల చర్చ–పరిశీలన ఒకటి కనుక అది మన అంచనాలకు తగ్గట్లుగా లేదని మనం నిస్సంకోచంగా అనుకోవచ్చు. దీనికి పరిష్కారం సరళమైనది, స్పష్టమైనది. అదేమిటంటే, లోక్‌సభలు ప్రతి సంవత్సరం కనీసం ఇన్ని రోజులని నిర్దిష్టంగా సమావేశం అవ్వాలి. బిల్లులు ఆమోదం పొందటానికి ముందు సవివరమైన పరిశీలన కోసం వాటిని పార్లమెంటరీ కమిటీలకు పంపాలి.

మరొకటి – ఎంతో క్లిష్టమైనదీ – లోక్‌సభ పనితీరుకు ప్రభుత్వం బాధ్యత వహించేలా చేయటం! ఇక్కడే పాలకపక్షం తమ గొంతును వినటం లేదని ప్రతిపక్షాలు చేస్తున్న వాదనను పరిగణనలోకి తీసుకుని పరిష్కరించవలసిన అవసరం ఉంది. అలా చేస్తే తప్ప ప్రభుత్వాన్ని అర్థవంతంగా ప్రశ్నించటం, సవాలు చేయటం కుదరదు. మరి దీన్నెలా మనం సాధించాలి?

దీనికొక కుదురైన పరిష్కారం హౌస్ ఆఫ్ కామన్స్ పాటించే విధానాన్ని స్వీకరించటం! ప్రతి సమావేశాలలోనూ కొన్నిరోజులు ప్రతిపక్షాలే అజెండాను నిర్ణయించేలా చేయటం. బ్రిటన్‌లో వాటిని 'ప్రతిపక్షాల రోజులు' అంటారు. ప్రతి పార్లమెంటు సమావేశంలో అవి 20 ఉంటాయి. ప్రధాన ప్రతిపక్షానికి 17, రెండవ అతిపెద్ద
ప్రతిపక్షానికి 3 రోజులు.

మనం అనుసరించదగిన బ్రిటిష్ పార్లమెంటరీ విధానాలలో రెండవది... పీఎంక్యూస్ (ప్రైమ్ మినిస్టర్స్ క్వశ్చన్స్). సమావేశాలు జరుగుతున్న కాలంలో ప్రతివారం ఒక నిర్ణీత రోజున పూర్తిగా ఒక అరగంట పాటు ప్రతిపక్షాల ప్రశ్నలకు ప్రధానే నేరుగా సమాధానం చెబుతారు. వాటిల్లో కనీసం ఆరు ప్రశ్నలను ప్రతిపక్ష నేత అడుగుతారు.

పీఎంక్యూస్ అని బ్రిటన్‌లో వాడుకలో ఉన్న ఈ ప్రశ్నా సమయం అమితమైన ప్రజాసక్తిని కలిగి ఉంది. పీఎం, ప్రతిపక్ష నేతల బలాలను, బలహీనతలను బహిర్గతపరిచే ఉత్తేజభరితమైన క్షణాలు అవి. వారి సమాచార లేమి, సామర్థ్య లోపం ఇట్టే తెలిసిపోతాయి. పీఎంక్యూస్ బ్రిటన్‌కొక గవాక్షం వంటిది కూడా! తమ నాయకుడు ఎంతటి ఘనుడో ప్రజలు చూస్తారు. ఒక అంచనాకు వస్తారు. ఒక్కమాటలో చెప్పాలంటే, ప్రజాస్వామ్యం పని చేస్తోందా, లేక పట్టుతప్పుతోందా అనేదానికి పీఎంక్యూస్ ఒక రుజువు.

ఈ సంప్రదాయాలను మనం స్వీకరించినట్లయితే, ప్రజాస్వామ్యం పట్ల అవి మన విశ్వాసాన్ని పెంపొందింపజేస్తాయి. తమ వంతు కర్తవ్యాన్ని నిర్వహించాలన్న ప్రతిపక్షాల ప్రయత్నానికి అవి మద్దతును ఇస్తాయి. భిన్నమైన అభిప్రాయాలు, వాదనలకు చర్చావేదిక దొరికిందన్న నమ్మకాన్ని భారత ప్రజలకు కల్పిస్తాయి.

చివరిగా, కోల్పోయిన విశ్వాసాన్ని నిజంగా పాదుకొల్పడానికి మనం స్పీకర్ స్థానం విషయమై కూడా మార్పులు చేసుకోవలసిన అవసరం ఉంది. స్పీకర్‌గా ఎంపికైన వారు వెంటనే తమ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేయాలి. అప్పుడు మాత్రమే ఆ వ్యక్తి నిష్పక్షపాతంగా, పార్టీలకు అతీతంగా ఉండగలరని నమ్మగలం. ఆమె లేదా అతడు తర్వాతి లోక్‌సభకు కూడా కొనసాగాలని అనుకుంటే వారి ఎన్నిక పోటీ లేకుండానే జరగాలి. అదంతా కూడా ఎలాగూ వారి స్వభావం, ప్రవర్తన మీద ఆధారపడి ఉన్నప్పటికీ వార్ధక్య వైకల్యాలు లేకుండాలి.

ఇవి స్పష్టమైన పరిష్కారాలే కానీ ప్రభుత్వం ఆమోదించినప్పుడు మాత్రమే సంభవమౌతాయి. కాంగ్రెస్ పార్టీ తన మ్యానిఫెస్టోలో పేర్కొన్న విధంగా ప్రతిపక్షమే స్వయంగా ఈ మార్పులను సిఫారసు చేయవచ్చు. అందుకు బీజేపీ కనుక నిరాకరిస్తే భారతదేశం ప్రజాస్వామ్యానికి తల్లి వంటిది అని చెప్పుకోవటాన్ని ఆ పార్టీ కొనసాగించగలదా? అప్పుడు తల్లి అని కాకుండా సవతి తల్లి అని చెప్పుకోవటమే సరిగ్గా ఉంటుందా?

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

భక్తిలో విశ్వాసం

భక్తి లేకుండా, విశ్వాసం లేకుండా కేవలం యాంత్రికంగా ఎన్ని రకాల, ఎన్ని వర్ణాల పూలతో పూజ చేసినా ఉపయోగం ఉండదు. విశ్వాసం లేకుండా చేసే తీర్థయాత్రల వల్ల, గంగా స్నానాల వల్ల ఫలితం ఉండదు. గంగలో మునక వేస్తే పాపాలు హరిస్తాయంటారు కానీ నిజంగా అలా జరుగుతుందని నమ్మకం ఏమిటి? అనే అవిశ్వాసం తోనే చాలా మంది ఉంటారు. మనుషులలో సందేహ జీవులే ఎక్కువ.

ఒకసారి పార్వతీ పరమేశ్వరులు ఈ విషయం గురించే 'నిత్యం గంగలో ఎంతోమంది స్నానం చేస్తూ, శివ స్మరణ చేస్తున్నారు కానీ ఎవరిలోనూ పూర్తి విశ్వాసం కనిపించటం లే'దని

జ్యోతిర్మయం

అనుకుంటారు. నిజమైన భక్తి ఎవరిదో పరీక్షిద్దామని అనుకుని వృద్ధ దంపతుల రూపంలో గంగా తీరానికి వెళతారు. అక్కడ వృద్ధుడు ఒక గోతిలో పడిపోతాడు. భార్య దుఃఖిస్తూ ఎవరైనా చేయందించి తన భర్తను కాపాడమని అక్కడ చుట్టూ చేరిన వారిని కోరుతుంది. వాళ్ళు ముందుకు రాబోతుంటే ఆమె 'మీలో ఎప్పుడూ ఏ పాపం చేయని వాళ్ళు మాత్రమే నా భర్తను కాపాడండి. లేకుంటే, చేయందిస్తున్నప్పుడు మీ చేయి కాలిపోతుంది' అంది. అక్కడ ఉన్నవారంతా గంగా స్నానం చేసినవారు. నిరంతరం శివ స్మరణ చేసేవారు. అయినా, తమ భక్తి మీద తమకు నమ్మకం లేదు. ఎవరూ ముందుకు రాలేదు. వృద్ధుణ్ణి కాపాడే ప్రయత్నం చేయలేదు.

అంతలో ఒక దొంగ అక్కడకి వచ్చాడు. వృద్ధురాలు చెప్పిన విషయం తెలుసుకుని, వెంటనే గంగలో మూడు మునకలు వేశాడు. వృద్ధుణ్ణి కాపాడాడు. గంగలో మునిగిన తర్వాత తన పాపాలన్నీ నశించిపోయాయని అతని నమ్మకం. వృద్ధునికి చేయందించినపుడు అతని చేయి కాలలేదు. అదీ విశ్వాసమంటే! ఆ తర్వాత అతడు దొంగతనాలు మాని శివభక్తుడయ్యాడు.

అపనమ్మకంతో, సందేహంతో చేసే పనులు ఏవీ సత్ఫలితాన్నివ్వవు. చేసే పనిపై విశ్వాసం ఉండాలి.

– డా॥ చెంగల్వ రామలక్ష్మి

గ్రహం అనుగ్రహం

శ్రీక్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు; ఆషాఢ మాసం; **తిథి:** శు.తదియ తె.5.20 వరకు (తెల్లవారితే మంగళవారం), తదుపరి చవితి; **నక్షత్రం:** పుష్యమి ఉ.6.12 వరకు, తదుపరి ఆశ్లేష; **వర్జ్యం:** రా.7.53 నుండి 9.36 వరకు; **దుర్ముహూర్తం:** ప.12.30 నుండి 1.22 వరకు, తదుపరి ప.3.06 నుండి 3.58 వరకు; **అమృత ఘడియలు:** ఉ.6.08 నుండి 8.24 వరకు; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు; **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు; **సూర్యోదయం:** 5.34; **సూర్యాస్తమయం:** 6.35

'అన్నారం'కి నిపుణుల బృందం

కాళేశ్వరం: జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం ప్రాజెక్టు పరిధి అన్నారం(సరస్వతీ) బరాజ్ వద్ద రెండో దశ పరీక్షలు జరిపేందుకు సీడబ్ల్యూపీఆర్ ఎస్(సెంట్రల్ వాటర్ పవర్ రీసెర్చ్ స్టేషన్) నిపుణుల బృందం ఆదివారం చేరుకుంది. ఇప్పటికే నాయుడు బృందం సభ్యులు బ్యారేజీ పార్లర్ సెస్మిక్ మెథడ్ ద్వారా భూగర్భంలో స్కానింగ్ పరీక్షలు చేపట్టారు. ఈ బృందం.. భూగర్భంలోని బరాజ్ పియర్స్ కింద సీకెంట్ ఫైల్స్ ఎంత పటిష్టంగా ఉన్నాయో చిత్రాలను తీస్తుంది. ప్రస్తుతం 42 చోట్ల పరీక్షలు చేయాల్సి ఉండగా, మొదటి దశ పూర్తికాగా.. బృందం పూణెకు వెళ్లిపోయింది. ఈ బృందానికి చెందిన రెండో బృందం పరీక్షలు చేయడానికి ఇక్కడికి చేరుకుంది.

జైనథ్‌కు దారేది?

- మళ్లీ కొట్టుకుపోయిన తరోడ తాత్కాలిక వంతెన

జైనథ్: ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం తరోడ గ్రామం వద్ద సాత్నాల వాగుపై నిర్మించిన తాత్కాలిక వంతెన మళ్లీ కొట్టుకుపోయింది. జైనథ్–బేల 353–బి జాతీయ రహదారిపై ఉన్న తరోడ పాత బ్రిడ్జి గతేడాది ఫిబ్రవరిలో కుంగిపోగా, అప్పటి నుంచి రాకపోకలు నిలిపివేశారు. వాహనాల రాకపోకల కోసం పాత బ్రిడ్జి కింద సాత్నాల వాగుపై పలుమార్లు తాత్కాలిక వంతెనలు ఏర్పాటు చేస్తున్నా, వర్షాలకు కొట్టుకుపోతున్నాయి. శనివారం రాత్రి కురిసిన వర్షానికి వాగు పొంగింది. దీంతో వంతెన కోసం వేసిన సిమెంట్ పైపులు, మధ్య భాగం కొట్టుకుపోయింది. ప్రస్తుతం రాకపోకలు నిలిచిపోవడంతో జైనథ్ నుంచి ఆదిలాబాద్ వెళ్లేందుకు నిరాల మీదుగా వయా అడా గ్రామం గుండా రాకపోకలు కొనసాగిస్తున్నారు.



వానకు కొట్టుకు పోయిన తాత్కాలిక వంతెన

కొత్త రైళ్లు కూత వేసేనా?

ఈ నెలలోనే కేంద్ర బడ్జెట్..ఈసారైనా పట్టాలెక్కేనా?



- కోట్లాదిమంది భక్తులు సందర్శించే ఆధ్యాత్మిక క్షేత్రం వారణాసికి కొంతకాలంగా హైదరాబాద్ నుంచి భక్తుల రద్దీ పెరిగింది. కానీ భక్తుల డిమాండ్ మేరకు రైళ్లు లేవు.
- నగరవాసులు అయోధ్య బాల రాముడిని సందర్శించాలంటే ఖరీదైన ఐఆర్‌సీటీసీ ప్యాకేజీతో భారత్ గౌరవ్ రైళ్లు ఎక్కాల్సిందే. పైగా అది వారం, పది రోజుల పర్యాటక రైలు (టూరిస్ట్ ట్రైన్). జంటనగరాల నుంచి నేరుగా అయోధ్యకు వెళ్లేందుకు ఎలాంటి సదుపాయం లేదు.
- సికింద్రాబాద్ నుంచి దానాపూర్‌కు ఒకే ఒక్క రైలు అందుబాటులో ఉంది. ఇది ప్రతిరోజూ 180 శాతం ఆక్యుపెన్సీతో నడుస్తోంది. తాజాగా ఈ ట్రైన్‌కు 2 సాధారణ బోగీలను అదనంగా ఏర్పాటు చేశారు. కానీ ఈ రూట్‌లో మరో రైలు ఏర్పాటు చేయాలనే డిమాండ్ చాలాకాలంగా ఉంది.

సాక్షి, హైదరాబాద్: సికింద్రాబాద్ నుంచి తిరుపతి, విశాఖ, బెంగళూరులకు ప్రవేశపెట్టిన వందేభారత్ రైళ్లు మినహా హైదరాబాద్ మహా నగరానికి సంబంధించి ఈ పదేళ్లలో కొత్తగా పట్టాలెక్కిన రైళ్లు తక్కువే. ముచ్చటగా మూడోసారి కొలువుదీరిన మోదీ సర్కార్ ఈ నెలలోనే బడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు సన్నాహాలు చేపట్టింది. దీంతో ఈసారైనా కొత్త రైళ్లు కరుణిస్తాయేమోనని నగర ప్రయాణికులు ఆశగా ఎదురు చూస్తున్నారు. ప్రయాణికుల రద్దీ, డిమాండ్ అత్యధికంగా ఉన్న మార్గాల్లో కొత్త రైళ్లు ప్రవేశపెట్టాలనే ప్రతిపాదనకు గ్రీన్‌సిగ్నల్ వేస్తారా లేదా అనేది మరికొద్ది రోజుల్లోనే తేలనుంది.

ఈ మార్గాల్లో భారీ డిమాండ్ ....

- సికింద్రాబాద్ నుంచి బిహార్‌లోని దానాపూర్‌కు ఇప్పుడు ఒకే ఒక్క సూపర్‌ఫాస్ట్ రైలు ఉంది. కానీ ప్రతిరోజూ కనీసం రెండు రైళ్లకు సరిపడా ప్రయాణికులు పడిగాపులు కాస్తూనే ఉంటారు. ఈ రూట్‌లో అన్ని వర్గాల ప్రయాణికులు రాకపోకలు సాగించే విధంగా మరో అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును ఏర్పాటు చేయవలసి ఉంది. అలాగే హైదరాబాద్ నుంచి అయోధ్యకు నిజామాబాద్, కరీంనగర్, పెద్దపల్లి, బల్లార్షా, గోండియా, జబల్‌పూర్, కట్నీ, ప్రయాగరాజ్, వారణాసిల మీదుగా వారానికి రెండుసార్లు బై వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలును నడపాలనే డిమాండ్ ఉంది. ఈ ట్రైన్ అందుబాటులోకి వస్తే నగరానికి చెందిన భక్తులు ఐఆర్‌సీటీసీ రైళ్లపైన ఆధారపడవలసిన అవసరం లేకుండా నేరుగా అయోధ్య, వారణాసిలకు రాకపోకలు సాగించే అవకాశం లభిస్తుంది.
- సికింద్రాబాద్ నుంచి సంత్రాగచ్చి (కోల్‌కతా)కి కూడా ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంది. ఈ రూట్‌లో ఒక బై వీక్లీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రవేశపెట్టవలసి ఉంది. దీంతో సికింద్రాబాద్ నుంచి కాజీపేట, బల్లార్షా, గోండియా, రాయ్‌పూర్, ఝర్సుగూడ, టాటానగర్‌ల మీదుగా ప్రయాణికులకు సదుపాయం లభిస్తుంది. కాజీపేట– బల్లార్షా సెక్షన్‌లో కోల్‌కతాకు వెళ్లేందుకు ప్రస్తుతం ఒక్క రైలు కూడా లేదు.
- ప్రతి సంవత్సరం లక్షలాది మంది అయ్యప్ప భక్తులు శబరికి వెళ్తారు. కానీ ప్రస్తుతం హైదరాబాద్–శబరి ఎక్స్‌ప్రెస్ ఒక్కటే ఇక్కడినుంచి అందుబాటులో ఉంది. ఈ రూట్‌లో సికింద్రాబాద్ నుంచి కొల్లాం వరకు ఒక బై వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలును వికారాబాద్, గుంతకల్, తిరుపతిల మీదుగా నడపాలని భక్తులు చాలాకాలంగా డిమాండ్ చేస్తున్నారు. హైదరాబాద్ నుంచి గాంధీధాం (గుజరాత్) వరకు బై వీక్లీ ఎక్స్ ప్రెస్ రైలును ప్రవేశ పెట్టాలనే డిమాండ్ కూడా పెండింగ్‌లోనే ఉంది.

తెలంగాణ సంపర్క్ క్రాంతి ఏమైనట్లు?

హైదరాబాద్ నుంచి న్యూఢిల్లీ వరకు రాకపోకలు సాగించే విధంగా తెలంగాణ సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ రైలును నడపాలనే ప్రతిపాదన పదేళ్లుగా పెండింగ్‌లోనే ఉంది. ప్రస్తుతం తెలంగాణ ఎక్స్‌ప్రెస్ మాత్రమే అందుబాటులో ఉంది. అయితే ప్రతిరోజూ వందలాది మంది వెయిటింగ్ లిస్ట్‌పై దృష్టి పెట్టి పడిగాపులు కాస్తుంటారు. మరోవైపు ఇటీవలి కాలంలో నగరవాసులు ఎక్కువగా రాకపోకలు సాగిస్తున్న సికింద్రాబాద్ నుంచి రామేశ్వరం రూట్‌లో ఒక వీక్లీ ఎక్స్‌ప్రెస్‌ను కాజీపేట, విజయవాడ, గూడూరు, రేణిగుంట, కాంచీపురం, విల్లుపురం మీదుగా ప్రవేశపెడితే ప్రయాణికులకు ఎంతో ఊరట లభిస్తుంది.

రాజధానితో అనుసంధానం ఏదీ?

రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరానికి, ఉమ్మడి జిల్లా కేంద్రాలకు ట్రైన్ కనెక్టివిటీ అరకొరగానే ఉంది. ఇంటర్‌సిటీ రైళ్ల తరహాలో ప్రత్యేకంగా వివిధ జిల్లా కేంద్రాలకు రైళ్లను ప్రవేశపెట్టాలని చాలాకాలంగా ప్రతిపాదనలు ఉన్నాయి. సికింద్రాబాద్ నుంచి కరీంనగర్ వరకు కాజీపేట, పెద్దపల్లి పట్టణాల మీదుగా వందే మెట్రో రైలును ప్రవేశపెట్టాలి, అలాగే సికింద్రాబాద్ నుంచి సిర్పూర్ కాగజ్‌నగర్ మార్గంలో ఒక ఇంటర్ సిటీ రైలును నడపాలనే ప్రతిపాదన చాలా రోజులుగా పెండింగ్‌లో ఉంది. అలాగే హైదరాబాద్ – బోధన్, కాచిగూడ–పుదుచ్చేరి తదితర మార్గాల్లో రైళ్లకు డిమాండ్ ఉంది.

చర్లపల్లిని ప్రారంభిస్తారా?

టెర్మినల్‌గా అందుబాటులోకి వచ్చిన చర్లపల్లి స్టేషన్ ఇప్పటివరకు ప్రారంభానికి నోచుకోలేదు. నిర్మాణ పనులు పూర్తయినప్పటికీ ఇంకా రైళ్ల రాకపోకలు అందుబాటులోకి రాలేదు. ఇది ప్రారంభమైతే సికింద్రాబాద్, నాంపల్లి స్టేషన్లపై ఒత్తిడి తగ్గనుంది. మరోవైపు సికింద్రాబాద్ స్టేషన్ పునర్నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్న దృష్ట్యా కూడా చర్లపల్లిని వినియోగంలోకి తేవలసి ఉంది. ఎన్నికల నేపథ్యంలో చర్లపల్లి ప్రారంభోత్సవం వాయిదా పడినట్లు అప్పట్లో అధికారులు చెప్పారు. ప్రస్తుతం ఎన్నికలు ముగిసి కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. ఇప్పటికైనా చర్లపల్లి అందుబాటులోకి వస్తే ప్రయాణికులకు సదుపాయంగా ఉంటుంది.

అంతలో వెళ్లమని.. ఇంతలో ఆగమని..

'రామగుండం బీ–థర్మల్'పై రాజకీయ రగడ

- గత నెల 4వ తేదీ నుంచి నిలిచిపోయిన విద్యుదుత్పత్తి
- కాలం చెల్లిన 53 ఏళ్ల విద్యుత్ కేంద్రానికి మరమ్మతులు చేసినా వృథా అనే భావన
- అక్కడి నుంచి ఇతర కేంద్రాలకు ఇంజనీర్లు, ఉద్యోగుల బదిలీకి జెన్‌కో ఆదేశం
- ఓ మంత్రి, ఎమ్మెల్యే ఒత్తిడితో అమలు నిలుపుదల చేస్తూ మరో ఉత్తర్వు

సాక్షి, హైదరాబాద్: రామగుండం బీ–థర్మల్ విద్యుత్ కేంద్రం మూసివేతపై రాజకీయ రగడ జరుగుతోంది. 1971లో 62.5 మెగావాట్ల విద్యుదుత్పత్తితో ప్రారంభమైన ఈ విద్యుత్ కేంద్రం జీవితకాలం ఎప్పుడో ముగిసింది. అయినా మరమ్మతులు చేస్తూ ఇంతకాలం నెట్టుకొచ్చారు. సాంకేతిక సమస్యలతో గత నెల 4వ తేదీ నుంచి విద్యుదుత్పత్తి నిలిచిపోయింది. ఇకపై మరమ్మతులు చేసినా ఫలితం ఉండదనే భావనకు జెన్‌కో వచ్చింది. అక్కడున్న 65 మంది ఇంజనీర్లు, 230 మంది ఆపరేషన్స్ అండ్ మెయింటనెన్స్(ఓ అండ్ ఎం) సిబ్బంది, మరో 40 మంది అకౌంట్స్, పీఎంజీ విభాగాల్లో పనిచేస్తుండగా, జూన్ 4 నుంచి వీరికి పనిలేకుండా పోయింది. అక్కడి సబ్‌స్టేషన్, ఇతర అత్యవసర వ్యవస్థల నిర్వహణకు అవసరమైన సిబ్బంది మినహా మిగిలిన ఇంజనీర్లు, ఇతర ఉద్యోగులకు విడతల వారీగా రాష్ట్రంలోని ఇతర విద్యుత్ కేంద్రాలకు బదిలీ చేయాలని జెన్‌కో నిర్ణయం తీసుకుంది. తొలిదఫాలో 44 మంది ఇంజనీర్లు, నలుగురు కెమిస్ట్‌లను నిర్మాణదశలో ఉన్న యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రానికి డెప్యూటేషన్‌పై బదిలీ చేస్తూ గత నెలలో జెన్‌కో ఉత్తర్వులు జారీ చేసింది. కాగా ఉత్తర తెలంగాణకు చెందిన ఓ మంత్రి, మరో ఎమ్మెల్యే ఒత్తిడితో రెండురోజులకే ఉత్తర్వుల అమలును నిలుపుదల చేస్తూ మరో ఉత్తర్వులు జారీ చేయాల్సి వచ్చింది. ఈ విద్యుత్ కేంద్రానికి సంబంధించిన ఉద్యోగుల జీతాలు, పెన్షన్లకు నెలకు రూ.4 కోట్లకు పైగా వ్యయం అవుతుండగా, ఉత్పత్తి నిలిచిపోయి ఉద్యోగులందరూ ఖాళీగా ఉండడంతో జెన్‌కోకు ఆర్థికంగా భారంగా మారింది. కొత్త విద్యుత్ కేంద్రంనిర్మించే వరకు వారిని అక్కడే కొనసాగించాలని ఓ మంత్రి, ఎమ్మెల్యే ఒత్తిడి చేస్తున్నట్టు చర్చ జరుగుతుండగా, కొత్త కేంద్రం నిర్మాణానికి 4 నుంచి 8 ఏళ్లు పట్టనుందని జెన్‌కో అధికారవర్గాలు పేర్కొంటున్నాయి.

ఐదేళ్లుగా నెట్టుకొస్తున్నా...

రామగుండం బీ–థర్మల్ విద్యుత్ కేంద్రం నిర్వహణ భారంగా మారినా స్థానికంగా వస్తున్న రాజకీయ ఒత్తిళ్లతో గత ఐదేళ్లుగా నెట్టుకొస్తున్నారు. 2019 మార్చి 31లోగా ఈ విద్యుత్ కేంద్రాన్ని మూసివేయాలని సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ(సీఈఏ) గతంలో ఆదేశాలు జారీ చేయగా, రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తితో గడువును 2029 వరకు పొడిగించింది. 62.5 మెగావాట్ల పూర్తి స్థాపిత సామర్థ్యం మేరకు విద్యుత్ కేంద్రంలో ఉత్పత్తి జరగడం లేదు. గరిష్టంగా 45 మెగావాట్ల విద్యుత్ మాత్రమే ఉత్పత్తి చేస్తుండగా, అధిక బొగ్గు వినియోగిస్తుండడంతో ఆర్థికంగా గిట్టుబాటు కావడం లేదు. కాలుష్యం సైతం అనుమతించిన స్థాయికి మించి జరుగుతోంది. దాదాపుగా రూ.2 కోట్లు ఖర్చు చేసి బయటి నుంచి పరికరాలు తెప్పించి మరమ్మతులు నిర్వహిస్తే 15 రోజుల్లో ఉత్పత్తిని ప్రారంభించి మరికొన్ని రోజుల పాటు నెట్టుకు రావొచ్చని, పూర్తిస్థాయిలో మరమ్మతుల నిర్వహణకు కనీసం రూ.30కోట్లకు పైగా ఖర్చు అవుతుందని జెన్‌కో వర్గాలు పేర్కొంటున్నాయి. అయినా ఎంత కాలం పనిచేస్తుందో చెప్పలేని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో జెన్‌కో ఆర్థిక ప్రయోజనాల రీత్యా ఈ విద్యుత్ కేంద్రాన్ని శాశ్వతంగా మూసివేయక తప్పని పరిస్థితి నెలకొంది.



'సూపర్ క్రిటికల్' నిర్మాణ బాధ్యతపై జెన్‌కో అభ్యంతరం

రామగుండం బీ–థర్మల్ విద్యుత్ కేంద్రం స్థానంలో అక్కడే 800 మెగావాట్ల సూపర్ క్రిటికల్ థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో నిర్మిస్తామని రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రకటనపై జెన్‌కో ఉద్యోగులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. కొత్త విద్యుత్ కేంద్రాన్ని జెన్‌కో ఆధ్వర్యంలోనే నిర్మించాలని కోరుతున్నారు. వాస్తవానికి నైజాం ప్రభుత్వం 1931లో రామగుండంలో ఏ–థర్మల్, బీ–థర్మల్ విద్యుత్ కేంద్రాల నిర్మాణానికి 3000 ఎకరాలు కేటాయించింది. ఏ– థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని గతంలోనే మూసివే యగా, ఇందుకు సంబంధించిన స్థలంలో దాదాపు 1200 ఎకరాలను 90వ దశకం మధ్యలో బీపీఎల్ అనే సంస్థకు కొత్త విద్యుత్ కేంద్రం నిర్మాణం కోసం ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. ఇక బీ–థర్మల్ కేంద్రానికి దాదాపు 700 ఎకరాల స్థలం ఉండగా, కబ్జాలు పోగా 550 ఎకరాలే మిగిలాయి. 800 మెగావాట్ల కొత్త విద్యుత్ కేంద్రం నిర్మాణానికి ఈ స్థలం సరిపోదు. బీపీఎల్‌కు కేటాయించిన స్థలంలో కొంత స్థలాన్ని జెన్‌కోకు అప్పగిస్తే కొత్త విద్యుత్ కేంద్రం నిర్మించుకుంటామని జెన్‌కో ఉద్యోగులు కోరుతున్నారు.

టార్గెట్ బీఆర్‌ఎస్!

తెలంగాణలో 'బాబు' రాజకీయం షురూ

- రేవంత్‌తో సమావేశం తర్వాత యాక్టివ్ అయిన ఏపీ సీఎం
- రెండుకళ్ల సిద్ధాంతం మరోమారు తెరపైకి
- చంద్రబాబును కలిసిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు గాంధీ, ప్రకాశ్‌గౌడ్
- మంత్రి తుమ్మలతోనూ ప్రత్యేక సమావేశం
- ఎన్‌డీఏ కీలక భాగస్వామిగా ఉంటూ సరికొత్త రాజకీయం



బాబును సత్కరిస్తున్న మంత్రి తుమ్మల

సాక్షి, హైదరాబాద్: ఏపీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించి తెలంగాణలో అడుగుపెట్టగానే రెండు కళ్ల సిద్ధాంతాన్ని మరోసారి తెరపైకి తెచ్చిన చంద్రబాబు.. బీఆర్‌ఎస్ టార్గెట్‌గా సరికొత్త రాజకీయానికి సిద్ధమయ్యారు. కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా ఉన్న చంద్రబాబు..తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డితో అధికారిక సమావేశానంతరం తెలంగాణవాదులు ఊహించినట్టుగానే పావులు కదపడం మొదలుపెట్టారు. తెలంగాణలో తన రాజకీయశత్రువు బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ టార్గెట్‌గా పాత తెలుగుదేశం ప్రజాప్రతినిధులను ఏకం చేస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. త్వరలో మరికొంత మంది బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరుతారనే ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో గతంలో టీడీపీలో ముఖ్య నాయకులుగా ఉండి బీఆర్‌ఎస్‌లోకి వెళ్లి ఎమ్మెల్యేలుగా గెలిచిన వారితో చంద్రబాబు టచ్‌లోకి వెళ్లినట్టు తెలిసింది. ఆదివారం బీఆర్‌ఎస్‌కు చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు అరికపూడి గాంధీ (శేరిలింగంపల్లి), ప్రకాశ్‌గౌడ్ (రాజేంద్రనగర్) చంద్రబాబును ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్‌లో నెలకొన్న పరిస్థితులపై వారితో చర్చించి , భవిష్యత్ చూసుకోవాలని సూచించినట్టు టీడీపీ వర్గాలే చెబుతున్నాయి. ఇప్పట్లో టీడీపీ తెలంగాణలో బలపడే అవకాశం లేనందున, ముందు కాంగ్రెస్‌లోకి వెళ్లి బీఆర్‌ఎస్‌ను దెబ్బతీయాలని హితబోధ చేసినట్టు సమాచారం. చంద్రబాబును కలిసిన ఇద్దరితోపాటు బీఆర్‌ఎస్‌కు చెందిన జీహెచ్‌ఎంసీ పరిధిలోని 8 మంది ఎమ్మెల్యేలు త్వరలోనే కాంగ్రెస్‌లో చేరుతారని ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో చంద్రబాబు రాజకీయం తెలంగాణలో చర్చనీయాంశమైంది. వీరే కాకుండా కరీంనగర్, మెదక్ జిల్లాలకు చెందిన టీడీపీ మాజీ ప్రజాప్రతినిధులు కూడా కాంగ్రెస్‌లో చేరేలా మంత్రాంగం నడుస్తుందని సమాచారం.

ఎన్‌డీఏ కీలకనేతగా ఉంటూ కాంగ్రెస్‌కు మద్దతు !

రెండు కళ్ల సిద్ధాంతంతో టీడీపీ ఓవైపు ఎన్‌డీఏలో భాగస్వామిగా ఉంటూనే, తెలంగాణలో కాంగ్రెస్‌కు అండగా నిలుస్తూ సంకీర్ణ రాజకీయాల్లో కొత్త చరిత్రను లిఖిస్తోందనే చర్చ సాగుతోంది. ఎన్‌డీఏలో భాగస్వాములైన జనసేన, బీజేపీ నాయకులెవరూ తెలంగాణకు వచ్చిన చంద్రబాబును కలవకపోగా, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు ఆయనతో భేటీ కావడం రాజకీయ వర్గాలను ఆశ్చర్యానికి గురిచేసింది. విభజన సమస్యల పేరుతో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డితో శనివారం సమావేశమైన చంద్రబాబు ఆదివారం పూర్తిగా రాజకీయ సమావేశాలతోనే గడపడం ఇందుకు బలాన్ని చేకూరుస్తోంది. తెలంగాణ వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేకంగా చంద్రబాబును ఆయన నివాసంలో కలిసి రాష్ట్రంలోని రాజకీయ పరిస్థితులపై సుదీర్ఘంగా చర్చించడం అందుకు ఉదాహరణ. ఆ తర్వాతే ఇద్దరు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు బాబుతో సమావేశమయ్యారు. వీరి బాటలోనే మరికొందరు టీడీపీ మాజీ నేతలు బీఆర్‌ఎస్‌కు షాక్ ఇచ్చే పనిలో ఉన్నారని తెలుస్తోంది. కాగా ఎన్టీఆర్ ట్రస్ట్‌భవన్‌లో నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి చంద్రబాబు మాట్లాడుతూ తెలంగాణలో టీడీపీకి పూర్వ వైభవం వస్తుందని చేసిన వ్యాఖ్యలను రాజకీయవర్గాలు వివిధ రకాలుగా విశ్లేషిస్తున్నాయి.

తెలుగు రాష్ట్రాలు నాకు రెండు కళ్లు

ఎన్టీఆర్ ట్రస్ట్‌భవన్‌లో ఏపీ సీఎం చంద్రబాబు

సాక్షి, హైదరాబాద్: రెండు తెలుగురాష్ట్రాలు తనకు రెండు కళ్లు అని ఏపీ సీఎం, టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు పునరుద్ఘాటించారు. ఏపీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత చంద్రబాబు తొలిసారిగా ఆదివారం నగరంలోని ఎన్టీఆర్ ట్రస్ట్‌భవన్‌కు వచ్చారు. అంతకుముందు జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసం నుంచి పార్టీ కార్యాలయం వరకు తెలంగాణ టీడీపీ నేతలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. తెలంగాణగడ్డపై టీడీపీకి పూర్వవైభవం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఏపీలో విజయానికి పరోక్షంగా కృషి చేసిన తెలంగాణ పార్టీశ్రేణులకు ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణలో అధికారంలో లేకున్నా కార్యకర్తలు పార్టీని వదల్లేదని చెప్పారు. తెలంగాణలో నాలెడ్జి ఎకానమీకి తాను సీఎంగా ఉమ్మడిరాష్ట్రంలో నాంది పలికినట్టు చంద్రబాబు చెప్పారు. తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అభివృద్ధిని కొనసాగించాయన్నారు. రాష్ట్ర విభజన సమస్యల పరిష్కారానికి తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి చూపిన చొరవ అభినందనీయమని చెప్పారు. ఈ సందర్భంగా రేవంత్‌కు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. తెలుగురాష్ట్రాల మధ్య ఐకమత్యం ఉండాలని, వివాదాలుంటే నష్టాలే ఎక్కువ అని, ఇచ్చిపుచ్చుకునే ధోరణితోనే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. తెలంగాణలో కాంగ్రెస్, ఏపీలో ఎన్డీయే ప్రభుత్వాలు ఉన్నాయని, సిద్ధాంతపరంగా ఆలోచనలు వేరుగా ఉన్నా, తెలుగు జాతి ప్రయోజనాల కోసం కలిసి పనిచేస్తామని చెప్పారు.

నాణ్యతలో భారత్ ఫార్మా ఉత్పత్తులు బెస్ట్


- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి
- హైటెక్స్‌లో ముగిసిన ఫార్మాస్యూటికల్ కాంగ్రెస్



కిషన్‌రెడ్డిని సత్కరిస్తున్న సదస్సు నిర్వాహకులు

మాదాపూర్: భారతీయ ఫార్మాస్యూటికల్ (ఔషధ) ఉత్పత్తులు నాణ్యతలో అన్ని విధాల బెస్ట్ అనికేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. మనదేశం లక్షా 83 వేల కోట్ల రూపాయల విలువైన ఫార్మా ఉత్పత్తులను ఎగుమతి చేసిందని తెలిపారు. మాదాపూర్‌లోని హైటెక్స్‌లో జరుగుతున్న ఫార్మాస్యూటికల్ కాంగ్రెస్ 73వ సదస్సు ఆదివారం ముగిసింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, మన ఫార్మా ఉత్పత్తుల్లో రూ.67 వేల కోట్ల ఔషధాలను ఒక్క అమెరికాకే ఎగుమతి చేశామన్నారు. కరోనా కష్టకాలంలో భారత్ యుద్ధప్రాతిపదికన వ్యాక్సిన్ తయారు చేసి ప్రపంచానికి అందజేసిందన్నారు. ప్రపంచంలో మన దేశం అయిదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అని వివరించారు. త్వరలోనే 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలనేదే మన లక్ష్యమన్నారు. దేశంలో 74 ఆపరేషనల్ విమానాశ్రయాలు ఉన్నాయని, రవాణా, రహదారులకు బడ్జెట్ కేటాయింపులు చూస్తే.. 2014 తర్వాత 500 శాతం పెరిగాయని తెలిపారు. జాతీయ రహదారుల నెట్‌వర్క్ 2014లో 91 వేల 287 కిలోమీటర్లు ఉంటే ఇప్పుడు లక్షన్నర కిలోమీటర్లకు, అంటే 60 శాతం పెరిగిందని అన్నారు. దేశీయ తయారీ రంగాన్ని ప్రోత్సహించేందుకు కేంద్రం రూ.15 వేల కోట్లను కేటాయించిందన్నారు. రాష్ట్రంలో రాబోయే బల్క్‌డ్రగ్ పార్కులో మౌలిక సదుపాయాలను కల్పించడానికి కేంద్రం ఆర్థిక సహకారం అందిస్తుందన్నారు. ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా కేంద్రం 12 కోట్ల కుటుంబాలకు 5 లక్షల రూపాయల వరకు వైద్య బీమా కల్పిస్తుందన్నారు.

భూమి దక్కదేమోనని మహిళా రైతు ఆత్మహత్య



జ్ఞానేశ్వరి

చిల్పూరు: భూమి అమ్మిన వ్యక్తే మోసం చేయడంతో ఓ మహిళా రైతు ఆత్మహత్య చేసుకుంది. జనగామ జిల్లా చిల్పూరు మండలం కొండాపూర్‌లో ఆదివారం ఈ ఘటన జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. కొండాపూర్‌కు చెందిన కుంచ కార్యవద్ధిరాజు, శివరాత్రి చినరాజయ్య 2011లో ఇదే గ్రామానికి చెందిన పసునూరి నరేందర్‌రెడ్డి వద్ద 180–ఏ సర్వేనంబర్‌లోని భూమిని ఒక్కో ఎకరం చొప్పున కొనుగోలు చేశారు. రెండెకరాలకు రూ.2.40 లక్షలు ధర ఒప్పందం చేసుకుని రూ. 2.10 లక్షలు చెల్లించారు. పూర్తి డబ్బులు ముట్టాక రిజిస్ట్రేషన్ చేస్తానని భూమి విక్రయించిన నరేందర్‌రెడ్డి తెలిపాడు. అప్పటి నుంచి వారు కాస్తులోనే ఉన్నారు. నాలుగేళ్ల అనంతరం బాకీ ఉన్న రూ.30 వేలతో పాటు అదనంగా రూ.10 వేలు చెల్లించాలని నరేందర్‌రెడ్డి డిమాండ్ చేయగా కార్యవద్ధిరాజు, చినరాజయ్య తమకు సమయం కావాలని వేడుకున్నారు. కాగా, 2015లో ఇదే గ్రామానికి చెందిన రిటైర్డ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఇంద్రసేనారెడ్డి ఆ ఇద్దరికి అమ్మిన భూమిని తన కూతురు పేర రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. విషయం తెలుసుకున్న బాధిత రైతులు అధికారుల చుట్టూ తిరుగుతూనే పంట సాగు చేసుకుంటున్నారు. ఇటీవల ఇంద్రసేనారెడ్డి ఆ ఇద్దరి రైతులపై పోలీసులకు ఫిర్యాదు చేయగా.. స్థానిక ఎస్సై ముత్యం రాజేందర్ వారం క్రితం ఆభూమిని పరిశీలించారు. ఈ క్రమంలో రైతులు కార్యవద్ధిరాజు, చినరాజయ్యను తనవద్దకు రావాలని స్టేషన్ ఘన్‌పూర్ ఏసీపీ భీంశర్మ శనివారం ఆదేశించారు. దీంతో ఆ ఇద్దరితోపాటు కార్యవద్ధిరాజు భార్య జ్ఞానేశ్వరి (44) కూడా వెళ్లింది. అదే సమయంలో ఇంద్రసేనారెడ్డి అనుచరుడు, అదే గ్రామానికి చెందిన కూరపాటి దేవేందర్ ఆ భూమికి సంబంధించిన పట్టా కాగితాలతో వచ్చాడు. ఏసీపీ వచ్చి ఇద్దరి వాదనలు విన్నారు. భూమికి సంబంధించిన రిజిస్ట్రేషన్ కాగితాలు వారివద్ద ఉన్నాయని, మీరు ఎలా కాస్తులో ఉన్నారని రైతులను ప్రశ్నించి.. ఈ విషయంలో మరోమారు గ్రామంలో మాట్లాడుకోవాలని ఇరు వర్గాలను పంపించారు. ఈ క్రమంలో కార్యవద్ధిరాజు భార్య జ్ఞానేశ్వరి ఆదివారం తెల్లవారుజామునే కూరపాటి దేవేందర్ ఇంటికి వెళ్లి 'భూమి కొన్న దగ్గరి నుంచి మేమే కాస్తులో ఉన్నాం.. నీకు కూడా తెలుసు.. ఇప్పుడు వారి పక్షాన ఎలా మాట్లాడుతావు.. మాకు న్యాయం జరిగేలా చూడాలి'అని ప్రాధేయ పడింది. దీంతో 'కాగితాలు లేకుంటే నీకు భూమి ఎలా దక్కుతుంది.. ఇక్కడి నుంచి వెళ్లిపో'అని దేవేందర్ అనడంతో జ్ఞానేశ్వరి వెంట తెచ్చుకున్న క్రిమి సంహారక మందు తాగి పడిపోయింది. కుటుంబ సభ్యులు ఆమెను ఎంజీఎంకు తరలించగా కొద్దిసేపటికే మృతి చెందింది.

మృతదేహంతో ఆందోళన..

జ్ఞానేశ్వరి మృతదేహం గ్రామానికి చేరుకోగానే.. భర్త కార్యవద్ధిరాజు తన భార్య మృతికి ఏసీపీయే కారణమని, ఆయనపై కేసు నమోదు చేయాలని.. దేవేందర్ ఇంటిముందు మృతదేహాన్ని ఉంచి ఆందోళనకు దిగాడు. న్యాయం జరిగే వరకు కదిలేది లేదని స్పష్టం చేశాడు. పోలీసులు గ్రామంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆరుగురిపై కేసులు నమోదు..

జ్ఞానేశ్వరి ఆత్మహత్య ఘటనకు సంబంధించి ఇంద్రసేనారెడ్డి, నరేందర్‌రెడ్డి, మారబోయిన ఎల్లయ్య, కూరపాటి దేవేందర్, జోడుముంతల బుచ్చిరాములు, పులి కాశిరాజయ్యలపై కొత్త చట్టం కింద కేసులు నమోదు చేసినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు.

వాస్తవంగా బాధితులే కాస్తులో ఉన్నారు..

భూ పంచాయితీ విషయంలో వివరాలను తెలుసుకునేందుకు రైతులను కార్యాలయానికి రమ్మన్నాను. జనగామ ఏసీపీ లీవులో ఉండటంతో ఇన్‌చార్జిగా నేను వెళ్లాను. వాస్తవంగా నేటికీ బాధితులే కాస్తులో ఉన్నారు. దీంతో మరోసారి మాట్లాడుకోమన్నాను. – ఏసీపీ భీంశర్మ

టీఎన్జీవోస్ నేత ఆత్మహత్యాయత్నం

ఖమ్మం సహకారనగర్: టీఎన్జీవోస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు అఫ్జల్‌హసన్ శనివారం రాత్రి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. భూ వివాదం ఆరోపణల నేపథ్యంలో అఫ్జల్‌హసన్ ఓ కేసులో అరెస్టై 4 రోజుల క్రితం జైలు నుంచి విడుదలయ్యారు. ఆయనపై మరో రెండు కేసులున్నట్టు పోలీసులు చెబుతున్నారని బంధువులు పేర్కొన్నారు. కక్షపూరితంగా తనను కొందరు పోలీసులు, ఉద్యోగ సంఘాల నాయకులు ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ అఫ్జల్‌హసన్ నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం చేశాడని కుటుంబసభ్యులు తెలిపారు.

అమ్మ మందలించిందని..

ఇబ్రహీంపట్నం రూరల్: సెల్‌ఫోన్ కోసం కొట్లాడుకున్న తనను, తమ్ముడిని తల్లి మందలించిందన్న మనస్తాపంతో ఓ బాలిక ఆత్మహత్యకు పాల్పడింది. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. దండుమైలారం గ్రామానికి చెందిన దామ అనుష్క (13) దండుమైలారం ప్రభుత్వ పాఠశాలలో టెన్త్ చదువుతోంది. ఆదివారం ఉదయం సెల్‌ఫోన్ కోసం అనుష్క తమ్ముడితో గొడవ పడింది. ఇదే క్రమంలో టీ తాగుతూ తమ్ముడిపై టీ పడేసింది. దీంతో ఆగ్రహించిన తల్లి కూతుర్ని మందలించింది. మనస్తాపానికి గురైన అనుష్క ఇంట్లో ఎవరూ లేనప్పుడు ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

చికిత్స పొందుతున్న ఎస్సై శ్రీనివాస్ మృతి

తనని అవినీతిపరుడిగా చిత్రీకరించారంటూ మరణ వాంగ్మూలం

- హైదరాబాద్‌లో జీరో ఎఫ్ఐఆర్.. మహబూబాబాద్ పీఎస్‌కు కేసు బదిలీ
- సీఐతోపాటు నలుగురు కానిస్టేబుళ్లపై అట్రాసిటీ కేసు



శ్రీరాముల శ్రీనివాస్

అశ్వారావుపేట/నల్లబెల్లి/దుగ్గొండి: భద్రాద్రి కొత్త గూడెం జిల్లా అశ్వారావుపేట ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్ (31) చికిత్స పొందుతూ మృతి చెందాడు. జూన్ 30న మహబూబాబాద్‌లో శ్రీనివాస్ కలుపు మందు తాగిన విషయం విదితమే. చికిత్స నిమిత్తం సికింద్రాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. శనివారం అర్ధరాత్రి దాటాక మృతి చెందాడు. కాగా తన ఆత్మహత్యాయత్నానికి అశ్వారావు పేట సీఐ జితేందర్‌రెడ్డి, నలుగురు కానిస్టేబుళ్ల వేధింపులే కారణమని, ఓ ఇంటెలిజెన్స్ కానిస్టేబుల్ తన సోదరుడైన ఓ విలేకరితో తప్పుడు కథనాలు రాయించి తనను అవినీతి పరుడుగా చిత్రీకరించారని శ్రీనివాస్ తన మరణ వాంగ్మూలంలో పేర్కొన్నారు. ఆయన సతీమణి కృష్ణవేణి కూడా ఫిర్యాదు చేయడంతో హైదరాబాద్‌లో జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి కేసును మహబూబాబాద్ పోలీస్ స్టేషన్‌కు బదలాయించారు. దీంతో సీఐ జితేందర్‌రెడ్డితోపాటు మరో నలుగురు కానిస్టేబుళ్లపై అట్రాసిటీ కేసు నమోదు చేశారు. సీఐ జితేందర్‌రెడ్డిని వరంగల్ ఐజీ కార్యాలయానికి, కానిస్టేబుళ్లను కొత్తగూడెం ఎస్పీ కార్యాలయానికి గతంలోనే అటాచ్ చేశారు. శ్రీనివాస్ మృతదేహానికి గాంధీ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.



రాస్తారోకో నిర్వహిస్తున్న గ్రామస్తులు, దళిత సంఘాల నాయకులు

నారక్కపేటలో ఉద్రిక్తత

పోస్టుమార్టం అనంతరం శ్రీనివాస్ మృతదేహాన్ని ఆదివారం కుటుంబసభ్యులు స్వగ్రామమైన నల్లబెల్లి మండలంలోని నారక్కపేటకు తరలించారు. ఈ క్రమంలో మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బంధువులు, దళిత సంఘాల నాయకులు అంబులెన్స్‌ను అడ్డుకున్నారు. నర్సంపేట ఏసీపీ కిరణ్‌కుమార్ పర్యవేక్షణలో అంబులెన్స్‌ను ముందుకు తరలించే ప్రయత్నం చేయగా, బంధువులు మృతదేహాన్ని తీసుకువెళ్లి జాతీయ రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేశారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అక్కడికి చేరుకొని ఆందోళన చేస్తున్న వారికి మద్దతు తెలిపారు. ఏసీపీ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేయగా, భద్రాది కొత్తగూడ ఎస్పీ రోహిత్‌రాజు అక్క కు చేరుకొని మాజీ ఎమ్మెల్యే, దళిత సంఘాల నాయకులు, కుటుంబ సభ్యులతో చర్చించారు. 'ఎస్సై శ్రీను కుటుంబసభ్యులకు న్యాయం చేస్తాం.. భవిష్యత్‌లో అండగా ఉంటాం.. దోషులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం' అని హామీ ఇవ్వడంతో రెండున్నర గంటల పాటు కొనసాగిన ఆందోళన విరమించారు.

గుండెపోటుతో ఎస్సై మేనత్త మృతి

శ్రీనివాస్ మరణవార్త తెలియగానే దుగ్గొండి మండలం నాచినపల్లి గ్రామానికి చెందిన ఆయన మేనత్త దార రాజమ్మ గుండెలో నొప్పి అంటూ విలపించారు. కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం వరంగల్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో ఆమె మృతి చెందింది.

రష్యాలో మోదీ పర్యటన

- ఇండో-రష్యా శిఖరాగ్రంలో పాల్గొననున్న ప్రధాని.. పుతిన్‌తో విస్తృతస్థాయి చర్చలు

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం నుంచి రెండు రోజుల పాటు రష్యాలో పర్యటించనున్నారు. 22వ ఇండో-రష్యా వార్షిక శిఖరాగ్ర సదస్సులో పాల్గొననున్నారు. రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు. పలు రంగాల్లో విస్తృతస్థాయి సహకారంపై వారు చర్చిస్తారు. ఉక్రెయిన్‌పై రష్యా దురాక్రమణకు దిగాక మోదీ రష్యాలో పర్యటించడం ఇదే తొలిసారి. మూడేళ్ల విరామం తర్వాత భారత్-రష్యా వార్షిక శిఖరాగ్ర సదస్సు జరుగుతున్న నేపథ్యంలో ఈ సమిట్‌లో చర్చించబోయే అంశాలు, తీసుకోబోయే ఉమ్మడి నిర్ణయాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. చివరిసారిగా 2021 డిసెంబర్‌లో ఢిల్లీలో ఈ సదస్సు జరిగింది. సోమవారం మధ్యాహ్నం రష్యాకు మోదీ చేరుకున్నాక పుతిన్ ఇచ్చే ప్రత్యేక విందు కార్యక్రమానికి మోదీ హాజరుకానున్నారు. తర్వాత శిఖరాగ్ర సదస్సు జరగనుంది. మరుసటి రోజు రష్యాలోని భారతీయసంతతి వ్యక్తులతో మోదీ మాట్లాడతారు. తర్వాత క్రెమ్లిన్‌లో అనామక సైనికుల స్మారకం వద్ద అంజలి ఘటిస్తారు. తర్వాత మాస్కోలో ఎగ్జిబిషన్‌ను సందర్శిస్తారు.

ఆస్ట్రియాలోనూ పర్యటన

రష్యా పర్యటన తర్వాత 9వ తేదీన మోదీ ఆస్ట్రియాకు వెళ్తారు. ఆస్ట్రియా అధ్యక్షుడు అలెగ్జాండర్ వాన్ డీర్ బెల్లాన్, చాన్స్‌లర్ కార్ల్ నెహామెర్‌లతో విడివిడిగా ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. 'ఆస్ట్రియా, భారత్ మైత్రీబంధానికి 75 ఏళ్లు పూర్తవుతున్న వేళ మోదీతో చర్చల కోసం సిద్ధంగా ఉన్నా' అని నెహామెర్ శనివారం 'ఎక్స్'లో చేసిన పోస్ట్‌కు మోదీ ఆదివారం స్పందించారు. ''ఇరు దేశాల మధ్య బంధాన్ని మరింత పటిష్టం చేసేందుకు, సహకారంలో కొత్త పథాలను అన్వేషించేందుకు మీతో చర్చల కోసం ఎదురుచూస్తున్నా'' అని మోదీ ఆదివారం 'ఎక్స్'లో ఒక పోస్ట్‌పెట్టారు. భారత ప్రధాని ఒకరు ఆస్ట్రియాలో పర్యటిస్తుండటం గత 40 ఏళ్లలో ఇదే తొలిసారికావడం విశేషం. భారత్, ఆస్ట్రియాకు చెందిన పారిశ్రామిక దిగ్గజాలతో మోదీ భేటీ కొనసాగుతుంది. మాస్కోతోపాటు వియన్నాలోని భారతీయ సంతతి ప్రజలతో ప్రధాని ముచ్చటించనున్నారు.

నీట్‌పై నేడు సుప్రీంలో విచారణ

న్యూఢిల్లీ: వివాదాస్పదంగా మారిన నీట్-యూజీ 2024 నిర్వహణపై దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టులో సోమవారం నుంచి విచారణ మొదలుకానుంది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ సారథ్యంలోని ముగ్గురు సభ్యుల ధర్మాసనం నీట్‌కు సంబంధించి దాఖలైన 38 పిటిషన్లపై వాదనలు విననుంది. అయితే, పరీక్షను రద్దు చేయడం సహేతుకం కాదని, పేపర్ లీకేజీ భారీపెద్ద ఎత్తున జరిగినట్లు ఎటువంటి ఆధారాలు లేవని ఇప్పటికే సుప్రీంకోర్టుకు కేంద్రం తెలిపింది. మే 5వ తేదీన జరిగిన ఈ పరీక్షలో అక్రమాలు చోటుచేసుకున్నాయంటూ విద్యార్థులు, రాజకీయ పార్టీలు నిరసనలు వ్యక్తం చేస్తున్నాయి. పేపర్ లీకేజీ ఆరోపణలపై సీబీఐ దర్యాప్తు చేపట్టింది.

పూరీలో వైభవంగా రథయాత్ర

హాజరైన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము • తొక్కిసలాటలో ఒకరి మృతి



రథయాత్రలో అశేషంగా పాల్గొన్న భక్తులు (ఇన్‌సెట్‌లో) కలశ స్థాపన చేస్తున్న పూజారులు

భువనేశ్వర్: ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పూరీలోని జగన్నాథుని రథయాత్ర అంగరంగ వైభవంగా మొదలైంది. సాయంత్రం లక్షలాది భక్తుల నినాదాల నడుమ జగన్నాథ ఆలయం నుంచి రెండున్నర కిలోమీటర్ల దూరంలోని గుండీచా ఆలయం దిశగా భారీ రథాలు ముందుకు సాగాయి. 5.20 గంటలకు రథాలు కదిలాయి. అంతకుముందు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము మూడు రథాలకు పూజలు చేశారు. ఆమె, ఒడిశా గవర్నర్ రఘుబర్ దాస్, సీఎం మోహన్ చరణ్ మాఝి, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ జగన్నాథ రథం తాళ్లను లాగి యాత్రను లాంఛనంగా ప్రారంభించారు. ముందున్న బలభద్రుని ప్రతిష్ఠించిన 45 అడుగుల ఎత్తైన రథాన్ని దేవీ సుభద్ర, జగన్నాథుని రథాలు అనుసరించాయి. రథయాత్రకు ముందు భక్తుల బృందాలు జగన్నాథుని కీర్తనలను ఆలపిస్తూ ముందుకు సాగారు. రెండు రోజులపాటు సాగే యాత్ర కోసం భారీగా బందోబస్తు చేపట్టారు.

సాయంత్రం వేళ బలభద్రుని రథం లాగుతున్న చోట ఒక్కసారిగా తొక్కిసలాట జరిగింది. దీంతో ఊపిరాడక తొమ్మిది మంది భక్తులు అస్వస్థతకు గురయ్యారు. ఆస్పత్రికి తీసుకొచ్చేలోగా ఒడిశాలోని బాలాంగిర్ జిల్లాకు చెందిన లలిత్ బాగార్తి అనే వ్యక్తి ప్రాణాలు కోల్పోయారు. భక్తుని మృతి పట్ల సీఎం చరణ్ మాఝీ సంతాపం వ్యక్తంచేశారు. అయితే 300 మందిదాకా గాయపడినట్లు మీడియాలో వార్తలొచ్చాయి.

విషం చల్లడం వల్లే...

హత్రాస్ ఘటనపై భోలే బాబా లాయర్

న్యూఢిల్లీ: యూపీలోని హత్రాస్‌లో ఈనెల 2వ తేదీన సత్సంగ్‌లో తొక్కిసలాటకు దారితీసిన పరిస్థితులపై భోలే బాబా తరఫు న్యాయవాది ఏపీ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆదివారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ..భోలే బాబాకు పెరుగుతున్న ఆదరణ చూసి కొందరు కుట్ర చేశారు. సత్సంగ్‌లో పాల్గొన్న భక్తులపైకి క్యాన్లతో తెచ్చిన విష పదార్థాన్ని చల్లారు. జనం భయకంపితులై అక్కడి నుంచి వెళ్లే క్రమంలో తొక్కిసలాట చోటుచేసుకుంది'అని ఆయన వివరించారు. కనీసం 16 మంది గుర్తు తెలియని వ్యక్తులు సత్సంగ్ వద్దకు విష పదార్థం నింపిన క్యాన్లతో వచ్చినట్లు ప్రత్యక్ష సాక్ష్యులు కొందరు తనకు తెలిపారన్నారు. అనంతరం వారు తప్పించుకుని వెళ్లేందుకు అక్కడ వాహనాలు కూడా సిద్ధంగా ఉన్నట్లు కూడా తమ వద్ద రుజువులున్నాయన్నారు. సాక్ష్యులకు భద్రత కల్పించాలని ఆయన అధికారులను కోరారు. ఈ ఘటనలో 121 మంది భక్తులు, ముఖ్యంగా మహిళలు ప్రాణాలు కోల్పోవడం తెల్సిందే. కాగా, ఈ ఘటనలో కీలక నిందితుడు దేవ్‌ప్రకాశ్ మధుకర్ సహా ఇప్పటి వరకు 9 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

డేంజర్ మార్కు దాటేస్తున్న...
భగభగలు

ప్రచండమైన ఎండలతో అల్లాడుతున్న భూమి


శతాబ్ది చివరికల్లా భూతాపం 2.5 డిగ్రీలు పైకి! • అప్పుడిక సర్వ నాశనమేనంటున్న తాజా సర్వే

ఈ వేసవిలో ఉత్తర భారతమంతా కనీవిని ఎండలతో తల్లడిల్లిపోయింది. ఢిల్లీలో ఏకంగా 40 రోజుల పాటు 40 డిగ్రీల సెంటీగ్రేడ్‌కు పై చిలుకు ఉష్ణోగ్రతలు నమోదై జనాలను బెంబేలెత్తించాయి.

అలస్కాలో హిమానీ నదాలు ఇటీవలి కాలంలో వేసిన అంచనాలను కూడా మించి శరవేగంగా కరిగిపోతున్నట్టు తాజా అధ్యయనాలు తేల్చాయి.

భూగోళానికి ఊపిరితిత్తులుగా చెప్పే అమెజాన్ సతత హరిత అరణ్యాలే క్రమంగా ఎండిపోతున్నాయి. ఎన్నడూ లేనంతగా కార్చిచ్చుల బారిన పడుతున్నాయి.

సౌదీ అరేబియాలో ఏకంగా 50 డిగ్రీలు దాటేసిన ఎండలకు తాళలేక 1,300 మందికి పైగా మరణించారు.



ఈ ఉత్పాతాలన్నీ సూచిస్తున్నది ఒక్కటే. భూగోళం శరవేగంగా విపత్కర పరిస్థితుల్లోకి వెళ్తోంది. వాతావరణ మార్పుల ప్రభావం శాస్త్రవేత్తల అంచనాలకు కూడా అందనంత దారుణ ప్రభావం చూపుతోంది. భూతాపం ఈ శతాబ్దంలోనే ఏకంగా 2.5 డిగ్రీలకు పైగా పెరిగి మొత్తం మానవాళినే వినాశనం వైపు నెట్టడం ఖాయమని వందలాది మంది ప్రపంచ ప్రఖ్యాత వాతావరణ నిపుణులు, శాస్త్రవేత్తలు ముక్త కంఠంతో హెచ్చరిస్తున్నారు! పారిశ్రామికీకరణ ముందు స్థాయితో పోలిస్తే భూతాపం ఇప్పటికే 1.2 డిగ్రీ సెంటీగ్రేడ్ మేరకు పెరిగింది. అది 1.5 డిగ్రీలను దాటితే ఊహించని ఉత్పాతాలు తప్పవని సైంటిస్టులు ఎప్పటినుంచో మొత్తుకుంటున్నారు. అలాంటిది, ప్రస్తుత పరిస్థితులను చూస్తుంటే ఈ శతాబ్దాంతానికే భూతాపంలో పెరుగుదల 2.5 డిగ్రీల డేంజర్ మార్కును దాటేయడం ఖాయమని ప్రపంచ వాతావరణ సంస్థ నిర్వహించిన తాజా అంతర్జాతీయ సర్వే తేల్చింది. ఎండాకాలంలో ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న కనీవినీ ఎరగని విపరిణామాలు తదితరాలను పరిగణనలోకి తీసుకున్న మీదట ఈ అంచనాకు వచ్చింది. గత ఏడాది కాలంగా ప్రపంచవ్యాప్తంగా సగటు ఉష్ణోగ్రతలు ప్రతి నెలా రికార్డులు బద్దలు కొట్టాయి. ఈ ఏడాది సంభవించిన ఎల్‌నినో ఇప్పటిదాకా నమోదైన ఐదు అత్యంత శక్తిమంతమైన ఎల్‌నినోల్లో ఒకటిగా నిలిచింది. శిలాజ ఇంధనాల వాడకం తదితరాల వల్ల జరుగుతున్న భారీ కాలుష్యం వంటివి వీటికి తోడవుతున్నాయి. గ్లోబల్ వార్మింగ్‌లో మూడొంతులు కేవలం కార్బన్ డయాక్సైడ్ (సీఓటూ) ఉద్గారం వల్లనే జరుగుతోంది. వాతావరణంలో సీఓటూ స్థాయి పెరుగుతున్న కొద్దీ వేడిగాలులు, హరికేన్లు, కార్చిచ్చులు, వరదలు వచ్చిపడుతున్నాయి. గ్రీన్ హౌస్ వాయు ఉద్గారాల్లో చైనా, అమెరికా, భారత్ టాప్ 3లో ఉన్నాయి. అయితే గ్లోబల్ వార్మింగ్‌కు ప్రధానంగా సంపన్న దేశాలే కారణమని ఐపీఈ గ్లోబల్ క్లైమేట్ చేంజ్ హెడ్ అబినాశ్ మహంతీ చెప్పుకొచ్చారు. ఆ దేశాల్లో గత రెండు శతాబ్దాలుగా జరిగిన మితిమీరిన పారిశ్రామికీకరణ పర్యావరణానికి చెప్పలేనంత చేటు చేసిందని వివరించారు. ''ఇప్పుడు కూడా సంప్రదాయేతర ఇంధనాల వాడక తదితరాల ద్వారా గ్లోబల్ వార్మింగ్‌కు అడ్డుకట్ట వేస్తామన్న పెద్ద దేశాల ప్రకటనలు మాటలకే పరిమితమవుతున్నాయి. ఫలితంగా భరించలేని ఎండలు, ఆ వెంటే వరదలు, హరికేన్ల వంటి ఉత్పాతాలు కొన్నేళ్లుగా సాధారణ పరిణామంగా మారిపోతున్నాయి. ఇవన్నీ ప్రమాద సూచికలే'' అని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మేల్కొని గ్రీన్ హౌస్ వాయు ఉద్గారాలకు అడ్డుకట్ట వేయకపోతే పరిస్థితి చేయి దాటిపోయే రోజు ఎంతో దూరంలో లేదని హెచ్చరిస్తున్నారు. **- సాక్షి, నేషనల్ డెస్క్**

ఉత్తరాదిన పాతాళానికి భూగర్భ జలాలు

20 ఏళ్లలో 450 క్యూబిక్ కి.మీ. మేరకు మాయం

ఉత్తర భారతదేశంలో భూగర్భ జల వనరులు శరవేగంగా అడుగంటుతున్నాయి! ఎంతగా అంటే, 2002 నుంచి 2021 మధ్య కేవలం 20 ఏళ్లలోనే ఏకంగా 450 క్యూబిక్ కిలోమీటర్ల మేర భూగర్భ జలాలు లుప్తమైపోయినట్టు ఐఐటీ గాంధీనగర్ తాజా సర్వే తేల్చింది. దేశంలోకెల్లా అతి పెద్ద జలాశయమైన ఇందిరా సాగర్ మొత్తం నీటి పరిమాణానికి ఇది ఏకంగా 37 రెట్లు ఎక్కువని సర్వేకు సారథ్యం వహించిన ఐఐటీ గాంధీనగర్ సివిల్ ఇంజనీరింగ్, ఎర్త్ సైన్సెస్ విభాగంలో విక్రం సారాబాయి చైర్ ప్రొఫెసర్ విమల్ మిశ్రా వివరించారు! అందుబాటులో ఉన్న సంబంధిత గణాంకాలతో పాటు శాటిలైట్ డేటా తదితరాలను విశ్లేషించి ఈ మేరకు తేల్చినట్టు తెలిపారు. వాతావరణ మార్పుల ప్రభావం ఇలాగే కొనసాగితే ఈ ధోరణి మరింతగా ఊపందుకుంటుందని హెచ్చరించారు. ''ఉత్తరాదిన గత 75 ఏళ్లలో వర్షపాతం ఇప్పటికే 8.5 శాతం తగ్గిపోయింది. వాతావరణం 0.5 డిగ్రీల మేరకు వేడెక్కింది. దాంతో సాగునీటికి డిమాండ్ అమాంతంగా పెరిగిపోయి విచ్చలవిడిగా బోర్లు పుట్టుకొచ్చాయి. దాంతో కనీసం భూగర్భ జల వనరులు 12 శాతం తగ్గిపోయాయి'' అని మిశ్రా వెల్లడించారు. ఒక్క 2009లోనే వర్షాకాలంలో అల్ప వర్షపాతం, చలికాలంలో హెచ్చు ఉష్ణోగ్రతల దెబ్బకు ఉత్తరాదిన భూగర్భ జలాలు 10 శాతం మేర తగ్గిపోయాయని అంచనా! ''గ్లోబల్ వార్మింగ్ మరింత పెరిగే సూచనలే ఉన్నందున భూగర్భ జలాలు ఇంకా వేగంగా ఎండిపోయేలా ఉన్నాయి. ఎలా చూసినా ఇవన్నీ ప్రమాద సంకేతాలే. ఉత్తర భారత దేశంలో ఉష్ణోగ్రతలు గనుక 1 నుంచి 3 డిగ్రీల మేరకు పెరిగితే భూగర్భ జలాలు మరో 10 శాతం దాకా తగ్గిపోతాయి'' అంటూ సర్వేలో పాల్గొన్న హైదరాబాద్ ఎన్‌జీఆర్‌ఐ పరిశోధకులు కూడా ఆందోళన వెలిబుచ్చారు. సర్వే ఫలితాలను జర్నల్ ఎర్త్ తదుపరి సంచికలో ప్రచురించనున్నారు.

మనోళ్లు కొంటున్నది... పోషకాలున్న స్నాక్సే!

ఏం పదార్థాలు వాడారో 73 శాతం మంది భారతీయులు చదువుతున్నారన్న సర్వే

న్యూఢిల్లీ: మార్కెట్‌లో స్నాక్స్ కొనేటప్పుడు ప్యాక్‌పై ఉన్న వివరాలు తప్పనిసరిగా చదువుతున్నారా? అయితే ఈ లిస్ట్‌లో మీరూ ఉన్నట్టే. ఆహారపదార్థాలు, ప్రత్యేకించి స్నాక్స్ కొనేటప్పుడు దానిలో వాడిన పదార్థాలేంటి? అందులో ఏమాత్రం పోషక విలువలున్నాయని 73శాతం మంది భారతీయులు చదువుతున్నారని హెల్తీ స్నాకింగ్ రిపోర్ట్-2024 సర్వే తెలిపింది. దేశవ్యాప్తంగా 6వేల మందిపై సర్వే నిర్వహించి నివేదికను ఆదివారం విడుదల చేసింది. వీరిలో 93 శాతం మంది ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలను ఎంచుకోవడానికే



ఇష్టపడుతున్నారని తెలిపింది. ఆహార కల్తీకి సంబంధించి కేసులు పెరుగుతున్న నేపథ్యంలో సుగంధ ద్రవ్యాలు, స్వీట్స్, ఇతర స్నాక్స్ ప్యాకెట్స్ కొనుగోలుదారులపై సర్వే నిర్వహించింది. ప్రతి 10 మందిలో 9 మంది సంప్రదాయ చిరుతిళ్లకు బదులుగా ఆరోగ్యకరమైన స్నాక్స్ కొనాలని చూస్తున్నారని తెలిపింది. డ్రైఫ్రూట్స్, నట్స్, తృణధాన్యాలతో చేసిన సహజమైన ఉత్పత్తులను కొనడానికి ఇష్టపడుతు న్నారని తెలిపింది. డ్రై ఫ్రూట్స్, తామర గింజలతో చేసిన పేలాల (మఖనా)ను హెల్తీ స్నాక్‌గా గుర్తించారు. పోషకాలు అత్యధికంగా ఉన్న వీటిని కొనడానికి 67శాతం మంది భారతీయులు ఆసక్తి చూపుతున్నారని సర్వే వెల్లడించింది.

ఉత్తరాదిన వరదలు

చార్‌ధామ్ యాత్ర నిలిపివేత

లక్నో/గువాహటి/కోల్‌కతా/పణజి: ఉత్తరాది రాష్ట్రాలను భారీ వర్షాలు, వరద ముంచెత్తాయి. ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, బిహార్, పశ్చిమబెంగాల్, అస్సాం, మహారాష్ట్ర సహా పలు రాష్ట్రాల్లో నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. అస్సాంలోని 29 జిల్లాల్లో భారీ వర్షాలకు దాదాపు 24 లక్షల మంది జనం ప్రభావితులయ్యారు. లక్షలాది మంది పునరావాస కేంద్రాల్లో తలదాచుకుంటున్నారు. పశ్చిమబెంగాల్‌లోని పర్వతప్రాంత జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. కొండప్రాంతాల్లో రోడ్లు దెబ్బతిని రాకపోకలు పూర్తిగా ఆగిపోయాయి.

49 మందిని రక్షించిన ఎన్‌డీఆర్‌ఎఫ్

మహారాష్ట్రలోని థానె, పాల్ఘర్‌లను భారీ వర్షాలు చుట్టుముట్టాయి. థానె పరిధిలోని షాపూర్ ప్రాంతంలో ఓ రిసార్ట్ పూర్తిగా జలమయమైంది. అందులో చిక్కిన 49 మంది పర్యాటకులను ఎన్‌డీఆర్‌ఎఫ్ రక్షించింది. గోవాలోనూ పాలీ జలపాతాన్ని చూసేందుకు నది ప్రవాహాన్ని దాటిన 80 మంది పర్యాటకులు వరదలో చిక్కుకుపోయారు. రాష్ట్ర పోలీసులు, అగ్నిమాపక, అత్యవసర విభాగ సిబ్బంది సమన్వయంతో వారిని కాపాడారు. బిహార్‌లో కోసీ, మహానంద, భాగమితి తదితర నదుల్లో ప్రవాహమట్టాలు ప్రమాదస్థాయిని దాటేశాయి.

ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాలు

ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాల ధాటికి చార్‌ధామ్ యాత్రను తాత్కాలికంగా నిలిపేశారు. నేడు గర్వాల్ ప్రాంతంలో భారీ నుంచి అతిభారీ వర్షాలు పడొచ్చని వాతావరణ శాఖ హెచ్చరించింది. బద్రీనాథ్‌కు రహదారిపై కొండచరియలు విరిగిపడ్డాయి. జోషిమఠ్ సమీపంలో అలకనంద నది ఉధృతంగా ప్రవహిస్తోంది.



ఫ్రాన్స్ ఎన్నికల్లో భాగంగా ఆదివారం పుదుచ్చేరిలో ఓటేస్తున్న స్థానికులు. ఇక్కడి వారిలో పలువురికి ఫ్రాన్స్ పౌరసత్వముంది

ఫ్రాన్స్ రెండో దశలో...
రికార్డు పోలింగ్

పారిస్: ఫ్రాన్స్ పార్లమెంటు ఎన్నికల్లో ఆదివారం కీలకమైన రెండో దశలో రికార్డు స్థాయిలో పోలింగ్ జరిగింది. స్థానిక కాలమానం ప్రకారం సాయంత్రం ఐదుగంటలకు 59.7 శాతం పోలింగ్ నమోదైనట్లు ఫ్రాన్స్ అంతర్గత వ్యవహారాల శాఖ తెలిపింది. 1981 తర్వాత ఇంతటి పోలింగ్ నమోదవడం ఇదే తొలిసారి. జూన్ 30వ తేదీన జరిగిన తొలి రౌండ్‌లో 67 శాతం పోలింగ్ జరిగింది. ఐరోపా ఎన్నికల్లో మధ్యేవాదుల పరాజయం తర్వాత అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ జూన్ 9న పార్లమెంట్‌ను రద్దు చేసి ఎన్నికలకు పిలుపునిచ్చారు. ఫ్రాన్స్‌లో అధ్యక్ష ఎన్నికలైనా, పార్లమెంటు ఎన్నికలైనా రెండు దశల్లో జరుగుతాయి. ఆదివారం జరిగిన రెండో దశ కీలకమైనది. మాక్రాన్ అధ్యక్ష పదవీ కాలం ఇంకా మూడేళ్లు ఉంది. ఇప్పుడు జరుగుతున్న పార్లమెంటు ఎన్నికల ఫలితాల వల్ల ఆయన పదవికి తక్షణ ప్రమాదం ఏమీ లేకున్నా, చట్టాలు చేసేటప్పుడు పార్లమెంటులో అడుగడుగునా పరీక్ష ఎదురయ్యే అవకాశం ఉంది. ముందస్తు ఎన్నికలకు వెళ్లిన ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్‌కు తొలిరౌండ్‌లో చేదు అనుభవం ఎదురైన విషయం తెల్సిందే. మేక్రాన్‌కు చెందిన మితవాద సెంట్రిస్ట్ ఎన్‌సింబల్ కూటమి మూడో స్థానంలో సరిపెట్టుకుంది. తొలి రౌండ్‌లో అతివాద నేషనల్ ర్యాలీ కూటమి 33.14 శాతం ఓట్లను ఒడిసిపట్టి విజయం సాధించింది. విపక్షాలకు చెందిన న్యూ పాపులర్ ఫ్రంట్ కూటమి 27.99 శాతం ఓట్లను సాధించింది. మేక్రాన్ పార్టీ కేవలం 20.04 శాతం ఓట్లతో సరిపెట్టుకుంది. ఇటీవల యూరోపియన్ పార్లమెంట్ ఎన్నికల్లో నాయకురాలు మెరీన్ లీ పెన్‌కు చెందిన నేషనల్ ర్యాలీ పార్టీ విజయం సాధించింది. ఆలస్యం చేస్తే విపక్షాలు మరింత పుంజుకుంటాయన్న భయంతో మేక్రాన్ ముందస్తు ఎన్నికలకు వెళ్లిన విషయం విదితమే.

కశ్మీర్‌లో రెండు ఎన్‌కౌంటర్లు

ఆరుగురు ఉగ్రవాదులు హతం • ఇద్దరు సైనికుల వీరమరణం

శ్రీనగర్/రాజౌరీ/జమ్మూ: జమ్మూకశ్మీర్‌లో కుల్గాం జిల్లాలో ఆదివారం రెండు ఎన్‌కౌంటర్లలో ఆరుగురు ఉగ్రవాదులు హతమయ్యారు. ఇద్దరు సైనికులు వీర మరణం పొందారు. ఉగ్రవాదులతో శనివారం ప్రారంభమైన కాల్పులు ఆదివారం ముగిశాయి. మోదెర్గామ్‌లో రెండు, చిన్నిగామ్‌లో నాలుగు మృతదేహాలను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలియజేశారు. పారా కమాండో, మరో జవాను మృతిచెందినట్లు వెల్లడించారు. కశ్మీర్‌లో ఉగ్రవాద నిర్మూలన ప్రక్రియ చివరి దశకు చేరుతోందని డీజీపీ ఆర్.ఆర్.స్వాయిన్ చెప్పారు. రాజౌరీ జిల్లాలో సైనిక శిబిరంపై ఉగ్రవాదుల కాల్పుల్లో ఓ జవాను గాయపడ్డాడు. ముష్కరుల కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు.

సీబీఐకి ఆర్మ్‌స్ట్రాంగ్ కేసు: మాయా



ఆదివారం ఆర్మ్‌స్ట్రాంగ్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాయవతి

సాక్షి, చెన్నై: తమిళనాడు బీఎస్పీ అధ్యక్షుడు కె.ఆర్మ్‌స్ట్రాంగ్ (52) హత్యోదంతం కేసును సీబీఐకు అప్పగించాలని పార్టీ చీఫ్ మాయవతి డిమాండ్ చేశారు. ఆయన్ను శుక్రవారం రాత్రి చెన్నైలో గుర్తుతెలియని వ్యక్తులు కత్తితో దాడిచేసి దారుణంగా హత్య చేయడం తెలిసిందే. ఆదివారం పెరంబూరులో ఆర్మ్‌స్ట్రాంగ్ పార్థివదేహానికి మాయావతి నివాళులర్పించారు. ఆయన భార్యను ఓదార్చారు. తర్వాత మాట్లాడుతూ తమిళనాట శాంతిభద్రతలు శూన్యమంటూ మండిపడ్డారు. ''అసలు హంతకులు బయటే తిరుగుతున్నారు. ఆర్మ్‌స్ట్రాంగ్ హత్యతో తమిళ దళితుల్లో భయం గూడుకట్టుకుంది. వారికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత అన్నారు. ఆర్మ్‌స్ట్రాంగ్ భౌతికకాయాన్ని పెరంబూరులోని బీఎస్పీ కార్యాలయంలో ఖననం చేయాలని భావించగా అది నివాస ప్రాంతమంటూ రాష్ట్ర ప్రభుత్వం అనుమతివ్వలేదు. దాంతో ఈ వ్యవహారం హైకోర్టు దాకా వెళ్లింది. చివరికి చెన్నై శివారులో పొత్తూరులోని ఆర్మ్‌స్ట్రాంగ్ బంధువు భూమిలో ఖననం చేశారు.

ఖల్సా కలల్లో తప్పేముంది?

ఖలిస్తానీ నేత అమృత్‌పాల్ వ్యాఖ్యలు

చండీగఢ్: ''ఖల్సా రాజ్య స్థాపన గురించి కలలు కనడం గౌరవమే తప్ప నేరం కాదు. ఈ కల సాకారానికి లక్షలాది సిక్కులు జీవితాలను త్యాగం చేశారు'' అని ఖలిస్తానీ వేర్పాటువాది, లోక్‌సభ సభ్యుడు అమృత్‌పాల్ సింగ్ అన్నారు. అమృత్‌పాల్ సింగ్ ఖలిస్తానీ మద్దతుదారు కాదని, ఆయన్ను వెంటనే విడుదల చేయాలని తల్లి బల్వీందర్ కౌర్ కోరడం తెలిసిందే. ఆ ప్రకటన తనకు బాధ కలిగించిందంటూ అమృత్‌పాల్‌సింగ్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

బైక్‌ను ఢీకొట్టి.. మహిళను ఈడ్చుకెళ్లి

- ముంబైలో బీఎండబ్ల్యూ బీభత్సం
- మహిళ అక్కడికక్కడే మృతి
- నిందితుడు శివసేన నేత కుమారుడు

ముంబై: దేశ ఆర్థిక రాజధాని ముంబైలో ఓ బీఎండబ్ల్యూ కారు బీభత్సం సృష్టించింది. భార్యాభర్తలు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో బైక్‌పై ఉన్న మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. వర్లీ ప్రాంతంలో ఆదివారం ఉదయం ఈ విషాద ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వర్లీలోని కోలివాడకు చెందిన చేపల వ్యాపారి అయిన ప్రదీప్, భార్య కావేరీ నఖ్వా(45)తో కలిసి సాసూన్ డాక్‌కు వెళ్లి చేపలు తీసుకుని తిరిగి వస్తున్నాడు. ఉదయం 5.30 నిమిషాల సమయంలో అనీబీసెంట్ రోడ్‌లో ప్రయాణిస్తుండగా అటుగా వస్తున్న లగ్జరీ కారు అదుపు తప్పి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌పైన ఉన్న ఇద్దరూ గాల్లో ఎగిరి కారు బానెట్‌పై పడ్డారు. ఆ తరువాత కింద పడిన కావేరీని కారు కొంత దూరం ఈడ్చుకెళ్లింది. ప్రమాదం జరిగిన వెంటనే కారును అక్కడే వదిలేసి పరారయ్యారు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు బాధితులను నాయర్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే కావేరీ చనిపోయినట్లు వైద్యులు ప్రకటించారు. కారు డ్రైవర్ రాజేంద్రసింగ్ బిదావత్, పక్కనే ఉన్న మిహిర్ షా అనే వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వారిని అదుపులోకి తీసుకున్నారు. మిహిర్ అధికార శివసేన నాయకుడు రాజేశ్ షా కుమారుడు.

'సూరత్' మృతులు ఏడుగురు

సూరత్: శనివారం సూరత్ పట్టణంలో ఆరంతస్తుల భవంతి కూలిన ఘటనలో మరణాల సంఖ్య ఆదివారానికి ఏడుకు పెరిగింది. పాల్ ఏరియాలోని భవంతి శనివారం కూలినపుడు ఒకరిని రక్షించి, శిథిలాల కింద ఒకరి మృతదేహాన్ని గుర్తించిన విషయం తెల్సిందే. శనివారం నుంచి ఆదివారం దాకా కొనసాగిన శిథిలాల తొలగింపు, గాలింపు తర్వాత మరో ఆరు మృతదేహాలను గుర్తించారు. భవంతిలో నివసించే వారి నుంచి అద్దెలు వసూలుచేసే ఒక వ్యక్తిని పోలీసులు అరెస్ట్‌చేశారు. శిథిలావస్థలో ఉన్న భవంతి యజమానులపై కేసు నమోదుచేశారు.

ఎల్‌ఏసీ పరిస్థితిపై ప్రజాభిప్రాయం: ఖర్గే

న్యూఢిల్లీ: చైనాతో సరిహద్దుల్లో పరిస్థితులపై కేంద్ర ప్రభుత్వం ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోవాలన్నదే తమ పార్టీ అభిమతమని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే పునరుద్ఘాటించారు. వాస్తవాధీన రేఖ(ఎల్‌ఏసీ) వెంబడి పాంగోంగ్ సరస్సు చుట్టుపక్కల ప్రాంతాల్లో చైనా శాశ్వత సైనిక శిబిరాలు, ఆయుధ, ఇంధన నిల్వల డిపోలను ఏర్పాటు చేసిందంటూ మీడియాలో వచ్చిన వార్తలను ఆయన ఆదివారం 'ఎక్స్'లో షేర్ చేశారు. ''2020 దాకా మన ఆధీనంలో ఉన్న పాంగోంగ్ సరస్సు సమీపంలోని సిరిజాప్ వద్ద చైనా మిలటరీ బేస్‌ను ఎలా నిర్మించింది? ఐదేళ్లుగా చైనా మన ప్రాదేశిక సమగ్రతను భంగం కలిగిస్తూనే ఉంది. ఎల్‌ఏసీ వెంట యథాతథ పరిస్థితులను కొనసాగించలేకపోతే మోదీ ప్రభుత్వానిదే బాధ్యత'' అన్నారు.

టీఎంసీ ఎంపీ మొయిత్రాపై కేసు

న్యూఢిల్లీ: తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రాపై కేసు నమోదైంది. జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రేఖా శర్మపై ఎక్స్‌వేదికగా అభ్యంతరకర వ్యాఖ్యలు చేసినందుకుగాను కేసు నమోదు చేసినట్లు ఢిల్లీ పోలీసులు తెలిపారు. హత్రాస్‌లో తొక్కిసలాట మృతుల కుటుంబాలను రేఖా శర్మ పరామర్శించిన సందర్భంగా వర్షం పడటంతో పక్కనున్నవారు ఆమెకు గొడుగు పట్టారు. ఆ వీడియోను ఎక్స్‌లో పోస్ట్ చేసిన మహువా 'నా గొడుగు నేను పట్టుకోగలను' అని పోస్టు చేశారు. దీనిపై కేసు నమోదుకు ఎన్సీడబ్ల్యూ డిమాండ్ చేసింది.

ఆరోరాల కనువిందు


ఒడిసిపట్టిన అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం



వాషింగ్టన్: భూ ఉపరితల నుంచి 400 కిలోమీటర్ల ఎత్తులో కక్ష్యలో భూమి చుట్టూ చక్కర్లు కొడుతున్న అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం అద్భుతమైన చిత్రాలను కెమెరాల్లో బంధించింది. కనువిందు చేసే ఆకుపచ్చ, ఊదా రంగుల కాంతి పుంజాల (ఆరోరా) ఫొటోలు, వీడియోలను భూమికి పంపింది. ఆరోరాల పైనుంచి అంతరిక్ష కేంద్రం పయనిస్తున్న సమయంలో ఈ అద్భుతం ఆవిష్కృతమైంది. ఉత్తర ధ్రువజ్యోతి అని, కాంతి ప్రవాహం అని పిలిచే ఆరోరాలు భూమి నుంచి అరుదుగా కనిపిస్తుంటాయి. గాలి రేణువులు, విద్యుత్ శక్తి కలిగిన సూర్యకాంతి రేణువులు భూ అయస్కాంత క్షేత్రంలో ఢీకొన్నప్పుడు అరోరాలు ఏర్పడుతుంటాయి. ఇవి సాధారణంగా ఆకుపచ్చ, ఎరుపు, పసుపు రంగుల్లో కనిపిస్తాయి.

అంతరిక్ష నడకల్లో చైనా రికార్డు

16 స్పేస్‌వాక్‌లు చేసిన వ్యోమగాములు



బీజింగ్: అంతరిక్ష పరిశోధనల్లో చైనా దూసుకెళ్తోంది. చైనా వ్యోమగాములు 16 స్పేస్‌వాక్‌లు నిర్వహించి సరికొత్త రికార్డు సృష్టించారు. భూదిగువ కక్ష్యలోని చైనా అంతరిక్ష కేంద్రం (సీఎస్‌ఎస్) 'తియాన్‌గాంగ్'లో షెన్‌జౌ-18 మిషన్‌లో భాగంగా బుధవారం ముగ్గురు వ్యోమగాములు యె గాంగ్‌ఫు, లీ కాంగ్, లీ గాంగ్‌సూ దాదాపు 6.5 గంటలపాటు స్పేస్‌వాక్ చేశారు. అంతరిక్ష కేంద్రం నుంచి బయటకు వచ్చి, శూన్య వాతావరణంలో విహరించడమే స్పేస్‌వాక్. సీఎస్‌ఎస్ అప్లికేషన్, డెవలప్‌మెంట్ దశలో ఇది 16వ స్పేస్‌వాక్ అని చైనా అంతరిక్ష పరిశోధకులు తెలిపారు. సంబంధిత వీడియోలను విడుదల చేశారు. ఇందులో వ్యోమగామి లీ కాంగ్ తెల్ల రంగు స్పేస్ సూట్ ధరించి చేసిన తొలి స్పేస్‌వాక్ కనిపిస్తోంది. లీ కాంగ్ వెనుక భూగోళం స్పష్టంగా దర్శనమిస్తోంది. షెన్‌జౌ-18 మిషన్‌లో ఇది రెండో స్పేస్‌వాక్. ఇదే మిషన్‌లో మే 28వ తేదీన వ్యోమగాములు 8.5 గంటల పాటు స్పేస్‌వాక్ నిర్వహించారు. చైనా అంతరిక్ష పరిశోధనల్లో అత్యంత సుదీర్ఘకాలం జరిగిన స్పేస్‌వాక్ ఇదే కావడం విశేషం. సీఎస్‌ఎస్ నుంచి మొట్టమొదటి అంతరిక్ష నడక 2021 జూలై నెలలో జరిగింది. షెన్‌జౌ-12 మిషన్ వ్యోమగాములు 7 గంటలపాటు స్పేస్‌వాక్ చేశారు. షెన్‌జౌ-13 మిషన్‌లో మొట్టమొదటిసారిగా ఓ మహిళా వ్యోమగామి స్పేస్‌వాక్‌లో పాల్గొన్నారు. షెన్‌జౌ-14 మిషన్ ఆస్ట్రోనాట్స్ మూడు స్పేస్‌వాక్‌లు నిర్వహించారు. షెన్‌జౌ-15 మిషన్‌లో భాగంగా ఒకే వ్యోమగామి ఆరు నెలల వ్యవధిలో నాలుగు స్పేస్‌వాక్‌లు చేశారు. ప్రస్తుతం షెన్‌జౌ-18 మిషన్ కొనసాగుతోంది. మరికొన్ని స్పేస్‌వాక్‌లు చేసే, కొత్త రికార్డులు నెలకొల్పే అవకాశం కనిపిస్తోంది. భూదిగువ కక్ష్యలో పరిశోధనల విషయంలో చైనా ముందంజలో ఉంది. స్పేస్‌వాక్‌లు సునాయాసంగా చేయడం అనేది సాంకేతిక నైపుణ్యాలను నిరూపించుకోవడంతోపాటు భవిష్యత్తులో మరిన్ని సంక్లిష్టమైన అంతరిక్ష పరిశోధనలకు నాంది అని చెప్పొచ్చు.

డ్రైవింగ్ లైసెన్స్ కావాలి.. మొదట లెర్నింగ్ లైసెన్స్ తీసుకున్నారు..
ఏదో డ్రైవింగ్ స్కూల్‌లో చేరి కొన్ని రోజులు నేర్చుకున్నారు.. డ్రైవింగ్ టెస్టులో పాసయ్యేంత నైపుణ్యం లేకున్నా..
ఎవరో ఏజెంట్‌నో, దళారీనో పట్టుకుని లైసెన్స్ సంపాదించేశారు. ఇదంతా బాగానే ఉంది..
మరి వచ్చీరాని డ్రైవింగ్‌తో బండి వేసుకుని రోడ్డెక్కితే? ఏదైనా ప్రమాదానికి కారణమైతే?
ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు రవాణా శాఖ చర్యలు చేపట్టింది. సిటీలోని నాగోల్‌లో ఆధునిక డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌ను అందుబాటులోకి తెచ్చింది. డ్రైవింగ్ సరిగ్గా నేర్చుకుని, ట్రాక్‌పై నిర్ణీత ప్రమాణాల మేరకు నడిపితేనే..
లైసెన్స్ చేతికి వస్తుంది. లేకుంటే ఫెయిలే మరి.



సరిగా వాహనం నడపగలిగితేనే
లైసెన్స్ వచ్చేలా ఆధునిక డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌లు
సిటీలోని నాగోల్ ఆర్టీఏలో ఏర్పాటు చేసిన రవాణా శాఖ

డ్రైవింగ్ ట్రాక్‌లో పడేలా

సాక్షి, హైదరాబాద్

డ్రైవింగ్ లైసెన్స్‌ల కోసం వచ్చేవారికి రవాణా శాఖ తనిఖీ అధికారులే పరీక్షలు నిర్వహించి లైసెన్స్‌లను అందజేసే పద్ధతి చాలాకాలం నుంచి కొనసాగుతోంది. మాన్యువల్‌గా సాగుతున్న ఈ పద్ధతికి స్వస్తి చెప్పి.. మోటారు వాహన చట్టం నిబంధనలకు అనుగుణంగా డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌ల ఆధునీకరణకు రవాణాశాఖ సిద్ధమైంది. ఆటోమేటిక్ పద్ధతిలో ట్రాక్‌ల నిర్వహణ చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తోంది. దీంతో నిర్ణీత ప్రమాణాల మేరకు వాహనం నడిపితేనే డ్రైవింగ్ లైసెన్స్ లభించనుంది. ఈ క్రమంలో డ్రైవింగ్ లైసెన్స్ కోసం టెస్టుకు వచ్చేవారు ఎలాంటి దొడ్డిదారి మార్గాలను అన్వేషించకుండా.. బాగా శిక్షణ తీసుకుని డ్రైవింగ్‌లో నైపుణ్యం సంపాదించాలని హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ సి.రమేశ్ స్పష్టం చేస్తున్నారు.

వాహనాల వినియోగం పెరుగుతూ..

ఇప్పుడు చాలా మందికి బైక్ లేదా కారు నిత్యావసరంగా మారింది. ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులు, మహిళలు అన్ని వర్గాల వారు వ్యక్తిగత వాహనాలను వినియోగిస్తున్నారు. ఏటా వేలాది మంది కొత్తగా డ్రైవింగ్ నేర్చుకుని, వాహనాలు కొనుగోలు చేస్తున్నారు. రవాణా రంగంలో డ్రైవర్లుగా చేరుతున్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో గత మూడేళ్లలో సుమారు 62 లక్షల మంది డ్రైవింగ్ లైసెన్స్‌లు తీసుకోవడం విశేషం. అయితే చాలా మంది ఎలాంటి డ్రైవింగ్ టెస్ట్ లేకుండా వచ్చేస్తే బాగుంటుందని భావిస్తుంటారు. ఇందుకోసం ఏజెంట్లను, మధ్యవర్తులను ఆశ్రయిస్తారు. సరిగా నేర్చుకోకుండా, టెస్టుకు హాజరుకాకుండా తప్పుడు పద్ధతుల్లో లైసెన్సు తీసుకుని.. అరకొర అనుభవంతో బండి నడిపితే ప్రమాదాల బారినపడే అవకాశం ఉంటుంది.

- ఇన్నాళ్లూ కొనసాగిన మొక్కుబడి డ్రైవింగ్ టెస్టులకు చెల్లుచీటీ
- రహదారులపై ఉండే ఇబ్బందులను తలపించేలా ట్రాక్‌లో ఏర్పాట్లు
- లైసెన్స్ కోసం వచ్చేవారు ఎలా నడపగలుగుతున్నారో పరిశీలన
- ఆటోమేటిక్ పద్ధతిలో ట్రాక్‌ల నిర్వహణ
- టెస్ట్ వివరాలన్నీ కంప్యూటర్‌లో నిక్షిప్తం
- ప్రమాణాల మేరకు డ్రైవింగ్ చేయకుంటే ఫెయిలే

ట్రాక్‌లో టెస్టు ఇలా..

వాహనదారుల డ్రైవింగ్ నైపుణ్యాన్ని పరీక్షించేందుకు రకరకాల ట్రాక్‌లను ఏర్పాటు చేశారు. కారు నడిపేవారు ఈ అన్ని ట్రాక్‌లలో తమ నైపుణ్యాన్ని చూపాల్సి ఉంటుంది. అలాగే ద్విచక్ర వాహనదారులు, భారీ వాహనాలు నడిపే డ్రైవర్లకు కూడా ప్రత్యేక ట్రాక్‌లు ఉన్నాయి.

ట్రాక్ 'హెచ్': వాహనం ముందుకు వెళ్లిన తరువాత రివర్స్ చేయాల్సి వస్తే.. ఎలా తీసుకొంటారో తెలుసుకొనేందుకే ఈ ట్రాక్.

ట్రాక్ 'ఎస్': ఒక మూల నుంచి మరో మూలకు టర్న్ చేయాల్సి వచ్చినప్పుడు ఎలాంటి నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నారో ఈ ట్రాక్‌లో తెలుస్తుంది.


ట్రాక్ '8': బాగా మలుపులున్న రోడ్డుపై ఎలా ముందుకు వెళ్తున్నారో తెలుసుకొనేందుకు ఇది దోహదం చేస్తుంది.

ఎత్తుపల్లాల ట్రాక్: ఎత్తైన ప్రదేశాలు, చిన్న లోయ వంటి ప్రాంతాల్లో ఎలా నడపగలరో పరిశీలించేందుకు ఇవి ఏర్పాటు చేశారు.

- చివరగా బండి పార్కింగ్ చేసే పద్ధతిని కూడా పరీక్షిస్తారు.

టెస్ట్‌కు హాజరయ్యే సమయంలో ఫోర్ వీలర్ అయితే సీట్ బెల్ట్, ద్విచక్రవాహనమైతే హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి. లేకుంటే ఫెయిల్ చేస్తారు.

ట్రాక్‌లలో నడిపేటప్పుడు ఎలాంటి తప్పిదాలు చేసినా ఫెయిల్ అయినట్టుగా నిర్ధారిస్తారు. ఇలా ఫెయిలైన వారు మరోనెల పాటు శిక్షణ తీసుకొని హాజరుకావాల్సి ఉంటుంది.



రోజూ వందలాది మందికి డ్రైవింగ్ టెస్టులు..

గ్రేటర్ హైదరాబాద్‌లో నాగోల్, ఉప్పల్, కొండాపూర్, మేడ్చల్, ఇబ్రహీంపట్నం, బండ్లగూడలలో ఏర్పాటు చేసిన డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌ల ద్వారా రవాణా శాఖ డ్రైవింగ్ పరీక్షలను నిర్వహిస్తోంది. రోజూ వందలాది మంది ఈ టెస్టులకు హాజరవుతున్నారు. ఈ క్రమంలో దేశంలోనే అత్యాధునిక డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌ను నాగోల్‌లో ఏర్పాటు చేశారు. ఇక్కడ ఉన్న 12 ట్రాక్‌లలో రోజూ వందల మందికి డ్రైవింగ్ టెస్టు చేస్తున్నారు. కార్లు, ద్విచక్ర వాహనాలు

మిగతా 8వ పేజీలో ▶



ఎకో ప్రెస్సింగ్

- వివరాలు 13లో

నాన్నను మిస్ అవుతున్నా..

- ప్రధానితో భేటీ మర్చిపోలేని అనుభూతి
- సూర్యకుమార్ క్యాచ్ అద్భుతం..
- ఇండియా గెలుస్తుందని అప్పుడే అనుకున్నాం
- నీలోఫర్ చాయ్ అంటే చాలా ఇష్టం..
- ఫస్ట్‌లాన్సర్ ఈద్గా గ్రౌండ్‌లోనే క్రికెట్ ఓనమాలు నేర్చుకున్నా
- 'సాక్షి'తో ప్రపంచకప్ టీం సభ్యుడు మహ్మద్ సిరాజ్

- వివరాలు 13లో



క్రికెట్ గ్రౌండ్స్.. ఫర్ రెంట్!

అద్దె కట్టు.. బ్యాట్ పట్టు..



- నగర శివార్లలో అద్దెకు క్రీడా మైదానాలు
- పొలాలు, భూములను గ్రౌండ్‌లుగా మారుస్తున్న యజమానులు
- మ్యాచ్‌కు, రోజుకు ఇంత అంటూ చార్జీ వసూలు
- అటు క్రీడాకారులకు వెసులుబాటు.. ఇటు ఓనర్లకు ఆదాయం
- మ్యాచ్‌కు రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు వసూలు
- క్రికెట్ హబ్‌గా మొయినాబాద్, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, శంకర్‌పల్లి మండలాలు
- ఫుట్‌బాల్, వాలీబాల్ వంటి ఇతర క్రీడా పోటీల నిర్వహణకూ వినియోగం

మన దగ్గర క్రికెట్ అంటే ఉండే క్రేజే వేరు. చిన్నప్పుడు గల్లీల్లో క్రికెట్ ఆడినా.. కాస్త పట్టు చిక్కినవారు, దానిపై మక్కువ ఉన్నవారు, ప్రొఫెషనల్‌గా తీసుకునేవారు మాత్రం విశాలమైన గ్రౌండ్‌ల కోసం వెతుకుతుంటారు. ఈ క్రమంలోనే నగర శివార్లలో అద్దె మైదానాలు వెలిశాయి. ఔటర్ రింగ్‌రోడ్డుకు అటూ ఇటూ భూములున్నవారు ఖాళీగా ఉన్న తమ భూములను క్రికెట్ మైదానాలుగా మార్చేసి అద్దెకు ఇస్తున్నారు. మ్యాచ్‌కు ఇంత అని లేకుంటే రోజుకు ఇంత అని వసూలు చేస్తున్నారు. అటు క్రీడాకారుల అవసరాన్ని తీర్చుతూనే, ఇటు ఆదాయాన్ని కూడా పొందుతున్నారు. ఇలా నగరంలో, శివార్లలో వందలకొద్దీ గ్రౌండ్లు ఏర్పాటయ్యాయి. అందులో ఒక్క మొయినాబాద్ మండలం పరిధిలోనే 60కిపైగా మైదానాలు ఉండటం గమనార్హం.

రోజురోజుకూ విస్తరిస్తున్న విశ్వనగరం హైదరాబాద్‌లో క్రికెట్ అంటే మోజు ఎక్కువ. ఆ ఆటను చూసేవారే కాదు.. ఆడేవారి సంఖ్య కూడా బాగా పెరిగిపోతోంది. సిటీలో గచ్చిబౌలి, ఉస్మానియా యూనివర్సిటీ, యూసఫ్‌గూడ, ఎల్బీ స్టేడియం, సరూర్‌నగర్‌లలో స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లు ఉన్నా.. అవి క్రీడాకారుల అవసరాలకు సరిపోవడం లేదు. మరోవైపు క్రీడాకారుల్లోని ప్రతిభను గుర్తించి, వెలికి తీసేందుకు వివిధ సంఘాలు, అసోసియేషన్లు ఏదో ఒక పేరుతో తరచూ క్రీడాపోటీలు నిర్వహిస్తున్నాయి. దీంతో గ్రౌండ్ల కోసం డిమాండ్ మరింత పెరిగింది. ఈ నేపథ్యంలో అటు క్రీడాకారులకు అందుబాటులో ఉండేలా, తామూ కొంత ఆదాయం పొందేలా.. నగర శివార్లలో భూములున్నవారు తమ భూములను క్రీడా మైదానాలు మారుస్తున్నారు. భూములను చదును చేసి, చుట్టూ ఎత్తయిన ప్రహరీలు లేదా ఇనుప కంచెలు ఏర్పాటు చేస్తున్నారు. చుట్టూ చెట్లను, మైదానమంతా పచ్చనిగడ్డిని పెంచుతున్నారు. ఇతర మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నారు. ఒక్క క్రికెట్ అనేగాకుండా వాలీబాల్, ఫుట్‌బాల్, టెన్నిస్ వంటి ఇతర పోటీలకు కూడా ఈ గ్రౌండ్లను అద్దెకు ఇస్తున్నారు.

శివార్లలో సాగు చేయలేక..

సిటీ శివారు ప్రాంతాల్లో భూగర్భ జలాలు తక్కువగా ఉండటం, వానలు సరిగా పడకపోవడం వంటి పరిస్థితుల్లో రైతులు పంటలు సాగు చేయడం లేదు. ఈ ప్రాంతాల్లో కూలీలు దొరకడం కూడా కష్టంగా మారింది. సాగు చేసినా.. ఖర్చులు రెట్టింపు అవుతున్న పరిస్థితి. దీనితో ఖాళీగా ఉన్న పొలాలను మైదానాలుగా మారుస్తున్నారు. ఒకేచోట నాలుగైదు ఎకరాల భూమి ఉన్నవారు ఓపెన్ స్టేడియాలుగా మారుస్తుండగా.. అర ఎకరం, ఎకరం భూమి ఉన్న వారు నెట్ స్టేడియాలు ఏర్పాటు చేస్తున్నారు. వాటిని క్రీడా మైదానాల నిర్వాహకులకు లీజుకు ఇస్తున్నారు. ముఖ్యంగా నగరానికి చేరువలో ఉన్న మొయినాబాద్ మండలం క్రీడా హబ్‌గా మారుతోంది. ఈ ఒక్క మండలంలోనే సుమారు 65 క్రికెట్ గ్రౌండ్లు ఉన్నాయి. ఇబ్రహీంపట్నం మండలంలో ఆరు, శంషాబాద్ మండలంలో ఐదు, హయత్‌నగర్ మండలంలో మూడు మైదానాలు ఏర్పాటయ్యాయి.



ఉద్యోగ, వ్యాపార వర్గాలూ..

రాజకీయ, సినీ ప్రముఖులు, వ్యాపారులు, ఉద్యోగులు.. సిటీ శివార్లలో భారీగా భూములు కొనుగోలు చేశారు. వారిలో కొందరు గేటెడ్ కమ్యూనిటీలు, విల్లాలు ఏర్పాటు చేస్తే.. మరికొందరు భూములను ఖాళీగా ఉంచడం ఇష్టం లేక క్రీడా మైదానాలుగా మారుస్తున్నారు. కొనుగోలు చేసిన భూములకు రక్షణగా ఉండటంతోపాటు అద్దె ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకుంటున్నారు. కొన్ని ఇంజనీరింగ్ కాలేజీల యాజమాన్యాలు కూడా విద్యార్థులను ఆకర్షించేందుకు క్రీడా మైదానాలు ఏర్పాటు చేస్తున్నాయి. వారాంతాల్లో వాటిని అద్దెకు కూడా ఇస్తున్నాయి.

ఏర్పాట్లను బట్టి అద్దెలు..

ఈ గ్రౌండ్లలో వీక్షకులు కూర్చునేందుకు వీలుగా కుర్చీలు, మరుగుదొడ్లు, విద్యుత్, సౌండ్ వ్యవస్థలు, భారీ స్క్రీన్లు, ఎల్ఈడీ లైట్లు, ఇతర మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ సదుపాయాలను బట్టి, డిమాండ్‌ను బట్టి అద్దెలు వసూలు చేస్తున్నారు. గ్రౌండ్ల బుకింగ్ కోసం కొందరు నిర్వాహకులు ఆన్‌లైన్ బుకింగ్ సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చారు. పెద్ద గ్రౌండ్లు అయితే ఒక్కో మ్యాచ్‌కు రూ.5000 నుంచి రూ.10 వేల వరకు చార్జీ చేస్తున్నారు. నెట్, ఫెన్సింగ్‌తో ఉండే చిన్న గ్రౌండ్లకు గంటకు రూ.500 నుంచి రూ.1000 వరకు చార్జీ చేస్తున్నారు. శని, ఆదివారాలు, ఇతర సెలవు రోజుల్లో కాస్త ఎక్కువగా వసూలు చేస్తున్నారు.



క్రికెట్‌పై ఇష్టంతో

చిన్నప్పటి నుంచీ క్రికెట్ అంటే ఎంతో ఇష్టం. అందుకే క్రికెట్ ఆడేందుకు ఎంత దూరమైనా వెళ్తుంటా. హైదరాబాద్ నగరంలో క్రికెట్ మైదానాలు అందుబాటులో లేవు. ఎక్కడైనా పార్కుల్లో ఉన్నా క్రికెట్ ఆడేందుకు ఇబ్బందిగా ఉంటుంది. దాంతో ప్రతిరోజు క్రికెట్ ఆడేందుకు సిటీ బయటి ప్రాంతాలకు వెళ్తున్నాను. క్రీడాకారులందరం డబ్బులు పోగేసుకుని మైదానాన్ని అద్దెకు తీసుకుంటాం.

సయ్యద్ అర్షద్, క్రీడాకారుడు



ఆన్‌లైన్ ద్వారా అద్దెకు..

క్రీడాకారులకు అందుబాటులో ఉండేలా క్రికెట్ మైదానాలు ఏర్పాటు చేశాం. ఎవరైనా ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవచ్చు. చాలా వరకు క్రీడాకారులు ట్వంటీ ట్వంటీ మ్యాచ్‌లు ఆడుతుంటారు. సాధారణ రోజుల్లో మ్యాచ్‌కు రూ.2 వేల నుంచి రూ.4 వేలు.. శని, ఆదివారాల్లో అయితే మ్యాచ్‌కు రూ.5 వేల నుంచి రూ.7 వేల వరకు అద్దె వసూలు చేస్తాం. గ్రౌండ్ నిర్వహణకే చాలా వరకు ఖర్చవుతుంది. మౌలిక సదుపాయాలు, డిమాండ్‌ను బట్టి చార్జీలలో మార్పులు ఉంటాయి.

- రాజేందర్‌రెడ్డి, క్రికెట్ మైదానం నిర్వాహకుడు, మొయినాబాద్

క్రికెట్ గ్రౌండ్‌లు ఉన్న గ్రామాల వివరాలివీ..



గ్రామం	గ్రౌండ్లు	గ్రామం	గ్రౌండ్లు	గ్రామం	గ్రౌండ్లు
బాకారం	15	నాగిరెడ్డిగూడ	3	మొత్కుపల్లి	1
అజీజ్‌నగర్	12	హిమాయత్‌నగర్	3	శ్రీరాంనగర్	1
ఎనికేపల్లి	12	కనకమామిడి	3	బొంగుళూరు	1
చిలుకూరు	6	రెడ్డిపల్లి	3	ఇబ్రహీంపట్నం	1
నజీబ్‌నగర్	4	తుర్కయాంజాల్	2	నాదర్‌గుల్	1
అమ్డాపూర్	3	కొంగరకలాన్	2		

సాక్షి, రంగారెడ్డి జిల్లా

డ్రైవింగ్.. ట్రాక్‌లో పడేలా

▶ 7వ పేజీ తరువాయి

నడిపేందుకు వేర్వేరు ట్రాక్‌లు ఉన్నాయి. అలాగే బస్సులు, లారీలు, ఇతర భారీ వాహనాలను నడిపేవారికి టెస్టుల కోసం ప్రత్యేకంగా ట్రాక్‌లను ఏర్పాటు చేశారు. అనంతరం దశలవారీగా కొండాపూర్, ఉప్పల్, మేడ్చల్ తదితర ఆర్టీఏలలోనూ ట్రాక్‌లను విస్తరించారు.

నెలరోజులకే 'టెస్టు'కు వస్తూ.. : అభ్యర్థులు తొలుత లెర్నింగ్ లైసెన్సు తీసుకుని డ్రైవింగ్ నేర్చుకోవాల్సి ఉంటుంది. తర్వాత నెల రోజుల నుంచి 6 నెలలలోపు ఎప్పుడైనా డ్రైవింగ్ టెస్టు పాసై.. హాజరై శాశ్వత డ్రైవింగ్ లైసెన్సు పొందవచ్చు. డ్రైవింగ్‌లో పట్టుసాధించాకే లైసెన్సు అందేలా ఈ నిబంధన అమలవుతోంది. కానీ చాలా మంది తూతూమంత్రంగా డ్రైవింగ్ నేర్చుకుని.. నెల రోజులకే టెస్టుకు హాజరవుతున్నారు. డ్రైవింగ్ పూర్తిగా రాకపోయినా, అడ్డదారిలో లైసెన్స్ పొందేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇకపై అలాంటి వాళ్లు టెస్టులో చిక్కులు ఎదుర్కోక తప్పదని నాగోల్ ప్రాంతీయ రవాణా అధికారి రవీందర్ తెలిపారు. ప్రతి ఒక్కరు తప్పనిసరిగా డ్రైవింగ్ టెస్ట్‌కు హాజరు కావాలని.. ఆ టెస్ట్ వివరాలను కంప్యూటర్‌లో నమోదు చేసి, ఉత్తీర్ణులుగా నిర్ధారణ అయితేనే లైసెన్స్ ఇస్తారని వెల్లడించారు.

నైపుణ్యం ఉంటే కష్టమేమీ కాదు

ప్రస్తుతం ప్రతి ఒక్కరికి వాహనం తప్పనిసరి అవసరంగా మారింది. డ్రైవింగ్ లైసెన్స్ కోసం వచ్చేవారు ట్రాఫిక్ నిబంధనలు, రహదారి భద్రత, వాహనం నడపడంలో కచ్చితమైన నైపుణ్యం కలిగి ఉండాలి. డ్రైవింగ్‌లో ప్రావీణ్యం ఉన్నవారు ఆర్టీఏ టెస్ట్ ట్రాక్‌లలో నిర్వహించే పరీక్షల్లో తేలిగ్గా ఉత్తీర్ణులవుతారు. డ్రైవింగ్ ఎంతో కీలకమైంది. నాణ్యమైన శిక్షణ తీసుకొని, పూర్తి నమ్మకం కలిగాకే.. డ్రైవింగ్ టెస్ట్‌కు హాజరుకావాలి. మొక్కుబడిగా నేర్చుకుని లైసెన్సుల కోసం రావడం వల్ల ప్రయోజనం ఉండదు. టెస్ట్‌కు రావడానికి ముందే ఒకసారి ట్రాక్‌పైన అవగాహన పెంచుకోవడం మంచిది.

- సి.రమేశ్, జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్, హైదరాబాద్

పూర్తిగా నేర్చుకుని వచ్చాను



సాధారణంగా డ్రైవింగ్ స్కూల్లో నెల రోజులు మాత్రమే శిక్షణ ఇస్తారు. నైపుణ్యం పెంచుకునేందుకు అది ఏ మాత్రం చాలదు. కనీసం 3 నెలల పాటు డ్రైవింగ్ మెళకువలు నేర్చుకోవాలి. ఎలాంటి రోడ్లపై అయినా సరే బండి నడపగలమనే ధైర్యం, నమ్మకం వచ్చిన తర్వాత టెస్ట్‌కు రావడం వల్ల ఎలాంటి ఇబ్బందీ ఉండదు. ఈజీగా పాస్ కావొచ్చు.

- పూర్ణిమ, టెస్ట్‌కు హాజరైన మహిళ

రోడ్లపై నడిపినట్లుగానే ఉంది

ఈ ట్రాక్‌లో రోడ్డు మీద నడిపినట్టుగానే ఉంది. మూల మలుపులు, ఎత్తుపల్లాలు, స్పీడ్ బ్రేకర్లు అన్నీ ఉన్నాయి. బండి నడిపే సమయంలో ఏ రోడ్డుపైన ఎలా నడపాలో స్పష్టమైన అవగాహన ఉంటేనే ఇక్కడ టెస్ట్‌ను ఎదుర్కోగలుగుతాం. ఎలాంటి టెన్షన్ లేకుండా ప్రశాంతంగా నడిపితే డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌లలో నిర్వహించే పరీక్షలు ఏ మాత్రం ఇబ్బంది కాదు.

- శ్రీధర్, టెస్ట్‌కు హాజరైన యువకుడు

సాక్షి హైదరాబాద్

సోమవారం । 8 । జూలై । 2024



పబ్‌లో డ్రగ్స్ కలకలం

ఖాజాగూడలోని 'ద కేవ్' పబ్‌లో నిర్వహించిన 'ఫారెస్ట్ సైకెడలిక్ పార్టీ'లో డ్రగ్స్ సేవించినట్లు అందిన సమాచారంతో పోలీసులు, తెలంగాణ నార్కోటిక్ బ్యూరో సభ్యులు దాడి చేశారు. -10లో



హోంగార్డు.. 'ట్రీ గార్డు'

ఆయన వృత్తి హోంగార్డు.. ప్రవృత్తి 'ట్రీగార్డు'గా మారింది.. మొక్కలు నాటుతూ, పర్యావరణ పరిరక్షణకు పాటుపడుతూ సహచరులతో పాటు అందరి ప్రశంసలు పొందుతున్నారు కృష్ణసాగర్. -12లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.0/23.0

నగర పరిధిలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. గరిష్ట ఉష్ణోగ్రత 31 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రత 23 డిగ్రీలు నమోదు కావచ్చు.

ఇంటి తలుపులు పగులగొట్టి చోరీ

- 40 తులాల బంగారం, రూ.లక్ష నగదు అపహరణ
- పార్థీ దొంగల ముఠాపై పోలీసుల అనుమానాలు

లింగోజిగూడ: తాళం వేసి ఉన్న ఓ విల్లా తలుపులు పగులగొట్టి నగలు, నగదును దొంగలు అపహరించారు. మరో విల్లాలో చోరీకి విఫల యత్నం చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగోలు జైపూరి కాలనీలో గోల్డెన్ లీవ్స్ విల్లాస్‌లోని 89వ విల్లాలో నివాసం ఉండే పురుషోత్తం రెడ్డి కుటుంబ సభ్యులతో తీర్థయాత్రలకు వెళ్లారు. ఆదివారం ఉదయం విల్లా ఇంటి తలుపులు పగులగొట్టి ఉండడంతో పురుషోత్తం రెడ్డికి స్థానికులు సమాచారం అందించారు. దీంతో పురుషోత్తం రెడ్డి ఇంటికి వచ్చి పరిశీలించారు. ఇంట్లోని సుమారు 40 తులాల బంగారు ఆభరణాలు, రూ.లక్ష నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు.ఇదే విల్లాస్‌లో నీరజరెడ్డికి చెందిన 22వ విల్లాలో కూడా దుండగులు చోరీకి విఫల యత్నం చేశారు. తాళం వేసి ఉన్న ఇల్లే లక్ష్యంగా దుండగులు గొడ్డలి, కత్తులతో తలుపులను పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. క్లూస్ టీం ద్వారా ఆధారాలు సేకరిస్తున్నారు. ఇటీవల పోలీసుల కాల్పుల నుంచి తప్పించుకున్న అంతర్రాష్ట్ర పార్థీ దొంగల ముఠాగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

నేడు వన మహోత్సవం ప్రారంభం

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు సోమవారం వన మహోత్సవ కార్యక్రమం ఆరంభం కానుంది. ఉదయం 10 గంటలకు ఉప్పల్ సర్కిల్– 2 హబ్సిగూడ సర్కిల్– 8, రామాంతాపూర్‌లో మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, మేయర్ గద్వాల్ విజయ లక్ష్మి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలిలు మొక్కలు నాటే కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు.

బల్కంపేట ఎల్లమ్మ కల్యాణోత్సవం

నేటి నుంచి మూడ్రోజులు ట్రాఫిక్ ఆంక్షలు

సనత్‌నగర్: బల్కంపేట ఎల్లమ్మ కల్యాణోత్సవం సందర్భంగా నేటి నుంచి మూడు రోజుల పాటు ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు పోలీసులు తెలిపారు. కల్యాణం జరిగే 9న, రథోత్సవం నిర్వహించే 10న భక్తులు విశేషంగా తరలిరానున్న నేపథ్యంలో ఈ నెల 8 నుంచి 10 వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉంటాయని పేర్కొన్నారు. వాహనదారులు, ప్రయాణికులు గమనించి ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాల్సిందిగా సూచించారు. ట్రాఫిక్ ఆంక్షలు ఇలా ఉన్నాయి.

- గ్రీన్‌ల్యాండ్స్, మాతా టెంపుల్, సత్యం థియేటర్ నుంచి ఫతేనగర్ వైపు వెళ్లే ట్రాఫిక్‌ను ఎస్ఆర్‌నగర్ టి–జంక్షన్ వద్ద మళ్లించి ఎస్ఆర్‌నగర్ కమ్యూనిటీ హాల్, అభిలాష టవర్స్, బీకేగూడ ఎక్స్‌రోడ్డు, శ్రీరామ్‌నగర్ క్రాస్‌రోడ్డు, సనత్‌నగర్ మీదుగా ఫతేనగర్ రోడ్డు వైపు అనుమతిస్తారు.
- ఫతేనగర్ ఫ్లైఓవర్ నుంచి బల్కంపేట వైపు వెళ్లే వాహనాలను కొత్త వంతెన వద్ద కట్టమైసమ్మ దేవాలయం, బేగంపేట వైపు మళ్లిస్తారు.
- గ్రీన్‌ల్యాండ్స్–బకుల్ అపార్ట్‌మెంట్స్, ఫుడ్‌వరల్డ్ నుంచి వచ్చే వాహనాలను బల్కంపేట వైపు అనుమతించరు. ఫుడ్‌వరల్డ్ ఎక్స్ రోడ్డులో సోనాబాయి టెంపుల్, సత్యం థియేటర్, మైత్రివనం లేదా ఎస్ఆర్‌నగర్ టి–జంక్షన్ వైపు మళ్లిస్తారు.
- బేగంపేట కట్టమైసమ్మ దేవాలయం నుంచి వచ్చే వాహనాలు బల్కంపేట వైపు వెళ్లడానికి అనుమతించరు. ఆ ట్రాఫిక్‌ను గ్రీన్‌ల్యాండ్స్, మాతా ఆలయం, సత్యం థియేటర్, ఎస్ఆర్‌నగర్ టి–జంక్షన్ ఎడమ మలుపు నుంచి ఎస్ఆర్‌నగర్ కమ్యూనిటీ హాల్ వైపు మళ్లిస్తారు.
- ఎస్ఆర్‌నగర్ టి–జంక్షన్ నుంచి ఫతేనగర్ వరకు బైలేన్లతో పాటు లింక్ రోడ్లు మూసివేస్తారు.

వాహనాల పార్కింగ్ ఇలా..

ఎస్ఆర్‌నగర్ టి–జంక్షన్ సమీపంలో ఆర్అండ్‌బీ కార్యాలయం, ఫుడ్‌వరల్డ్ ఎక్స్‌రోడ్డు సమీపంలోని జీహెచ్ఎంసీ గ్రౌండ్, నేచర్ క్యూర్ హాస్పిటల్ రోడ్డు సైడ్ పార్కింగ్, నేచర్‌క్యూర్ హాస్పిటల్ పార్కింగ్, ఫతేనగర్ రైల్వే వంతెన కింద పార్కింగ్ ప్రాంతాలను గుర్తించారు. భక్తులు తమ వాహనాలను నిర్ణీత పార్కింగ్ ప్రదేశాల్లో మాత్రమే సక్రమంగా పార్కింగ్ చేయాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు. ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో, ప్రయాణ సహాయం కోసం ట్రాఫిక్ హెల్ప్‌లైన్ 90102 03626కు ఫోన్ చేయాలన్నారు.



నమో జగన్నాథా..

నగర వ్యాప్తంగా ఆదివారం జగన్నాథ రథయాత్ర ఉత్సవాలు నేత్రపర్వంగా జరిగాయి. ప్రధానంగా సికింద్రాబాద్ ఎస్పీ రోడ్‌లోని ఇస్కాన్ టెంపుల్ ఆధ్వర్యంలో నిర్వహించిన జగన్నాథ స్వామి రథయాత్ర ఆద్యంతం ఆధ్యాత్మికతను సంతరించుకుంది. భక్తుల పూజలు, హారతుల మధ్య యాత్ర శోభాయమానంగా సాగింది. భక్తుల కోలాహలం మధ్య రథయాత్ర సెయింట్ మేరీస్ రోడ్, ప్యాట్నీ సెంటర్, ఆర్పీరోడ్, మోండా మార్కెట్, క్లాక్ టవర్, సంగీత్ చౌరస్తా మీదుగా ఇస్కాన్ టెంపుల్‌కు చేరుకుంది.



సికింద్రాబాద్‌లో సందడిగా జగన్నాథ రథయాత్ర

బోన భాగ్యం



బోనంతో నిషా క్రాంతి



గోల్కొండ కోటలో భక్తుల కోలాహలం

- గోల్కొండ కోటలో సంబరం
- వెల్లువలా తరలిన భక్తజనం
- వెల్లివిరిసిన ఆధ్యాత్మిక వైభవం

భక్తులతో గోల్కొండ కోట కిటకిటలాడింది. అంతటా ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. శ్రీ జగదాంబిక మహంకాళి అమ్మవారి ఆషాఢ మాసం బోనాల ఉత్సవాలు ఆదివారం కన్నులపండువగా ప్రారంభమయ్యాయి. అధికారులు ఊహించిన దానికంటే భారీ సంఖ్యలో భక్తులు తరలి రావడంతో మధ్యాహ్నం 12 గంటల నుంచి కోట జనసంద్రాన్ని తలపించింది. ఎల్లమ్మ తల్లికి మొక్కులు చెల్లించుకునేందుకు వేలాది మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో తలలపై బోనాలతో మెట్లపై నుంచి కోటపైకి వెళ్లారు. ఒకేసారి భారీ సంఖ్యలో మహిళలు ఇలా వెళ్లిన దృశ్యం ఆకట్టుకుంది. కళాబృందాల నృత్యాలు.. శివసత్తుల పూనకాలు.. పోతరాజుల విన్యాసాలు ఎంతగానో అలరించాయి. నగర సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి పర్యవేక్షణలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా.. అంతకు ముందు లంగర్‌హౌస్ నుంచి నజర్ బోనంతో అమ్మవారిని పల్లకీలో ఊరేగిస్తూ కోటపై కొలువుదీరిన జగదాంబిక ఆలయానికి భక్తులు చేరుకున్నారు. అలాగే.. లోయర్ ట్యాంక్‌బండ్‌లోని శ్రీ కనకాల కట్టమైసమ్మకు కుమ్మరులు బోనాలను సమర్పించారు. – గోల్కొండ/లంగర్‌హౌస్



ఉత్సవాల్లో మాట్లాడుతున్న మంత్రి పొన్నం, చిత్రంలో స్పీకర్ ప్రసాద్ కుమార్, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మేయర్ తదితరులు

అమ్మవారికి బంగారు బోనం

చార్మినార్: భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య ఆధ్వర్యంలో భక్తులు ఆదివారం గోల్కొండ జగదాంబ అమ్మవారికి బంగారు పాత్రలో బోనంతో పాటు పట్టు వస్త్రాలు, ఒడి బియ్యం సమర్పించారు. మీరాలంమండి మహంకాళేశ్వర దేవాలయంలోని అమ్మవారికి బంగారు పాత్రతో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం బాజా భజంత్రీల నడుమ పోతురాజుల నృత్య విన్యాసాలతో గోల్కొండ జగదాంబ అమ్మవారికి బోనం సమర్పించారు. రాజ్యసభ సభ్యుడు మందడి అనిల్‌కుమార్ యాదవ్ బంగారు బోనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.











కళా బృందాల సాంస్కృతిక ప్రదర్శనలు





పోతరాజుల విన్యాసాలు



గోల్కొండ కోటలో బోనాల ఊరేగింపు..



లోయర్ ట్యాంక్‌బండ్‌లో బోనాలతో మహిళలు

పుష్కరమైనా పత్తాలేవు!

- 2012 నుంచి అమలుకు నోచుకోని హెచ్ఓపీలు
- 'గ్రేటర్' పరిధిలో ఎనిమిదింటికి ప్రతిపాదనలు
- పట్టనట్లుగా వ్యవహరిస్తున్న ప్రభుత్వ విభాగాలు

కారణాలు 'కనిపించని' రోడ్డు ప్రమాదాలు

సాక్షి, సిటీబ్యూరో: ఏదైనా ఓ సమస్యకు కారణం తెలిస్తేనే దాన్ని పరిష్కరించడంతో పాటు పునరావృతం కాకుండా చూసే ఆస్కారం ఉంటుంది. ఏటా వందల మందిని కబళిస్తున్న రోడ్డు ప్రమాదాల విషయంలోనూ ఇది వర్తిస్తుంది. 'గ్రేటర్' రోడ్లు రక్తమోడుతూనే ఉన్నాయి. రాకాసి రహదారి ఓఆర్ఆర్‌తో పాటు అంతర్గత మార్గాలూ నిత్యం రుధిర దారులే అవుతున్నాయి. ఏదో ఒక ఇంట విషాదాన్ని నింపుతున్నాయి. వీటికి చెక్ చెప్పేందుకు ప్రమాదాలకు కారణాలను పరిశోధించడం కీలకమని భావించిన యంత్రాంగాలు 2012లో బ్యూరో ఆఫ్ రోడ్ సేఫ్టీ అండ్ ట్రాఫిక్ ప్లానింగ్‌కు (బీఆర్ఎస్ అండ్ టీపీ) అంకురార్పణ చేశాయి. ఇందులో భాగంగా రోడ్డు ప్రమాదాలపై పరిశోధనకు మూడు కమిషనరేట్ల పరిధిలో ఎనిమిది ఔట్ పోస్టులు ఏర్పాటు చేయాలని భావించారు. పుష్కరకాలం అవుతున్నా ఈ ప్రతిపాదన



ఇప్పటికీ కాగితాలకే పరిమితమైంది.

ఇప్పుడంతా నామ్‌కే వాస్తేనే..

నగరం లేదా శివార్లలో, ఓఆర్ఆర్ పైనా ఓ ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంటే దానిపై కేసు నమోదు చేసుకుంటున్న స్థానిక పోలీసులు రొటీన్ పద్ధతిలో దర్యాప్తు చేపట్టి ఎవరి పొరపాటు వల్ల ప్రమాదం జరిగిందనేది తేల్చేస్తున్నారు. ప్రమాదంలో ఇన్‌వాల్వ్ అయి ఉన్న వాటిలో ఏది పెద్ద వాహనమైతే వారి నిర్లక్ష్యం కారణంగానే ఉదంతం చోటు చేసుకుందంటూ రికార్డుల్లోకి ఎక్కించడం పరిపాటిగా మారింది. ఏ స్థాయిలోనూ కూడా ప్రమాద కారణాలు విశ్లేషించే, నిరోధాలను తెలిపే సమగ్ర అధ్యయనం జరగట్లేదు. కనీసం జాతీయ రహదారులపై చోటు చేసుకున్న ప్రమాదాలపైనా సమగ్ర అధ్యయనం చేయాలని 2012లో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రమాదానికి గల కారణాలు, రోడ్డు మౌలిక స్థితిగతులు, చేపట్టాల్సిన మార్పు చేర్పులను అధ్యయనం చేసేందుకే బీఆర్ఎస్ అండ్ టీపీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది.

సిటీలో ప్రమాదాలు, మృతులు ఇలా...

ఏడాది	ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
2021	2,575	323	2,252
2022	2,106	275	1,831
2023	2,548	335	2,090

హత్యల కన్నా ప్రమాదకరంగా..

ప్రతి ఏడాదీ జంట నగరాల్లో చోటు చేసుకుంటున్న హత్యల్లో కన్నుమూస్తున్న వారి కన్నా.. రోడ్డు ప్రమాదాల బారినపడి అసువులు బాస్తున్న వారి సంఖ్య రెట్టింపు వరకు ఉంటోంది. గత ఏడాది నగరంలో హత్య కేసుల్లో మృతుల సంఖ్య 65గా ఉంటే.. రోడ్డు ప్రమాదాల్లో మరణించిన వారి సంఖ్య 335గా ఉంది. రాష్ట్రంలో నమోదవుతున్న ప్రమాదాల్లో సగానికి పైగా హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండల్లోనే ఉంటున్నాయి. ఈ ప్రమాదాల్లో 'గ్రేటర్' మీదుగా వెళ్తున్న జాతీయ రహదారులపై జరుగుతున్నవే ఎక్కువ. వీటికి చెక్ చెప్పేందుకు ఉద్దేశించినదే బీఆర్ఎస్ అండ్ టీపీ. డీజీపీ కార్యాలయం కేంద్రంగా అదనపు డీజీపీ నేతృత్వంలో ఏర్పాటు కావాల్సి ఉంది. ఈ విభాగం రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేయనున్న హైవే పెట్రోలింగ్ ఔట్ పోస్టు (హెచ్ఓపీ)ల్లో ఎనిమిది రాజధానిలోని మూడు కమిషనరేట్లలోనే (అప్పట్లో రెండే కమిషనరేట్లు) పెట్టాలనుకున్నారు.

కాగితాలకే పరిమితమైన లక్ష్యాలు..

ఈ విభాగాన్ని ప్రధానంగా మూడు లక్ష్యాల కోసం పని చేయిస్తున్నట్లు ప్రభుత్వం ఘనంగా ప్రకటించింది. వీటిని 'త్రీ ఆర్స్'గానూ నిర్దేశించారు. అంటే.. రెడ్యూస్ ది ఫాటల్ యాక్సిడెంట్స్ (ప్రాణాంతకమైన ప్రమాదాల తగ్గింపు), రెడ్యూస్ క్యాజువాలిటీస్ ఇన్ రోడ్ యాక్సిడెంట్స్ (రోడ్డు ప్రమాదాల్లో మృతుల సంఖ్య తగ్గించడం), రెడ్యూస్ ట్రావెల్ టైమ్ ఆన్ రోడ్ ఇన్ అర్బన్ ఏరియాస్ (నగర/పట్టణ ప్రాంతాల్లో రోడ్డుపై ప్రయాణ సమయం తగ్గించడం). ఈ మూడూ కూడా మూడు కమిషనరేట్లకు అత్యంత కీలకమైనవే. వీటిని సాధించడం కోసం బీఆర్ఎస్ అండ్ టీపీ ఇంజినీరింగ్, ఎడ్యుకేషన్, ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎమర్జెన్సీ సర్వీసెస్, ఎన్‌క్యాచ్‌మెంట్ అండ్ లీగల్ సర్వీసెస్, ఎకనమిక్ రిలీఫ్ అనే 'సిక్స్ ఈస్'ను నిర్వహిస్తుందని అప్పట్లోనే ప్రకటించారు. ఈ లక్ష్యాలన్నీ కాగితాలకు, ఫైళ్లకు మాత్రమే పరిమితమయ్యాయి.

ప్రభుత్వానికీ సలహాలు ఇప్పించాలని..

మౌలిక వసతుల కల్పన, అభివృద్ధిలో కీలకమైన ఇంజినీరింగ్‌లో భాగంగా బీఆర్ఎస్ అండ్ టీపీ ద్వారా రోడ్ సేఫ్టీ పాలసీలను సమగ్రంగా, లోతుగా అధ్యయనం చేయించాలని భావించారు. వీటిలో మార్పుచేర్పులు అవసరమైనట్లు గుర్తించడంతో పాటు ఆ మేరకు సాక్షాత్తూ ప్రభుత్వానికే దీంతో సలహాలు ఇప్పిచాలనుకున్నారు. రోడ్ల స్థితిగతులు, ప్రమాదాలు జరగడానికి కారణాలు, నివారణ మార్గాలు తదితర కీలక అంశాలు వీటిలో ఉండాల్సి ఉంది. దీన్ని సాధించడంలో భాగంగా ఇదే ఆశయం కోసం పని చేస్తున్న రోడ్ సేఫ్టీ కౌన్సిల్స్, రోడ్ సేఫ్టీ అథారిటీస్, ఆర్ అండ్ బీ, ఆర్టీఏ, కేంద్ర ప్రభుత్వ అధీనంలోని మినిస్ట్రీ ఆఫ్ సర్ఫేస్ ట్రాన్స్‌పోర్ట్, మినిస్ట్రీ ఆఫ్ అర్బన్ డెవలప్‌మెంట్, మినిస్ట్రీ ఆఫ్ హ్యూమన్ రెసోర్సెస్ డెవలప్‌మెంట్ తదితర విభాగాలతో సమన్వయంతో పని చేయించాలంటూ ఉన్నతాశయాన్ని ఏర్పరుచుకున్నారు. ఇప్పటికీ ఈ ప్రతిపాదనలకు మోక్షం లభించలేదు.

రాజ్‌తరుణ్‌పై ఆధారాలతో మరో ఫిర్యాదు చేస్తా

మీడియాతో లావణ్య




మణికొండ: సినీ హీరో రాజ్‌తరుణ్ తనతో కలిసి లివింగ్ రిలేషన్‌లో ఉండటం, గుడిలో పెళ్లి చేసుకోవటం, నన్ను ఫోన్‌లో చంపేస్తానని బెదిరించిన రికార్డులు అన్నీ ఉన్నాయని, వాటన్నింటినీ జత చేస్తూ న్యాయవాదితో కలిసి త్వరలోనే నార్సింగి పోలీసులకు మరో ఫిర్యాదు చేస్తానని అతని మాజీ ప్రియురాలు లావణ్య అన్నారు. ఆదివారం ఆమె నగరంలో మీడియాతో మాట్లాడుతూ హీరోయిన్ మాల్వీ మల్హోత్రతో పరిచయం అయిన తరువాత తనే రాజ్‌తరుణ్ పూర్తిగా మారిపోయాడన్నారు. తనను వదలించుకునేందుకు కట్టు కథలు అల్లుతున్నారన్నారు. గతంలో డ్రగ్స్ కేసుకు తనకు ఎలాంటి సంబంధం లేకపోయినా బలవంతంగా అందులో ఇరికించారని, త్వరలోనే తాను నిర్దోషిగా బయటకు వస్తానన్నారు. నార్సింగి పోలీసులు ఆధారాలు ఇవ్వాలని నోటీసు ఇచ్చారని, గతంలో తను ఇచ్చిన ఫిర్యాదు సరిగా లేదనే విషయం తెలుసుకుని ప్రస్తుతం న్యాయవాదితో తయారు చేయించి పూర్తి ఆధారాలతో మరో ఫిర్యాదు ఇస్తానని ఆమె పేర్కొన్నారు. ఈ కేసు సంగతి ఎలా ఉన్నా తనకు వారి నుంచి ప్రాణహాని ఉందని, పోలీసులు తనకు రక్షణ కల్పించాలని ఆమె కోరింది.

మున్సిపల్ కమిషనర్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు

మణికొండ: మున్సిపల్ చట్టం ప్రకారం కౌన్సిల్ సమావేశాలను నిర్వహించటం, వాటి మినిట్స్‌ను వెంటనే ఉన్నతాధికారులకు పంపకపోవటం, మున్సిపల్ చట్టం సెక్షన్ 59(5)కు విరుద్ధమని 7వ వార్డు కౌన్సిలర్ బి. పద్మారావు జిల్లా కలెక్టర్‌కు శనివారం ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు పత్రంలో కౌన్సిల్ సమావేశం ఎజెండాను కమిషనర్ సంతకంతో సభ్యులకు పంపాల్సి ఉండగా అందుకు భిన్నంగా చైర్మెన్ సంతకంతో పంపుతున్నారన్నారు. కమిషనర్ నిర్లక్ష్యంగా విదులు నిర్వహిస్తున్నాడని, కౌన్సిల్ తీర్మానం లేకుండానే తైబజార్ వేలం నిర్వహించారని వివరించినట్లు కౌన్సిలర్ తెలిపారు. గత నెల 20వ తేదీన జరిగిన మున్సిపల్ సమావేశం మినిట్స్ ఇప్పటి వరకు ఉన్నతాధికారులకు పంపకపోవటం, అందులో కౌన్సిలర్ల నుంచి పూర్తి స్థాయిలో ప్రతిపాదనలను తీసుకోకుండా సమావేశం నిర్వహించటం, వాటిని కప్పి పుచ్చుకునేందుకు ఈనెల 5వ తేదీన మరో అత్యవసర సమావేశం నిర్వహించటం అతని బాధ్యతారాహిత్యమన్నారు. ప్రజల చేత ఎన్నికయిన కొందరు ప్రజాప్రతినిధులతో సరైన విధంగా వ్యవహరించటంలేదన్నారు. ఆవిషయంలో అతనిపై చర్యలు తీసుకుని మున్సిపల్ చట్టం నిబంధనల ప్రకారం కౌన్సిల్ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరామన్నారు.

పబ్‌లో డ్రగ్స్ కలకలం

ద కేవ్ పబ్‌పై పోలీసుల దాడి.. 24 మందికి డ్రగ్ పాజిటివ్



ఖాజాగూడలోని ద కేవ్ పబ్



వివరాలను వెల్లడిస్తున్న మాదాపూర్ డీసీపీ వినీత్

గచ్చిబౌలి: ఎలక్ట్రికల్ మ్యూజిక్ అంటేనే హై హోల్టేజీ సౌండ్ ఉంటుంది. ఆ మ్యూజిక్‌ను వినాలంటే మామూలుగానైతే కర్ణబేరి బద్దలైనట్లు ఉంటుంది. కాని డ్రగ్స్ తీసుకున్న వారు ఆ మ్యూజిక్‌ను ఎంజాయ్ చేస్తుంటారు. ఇదే తరహాలో సైబరాబాద్ కమిషనరేట్‌కు కూతవేటు దూరంలో ఖాజాగూడలోని ద కేవ్ పబ్‌లో 'ఫారెస్ట్ సైకెడలిక్ పార్టీ'ని నిర్వహించారు. డ్రగ్స్ సేవించి పార్టీలో పాల్గొన్నారని సమాచారం అందడంతో సైబరాబాద్ పోలీసులు, తెలంగాణ నార్కొటిక్ బ్యూరో శనివారం రాత్రి ఖాజాగూడలోని ఎస్‌వీ ఆర్కేడ్‌లోని నాల్గవ అంతస్తులో ఉన్న 'ద కేవ్ పబ్'పై మెరుపు దాడి చేసింది. పార్టీలో పాల్గొన్న వారందరికీ మెడికల్ టెస్టులు నిర్వహించారు. 24 మందికి పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. ఆదివారం గచ్చిబౌలిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాదాపూర్ డీసీపీ డాక్టర్ వినీత్ కేసు వివరాలను వెల్లడించారు. రాత్రి 10.30 గంటల సమయంలో నార్కొటిక్ బ్యూరో, ఎస్ఓటీ, రాయదుర్గం పోలీసులు సంయుక్తంగా కేవ్ పబ్‌పై దాడి చేశారని తెలిపారు. పార్టీలో పాల్గొన్న, హోటల్‌లో పని చేస్తున్న 55 మందిని అదుపులోకి తీసుకొని టెస్ట్ చేయగా 24 మందికి పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యిందన్నారు. పలు మల్టీ నేషనల్ కంపెనీలలో పని చేసే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, వ్యాపారవేత్తలు, విద్యార్థులు ఉన్నారని చెప్పారు. పాజిటివ్ వచ్చిన వారితో పాటు కేవ్ పబ్ మేనేజర్ బెంగళూర్‌కు చెందిన సందీప్ శర్మ(44)ను అరెస్ట్ చేశామన్నారు. పబ్ యజమానులు రాజేష్, అభినవ్, సాయి కృష్ణ, సన్నీలు పరారీలో ఉన్నారని వివరించారు. సైకెడలిక్ పార్టీ ఆర్గనైజర్, డీజే ఆపరేటర్ న్యూ మల్లెపల్లికి చెందిన అబ్దుల్ అయూబ్(24) ఇన్‌స్టాగామ్‌లో సైకెడలిక్ పార్టీ ఉన్నట్లు ప్రచారం చేశారన్నారు. దీంతో వివిధ ప్రాంతాల నుంచి వేర్వేరు బృందాలు వేర్వేరు చోట్ల గంజాయి, కొకైన్ , ఎండీఎంఏ సేవించి వచ్చినట్లు గుర్తించినట్లు తెలిపారు. 17 మంది గాంజా, ఇద్దరు కొకైన్, గాంజా, నలుగురు ఎండీఎంఏ, గాంజా, ఒకరు ఎండీఎంఏ సేవించినట్లు డీసీపీ తెలిపారు. గాంజా, ఎండీఎంఏ, కొకైన్ ఎక్కడ సేవించారు, ఎక్కడి నుంచి కొనుగోలు చేశారనే అంశాలపై సమగ్ర విచారణ చేయాల్సి ఉందన్నారు. నార్కొటిక్ బ్యూరో డీఎస్పీ సీహెచ్.శ్రీధర్ , టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ టి.శ్రీనివాస్, ఏడీసీపీ జయరాం, ఏసీపీ శ్రీకాంత్, ఇన్‌స్పెక్టర్లు దాలినాయుడు, సంజయ్, సీహెచ్.వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పబ్‌లపై చర్యలు తప్పవు

డ్రగ్ సేవించే వారి కోసం పార్టీలు నిర్వహిస్తే పబ్‌లపై కఠిన చర్యలు తీసుకుంటామని మాదాపూర్ డీసీపీ వినీత్ హెచ్చరించారు. ర్యాండమ్‌గా పబ్‌లలో తనిఖీలు చేస్తామని అక్కడికక్కడే యూరిన్ కిట్ల పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. పాజిటివ్‌గా తేలితే సంబంధిత వ్యక్తులపై ఎన్‌డీపీఎస్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేస్తామని తెలిపారు. మత్తు పదార్థాలు అమ్ముతున్నట్లు, వాడుతున్నట్లు సమాచారం 8712671111 ఫోన్ నెంబర్‌కు తెలియజేయాలని సూచించారు. డ్రగ్ రహిత సమాజం ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు.

24 మందికి పాజిటివ్

ద కేవ్ పబ్ డీజే ఆపరేటర్, ఈవెంట్ ఆర్గనైజర్ మల్లెపల్లికి చెందిన అబ్దుల్లా అయూబ్, మేనేజర్ శేఖర్ కుమార్(52), పార్టీకి వచ్చిన కస్టమర్లు మహ్మద్ అడ్నన్ బారీ(23), మహ్మద్ అలీ(29), సాయి కిరణ్ బేగరీ(31), గిరిధర్ మనీష్(39), చింతమ్ పూజిత్(24), మహేష్ చంద్ర(24), మహ్మద్ యాసిన్(22), మహ్మద్ రఫీ నిజామీ(22), సాయి ప్రణీత్(23), కంది రేగుల కిరణ్(25), నేరడుమల్లీ సందీప్(24), పోతురి వంశీ కృష్ణ(24), మహ్మద్ అర్బజ్(24), మిరాజ్ అసద్ అహ్మద్(25), మహ్మద్ సయ్యద్ రజా(26), పూలపల్లి శివ(22), ఎం.డి.నవాజుద్దీన్(29), అయలసోమయాజుల సాయి గౌరంగ్(26), ఎం.హరికృష్ణ(26), కె.మధుసూదన్(24), అనీస్ ముష్రాఫ్(39), డి.రోహిత్ వర్మ(26)లకు పాజిటివ్‌గా తేలింది. వారందరికి తదుపరి వైద్యపరీక్షలు నిర్వహించనున్నారు.

సాహిత్యం సమాజాన్ని ఏకం చేయాలి



కొలకలూరి ఇనాక్‌ను సత్కరిస్తున్న గవర్నర్ బండారు దత్తాత్రేయ

ముషీరాబాద్: సాహిత్యం సమాజాన్ని కలిపి ఐక్య పరిచే విధంగా ఉండాలే కానీ కులం, మతం, ప్రాంతం పేరిట విడగొట్ట రాదని హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. ఇనాక్ రచనలు సమాజ నిర్మాణ సంస్కృణాత్మక సాహిత్యం అని ఆయన వివరించారు. త్యాగరాయ గాన సభ ప్రధాన వేదికపై జరుగుతున్న ప్రముఖ సాహితీవేత్త ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహితీ సమాలోచన సప్తహం ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ఇనాక్‌ను సత్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఇనాక్ పరులు శ్రేయస్సు కోసం సాహిత్య సేద్యం చేశారని కొనియాడారు. గాన సభ అధ్యక్షులు కళా జనార్థన మూర్తి అధ్యక్షత వహించిన సభలో ఉపాధ్యక్షులు జంగం రావుగౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంయుక్త విష్య బృంద గాన గోష్టి ఆకట్టుకుంది.

ఆగిఉన్న లారీని ఢీకొన్న డీసీఎం

డ్రైవర్ మృతి



ఘటనా స్థలంలో డీసీఎం డ్రైవర్ మృతదేహం

దుండిగల్: ఆగి ఉన్న లారీని వెనుక నుండి వచ్చిన డీసీఎం ఢీకొనడంతో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. దుండిగల్ ఔటర్ రింగ్ రోడ్డుపై శంభీపూర్ సమీపంలో ఆదివారం ఉదయం లిక్కర్ లోడుతో ఉన్న లారీ ఆగి ఉంది. ఆ సమయంలో పటాన్ చెరువు నుండి దుండిగల్ వైపు వస్తున్న డీసీఎం ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. ఈ ఘటనలో డీసీఎం ముందు భాగం పూర్తిగా ధ్వంసం కావడంతో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న దుండిగల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వాహనాలను పక్కకు తప్పించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. కాగా డీసీఎం డ్రైవర్ వివరాలు తెలియరాలేదు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌ను ఢీకొన్న టిప్పర్

మహిళ మృతి




రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నాగమణి

దుండిగల్: వెనుక నుండి వేగంగా వచ్చిన టిప్పర్ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో టిప్పర్ టైర్ల కింద పడి ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. ఐడీఏ బొల్లారం ప్రాంతానికి చెందిన భూమయ్య, నాగమణి(38)లు భార్యాభర్తలు. శనివారం సాయంత్రం ఇద్దరూ యాక్టీవాపై నర్సాపూర్ నుండి గండిమైసమ్మ వైపు వస్తున్నారు. ఖాజీ పల్లి చౌరస్తా దాటిన తరువాత టీటైమ్ హోటల్ సమీపంలో వెనుక నుండి వేగంగా వచ్చిన టిప్పర్ భూమయ్య, నాగమణిలు ప్రయాణిస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రోడ్డుపై పడిన నాగమణి మీదుగా టిప్పర్ టైర్లు వెళ్లడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందగా, భూమయ్య గాయాలతో బయటపడ్డాడు. మృతురాలి భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రాణం తీసిన అతివేగం


- విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన ద్విచక్ర వాహనం
- బీటెక్ విద్యార్థి దుర్మరణం, మరొకరికి గాయాలు



వంశీకృష్ణ (ఫైల్)

మీర్‌పేట: వేగంగా వెళ్తున్న ద్విచక్ర వాహనం అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో బీటెక్ విద్యార్థి అక్కడికక్కడే మృతి చెందగా, మరో విద్యార్థి గాయపడ్డాడు. ఈ సంఘటన రంగారెడ్డి జిల్లా మీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు, ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపిన మేరకు.. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండల కేంద్రానికి చెందిన బాసాని రవి కుమారుడు వంశీకృష్ణ (20) మీర్‌పేటలోని టీకేఆర్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతూ తిరుమలహిల్స్ కాలనీలో స్నేహితులతో కలిసి ఉంటున్నాడు. శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత 2.30 గంటలకు దిల్‌సుఖ్‌నగర్‌లో ఉండే స్నేహితుడు బాలాజీతో కలిసి ద్విచక్ర వాహనంపై మీర్‌పేట నుంచి మందమల్లమ్మ వైపు వెళ్తున్నాడు. జిల్లెలగూడ పాత గ్రామ పంచాయితీ కార్యాలయం వద్దకు రాగానే బైక్ వేగాన్ని కంట్రోల్ చేయలేక రోడ్డుకు అవతలి వైపు ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టాడు. దీంతో వంశీకృష్ణకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం వంశీకృష్ణ మృతదేహాన్ని తరలించి, బైకుపై వెనుక కూర్చున్న బాలాజీకి గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

మహిళపై ఆటో డ్రైవర్ లైంగిక దాడికి యత్నం



నిందితుడు బంటి

కేపీహెచ్‌బీకాలనీ: మానసిక పరిస్థితి సరిగాలేని ఓ మహిళపై ఆటో డ్రైవర్ లైంగిక దాడికి యత్నించాడు. ఈ సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. కేపీహెచ్‌బీ కాలనీ టెంపుల్ బస్‌స్టాప్‌లో మానసిక పరిస్థితి సరిగ్గా లేని నర్సాపూర్ గ్రామానికి చెందిన మహిళ పుష్పలత (30) తన ఏడేళ్ల కుమారుడితో నివాసముంటోంది. ఆదివారం ఉదయం 5.30 గంటల ప్రాంతంలో శంషీగూడ, మహంకాళి నగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ బంటి (30) ఆమె ఒంటరిగా ఉండటం చూసి లైంగికదాడికి యత్నించాడు. స్థానికులు గమనించి అడ్డుకొని పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు బంటిని అదుపులోకి తీసుకున్నారు.పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విమానాశ్రయంలో నగలు మాయం

శంషాబాద్: శంషాబాద్ విమానాశ్రయంలో నగలు మాయమయ్యాయని ఓ మహిళ ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈసీఐఎల్‌కు చెందిన ఓ మహిళ భర్తతో కలిసి లండన్ నుంచి ఆదివారం ఉదయం శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకుంది. బయటికి వచ్చిన సమయంలో బ్యాగులో ఉన్న ఏడు తులాల నగలు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది.

గంజాయి తరలిస్తున్న యువకుడి అరెస్ట్



నిందితుడు శివ

మేడిపల్లి: గంజాయి తరలిస్తున్న ఓ యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మేడిపల్లి సీఐ గోవింద రెడ్డి తెలిపిన మేరకు.. మేడిపల్లి పోలీసులు పీర్జాదిగూడ సాయినగర్ కాలనీలో వాహన తనిఖీలు చేస్తుండగా ఓ యువకుడు ద్విచక్ర వాహనంపై అనుమానాస్పదంగా కనిపించడాడు. అతనిని పరిశీలించగా బ్యాగులో 150 గ్రాముల గంజాయిని కనుగొన్నారు. నిందితుడు పీర్జాదిగూడకు చెందిన సారగండ్ల శివ(20)గా గుర్తించారు. పోలీసులు అదుపులోకి తీసుకుని వాహనాన్ని సీజ్ చేశారు.

ఉత్తరాఖండ్‌లోనే అంత్యక్రియలు పూర్తి



సత్యనారాయణ (ఫైల్)

బన్సీలాల్‌పేట్: ధార్మిక యాత్రకు ఉత్తరాఖండ్‌కు వెళ్లిన నగర వాసుల్లో ఇద్దరు కొండచరియలు విరిగి పడి మృతి చెందారు. నగరానికి చెందిన దారా సత్యనారాయణ(50), నిర్మల్ సాహి(36) బద్రీనాద్ ఆలయాన్ని దర్శించుకుని ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తుండగా భారీగా వర్షాల కారణంగా కొండచరియలు విరిగిపడిన సంఘటనలో వారిద్దరూ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. సత్యనారాయణ, నిర్మల్ సాహీ శరీరాలు పూర్తిగా నుజ్జు నుజ్జు కావడంతో వారికి అక్కడే అంత్యక్రియలు నిర్వహించారు. ఈ మేరకు కుటుంబీలకు సమాచారం అందడంతో సత్యనారాయణ మృతదేహాన్ని తీసుకువచ్చేందుకు ఆదివారం హరిద్వార్‌కు చేరుకున్నారు. కానీ తీసుకురావడానికి వీలులేకపోడంతో అక్కడి అంత్యక్రియలు పూర్తి చేశారు.

సందడి చేసిన అనుపమ పరమేశ్వరన్

ఖాజాగూడలో సౌత్ ఇండియా షాపింగ్ మాల్ ప్రారంభించిన నటి



సౌత్ ఇండియా షాపింగ్ మాల్ షోరూమ్‌ను ప్రారంభిస్తున్న అనుపమ పరమేశ్వరన్

హఫీజ్‌పేట్ : ఖాజాగూడలో సౌత్ ఇండియా షాపింగ్ మాల్ 34వ షోరూమ్‌లో ఆదివారం ప్రముఖ టాలివుడ్ తార అనుపమ పరమేశ్వరన్ సందడి చేశారు. సౌత్ ఇండియా షాపింగ్ మాల్ డైరెక్టర్లు సురేష్, అభినయ్, రకేష్, కేశవ్‌లతో కలిసి షోరూమ్‌ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆషాఢమాసంకిలో సేల్‌ను ప్రారంభించారు.అనంతరం మాట్లాడుతూ.. సౌత్ ఇండియా షాపింగ్ మాల్‌తో తనకు ప్రత్యేక అనుభంధం ఉందన్నారు. మాల్‌లో వివిధ రకాల చీరలు, అన్ని రకాల వస్త్రాలపై 66 శాతం వరకు డిస్కౌంట్ అందిస్తున్నారన్నారు.సౌత్ ఇండియా షాపింగ్ మాల్ డైరెక్టర్లు మాట్లాడుతూ మహిళల అభిరుచులకు తగిన సరి కొత్త ఫ్యాషన్లను, డిజైన్లను తమ షోరూమ్ అందుబాటులో ఉన్నాయన్నారు.

గోదావరిలో యువకుడి గల్లంతు



హరీష్ (ఫైల్)

భద్రాచలం అర్బన్: తన స్నేహితుడి పెళ్లి కార్డును భద్రాద్రి రామయ్య వద్ద ఉంచి పూజలు చేయించేందుకు వచ్చి గోదావరి నదిలో ఓ యువకుడు గల్లంతయ్యాడు. విజయనగరం జిల్లాకు చెందిన గోవింద్, మోహన్, గణేష్, కృష్ణ, హరీష్‌లు స్నేహితులు. వీరు హైదరాబాద్‌లో వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. హరీష్ సివిల్ కాంట్రాక్టర్ వద్ద అకౌంటెంట్‌గా పనిచేస్తుండగా గోవింద్ అనే వ్యక్తి పెళ్లి కుదిరింది. పెళ్లి పత్రికను భద్రాచలంలోని శ్రీసీతారామచంద్ర స్వామి వద్ద సమర్పించేందుకు హైదరాబాద్ నుంచి ఆదివారం ఉదయం భద్రాచలానికి చేరుకున్నారు. గోదావరి నదిలో స్నానం చేసేందుకు వెళ్లారు. గోదావరిలో వినాయకుడి విగ్రహాలను నిమజ్జనం చేసే ప్రదేశానికి వెళ్లారు. అటు వైపు వెళ్లొద్దంటూ స్థానికులు చెప్పినా వినకుండా వెళ్లారు. ముందుగా గోవింద్, గణేష్, కృష్ణ, మోహన్ స్నానం చేసి ఒడ్డుకు చేరుకున్నారు. అనంతరం హరీష్ తనకు ఈత వచ్చంటూ నీటిలో దిగాడు. కాసేపటికే ప్రమాదవశాత్తు గోదావరి నీటిలో కొట్టుకుని పోతుండగా గమనించిన స్నేహితులు వెంటనే స్థానికులు, గజ ఈతగాళ్లు, పోలీసులకు సమాచారం అందించారు. అయితే ఇటీవల కురిసిన వర్షాలకు గోదావరి నీటి ప్రవాహం కొద్దిగా పెరగడంతో హరీష్ కనిపించకుండా పోయాడు. దాదాపు 4.30 గంటల పాటు గాలించినా హరీష ఆచూకీ లభించలేదు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య



రవికుమార్ (ఫైల్)

ఉప్పల్: ఆర్థిక ఇబ్బందులు తాళ లేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. రామంతాపూర్ గృహకల్ప ప్రాంతానికి చెందిన జోషి రవికుమార్(40) కియా మోటర్స్‌లో పని చేస్తున్నాడు. శనివారం విధులు ముగించుకుని ఇంటికి వచ్చి అకలిగా ఉంది వంట చేయాలని బార్య నిషా జోషికి చెప్పాడు. దీంతో భార్య వంట చేయడంలో నిమగ్నమయింది. రవికుమార్ బెడ్ రూంలో కి వెళ్లి ఆత్మహత్య చేసుకున్నాడు. అనంతరం భార్య తలుపు కొట్టినా ఫలితం లేకపోవడంతో పక్కంటికి వెళ్లి కిటికిలోంచి చూడగా ఫ్యాన్‌కు ఉరి వేసుకుని వేలాడుతున్నాడు. తలుపు పగుల గొట్టి వెళ్లి రవికుమార్ దించి ప్రైవేట్ అసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధృవీకరించారు. దీంతో బార్య నిషా జోషి ఉప్పల్ పోలీస్‌స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. ఆర్థిక ఇబ్బందులే ఆత్మహత్యకు కారణం కావచ్చని దర్యాప్తు చేయాలని పోలీసులతో పేర్కొంది.

చైతన్య సురేష్‌కు గౌరవ డాక్టరేట్



గౌరవ డాక్టరేట్ అందుకున్న చైతన్య సురేష్

శ్రీనగర్‌కాలనీ: నగరానికి చెందిన చీఫ్ చెస్ కోచ్ ఉద్దిస చైతన్య సురేష్ గౌరవ డాక్టరేట్‌ను అందుకున్నారు. మలేషియాలోని ది థేమ్స్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ ఫ్రాన్స్ ఆధ్వర్యంలో ఇండో గ్లోబల్ సమ్మిట్ అవార్డ్స్‌లో భాగంగా ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో చైల్డ్ సైకాలజీ ఇన్ రెఫరెన్స్ ఆఫ్ చెస్‌లో గౌరవ డాక్టరేట్‌ను యూనివర్సిటీ ప్రతినిధుల నుంచి అందుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ చైతన్య సురేష్ మాట్లాడుతూ... నగరంలోని ఏకాగ్ర చెస్ అకాడమీ చీఫ్‌కోచ్‌గా వ్యవహరిస్తున్నానని, ఈ అవార్డు నాలో మరింత బాధ్యతను పెంచిందని, చెస్‌లో భారత్‌ని అగ్రగామిగా నిలపడానికి నావంతు కృషి చేస్తానని తెలియజేశారు. చైతన్యకు గౌరవ డాక్టరేట్ రావడం పట్ల ఏకాగ్ర చెస్ అకాడమీ సీఈఓ సందీప్‌నాయుడు ఆనందం వ్యక్తం చేశారు.

నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ప్రారంభం



చీరలను తిలకిస్తున్న నటి భార్గవి

శ్రీనగర్‌కాలనీ: శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో జగ్‌దీశ్వర్ హస్తకళా ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన నేషనల్ సిల్క్ ఎక్స్‌పో–2024ను ఎగ్జిబిషన్‌ను నటి, యాంకర్ భార్గవి ప్రారంభించారు. ప్రతిఒక్కరూ చేనేతకారులను ప్రోత్సహించాలని, నగర ఫ్యాషన్ ప్రియులకు ఈ ప్రదర్శన మహిళలను అమితంగా ఆకట్టుకుంటుందన్నారు. ఈ వస్త్ర ప్రదర్శనలో దేశంలోని పలు రాష్ట్రాల చేనేతకారుల ఉత్పత్తులైన సిల్క్, కాటన్, డిజైనరీ చీరలతో పాటు పలు ఫ్యాన్సీ వస్తువులను సుమారు 70 స్టాల్స్‌లో ప్రదర్శిస్తున్నారు. చేనేత కళాకారుల ఉత్పత్తులు నేరుగా వినియోగదారులకు చేరాలనే సదుద్దేశంతో ఈ ప్రదర్శనను ఏర్పాటు చేశామని నిర్వాహకుడు జయేష్‌గుప్తా తెలిపారు. వస్త్ర ప్రదర్శన ఈ నెల 14 వరకు అందుబాటులో ఉంటుందన్నారు.

వేడుకగా సుదర్శన హోమం



హోమంలో పాల్గొన్న విజయారెడ్డి తదితరులు

ఖైరతాబాద్: ఖైరతాబాద్ మహాగణపతి మండపం ప్రాంగణంలో ఆదివారం సుదర్శన హోమం నిర్వహించారు. వేద పండితులు, పూజారి రంగరాజాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన హోమంలో కార్పొరేటర్ విజయారెడ్డి, వీణామాధురి, రాజ్‌కుమార్, సందీప్‌రాజ్, స్థానికులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. లోక కల్యాణార్థం, వినాయక నిర్మాణ పనులు నిర్విఘ్నంగా కొనసాగాలని హోమం చేశామని నిర్వాహకులు తెలిపారు.

ఏకలవ్య కార్పొరేషన్‌కు రూ. 500 కోట్లు కేటాయించాలి

హిమాయత్‌నగర్: తెలంగాణ వ్యాప్తంగా 10 లక్షల జనాభా ఉండి విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలతో పాటు ఆర్థిక, రాజకీయంగా వెనుకబాటులో ఉన్న ఎరుకల సామాజికవర్గ ప్రజల అభివృద్ధి కోసం రానున్న బడ్జెట్‌లో రూ. 500 కోట్లు కేటాయించాలని తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని కోరింది. ఆదివారం బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోకిని రాజు మాట్లాడుతూ... ఎరుకల జాతి అభివృద్ధి కోసం ప్రత్యేకంగా ఏకలవ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసిన సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల ముందు ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ మహాసభలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం ఏకలవ్య కార్పొరేషన్‌కి రాబోయే బడ్జెట్ సమావేశంలో రూ. 500 కోట్ల బడ్జెట్ ప్రకటించాలని కోరారు. ఏకలవ్య కార్పొరేషన్‌కి పాలకవర్గాన్ని ఏర్పాటు చేసి కార్పొరేషన్ చైర్మన్‌గా అనుభవం ఉన్న విద్యావంతులకు, మేధావులకు అవకాశం కల్పించాలన్నారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కోనేటి నరసింహ, ప్రధాన కార్యదర్శి కుతాడి రవికుమార్, కోశాధికారి వనం రమేష్, శ్రీరామ్ సదానందం, ఆనంద్, నరసింహ, సాయి మాదిగాని, ఎల్లయ్య, మదన్, కుతాడి సాయిరాం, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

శుభ్రంగా దేవాలయ ప్రాంగణం



దేవాలయ ప్రాంగణంలో రాళ్లు, మట్టిని తొలగిస్తున్న దృశ్యం

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్ బాలిరెడ్డినగర్ బస్తీలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కట్టమైసమ్మ దేవాలయంలోకి వరద చేరి రాళ్లతో పూడికపోయింది. దీంతో పూడిక తీయాల్సిందిగా జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ జీహెచ్‌ఎంసీ అధికారులకు సూచించడంతో ఆదివారం జీహెచ్‌ఎంసీ సిబ్బంది పూడిక తొలగింపు పనులు చేపట్టారు. జేసీబీ సాయంతో పేరుకుపోయిన మట్టి, రాళ్లను తొలగించి చదును చేశారు. రానున్న బోనాల దృష్ట్యా దేవాలయ ప్రాంగణంతో పాటు పరిసరాలను పరిశుభ్రం చేయించిన కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్‌కు స్థానికులు ధన్యవాదాలు తెలిపారు.

కాచిగూడ ఇన్‌స్పెక్టర్‌గా చంద్రకుమార్

కాచిగూడ: కాచిగూడ ఇన్‌స్పెక్టర్‌గా కె.చంద్రకుమార్ ఆదివారం పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. 1996వ బ్యాచ్‌కు చెందిన చంద్రకుమార్ ఇప్పటి వరకు సౌత్‌జోన్ ఎస్‌బీలో ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్ర కుమార్ మాట్లాడుతూ... శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజల సహకారం అవసరమన్నారు. చట్ట పరిధిలో ఏవైనా సమస్యలుంటే ప్రజలు తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. వచ్చే బోనాల వేడుకలను ప్రజలు శాంతియుత వాతావరణంలో నిర్వహించేలా కృషి చేయనున్నట్లు తెలిపారు.

ఆయాల పోస్టులు భర్తీ చేయరా?

- అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏళ్ల తరబడి ఖాళీగానే...
- మీనమేషాలు లెక్కిస్తున్న అధికారులు
- కుంటుపడుతున్న అంగన్‌వాడీ వ్యవస్థ



అంగన్‌వాడీ కేంద్రం

బంజారాహిల్స్: ఏడిస్తే లాలిస్తారు.. ఆకలేస్తే అన్నం పెడతారు.. పోషకాహారం వండి వడ్డిస్తారు.. గర్భిణులకు జాగ్రత్తలు చెబుతారు.. బాధితులకు భరోసా ఇస్తారు.. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయాలు (హెల్పర్లు) చేసే పనులివి. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలోనూ టీచర్‌తో పాటు ఆయా తప్పనిసరిగా ఉంటేనే ఆ కేంద్రంలో లబ్ధిదారులకు మేలు చేకూరుతుంది. ఇందులో ఏ ఒక్కరు లేకపోయినా ఆ అంగన్‌వాడీ కేంద్రం పనితీరు అధ్వానంగా మారుతుంది. అయితే సమగ్ర శిశు అభివృద్ధి పథకం (ఐసీడీఎస్) ఖైరతాబాద్ పరిధిలోని 141 అంగన్‌వాడీ కేంద్రాలు, 10 మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో చాలాచోట్ల ఆయాల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిని భర్తీ చేయడంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. కొన్ని చోట్ల ఏడేళ్లుగా ఆయాలు లేకుండానే కేంద్రాలు కొనసాగుతున్నాయి.

- ఈ నేపథ్యంలో ఆయాలు చేయాల్సిన పనులు అంగన్‌వాడీ టీచర్లు చేయాల్సి వస్తుంది. పొరపాటున సంబంధిత అంగన్‌వాడీ టీచర్లు సర్వే చేయడానికో, శిక్షణ తీసుకోవడానికో వెళితే.. ఆ రోజు అంగన్‌వాడీ కేంద్రానికి తాళం పడాల్సిందే.
- పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్య అందించడంతో పాటు గుడ్లు, పాలు, బాలామృతం వంటి పోషకాహారాన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తుంటారు. ఉదయం 8 గంటలకే ఆయాలు కేంద్రాలకు చేరుకుని ప్రాంగణాన్ని శుభ్రం చేసి పోషకాహారం వండుతూనే కేంద్రానికి వచ్చే పిల్లలను కూర్చొండబెట్టి వారికి ముందుగా పాలు అందించి ఎదురుగా ఆట వస్తువులను ఏర్పాటు చేస్తారు. చాలాచోట్ల ఆయాలు లేకపోవడంతో ఈ వ్యవస్థ మాత్రం కుంటుపడింది.
- బంజారాహిల్స్, ఫిలింనగర్, షేక్‌పేట సెక్టార్‌లలో 8–10 ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అంతేకాదు మూడు చోట్ల అంగన్‌వాడీ టీచర్లు కూడా లేకపోవడంతో ఇన్‌చిర్జిలతో నెట్టుకువస్తున్నారు.
- ఐసీడీఎస్ ఖైరతాబాద్ పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వర కాలనీ, సోమాజిగూడ, ఖైరతాబాద్, షేక్‌పేట, యూసుఫ్‌గూడ, వెంగళరావునగర్, రహమత్‌నగర్, బోరబండ డివిజన్ల పరిధిలో కొన్ని చోట్ల ఆయా పోస్టులు ఖాళీగా ఉంటే మరికొన్ని చోట్ల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిని భర్తీ చేయడం ద్వారా కొంతమంది మహిళలకైనా ఉపాధి కల్పించే అవకాశాలు ఉన్నా అధికారులు పట్టించుకున్న పాపానపోవడం లేదు.
- అంగన్‌వాడీ కేంద్రాలను గాలికొదిలేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేంద్రానికి వచ్చే చిన్నారులు, బాలింతలు, గర్భిణీలు, వృద్ధులు, కౌమార బాలికలకు తగినంతగా పోషకాహారం, ఇతర సేవలు అందాలంటే తప్పనిసరిగా వీటి భర్తీ చేపట్టాల్సి ఉంది.

అసాంఘిక కార్యకలాపాలు కొనసాగుతున్న ఇల్లు సీజ్



ఇంటిని సీజ్ చేస్తున్న రెవెన్యూ అధికారులు

బంజారాహిల్స్: యూసుఫ్‌గూడ సమీపంలోని ఎల్ఎన్ నగర్‌లో పుట్టా రాము హత్య కేసులో నిందితురాలు హిమాంబీతో పాటు ఆమె కుమార్తె, భర్త తమ ఇంటిని ఆక్రమించుకొని బెదిరింపులకు గురి చేస్తున్నారంటూ ఇంటి యజమాని ధర్మారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రెవెన్యూ అధికారులు ఆదివారం ఈ ఇంటిని సీజ్ చేశారు. ఇటీవల ఈ ఇంటిని అద్దెకు తీసుకున్న హిమాంబి ఆమె కుమార్తె వ్యభిచారం నిర్వహిస్తున్నారు. ఇదే క్రమంలో పుట్టా రాము అనే రియల్ ఎస్టేట్ వ్యాపారిని ఇక్కడికి పిలిపించి హత్యకు కారకులయ్యారు. ఈ కేసులో జైలుకు కూడా వెళ్లారు. బెయిల్‌పై వచ్చిన తర్వాత ఇంట్లోకి మళ్ళీ వెళ్ళి వ్యభిచారం నిర్వహిస్తుండటంతో పాటు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతుండటంతో యజమాని బత్తిన ధర్మారెడ్డి జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ధర్మారెడ్డిని ఈ ఇల్లును అమ్మిన మహేశ్వర్‌రెడ్డిని హిమాంబితో పాటు ఆమె కుమార్తె బెదిరింపులకు గురి చేశారు. దీంతో బాధితుడు అసాంఘిక కార్యకలాపాలకు పేకాట శిబిరానికి వ్యభిచారానికి అడ్డాగా మారిన ఇంటిని ఖాళీ చేయించి సీజ్ చేయాలని సికింద్రాబాద్ ఆర్డీవోకు ఫిర్యాదు చేశాడు. ఆర్డీవో ఆదేశాల మేరకు జూబ్లీహిల్స్ పోలీసుల బందోబస్తు మధ్య రెవెన్యూ అధికారులు హిమాంబి, ఆమె కుమార్తె, భర్తను ఖాళీ చేయించి ఇంటిని సీజ్ చేశారు.

ఉద్యోగ నోటిఫికేషన్ జారీలో కాలయాపన దారుణం



మాట్లాడుతున్న భరత్‌గౌడ్

రహమత్‌నగర్: ఉద్యోగ నియామకాల్లో ప్రభుత్వం కాలయాపన చేస్తూ, నిరుద్యోగ యువత జీవితాలతో ఆటలాడు కుంటోందని నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ అడ్వైజరీ కమిటీ మెంబర్, బీజేవైఎం నగర నాయకుడు వాల్దాస్ భరత్ గౌడ్ ఆరోపించారు. రహమత్‌నగర్‌లో ఆదివారం ఆయన మాట్లాడుతూ... ఉద్యోగాలు ఇవ్వడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలమైందని భావించిన యువత కాంగ్రెస్‌ను గెలిపిస్తే ఆ పార్టీ అధికారం చేపట్టి ఆరు నెలలు గడుస్తున్నా నేటికీ జాబ్ కేలండర్‌ను ప్రకటించలేదని ఆరోపించారు. రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని మేనిఫెస్టోలో పొందుపరిచిన కాంగ్రెస్ పార్టీ ఆ విషయాన్నే మరిచి పోయిందన్నారు. విద్యాశాఖ మంత్రి రాష్ట్రంలో లేకపోవడం విచారకరమన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో టీపీఎస్సీ పరీక్ష పత్రం లీకేజీపై కొనసాగిన ఆందోళనలో తాను 16 రోజులు జైలు శిక్ష అనుభవించిన సంఘటన ఈ సందర్భంగా భరత్‌గౌడ్ గుర్తు చేశారు. ఇకనైనా ఉద్యోగ కేలండర్ ప్రకటించక పోతే బీజేవైఎం ఆధ్వర్యంలో మరోమారు ఉద్యమించాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు.

మొక్కలు నాటిన బీజేపీ నేతలు



మొక్కను నాటుతున్న మాజీ ఎమ్మెల్యే చింతల, లంకల దీపక్‌రెడ్డి

శ్రీనగర్‌కాలనీ: జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతిని పురస్కరించుకొని ఏక్‌పెడ్ మాకె నామ్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం నాగార్జున నగర్ కాలనీలో బీజేపీ నేతలు మొక్కలు నాటారు. సికింద్రాబాద్ బీజేపీ జూబ్లీహిల్స్ నియోజకవర్గ కార్యాలయంలో మొక్కలను నాటారు. మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, లంకల దీపక్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ కిలారి మనోహర్, నేతలు కుంబాల గంగరాజు, ప్రేమ్‌కుమార్, అట్లూరి రామకృష్ణ, గారపాటి అనంతలక్ష్మి, సుప్రియగౌడ్, మల్లారెడ్డి, విజయ్‌కుమార్ పాల్గొన్నారు. ఎల్లారెడ్డిగూడ అంబేడ్కర్‌నగర్‌లో ఏక్‌పెడ్ మాకే నామ్ కార్యక్రమంలో భాగంగా జూబ్లీహిల్స్ అసెంబ్లీ జాయింగ్ కన్వీనర్ శాంతికుమారఖ తన తల్లితో కలసి మొక్కను నాటారు.

కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ రైతుబజార్‌లో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 43, నల్లవంకాయ 35, పొడుగు వంకాయ 35, బెండకాయ 35, పచ్చిమిర్చి 70, బజ్జీమిర్చి 48, క్యాప్సికమ్ 70, పచ్చకాకర 45, పందిరి బీర 28, క్యాబేజీ 33, క్యారెట్ 35, దొండ 28, గుండుబీన్స్ 95, గింజ చిక్కుడు 95, గోకరకాయ 45, కీర 23, దోసకాయ 25, బీట్‌రూట్ 21, ఉల్లిగడ్డ 35, ఆలుగడ్డ 39, చామగడ్డ 35, మొరంగడ్డ 40, కందగడ్డ 55, సొరకాయ 13, పొట్లకాయ 18, అరటి 11, మునగకాయ 4–5 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

డ్రగ్స్ నియంత్రణ సామాజిక బాధ్యతగా భావించాలి

- టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా
- నెక్లెస్ రోడ్డులో సందడిగా 3కే, 5కే, 10కే వాక్



రన్‌లో పాల్గొన్న వారితో ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

ఖైరతాబాద్: మహిళలు, చిన్నారులపై జరుగుతున్న అఘాయిత్యాలు, అత్యాచారాలను నిరోధించాలని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. ఆదివారం హ్యూమన్ అగెనెస్ట్ రేప్ అండ్ డిస్క్రిమినేషన్ ఆధ్వర్యంలో నెక్లెస్ రోడ్డులో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంజీవయ్య పార్కు నుంచి పీపుల్స్ ప్లాజా వరకు 3కే, 5కే, 10కే రన్‌లను ఉప్పల శ్రీనివాస్‌గుప్తా జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చిన్నారులపై అత్యాచారాలు, హత్యలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గంజాయిని అరికట్టేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నారన్నారు. గంజాయి, డ్రగ్స్, మత్తు పదార్థాల నియంత్రణకు అందరూ సామాజిక బాధ్యతగా భావించి స్వీకరించాలన్నారు. జీనియస్ వరల్డ్ రికార్డు హోల్డర్ కె.ఎన్.రాజు, ధనుష్ మంజునాథ్, నరేష్‌గుప్తా తదిరతులు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

వెంగళరావునగర్: ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని మధురానగర్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాలివీ... యూసుఫ్‌గూడ పరిసర ప్రాంతాల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఆర్.వెంకటేష్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద ఉన్న ప్రెస్టేజ్ విస్కీ 48 క్వార్టర్ బాటిల్స్, ఆఫీసర్స్ ఛాయిస్ రెండు 90 బాటిల్స్, మొత్తం 50 బాటిల్స్ సీజ్ చేశారు.

దివ్యాంగుల జీవితాల్లో కొత్త వెలుగులు నిండాలి



సాయం అందుకున్న దివ్యాంగులతో సంస్థ ప్రతినిధులు

హిమాయత్‌నగర్: టెక్నాలజీని ఉపయోగించి దివ్యాంగుల జీవితాల్లో కొత్త వెలుగులు నింపి మార్పు తేవాలన్నది తమ లక్ష్యమని టీసీపీ వేవ్ సంస్థ ప్రతినిధులు అన్నారు. కృత్రిమ అవయవాల ద్వారా దివ్యాంగులు పూర్తిస్థాయి ఆత్మవిశ్వాసాన్ని పొందుతారని, వారికి అమర్చిన ప్రతి ఒక్క అవయవం వారి సామర్థ్యాలను మరింతగా వెలికితీసేలా ఉంటాయన్నారు. శ్రీ భగవాన్ మహావీర్ వికలాంగ సహాయతా సమితి ఆధ్వర్యంలో గుర్తించిన 50 మంది దివ్యాంగులకు ఆదివారం కింగ్‌కోఠిలోని ప్రభుత్వాసుపత్రిలో జరిగిన ఈ కార్యక్రమంలో కృత్రిమ కాళ్లు, వీల్‌చైర్లు, మూడుచక్రాల సైకిళ్లు, హ్యాండ్ కిట్లు, కాలిపర్స్, వాకర్లను టీసీపీ వేవ్ సంస్థ సీఎస్‌ఆర్ కార్యక్రమంలో భాగంగా అందజేశారు. దివ్యాంగులు కూడా మన సమాజంలో అందరితోపాటు సమానావకాశాలు పొందాలని, అందుకోసం వారిని ఆదుకునేందుకు సహృదయులు ముందుకు వస్తే దివ్యాంగులు ఎన్నో అద్భుతాలు సృష్టించగలరని టీసీపీ వేవ్ సంస్థ యాజమాన్య ప్రతినిధి పవన్ గాది తెలిపారు. ఫిక్కి ఐటీ చైర్మన్ మోహన్ రాయుడు, సీనియర్ పాత్రికేయుడు, రాజకీయ విశ్లేషకుడు డాక్టర్ సూరావఝుల రాము, డీసీఎస్ఐ సీఈఓ డాక్టర్ శ్రీరామ్, ప్రముఖ రుమటాలజిస్టు డాక్టర్ హమీద్ హుస్సేన్, సలహాదారు బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

వెంగళరావునగర్: విద్యుత్ సంబంధ మరమ్మతులు పనుల కారణంగా కార్మిక నగర్ 11కేవీ ఫీడర్ ఎస్‌పీఆర్‌హిల్స్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గ్రీన్‌లాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కార్మికనగర్, బ్రహ్మశంకర్‌నగర్, ఓంనగర్, ఎస్‌ఎస్‌బీ నగర్, వినాయకనగర్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు. పిల్లి దర్గా 11కేవీ ఫీడర్ బోరబండ సబ్‌స్టేషన్ పరిధిలో సోమవారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 3 గంటల వరకు ఎస్‌ఆర్‌ఆర్‌పురం సైట్–3, నూర్ మసీదు, జ్యోతినగర్, సునీల్‌నగర్, నాట్కో, హైటెక్ హోటల్, జయవంత్‌నగర్, పెద్దమ్మనగర్, అన్నానగర్, లంబాడబస్తీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏడీఈ వివరించారు.



విద్యార్థిని అదృశ్యం



సుప్రియ

ఖైరతాబాద్: యువతి కనిపించకుండా పోయిన సంఘటన ఖైరతాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... నల్లగొండకు చెందిన సునిత తన ఇద్దరు పిల్లలతో కలిసి ఖైరతాబాద్‌లో నివాసం ఉంటోంది. పెద్ద కుమార్తె ఓ హోటల్‌లో పని చేస్తుండగా చిన్న కుమార్తె సుప్రియ(19) బీకాం చదువుతోంది. ఈ నెల 5వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లిన సుప్రయ తిరిగి రాలేదు. దీంతో తల్లి ఖైరతాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న మారగోని ప్రవీణ్ కుమార్

హిమాయత్‌నగర్: దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న నిర్మాణ రంగ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో 'చలో హైదరాబాద్' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలంగాణ రాష్ట్ర బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారగోని ప్రవీణ్ కుమార్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ హైదరాబాద్ జిల్లా 3వ మహాసభల ముగింపు సందర్భంగా హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు రోజులపాటు జరిగిన యూనియన్ హైదరాబాద్ జిల్లా మహాసభలు విజయవంతంగా ముగిశాయని, ఈ మహాసభలు నూతన కమిటీని ఎన్నుకుందన్నారు. అధ్యక్షుడిగా చెట్టుకింది శ్రీనివాస్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా మొహమ్మద్ అహ్మద్, ఉపాధ్యక్షులుగా కె.కాశయ్య, కె.గణేష్, ఎస్.కె.మగ్బూల్, హుస్సేన్, ప్రధాన కార్యదర్శిగా కమతం యాదగిరి, సహాయ కార్యదర్శులుగా నాగరాజు, ఎన్.నరసింహ, ఎం.డి.షరీఫ్, కోశాధికారిగా జి.శ్రీనివాస్‌తో పాటు 35 మందిని సమితి సభ్యులుగా ఏకగ్రీవంగా మహాసభ ఎన్నికుందని ప్రకటించారు. నిర్మాణ కార్మికులకు కొత్త గుర్తింపు కార్డులను జారీ చేయాలనీ, కార్మికుల అడ్డాల వద్ద అన్ని వసతులతో కూడిన షెల్టర్‌లను నిర్మించాలన్నారు. 60 సంవత్సరాలు దాటినా కార్మికులందరికీ పెన్షన్ సౌకర్యం కల్పించి, ప్రమాదంలో మరణించిన వారికీ రూ. 10 లక్షలు, సహజ మరణానికి రూ. 5 లక్షలు, వివాహ కనుక రూ. లక్షకు పెంచి, పిల్లల చదువులకు స్కాలర్ షిప్‌లను అందించాలని ప్రవీణ్‌కుమార్ ప్రభుత్వాన్ని కోరారు.

విద్యార్థులకు నాయకత్వ లక్షణాలు అవసరం



హెడ్ బాయ్, హెడ్ గర్ల్‌లకు సన్మానం

వెంగళరావునగర్: ప్రతి ఒక్కరూ చదువుతో పాటు నాయకత్వ లక్షణాలను కలిగి ఉండాలని ఎంజీఎం ఇంటర్నేషనల్ స్కూల్ కరస్పాండెంట్ ఎం.ఎం.నాయుడు తెలియజేశారు. యూసుఫ్‌గూడలోని మహాత్మాగాంధీ మెమోరియల్ (ఎంజీఎం) ఇంటర్నేషనల్ స్కూల్‌లో స్వింగ్ సెర్మనీ నిర్వహించారు. స్కూల్ స్వింగ్ హెడ్ బాయ్‌గా కార్తికయ్య, హెడ్ గర్ల్‌గా రుచిరలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన అభినందన కార్యక్రమంలో వారికి బాధ్యతలను అప్పగించారు. కరస్పాండెంట్ మాట్లాడుతూ... నేటి యువత అన్ని రంగాల్లో తమ ప్రావీణ్యాన్ని చాటుతుందని అన్నారు. అనంతరం హెడ్ బాయ్, హెడ్ గర్ల్‌లను అభినందించారు. స్కూల్ ప్రిన్సిపాల్ కిరణ్ నాయుడు, టీచర్లు సబిత, వీణా, ఇమ్రోజ్ పాల్గొన్నారు.

నేత్రపర్వం.. జగన్నాథ రథోత్సవం



స్వామివారిని రథాల మీదికి తీసుకొస్తున్న అర్చకులు





బంగారు చీపురుతో రథాన్ని శుభ్రం చేస్తున్న అర్చకుడు



బంజారాహిల్స్‌లోని జగన్నాథ ఆలయం వద్ద జనన్నాథ రథ యాత్ర నేత్రపర్వంగా సాగింది. జై జగన్నాథ నినాదాల నడుమ జగన్నాథుడు, బల భద్రుడు, సుభద్రా దేవిల రథాలు ఆద్యంతం ముందుకు కనులపండువగా సాగాయి. ఆలయం నుంచి బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని కనకదుర్గా దేవాలయం వరకు రథయాత్ర కొనసాగింది. – బంజారాహిల్స్

భారతీయ ఫార్మా.. 65 బిలియన్ డాలర్లు

- హైటెక్స్‌లో 73వ ఇండియన్ ఫార్మాస్యూటికల్ కాంగ్రెస్



సాక్షి, సిటీబ్యూరో: 2024 చివరినాటికి భారతీయ ఫార్మా రంగం 65 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని, 2030 నాటికి అది 130 బిలియన్ డాలర్లకు చేరే అవకాశముందని మోడిఫై ఇండియా కంట్రీ హెడ్ సచిన్ నిగమ్ తెలిపారు. నగరంలోని హైటెక్స్ వేదికగా జరుగుతున్న 73వ ఇండియన్ ఫార్మాస్యూటికల్ కాంగ్రెస్‌లో భాగంగా మోడిఫై ఆధ్వర్యంలోని 'గ్రోత్ బూస్టింగ్ సొల్యూషన్స్'ను ఆవిష్కరించారు. భారతీయ ఫార్మా రంగాన్ని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా చిన్న, మధ్యతరహా సంస్థలకు ఉపయోగపడే గ్రోత్ బూస్టింగ్ సొల్యూషన్స్‌ను అందుబాటులోకి తీసుకువచ్చామని సచిన్ నిగమ్ పేర్కొన్నారు. భారతీయ ఔషధ రంగం శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. ఈ విభాగంలో ప్రపంచంలోనే అతి పెద్ద ఇండస్ట్రీగా పేరు తెచ్చుకుందని పేర్కొన్నారు. గ్లోబల్ డిమాండ్‌కు అనుగుణంగా 50 శాతం వ్యాక్సిన్లు, జెనరిక్ మందులు ఇక్కడి నుంచే ఇతర దేశాలకు ఎగుమతవడం విశేషమని పేర్కొన్నారు.

'ఈపీఎఫ్ఓ' పరీక్షలు ప్రశాంతం

బంజారాహిల్స్: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) నిర్వహించిన ఈపీఎఫ్ఓ పర్సనల్ అసిస్టెంట్, ఈఎస్ఐసీ నర్సింగ్ పరీక్షలు ఆదివారం సైఫాబాద్ సైన్స్ కాలేజ్‌లో ప్రశాంత వాతావరణంలో జరిగాయి. ఉదయం నిర్వహించిన ఈపీఎఫ్ఓ పరీక్షలో మొత్తం 168 మంది విద్యార్థులకు గాను కేవలం 46 మంది విద్యార్థులు హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన ఈఎస్ఐసీ నర్సింగ్ పరీక్షకు 168 మంది విద్యార్థులకుగాను 144 మంది హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌నాయక్ తెలిపారు. హైదరాబాద్‌లో 19 సెంటర్లలో ఈ పరీక్షలను యూపీఎస్సీ నిర్వహించిందని తెలిపారు.

సర్వం జగన్నాథం

నాలుగున్నర గంటలు వైభవంగా రథయాత్ర • వేలాదిగా తరలివచ్చిన భక్తులు



స్వామివారిని రథం పైకి తీసుకొస్తున్న అర్చకులు



బంజారాహిల్స్: వేలాదిగా భక్తులు... కరతాళధ్వనులు.. కోలాటాలు, డప్పుల నృత్యాలు.. జై జగన్నాథ నినాదాలు.. దారిపొడవునా ఆధ్యాత్మిక శోభ.. కాషాయ జెండాల రెపరెపలు.. ఉత్సాహంగా, ఉత్సవంగా జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్రాదేవిల రథాలు ముందుకు కదిలాయి. బంజారాహిల్స్‌లోని జగన్నాథ ఆలయం వద్ద రథయాత్ర వేడుకలు ఆదివారం వైభవంగాజరిగాయి.

- బంజారాహిల్స్ పోలీసుల బందోబస్తు నడుమ దేవతామూర్తుల రథోత్సవం కనులపండువగా ముగిసింది. వేకువజామునే స్వామివారికి ప్రత్యేక పూజలు చేసిన అర్చకులు బలభద్రుడు, సుభద్ర, జగన్నాథుడి మూల విరాట్‌లను రథాల్లోకి తీసుకొచ్చారు. బంగారు చీపురుతో రథాలను శుభ్రం చేశారు.
- హారతి అనంతరం వేలాదిగా తరలివచ్చిన భక్తులకు స్వామివార్ల దర్శనానికి అనుమతించారు. తొక్కిసలాటలు జరగకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. ఆలయం నుంచి బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని గుండిచా దేవాలయం (కనక దుర్గా ఆలయం) వరకు ఉదయం 11 నుంచి 4.30 గంటల దాకా యాత్ర కొనసాగింది.
- 10 రోజుల పాటు స్వామివారి మూల విరాట్‌లు ఈ ఆలయంలోనే పూజలందుకొన్న అనంతరం 11వ రోజు తిరుగుయాత్ర నిర్వహించి మూల విరాట్‌లను ఆలయానికి చేరుస్తామని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

దేశ సంస్కృతి బతకడం నేర్పింది

జగన్నాథ రథయాత్ర ముగింపు కార్యక్రమంలో గవర్నర్



మేడ్చల్: ప్రపంచానికి భారతదేశ సంస్కృతి బతకడం నేర్పిస్తే పాశ్చాత్య సంస్కృతి పరిగెత్తడం నేర్పిందని రాష్ట్ర గవర్నర్ రాధాకృష్ణన్ అన్నారు. మేడ్చల్‌లో ఇస్కాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జగన్నాథ రథ యాత్ర ముగింపు కార్యక్రమంలో గవర్నర్ మాట్లాడారు. ప్రపంచ దేశాలలో భారతదేశ సంస్కృతి ఎంతో గొప్పదని, చాలా దేశాలు మన సంస్కృతిని అనుసరిస్తున్నాయని పేర్కొన్నారు. ఇస్కాన్ తన వంతుగా మానవసేవ, మాధవ సేవ చేస్తోందని కొనియాడారు. ఈ సందర్భంగా కృష్ణా, బలరాములు, సుభద్రాదేవి విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి పలు రకాల నైవేద్యాలు అర్పించారు.

జూనియర్ ఆర్టిస్టులను ఆదుకోవాలి

పంజగుట్ట: ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించి ఆదుకోవాలని తెలుగు సినీ, టీవీ, జూనియర్ ఆర్టిస్ట్స్ యూనియన్ (సీఐటీయూ) విజ్ఞప్తి చేసింది. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.ఈశ్వర్‌రావు, నాయకులు వెంకటేశ్, రవీందర్ మాట్లాడుతూ రోజుకు 18 గంటలు పనిచేయించుకుని సరైన వేతనం కూడా ఇవ్వడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సభ్యత్వం లేని వారిని షూటింగ్‌లకు పంపుతూ ఏజెంట్లు అందినకాడికి దోచుకుంటున్నారని ఆరోపించారు. చిత్రపురి కాలనీలో ఫ్లాట్లను ఇతరులకు అమ్ముకుంటున్నారని, 70 శాతం మంది రాజకీయ నాయకులు, ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారని తెలిపారు. నిర్మించబోయే ట్విన్ టవర్స్‌లో సింగిల్ బెడ్‌రూం ఫ్లాట్స్‌ను చిత్రపరిశ్రమకు చెందిన వారికే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సుబాని, రాజు, రమేష్, రవిశంకర్, జాన్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

చెస్ అసోసియేషన్ అక్రమాలకు చెక్

ప్రభుత్వాన్ని కోరిన మాజీ ఉపాధ్యక్షుడు



మాట్లాడుతున్న శివప్రసాద్

పంజగుట్ట: రాష్ట్ర చెస్ అసోసియేషన్‌లో జరుగుతున్న అక్రమాలపై ప్రభుత్వం సమగ్ర విచారణ చేసి దోషులను శిక్షించి చెస్ క్రీడను కాపాడాలని అసోసియేషన్ మాజీ ఉపాధ్యక్షుడు మేజర్ కె.ఎ. శివప్రసాద్ కోరారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రంగారెడ్డి జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి ధన, సీనియర్ కోచ్ కంది రవతో కలిసి ఆయన మాట్లాడారు. చెస్‌తో సంబంధం లేనివారు అప్పటి నామినేటెడ్ సెక్రటరీతో కలిసి అసోసియేషన్‌గా ఏర్పడ్డారని, క్రీడాకారుల కోసం ఖర్చు చేయాల్సిన నిధులను దుర్వినియోగం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నైపుణ్యం గల క్రీడాకారులకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు బ్యాంకు అకౌంట్స్ ఫ్రీజ్ చేయగా, పోలీసులతో, మరికొంతమందితో రాయబారం పంపి తమను బెదిరించేందుకు యత్నిస్తున్నారన్నారు.

అమ్మమ్మల సంస్థ ఆవిర్భావం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ స్త్రీ సేవాసంస్థ.. మూడు తరాల వారి అభివృద్ధి కోసం ఆవిర్భవించిన అమ్మమ్మల సంస్థ అని వక్తలు అన్నారు. తెలంగాణ సీనియర్ సిటిజన్స్ కాన్ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం తెలంగాణ స్త్రీ సేవా సంస్థ పురుడు పోసుకుంది. ఈ కార్యక్రమం సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ జి.శోభాపేరిందేవి, డి.హేమలత నేతృత్వంలో ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో భీమన్న సాహితీనిధి చైర్మన్ బోయి హైమవతిభీమన్న అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల యాక్టింగ్ ఇంచార్జీ వి.యతీంద్రయాదవ్, తెలంగాణ స్టేట్ సీనియర్ సిటిజన్స్ కాన్ఫెడరేషన్ అధ్యక్షురాలు ఎస్ఆర్ఆర్‌పీ రామచంద్రయ్య, డాక్టర్ ఇ.భవానీ, డాక్టర్ బి.వెంకటరాంరెడ్డి, డాక్టర్ పి.మంగళ, డాక్టర్ ఎ.వి.రావు, లీగల్ అడ్వైజర్ ఈ.ప్రకాశ్‌రెడ్డి, జి.భ్రమరాంబ, ఎస్.సంధ్యా, డి.శైలజ తదితరులు పాల్గొన్నారు.

'ఎస్ఐ ఆత్మహత్య'పై విచారణ జరిపించాలి

సుందరయ్య పార్కు వద్ద కేవీపీఎస్ నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న కేవీపీఎస్ నేతలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: దళిత ఎస్ఐ శ్రీరాముల శ్రీనివాస్ ఆత్మహత్య చేసుకున్న ఘటనపై ముఖ్యమంత్రి స్పందించాలని, సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. ఆదివారం ఎస్ఐ శ్రీరాముల శ్రీనివాస్ ఆత్మహత్య ఘటనపై కేవీపీఎస్ ఆధ్వర్యంలో సుందరయ్య పార్కు ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అశ్వారావుపేట ఎస్ఐ శ్రీరాముల శ్రీనివాస్ 25 రోజుల కిందటనే తను ఎదుర్కొంటున్న కులవివక్ష వేధింపులపై జిల్లా ఎస్పీకి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారని, పోలీసు ఉన్నతాధికారులు సరైన సమయంలో స్పందించకపోవడం వల్లే ఈ ఘటన చోటుచేసుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. సీఐ జితేందర్‌రెడ్డితోపాటు కొందరు కానిస్టేబుళ్లు వేధించిన తీరు వల్లే మన స్తాపానికి లోనై ఎస్ఐ ఆత్మహత్య చేసుకున్నారని అన్నారు. కుల వివక్ష వేధింపులున్న పోలీసు శాఖలో ప్రక్షాళన చేపట్టాలని సీఎంను డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నేతలు ఎం.ప్రకాష్ కరత్, కృపాసాగర్, ఎస్.బాలపీరు, బి.సుబ్బారావు పాల్గొన్నారు.

వెనుదిరిగిన విద్యుత్ అధికారులు

మీటర్లు తొలగించొద్దంటూ అడ్డుకున్న స్థానికులు



ఏడీఈ శ్రీనివాసులును చుట్టుముట్టిన స్థానికులు

బహదూర్‌పురా : మీరాలం ఏఈ పరిధిలోని గుంటల్ షా బాబా దర్గా ప్రాంతంలో విద్యుత్ చౌర్యంపై విజిలెన్స్ అధికారులు స్థానిక విద్యుత్ అధికారులతో కలిసి తనిఖీలు చేపట్టారు. చౌర్యానికి గురవుతున్న మీటర్లను తొలగించి వాటిస్థానంలో కొత్త మీటర్లు చేశారు. బస్తీవాసులు విద్యుత్ అధికారులను అడ్డుకుంటూ విధులకు ఆటంకం కలిగించారు. దీంతో చేసేదేమీ లేక అధికారులు వెనుదిరిగారు. ఒకానొక దశలో విద్యుత్ అధికారులపై దాడి చేసేంతగా అడ్డుకున్నారు. తొలగించిన మీటర్ల స్థానంలో తిరిగి పాత మీటర్లు ఏర్పాటు చేసేవరకు అధికారులను కదలనీయలేదు. ఈ ఘటనపై చార్మినార్ డీఈ లింగయ్య స్పందిస్తూ విద్యుత్ సిబ్బంది, అధికారుల విధులకు ఆటకం కలిగిస్తే విద్యుత్ యాక్ట్ ప్రకారం చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఎస్సీ రిజర్వేషన్లు వర్గీకరించాలి

మాదిగ దండోరా ఆవిర్భావ దినోత్సవంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి



ఎమ్మెల్యే సత్యనారాయణను సన్మానిస్తున్న విమలక్క, పాపయ్యమాదిగ తదితరులు

గన్‌ఫౌండ్రీ: అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఎస్సీ రిజర్వేషన్లను వర్గీకరిస్తామని ప్రకటించిన బీజేపీ పదేళ్లు దాటినా హామీని అమలు చేయడంలేదని మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో జరిగిన మాదిగ దండోర 30వ ఆవిర్భావ దినోత్సవాల్లో ఆయన మాట్లాడారు. కొంతమంది ప్రతినిధులు మతతత్వవాదులతో కలిసి వర్గీకరణ పోరాటాన్ని నీరుగార్చేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. మాదిగలంతా ఐక్యంగా ఉండాలని, అప్పుడే అభ్యున్నతి సాధ్యమవుతుందని అన్నారు. అనంతరం మాదిగ అమరవీరులను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాలలో రాణిస్తున్న మాదిగ ప్రతిభావంతులను, ప్రతినిధులను ఘనంగా సన్మానించారు. అంతకుముందు కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అరుణోదయ సంస్థ అధ్యక్షురాలు విమలక్క, ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తమ్, సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపన్న మదిగ, వర్కింగ్ ప్రెసిడెంట్ మంచాల యాదగిరి మాదిగతోపాటు వివిధ జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

కొత్త పింఛన్లకు ఇంకా ఎదురుచూపులే!

- నాలుగేళ్లుగా పెండింగ్‌లో దరఖాస్తులు
- క్షేత్రస్థాయి విచారణ అంతంతే..
- తహసీల్ ఆఫీసుల చుట్టూ తప్పని చక్కర్లు
- ఆసరాపై సన్నగిల్లుతున్న నిరుపేదల ఆశలు



సాక్షి,సిటీబ్యూరో: నిరుపేదలకు నాలుగున్నరేళ్లుగా కొత్త ఆసరా పింఛన్ల కోసం ఎదురు చూపులు తప్పడంలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువు తీరి ఏడు మాసాలు గడిచినా.. పాత పెన్షన్ల పెంపు సంగతేమోకానీ .. కనీసం పెండింగ్‌లో ఉన్న కొత్త పింఛన్ల మంజూరు ఊసే లేదు. బీఆర్ఎస్ సర్కారు మూడేళ్ల క్రితం కేవలం వృద్ధాప్య పింఛన్ కోసం వయసు సడలింపు కింద 57 ఏళ్లకుపైబడి వారి నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించి మొక్కుబడిగా 40 శాతం మంజూరు చేసి చేతులు దులుపుకుంది. నిరంతరం ఆఫ్‌లైన్‌లో స్వీకరించే 65 దాటిన వృద్ధాప్య, వితంతు, వికలాంగుల, ఒంటరి మహిళా, కల్లు గీత, బీడీ తదితర పింఛన్ దరఖాస్తులను మాత్రం పెండింగ్‌లో పడేసింది. నిరుపేదలు కలెక్టరేట్, తహసీల్ ఆఫీసుల చుట్టూ చక్కర్లు కొడుతున్నా దరఖాస్తుల్లో మాత్రం కదలిక కనిపించడం లేదు. దీంతో ఆసరా పింఛన్లపై ఆశలు సన్నగిల్లుతోంది.

చనిపోతే పింఛన్ ఆగుతుందే కానీ..

వృద్ధాప్య పింఛనుదారుడు మృతి చెందితే.. సమాచారం అందగానే నెలవారీ పింఛన్ నిలిచిపోతుందే తప్ప... అతని భార్యకు మాత్రం వితంతు పింఛన్ మంజూరు పెండింగ్‌లోనే ఉండిపోయింది. మరణ ధ్రువీకరణ పత్రం తీసుకొని దరఖాస్తుదారులు కలెక్టరేట్, తహసీల్ ఆఫీసుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా... అధికారుల కాళ్లవేళ్ల పడుతున్న పింఛన్ మంజూరు మాత్రం అందని ద్రాక్షగా తయారైంది.

రెండు లక్షలపైనే...

గ్రేటర్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో కొత్తగా ఆసరా పింఛన్ల కోసం సుమారు రెండు లక్షలపైగానే దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు అధికార గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఇందులో వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళా దరఖాస్తులు అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వ హయాంలో కొన్ని దరఖాస్తులపై క్షేత్రస్థాయి విచారణ జరిపి జిల్లా యంత్రాంగం ద్వారా సెర్ప్‌కు ప్రతిపాదనలు వెళ్లినా మంజూరు మాత్రం పెండింగ్‌లో మగ్గుతోంది. దీంతో కొత్తగా ఆఫ్‌లైన్‌లో వస్తున్న దరఖాస్తులపై క్షేత్రస్థాయి విచారణ జరిపించేందుకు రెవెన్యూ అధికారులు ఆసక్తి కనబర్చడంలేదు.

ప్రస్తుతం 6.33 లక్షలపైనే...

గ్రేటర్ పరిధిలో మొత్తం మీద ఆసరా పింఛన్లు 6.33 లక్షలపైనే ఉన్నట్లు అధికార గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఇందులో లక్ష వరకు దివ్యాంగులు, చేనేత, కల్లుగీత, బీడీ వర్కర్స్, హెచ్ఐవీ, ఫైలేరియా పింఛన్ దారులుండగా, మిగిలిన వృద్ధాప్య, వింతంతు, ఒంటరి మహిళా తదితర పెన్షన్‌దారులు ఉన్నట్లు తెలుస్తోంది.

పాత పింఛన్ల సొమ్ము పెంపు ఏది...

కాంగ్రెస్ ప్రభుత్వ ఆరు గ్యారంటీల్లో ఒకటైన పింఛన్ల సొమ్ము పెంపు లేకుండా పోయింది. ఇప్పటికే రెండు గ్యారంటీలు అమలవుతుండగా, మరో గ్యారంటీ 'చేయూత'పై సర్కారు ఇంకా నిర్ణయం తీసుకోలేదు. గ్యారంటీ అమలైతే నిరుపేద కుటుంబాలు, పండుటాకులు, వితంతువులు, దివ్యాంగులు, చేనేత, కల్లుగీత, ఒంటరి మహిళల తదితర సామాజిక పెన్షన్ల నగదు పెరగనుంది.



హోంగార్డు.. 'ట్రీ గార్డు'

మొక్కల పెంపకంపై హోంగార్డు కృష్ణసాగర్ పాదయాత్ర

- గత నెల 22న జోగులాంబ ఆలయం నుంచి ప్రారంభం
- రోడ్డు పక్కన మొక్కలు నాటుతూ గచ్చిబౌలికి చేరిన కృష్ణసాగర్
- ఐదు జిల్లాల్లో 225 కి.మీ. నడక.. మొత్తం 637 మొక్కలకు జీవం

ఆయన వృత్తి హోంగార్డు.. ప్రవృత్తి 'ట్రీగార్డు'గా మారింది.. మొక్కలు నాటుతూ, పర్యావరణ పరిరక్షణకు పాటుపడుతూ సహచరులతో పాటు అందరి ప్రశంసలు పొందుతున్నారు కృష్ణసాగర్. ఒకవైపు విధులను నిర్వహిస్తూ, మరోవైపు మొక్కలు నాటుతూ మొక్కవోని దీక్షతో ప్రవృత్తిని కొనసాగిస్తూ మన్ననలను పొందుతున్నారు.

– రాయదుర్గం



తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి నివాసంలో ఆయనతో కలిసి మొక్క నాటుతున్న కృష్ణసాగర్



జోగులాంబ ఆలయం నుంచి పాదయాత్ర చేస్తూ నగరానికి వచ్చే మార్గంలో రోడ్డు పక్కన స్థానికులు, స్కూల్ విద్యార్థులతో కలిసి మొక్క నాటుతున్న హోంగార్డు కృష్ణసాగర్

వనపర్తి జిల్లా కేంద్రంలోని భరోసా సెంటర్‌లో కృష్ణసాగర్ హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నారు. అంతేకాదు, ఆయన సాగర్ స్నేక్ సొసైటీని కూడా స్థాపించారు. ఎవరి ఇంట్లోగానీ, వ్యాపార సముదాయాల్లోగానీ పాము ఉందని సమాచారం ఇస్తే చాలు కృష్ణసాగర్ వెళ్లి పామును సజీవంగా పట్టి అటవీ ప్రాంతంలో వదలేస్తారు. ఇందుకును ఆయన ప్రతిఫలం ఏమీ ఆశించరు. ఎవరైనా డబ్బులు ఇస్తానన్నా తీసుకోరు. వాటిక బదులుగా ఐదు మొక్కలు నాటాలని సూచిస్తారు. దగ్గరుండి వారితో మొక్కలు నాటిస్తారు. కరోనా సమయంలో మొక్కలు నాటే పనిని మరింత ఎక్కువగా చేపట్టారు కృష్ణసాగర్. అప్పటి నుంచి అందరికీ అవగాహన కల్పిస్తూ వారితో మొక్కలను నాటించి, వాటిని పరిరక్షించే బాధ్యత కూడా తీసుకోవాలని కోరుతుంటారు. ఇందులో భాగంగా ఆయన గత నెల 22వ తేదీన జోగులాంబ నుంచి పాదయాత్రగా బయలుదేరి తాజాగా ఆదివారం హైదరాబాద్‌లోని గచ్చిబౌలికి చేరుకున్నారు. గచ్చిబౌలిలో నివాసముండే రాష్ట్ర హోంగార్డుల సంఘం గౌరవాధ్యక్షుడు, తాండూరు ఎమ్మెల్యే బి.మనోహర్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా కృష్ణసాగర్ 'సాక్షి'తో మాట్లాడారు. ఆయన చెప్పిన విశేషాలు ఇవీ...

విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ....

కిలోమీటర్‌కు ఒక చోట రోడ్డుకు ఇరువైపులా మొక్కను నాటుతూ జోగులాంబ ఆలయం నుంచి గచ్చిబౌలి వరకు కృష్ణసాగర్ పాదయాత్ర నిర్వహించారు. గత నెల 22న పాదయాత్ర ప్రారంభించారు. రోజుకు 20 కిలోమీటర్ల చొప్పున మొత్తం 255 కిలోమీటర్ల మేర నడిచారు. మొక్కలు నాటే సమయంలో గుంతలను స్వయంగా తవ్వేందుకు గడ్డపార, సలికెపారను తన వెంట తీసుకువెళ్లారు. ఈ పాదయాత్రలో తన స్నేహితులు కుమార్‌సాగర్, దేవేందర్, గోపాల్‌లను కూడా భాగస్వాములను చేశారు. ఒక వాహనం, అందులో వంటకు అవసరమైన వస్తువులను వెంట తీసుకెళ్లారు. జోగులాంబ ఆలయం నుంచి గద్వాల, వనపర్తి, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల మీదుగా పాదయాత్ర చేస్తూ హైవే పక్కన ఉండే గ్రామాలు, పట్టణాలలో కూడా మొక్కలు నాటారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు మొక్కలు నాటడం, పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యత గురించి వివరించారు. నగరానికి వచ్చే వరకు మొత్తం 637 మొక్కలు నాటారు. అందులో వనపర్తి జిల్లాలో 161, మహబూబ్‌నగర్ 100, గద్వాల్ 200, రంగారెడ్డి, హైదరాబాద్ కలిపి 100 మొక్కలను నాటారు.

ఊహించని పరిణామాలుంటాయి జాగ్రత్తా..

2051 వరకు పర్యావరణ పరిరక్షణ చేయకపోతే ఊహించని పరిణామాలు చోటు చేసుకుంటాయని సాగర్ స్నేక్ సొసైటీ వ్యవస్థాపకుడు, హోంగార్డు కృష్ణసాగర్ స్పష్టం చేశారు. ఆదివారం ఆయన గచ్చిబౌలిలో 'సాక్షి'తో మాట్లాడుతూ ప్రస్తుతం మొక్కలు నాటేందుకు అందరూ ముందుకొచ్చి వాటిని పరిరక్షించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. 2019 జూన్‌లో పోస్టర్ ఆవిష్కరణ చేసి పర్యావరణ పరిరక్షణ పేరిట మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టానన్నారు. మరింత మందికి అవగాహన వచ్చేలా చేయాలనే సంకల్పంతో ఈ పాదయాత్ర చేపట్టానని పేర్కొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
13
హైదరాబాద్, సోమవారం : 8 : జూలై : 2024

బొగ్గురహిత ఇస్త్రీ కోసం పోరాటం
మహానగరాన్ని మార్చే దిశగా ప్రయత్నం
ఎకో ఇస్త్రీ మేన్ ఆఫ్ హైదరాబాద్ ఆలూరి మోహనవంశీ



నాన్నను మిస్ అవుతున్నా..

ఇండియన్ క్రికెటర్ మహ్మద్ సిరాజ్

- ప్రధానితో భేటీ మర్చిపోలేని అనుభూతి
- సూర్యకుమార్ క్యాచ్ అద్భుతం..
- ఇండియా గెలుస్తుందని అప్పుడే అనుకున్నాం
- నీలోఫర్ చాయ్ అంటే చాలా ఇష్టం..
- ఫస్ట్‌లాన్సర్ ఈద్గా గ్రౌండ్‌లోనే క్రికెట్ ఓనమాలు నేర్చుకున్నా
- 'సాక్షి'తో ప్రపంచకప్ విజేత టీం సభ్యుడు మహ్మద్ సిరాజ్

క్రికెట్ పొట్టి ఫార్మాట్‌లో ప్రపంచకప్ గెలిచిన సంతోషం అంతా ఇంతా కాదు. 17 ఏండ్ల తర్వాత ప్రతి ఒక్క భారతీయుడు గర్వపడేలా చేసిన గెలుపు అది. విశ్వవిజేతగా నిలిచి గెలిచిన భారతీయ జట్టు ముంబై వీధుల్లోకి రాగానే జయజయ ధ్వానాలతో.. ఇసుకేస్తే రాలనంత జనం వారికి నీరాజనం పట్టారు. పక్కనే ఉన్న సముద్రం కూడా చిన్నబోయేలా జనసంద్రం వారికి అడుగడుగునా ఘన స్వాగతం పలికింది. అదే జట్టులో భాగస్వామ్యమైన మన హైదరాబాద్ ముద్దుబిడ్డ మహ్మద్ సిరాజ్.. ప్రపంచకప్‌ను ముద్దాడిన తర్వాత తొలిసారిగా నగరానికి వచ్చినప్పుడు కూడా అదే స్థాయిలో స్వాగతం పలికారు. 'ఇండియా.. ఇండియా.. లవ్ యూ సిరాజ్ భాయ్' అంటూ అభిమానులు కేరింతలు కొట్టారు. అభిమానులు పాట పాడుతుంటే వారితో సిరాజ్ గొంతు కలిపాడు. 140 కోట్ల మంది ఆశల పల్లకి మోస్తూ.. కదనరంగం లాంటి క్రికెట్‌లో నగర ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పిన రారాజు.. మియాన్ భాయ్.. మన సిరాజ్‌తో 'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూ.

ప్రపంచ కప్ గెలవడం ఎలా అనిపిస్తోంది?
ప్రపంచకప్ గెలిచినందుకు చాలా సంతోషంగా ఉంది. ఇది జీవితంలో మర్చిపోలేని అనుభూతి. ప్రపంచకప్ జట్టులో భాగస్వామ్యం కావడం నా అదృష్టంగా భావిస్తున్నా. కాకపోతే ఇంత సంతోషంలో నాన్న లేకపోవడం చాలా బాధగా ఉంది. నాన్నను చాలా మిస్ అవుతున్నా.

మ్యాచ్ చాలా ఉత్కంఠగా సాగింది కదా..? గెలుస్తామని అనుకున్నారా?
ఫైనల్ మ్యాచ్ చాలా ఉత్కంఠగా సాగింది. సూర్యకుమార్ క్యాచ్ పట్టి డేవిడ్ మిల్లర్‌ను ఔట్ చేయడం ఓ మరపురాని జ్ఞాపకం. భారత జట్టు కప్ గెలుస్తుందని అప్పుడే అనుకున్నాం. చివరకు ప్రపంచకప్ విజేతలుగా నిలిచాం.

హైదరాబాద్ గురించి..
హైదరాబాద్‌తో ఎంతో అనుబంధం ఉంది. మాసబ్‌ట్యాంకులోని ఫస్ట్ లాన్సర్‌లోనే పెరిగాను. నీలోఫర్ చాయ్ అంటే చాలా ఇష్టం.

మోదీతో విందు గురించి..?
ప్రపంచకప్ గెలిచి ఇండియా వచ్చాక.. ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశం కావడాన్ని నా జీవితంలో మర్చిపోలేను. ఆ రోజును ఎప్పటికీ గుర్తుంచుకుంటాను. ఆయనతో కలిసి విందులో పాల్గొనడం సంతోషంగా ఉంది.

ర్యాలీని ఈద్గా వరకు ఎందుకు కొనసాగించారు?
ఫస్ట్ లాన్సర్‌లోని ఈద్గా మైదానం అంటే నాకు చాలా ఇష్టం. అక్కడే క్రికెట్ ఓనమాలు నేర్చుకున్నా. అందుకే ప్రపంచ కప్ గెలిచిన తర్వాత విజయోత్సవ ర్యాలీని ఈద్గా మైదానం వరకు కొనసాగించాం.

జట్టులో ఇష్టమైన ఆటగాళ్లు ఎవరు?
విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ అంటే నాకు చాలా ఇష్టం. వారిద్దరూ నన్ను వెన్నంటి ప్రోత్సహించారు. వాళ్లు ఎప్పుడు హైదరాబాద్ వచ్చినా.. మా ఇంటికి వస్తారు. ఫిల్మ్‌నగర్‌లో కొత్త ఇంటి ప్రవేశానికి బెంగళూరు టీమ్ మా ఇంటికి వచ్చింది. అప్పుడు చాలా సంతోషం అనిపించింది. కోహ్లీ మొదటిసారి మా ఇంటికి వచ్చినప్పుడు నా సంతోషానికి అవధుల్లేవు.





సంకల్ప దీక్షతో.. అంతా సన్నద్ధమై.. ఓ మహత్తర కార్యానికి శ్రీకారం చుట్టారు. ముందు చూపుతో మొదలైన ప్రస్థానం నేడు మహానగరాన్ని కదిలిస్తోంది. మనకు తెలియకుండానే నగరం వాయు కాలుష్యమయంగా ఎలా అవుతుందో గమనించారు. నెలకు లక్షలాది క్వింటాళ్ల బొగ్గును కేవలం నగరంలోని ఇస్త్రీ వ్యాపారులే వినియోగిస్తున్నారంటే నమ్మగలరా.. ఇలా మనం ఎంత కాలుష్యంలో బతుకుతున్నామో గమనించారా.. బొగ్గురహిత ఇస్త్రీ నగరంలో విస్తరించాలనే సదుద్దేశంతో రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్-ది లెజెండ్స్ శ్రీకారం చుట్టింది. అనుకున్నదే తడవుగా ఆచరణలో పెట్టి ఇస్త్రీ వ్యాపారులకు లాభాలతో పాటు సమయం, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణకు పాటుపడుతోంది. ప్రాజెక్ట్ 'ఎకో ప్రెస్సింగ్' పేరుతో ఈ ప్రాజెక్టును మొదలు పెట్టింది. ఈ ఉద్యమం ఎలా మొదలైంది? దీనికి సహకరించిన వారెవరు? వంటి విషయాలు తెలుసుకుందాం...

- శ్రీనగర్‌కాలనీ



ఎకో ప్రెస్సింగ్

Eco Pressing

సంకల్ప దీక్షతో ముందడుగు

బొగ్గు రహిత ఇస్త్రీ ఉద్యమం మొదట బెంగుళూరులో 'ఉద్యమ్ వ్యాపార్' ఎన్‌జీఓతో మొదలైంది. రోడ్లపై, అపార్టుమెంట్లలో వాచ్‌మెన్స్‌గా పనిచేస్తున్న వారు బొగ్గు ఇస్త్రీపెట్టెలతో ఇస్త్రీ చేసేవారు. పర్యావరణ పరిరక్షణతో పాటు ఈ బొగ్గు ఇస్త్రీపెట్టెలతో వారికి తగ్గ ఆదాయం సమకూరేదికాదు..పైగా వాటిని ఉపయోగించేందుకు ముందస్తుగా చాలా తతంగమే చేయాలి.. పైగా బొగ్గును మండించే క్రమంలో వచ్చే పొగకు ఆరోగ్య సమస్యలు తలెత్తేవి. సమయం కూడా చాలా వృథా అయ్యేది.. ఇదంతా గమనించిన ఓ ఎన్‌జీఓ సంస్థ ఎల్‌పీజీ ఇస్త్రీ పెట్టెలను అందించి వారికి తోడుగా నిలిచింది. బెంగుళూరులో సుమారు 5వేల మందికి, చెన్నైలో 3వేల మందికి ఎల్‌పీజీ ఇస్త్రీల వాడకాన్ని నేర్పింది. ఇలా బొగ్గు రహిత నగరాలుగా చేయడానికి పూనుకుంది.

భాగ్యనగరంలోనూ...

గ్రేటర్ హైదరాబాద్‌లోని రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ది లెజెండ్స్ ఫౌండర్ ప్రెసిడెంట్ మోహనవంశీ ఆలూరి చేస్తున్న సేవా కార్యక్రమాలను గమనించిన 'ఉద్యమ్ వ్యాపార్' దీనికి సంబంధించిన ప్రాజెక్టును వివరించారు. ఉద్యమ్ వ్యాపార్ ప్రతినిధులు కృష్ణన్, జూహీలు నగరానికి వచ్చి వారి ప్రాజెక్ట్‌ను వివరించి, క్లబ్ చేస్తున్న విస్తృత కార్యమాలకు ముగ్ధులై ఈ ప్రాజెక్ట్‌ను మీ క్లబ్ నుండే చేయాలని తెలిపారు. దీంతో ప్రాజెక్ట్ 'ఎకో ప్రెస్సింగ్' ఇస్త్రీ నగరంలో మోతీనగర్ నుండి ప్రారంభమై నేడు సుమారు 200 మందికిపైగా ఎల్‌పీజీ ఇస్త్రీలను అందించింది.

బొగ్గు ఇస్త్రీల వల్ల నష్టాలు

మహానగరంలో సుమారు 10 వేల మంది ఇస్త్రీ వ్యాపారులు ఉన్నారు. వీరిలో అధిక శాతం మంది ఇస్త్రీలకు ప్రధాన వనరుగా బొగ్గునే వాడుతున్నారు. ఒక్కొక్కరూ రోజుకు సుమారు రెండు కిలోల బొగ్గును వాడతారు. అంటే రోజుకు సుమారు 20వేల కేజీలు.. నెలకు 6లక్షలు, సంవత్సరానికి 72 లక్షల కిలోల బొగ్గును కేవలం ఇస్త్రీ వ్యాపారులే వినియోగిస్తున్నారంటే అతిశయోక్తికాదు.. నగరంలో వాయుకాలుష్యానికి ఇది కూడా ఒక సవాలుగా మారుతోంది.

భారీగా పెరిగిన బొగ్గు ధరలు

దీనికితోడు బొగ్గు ఖరీదుకూడా భారీగా పెరిగింది. బొగ్గు వినియోగానికి సుమారు నెలకు 2 నుండి మూడువేల వరకూ ఖర్చు చేస్తున్నారు. ఇస్త్రీ చేసేవారికి బొగ్గు మండాలంటే సుమారు గంటకు పైగా సమయం పడతుంది. పైగా మండించే క్రమంలో వచ్చే పొగ కారణంగా ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. బొగ్గు మండించడానికీ సమయం వృథా అవుతోంది. అంతేకాకుండా వీటికి ఉష్ణాన్ని అదుపుచేసే విధానం ఉండదు. దీంతో కొన్నిరకాల బట్టలు త్వరగా రంగుమారడం, ప్రధానంగా దుస్తులపైనున్న లోగోలు చెడిపోవడం, ఒక్కోసారి తెల్ల చొక్కాలపై మసి అంటి మరకలు పడటం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. ఇంతా చేస్తే చివరికి మిగిలేది నామమాత్రమే అని పలువురు నిర్వాహకులు వాపోతున్నారు.

ఎల్‌పీజీ, 'ప్రాజెక్ట్ ఎకో'తో లాభాలు

ఎల్‌పీజీ ఇస్త్రీలతో చాలా లాభాలున్నాయి. కమర్షియల్ సిలిండర్ 19 కేజీలు రెండు నుండి మూడు నెలలు వస్తుంది. పైగా దీని ధర రెండు వేల లోపు మాత్రమే.. బొగ్గుతో పోలిస్తే... ఖర్చు తగ్గి లాభాలతో పాటు సమయం కూడా కలిసి వస్తుంది. పర్యావరణానికి ఎటువంటి హానీ కలగదు. వినియోగదారులకు సంతోషకరమైన పనిని అందించవచ్చు. ఎందుకంటే ఇందులో ఇస్త్రీ పెట్టె ఉష్ణోగ్రతలను అదుపు చేసే వెసులుబాటు ఉంటుంది.

రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ లెజెండ్స్ వారు 'ఉద్యమ్ వ్యాపార్' ఆలోచనతో ప్రాజెక్ట్ 'ఎకో ప్రెస్సింగ్'ను ముందుకు తీసుకెళుతున్నారు. వీరికి తోడుగా రోటరీక్లబ్ ఆఫ్ మద్రాస్, రోటరీ క్లబ్ జూబ్లీహిల్స్, సైనిక్‌పురి, గ్లోబర్ విజర్డ్స్, స్మార్ట్ హైదరాబాద్, సంస్కార్ స్కూల్స్‌తో పాటు పలు సంస్థలు సహకారాన్ని అందిస్తున్నాయి. ఎల్‌పీజీ ఇస్త్రీ

ప్రాజెక్ట్ 'ఎకో ప్రెస్' ఇలా..

ఏడువేలకు పైగా ఉంటుంది. కానీ వీరు వీటిని రూ. 2,500 మాత్రమే ఇస్తున్నారు. ఇందులో వాడే ఇత్తడి మెటీరియల్ ఖరీదుకు మాత్రమే వారు తీసుకుంటున్నారు. బొగ్గురహిత గ్రేటర్ హైదరాబాద్ నగరంగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా పెట్టుకున్నామని, రెండు మూడు సంవత్సరాల్లో ప్రాజెక్ట్ పూర్తి చేయడానికి శ్రమిస్తామని ఎకో ఇస్త్రీ మేన్ ఆఫ్ హైదరాబాద్‌గా పేరున్న మోహనవంశీ తెలిపారు.

వినియోగం చాలా సులువు

బొగ్గు ఇస్త్రీపెట్టెల కంటే ఎల్‌పీజీ ఇస్త్రీల వినియోగం చాలా సులువైనది. త్వరగా హీట్ అయి హెచ్చు, తగ్గులను కంట్రోల్ చేసుకోవచ్చు. ఆదాయం పెరిగి సమయం కలిసొస్తుంది. ఇస్త్రీ వ్యాపారులు రోటరీ క్లబ్ సహకారంతో ఎల్‌పీజీని వాడి పర్యావరణాన్ని కాపాడాలి.



-ధర్మ, ఇస్త్రీ వ్యాపారి, మోతీనగర్

కోల్‌ఫ్రీ ఇస్త్రీ నగరంగా...

కాలుష్యాన్ని తగ్గించి హైదరాబాద్‌ను బొగ్గురహిత ఇస్త్రీ నిలయంగా చేయాలన్నదే మా సదుద్దేశం. ఈ ఆలోచనకు నాంది ఉద్యమ్ వ్యాపార్ సంస్థ. వారి ఆలోచనను రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్-ది లెజెండ్స్ పూర్తిస్థాయిలో నెరవేర్చడానికి పూనుకున్నాం. నగరంలోని అందరికీ ఈ ఎల్‌పీజీ ఇస్త్రీపెట్టెల వినియోగంపై అవగాహన కల్పించి వారికి అందజేస్తాం. కోల్‌ఫ్రీ ఇస్త్రీ నగరంగా హైదరాబాద్ నిలుపుతాం.



– ఆలూరి మోహనవంశీ, రోటరీక్లబ్ ఆఫ్ హైదరాబాద్ ది లెజెండ్స్ ఫౌండర్ ప్రెసిడెంట్





నాలుగున్నరేళ్లకే ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్

వంద దేశాలు, రాజధానులు, కరెన్సీ పేర్లు టకటకా చెప్పేస్తారు

ప్రఖ్యాత ప్రదేశాలు, ప్రముఖ వ్యక్తుల పేర్లు, జీకే ప్రశ్నలకు కూడా..

బ్రదర్స్.. అదుర్స్

అన్నదమ్ముల అరుదైన ఘనత | మూడేళ్లకే ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు

అద్భుతమైన జ్ఞాపక శక్తి ఆ ఇద్దరి అన్నదమ్ముల సొంతం. ఒక్కసారి చదివినా, చెప్పింది విన్నా, ఇట్టే గుర్తుంటుంది. ఏడాదిన్నర వయసులోనే విషయం గ్రహించిన తల్లిదండ్రులు పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించారు. సాధారణంగా భారతదేశం రాష్ట్రాలు, రాజధానులు, చిత్రపటంలో గుర్తించడం వంటివి చెప్పారు. అవి ధారాళంగా పలకడం, గుర్తుంచుకుని చెప్పడం చూసిన తల్లిదండ్రులు ప్రపంచపటం వైపు అడుగులు వేశారు. ఆ వివరాలేంటో తెలుసుకుందాం...

- సాక్షి, సిటీబ్యూరో

వంద దేశాలను లక్ష్యంగా చేసుకుని దేశాలు, రాజధానులు, కరెన్సీల పేర్లను ప్రాక్టీస్ చేయించారు. ఆ బుడతలకు మూడేళ్లకే వంద దేశాల సమాచారం నాలుకమీద నడయాడుతుంది. అసాధారణ ప్రతిభను చూసిన తల్లిదండ్రులు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్, ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధులను సంప్రదించారు. ఇంకేముంది పిల్లల తెలివితేటలను గుర్తించిన ఆయా సంస్థల ప్రతినిధులు రికార్డుల్లో స్థానం కల్పించారు. అయితే ఇంత సమాచారాన్ని గుక్కతిప్పుకోకుండా చెప్పడం అందరికీ సాధ్యం కాదనే చెప్పాలి. భాగ్యనగరానికి చెందిన బుడుమూరు గౌతం నంది మాత్రం నాలుగున్నరేళ్లకే ఆ అసాధ్యాన్ని సుసాధ్యం చేశాడు.

దేశాలు, రాజధానులు, భారత దేశంలోని రాష్ట్రాలు, రాజధానులు, 25 జంతువుల పేర్లు, 30 మంది చారిత్రక వ్యక్తుల పేర్లు, 12 జనరల్ నాలెడ్జ్ వంటి ప్రశ్నలకు సమాధానాలు కేవలం 3.59 నిమిషాల్లో టకటకా చెప్పేశాడు. ఇంకేముంది ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్, ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించుకున్నాడు.

3.59 నిమిషాల్లో..

దీంతో పాటు పాటలు పాడటం, రామాయణం, భగవద్గీత, కొన్ని ఆధ్యాత్మిక శ్లోకాలు ఇట్టే చెప్పేస్తున్నాడు. ప్రస్తుతం మహాభారతం చదువుతున్నాడు. దీంతో పాఠశాల స్థాయిలో వివిధ రకాల పోటీల్లో చురుగ్గా పాల్గొనడం అలవాటుగా మార్చుకున్నాడు. యాజమాన్యాలు సైతం గౌతం ప్రతిభను గుర్తించి ఎక్కడ ప్రతిభ పోటీలు నిర్వహించినా తమ పాఠశాల నుంచి పాల్గొనేందుకు అవకాశం కల్పిస్తున్నాయి. ప్రస్తుతం మూడో తరగతికి వెళుతున్న గౌతం నంది తల్లిదండ్రుల ప్రోత్సాహం, యూ ట్యూబ్ సాయంతో సెల్ఫ్ లెర్నింగ్ స్కిల్స్‌లో దూసుకుపోతున్నాడు.



అన్న బాటలో తమ్ముడు...

అన్న గౌతం నంది అలవాట్లు, తెలివితేటలు తమ్ముడు కౌస్తవ్ నందికి కూడా అబ్బాయి. మూడేళ్ల వయసులోనే 50 మంది ఆవిష్కర్తల పేర్లు, భారత రాష్ట్రాలు, 10 శ్లోకాలు, 6 ఇంగ్లిష్, 5 తెలుగు నర్సరీ రిథమ్స్, 50 రకాల పండ్లు, 50 జంతువులు, 30 మంది చారిత్రక వ్యక్తుల పేర్లు, 20 జనరల్ నాలెడ్జ్ ప్రశ్నలకు సమాధానాలు చెప్పిన బుడుమూరు కౌస్తవ్ నంది ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించుకున్నాడు. ఈ పిల్లాడు ఇంకా పాఠశాలలో చేరకపోవడం విశేషం.

తల్లిదండ్రులు శ్రద్ధవహించాలి..

గౌతం నంది తెలివితేటలను ఏడాదిన్నర వయసులోనే గుర్తించాం. అందుకే ఎక్కువ సమయం కేటాయించేవాళ్లం. చెప్పేకొద్దీ తెలివితేటలు ఆశ్చర్యం కలిగించేవి. దీంతో తల్లి కల్పన ప్రత్యేకంగా శ్రద్ధ పెట్టారు. ఈ క్రమంలో ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధులను సంప్రదించాం. వారు గౌతం ప్రతిభకు గుర్తించారు. మరో ఏడాది తరువాత ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం లభించింది. కౌస్తవ్ సైతం అదే బాటలో వెళుతున్నాడు. చిన్నప్పటి నుంచే తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహిస్తే మంచి ఫలితాలు సాధించొచ్చని నమ్ముతా.

– వెంకట అప్పలనాయుడు, విద్యార్థి తండ్రి

సిటీలో అతిపెద్ద

నేషనల్ మార్ట్

సాక్షి, సిటీబ్యూరో: షాపింగ్‌ను, హైదరాబాద్ నగరాన్ని వేర్వేరుగా చూడటం దాదాపుగా సాధ్యం కాదేమో..! సిటీ లైఫ్‌స్టైల్‌లో షాపింగ్‌కు అంతటి ఆదరణ, క్రేజ్ ఉంది. ఇప్పటికే నగరంలో ఎన్నో మాల్స్, షాపింగ్ జోన్స్ ఉన్నప్పటికీ రద్దీ మాత్రం తగ్గట్లేదు. ఈ తరుణంలో ఇండియా కా హైపర్ మార్ట్‌గా పిలుచుకునే ప్రతిష్టాత్మక 'నేషనల్ మార్ట్'ను నగరంలో తాజాగా ప్రారంభించారు. షాపింగ్ ప్రియుల అవసరాలను తీర్చడానికి సుచిత్ర–మేడ్చల్ మధ్య 40 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో నేషనల్ మార్ట్ ఏర్పాటైంది. ఈ మార్ట్ వేదికగా కిరాణా సరుకులు, పానీయాలు, వ్యక్తిగత సంరక్షణ, స్టేషనరీ, గృహ–వంటగది ఉపకరణాలు, పాదరక్షలు, దుస్తులు అందుబాటులోకి వచ్చాయి. అంతేకాకుండా సిటీ లైఫ్ స్టైల్‌కు ప్రతీకగా వినూత్న ఫ్యాషన్ శ్రేణులతో స్టైల్ మార్ట్‌ని సైతం పరిచయం చేస్తున్నామని నేషనల్ మార్ట్ వ్యవస్థాపకుడు యష్ అగర్వాల్ తెలిపారు. అవాంతరాలు లేని షాపింగ్ కోసం 24 బిల్లింగ్ కౌంటర్లను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. వినియోగదారులందరికీ షాపింగ్‌ను మరింత అందుబాటులోకి తీసుకురావడానికి ప్యాకెట్ ఫ్రెండ్లీ ధరలతో సేవలందిస్తున్నామని యష్ వివరించారు.





నేడు మహానేత వైఎస్సార్ 75వ జయంతి

- ఏపీవ్యాప్తంగా ఘనంగా నిర్వహించేందుకు వైఎస్సార్‌సీపీ ఏర్పాట్లు
- ఇడుపులపాయలో నివాళులర్పించనున్న మాజీ సీఎం వైఎస్ జగన్



సాక్షి, అమరావతి: దివంగత ముఖ్యమంత్రి, మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి 75వ జయంతిని సోమవారం రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించేందుకు వైఎస్సార్‌సీపీ సిద్ధమైంది. రక్తదానం, పేదలకు వస్త్రాల పంపిణీ, ఆస్పత్రుల్లో రోగులకు పండ్ల పంపిణీ, రహదారుల పక్కన మొక్కలు నాటడం వంటి సేవా కార్యక్రమాలను భారీ ఎత్తున చేపట్టేందుకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఏర్పాట్లు పూర్తి చేశాయి. వైఎస్సార్ జిల్లాలోని ఇడుపులపాయలో మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి సమాధి వద్ద వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నివాళులు అర్పించనున్నారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో వైఎస్సార్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు.

వైఎస్సార్ మహోన్నత నాయకుడు

ఆయన స్మృతిపై రోజూ విచారిస్తూనే ఉన్నాం
ఏఐసీసీ అగ్రనేత సోనియాగాంధీ



సాక్షి, న్యూఢిల్లీ: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి నిజమైన దేశభక్తుడని, మహోన్నత నాయకుడని ఏఐసీసీ అగ్రనేత సోనియాగాంధీ కొనియాడారు. మహానేత వైఎస్సార్ 75వ జయంతిని పురస్కరించుకొని ఆమె ఆదివారం ఓ సందేశం విడుదల చేశారు. 'డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి భారతదేశ మహోన్నత నాయకుడు. దేశానికి, రాష్ట్రానికి, ప్రజలకు, కాంగ్రెస్ పార్టీకి నిస్వార్థంగా, అంకితభావంతో సేవ చేసిన నిజమైన దేశభక్తుడు. మంచి వ్యక్తిగా, విలువలు ఉన్న సహచరుడిగా వైఎస్సార్ పట్ల మాకు అత్యంత గౌరవం ఉంది. పార్టీ కోసం కలిసి పనిచేసిన గత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటున్నా. ప్రజలకు గొప్ప సేవ చేసిన ఆ మహానేత లేరని మనమంతా ప్రతిరోజూ విచారిస్తూనే ఉన్నాం. వైఎస్సార్ దార్శనికత, మార్గదర్శకత్వం నుంచి స్ఫూర్తి పొందుదాం. వైఎస్సార్ జ్ఞాపకాలను కాంగ్రెస్ ఎల్లప్పుడూ గౌరవిస్తోంది. గొప్ప ప్రజా సేవకు బాటలు వేసిన వైఎస్సార్‌కు 75వ జయంతి సందర్భంగా ధన్యవాదాలు తెలుపుతున్నా' అని సోనియాగాంధీ పేర్కొన్నారు.

ఆ మూడు ఘట్టాలు నా జీవితంలో మరువలేను

టీపీసీసీ అధ్యక్షుడిగా మూడేళ్లు పూర్తయిన సందర్భంగా సీఎం రేవంత్ ట్వీట్



సాక్షి, హైదరాబాద్: టీపీసీసీ అధ్యక్షుడిగా తనకు సహకరించిన పార్టీ నేతలు, కార్యకర్తలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. 'తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షు డిగా బాధ్యతలు స్వీకరించి ఆదివారంతో మూ డు వసంతాలు పూర్తయ్యాయి. నాడు నాపై ఎంతో నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన సోనియాగాంధీ, కాంగ్రెస్ అగ్రనేతలందరికీ కృతజ్ఞతలు. టీపీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించడం , సోనియాగాంధీ సారథ్యంలో విజయభేరీ సభ నిర్వహించడం, నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆశీర్వాదంతో ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించడం... మూడేళ్లలో ఈ మూడు ఘట్టాలు నా జీవితంలో మరువలేని సందర్భాలు. ఈ ప్రస్థానంలో నాకు సహకరించిన పార్టీ సీనియర్ నేతలు, పార్టీ అధికారంలోకి రావడానికి కఠోర శ్రమ చేసిన లక్షలాది మంది కార్యకర్తలు, కాంగ్రెస్ పార్టీని గెలిపించి ప్రజాపాలనకు నాంది పలికిన నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు ధన్యవాదాలు.' అని ఆ ట్వీట్‌లో రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

పంటల బీమాకు 'పాతే'ర!

ఉచితానికి ఉద్వాసన.. పాత పద్ధతి వైపు సర్కారు చూపు • ఏపీ సీఎం చంద్రబాబు నిర్ణయంతో రైతన్న గుండెల్లో గుబులు

సాక్షి, అమరావతి: ఇన్నాళ్లూ తమపై పైసా భారం పడకుండా కష్టకాలంలో ఆదుకున్న డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమాకు పాతరేసే దిశగా టీడీపీ సర్కారు సన్నద్ధం కావడం అన్నదాతల్లో ఆందోళన రేకెత్తిస్తోంది. 'సంక్షేమ పథకాలన్నీ కొనసాగిస్తాం.. ఏ ఒక్కటీ ఆపే ప్రసక్తే లేదు. ఇంకా మెరుగైన రీతిలో అమలు చేస్తాం' అని ఎన్నికల ప్రచార సభల్లో హామీలిచ్చిన చంద్రబాబు, పవన్ కల్యాణ్, ఇతర కూటమి నేతలు వాటిని గాలికి వదిలేశారు. రైతులకు మేలు చేసే వ్యవసాయ సలహా మండళ్లను రద్దు చేసిన కూటమి సర్కారు కన్ను తాజాగా వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకంపై పడింది. ఈ – క్రాప్ నమోదు ప్రామాణికంగా నోటిఫై చేసిన ప్రతీ పంటకు, సాగు చేసిన ప్రతీ ఎకరాకు యూనివర్సల్ బీమా కవరేజ్ కల్పిస్తూ ఈ పథకం దేశానికే తలమానికంగా నిలిచింది. అయితే 2019కి ముందు అమలులో ఉన్న పాత పంటల బీమా పథకాన్ని పునరుద్ధరిస్తున్నట్టు తొలి సమీక్షలో సీఎం చంద్రబాబు చేసిన ప్రకటన రైతన్నల గుండెల్లో గుబులు రేపింది. గత ఐదేళ్లుగా తాము కట్టాల్సిన ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లించి పైసా భారం లేకుండా ఏ సీజన్‌లో జరిగిన పంట నష్టానికి బీమా పరిహారాన్ని మరుసటి ఏడాది అదే సీజన్ ప్రారంభానికి ముందే నేరుగా తమ ఖాతాల్లో జమ చేసే పరిస్థితి ఇక ఉండదన్న ఆందోళన వారికి కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. టీడీపీ సర్కారు తన నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకుని ఉచిత పంటల బీమా పథకాన్ని కొనసాగించాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. లేదంటే ఉద్యమ బాట పట్టక తప్పదని హెచ్చరిస్తున్నాయి.

ఏళ్ల తరబడి ఎదురు చూపులు..

1965లో కేంద్రం తెచ్చిన క్రాప్ ఇన్స్యూ బిల్లు ఆధారంగా ప్రవేశపెట్టిన మోడల్ ఇన్స్యూ పథకం వివిధ రూపాలు మార్చుకుని ప్రధాని ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై)గా 2016 నుంచి దేశవ్యాప్తంగా అమలవుతోంది. దీని ప్రకారం నోటిఫై చేసిన వ్యవసాయ పంటలకు ఖరీఫ్‌లో 2 శాతం, రబీలో 1.5 శాతం, వాణిజ్య పంటలకు 5 శాతం చొప్పున రైతులు ప్రీమియం చెల్లించగా మిగిలిన మొత్తాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమానంగా భరించాయి. అయితే ప్రీమియం భారం అధికంగా ఉండడంతో పాటు అవగాహన లేక పలువురు రైతులు సొంతంగా బీమా చేయించుకునేందుకు ముందుకొచ్చేవారు కాదు. రుణాలు తీసుకునే రైతులకు మాత్రం బ్యాంకులు ప్రీమియం రూపంలో నిర్దేశించిన మొత్తాన్ని మినహాయించుకొని మిగతాది అందచేసేవి. అయితే బీమా చేయించుకున్న వారు సైతం ఎంతొస్తుంది? ఎప్పుడొస్తుందో అంతుబట్టక ఏళ్ల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది.



రూ.4 లక్షల బీమా పరిహారం అందుకున్నా..



పసుపు, కంద, అరటి, తమలపాకు సాగు చేస్తుంటా. వైఎస్సార్ ఉచిత పంటల బీమా రైతులకు ఎంతో బాసటగా నిలిచింది. గత ఐదేళ్లలో పైసా ప్రీమియం చెల్లించకుండా రూ.4 లక్షలకు పైగా బీమా పరిహారం పొందా. రూ.2 లక్షల వరకు పంట నష్ట పరిహారం (ఇన్‌పుట్ సబ్సిడీ) అందుకున్నా. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా పరిహారం జమైంది. రైతాంగానికి ఎంతో ఆసరాగా ఉన్న పథకాన్ని రద్దు చేసి 2019కి ముందు ఉన్న విధానం అమలు చేయాలని నిర్ణయించడం సరికాదు. ఉచిత పంటల బీమా పథకాన్ని కొనసాగించాలి.

– ముత్తిరెడ్డి శ్రీనివాసరావు, కిష్కిందపాలెం, బాపట్ల జిల్లా

2014–19 పరిహారం రూ.3,411.20 కోట్లే

చంద్రబాబు గతంలో అధికారంలో ఉన్నప్పుడూ కేంద్ర పథకాలపై ఆధార పడడం మినహా అన్నదాతల సంక్షేమం కోసం తపించిన దాఖలాలు లేవు. 2014–19 మధ్య తొలి రెండేళ్లు వ్యవసాయ ఇన్స్యూ స్కీమ్(ఏఐఎస్), ఆ తర్వాత పీఎంఎఫ్‌బీవై అమలు చేశారు. ప్రీమియం రూపంలో 2014–19 మధ్యలో రైతులు తమ వాటాగా రూ.1249.90 కోట్లు చెల్లిస్తే, రాష్ట్ర ప్రభుత్వం రూ.1281 కోట్లు చెల్లించింది. హుద్‌హుద్ లాంటి పెను తుపాన్, కరువు కాటకాలతో రూ.వేల కోట్ల పంటలను కోల్పోయిన రైతులకు 2014–19 మధ్య దక్కిన పరిహారం కేవలం రూ.3,411.20 కోట్లు మాత్రమే.

పైసా భారం పడకుండా..

పాదయాత్ర హామీ మేరకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019 జూలై 8న వైఎస్సార్ ఉచిత పంటల బీమాకు శ్రీకారం చుట్టారు. తొలి ఏడాది పీఎం ఎఫ్‌బీవైతో అనుసంధానించి అమలు చేశారు. 2019 ఖరీఫ్ సీజన్‌లో రూపాయి ప్రీమియంతో పథకానికి శ్రీకారం చుట్టగా అనంతరం ఆ భారం కూడా రైతులపై పడకూడదన్న ఆలోచనతో ఖరీఫ్–2020 నుంచి నోటిఫైడ్ పంటలకు ఉచితంగా బీమా కవరేజ్ కల్పించారు. క్లెయిమ్‌లు, సెటిల్‌మెంట్లు, చెల్లింపుల బాధ్యతను కూడా ప్రభుత్వం తన భుజాన వేసుకుంది. తొలి ఏడాది రైతుల వాటా (రూ.468 కోట్ల)తో కలిపి ప్రీమియం రూపంలో వైఎస్ జగన్ ప్రభుత్వం రూ.971 కోట్లు బీమా కంపెనీలకు చెల్లించింది. యూనివర్సల్ కవరేజ్‌కు కేంద్రం ముందుకు రాకపోవడంతో 2020–21, 2021–22 సీజన్లలో పీఎం ఎఫ్‌బీవైతో సంబంధం లేకుండా మొత్తం బీమా పరిహారం ప్రభుత్వమే చెల్లించింది. 2022–23 నుంచి ఫసల్ బీమాతో అనుసంధానించి వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేశారు. వాతావరణ ఆధారిత పంటలకు మాత్రం గత ప్రభుత్వం సొంతంగానే బీమా పరిహారం చెల్లించింది.

ఈ క్రాప్ ప్రామాణికంగా..

ఈ క్రాప్‌తో పాటు ఈ కేవైసీ నమోదు ప్రక్రియ పూర్తి కాగానే గత ప్రభుత్వం ఉచిత పంటల బీమా పథకం వర్తించే నోటిఫై చేసిన పంటలకు (స్టార్) గుర్తుతో ప్రత్యేకంగా తెలియచేస్తూ రైతులకు భౌతిక రసీదు అందచేసింది. 'డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం కింద నోటిఫై చేసిన పంటకు ప్రీమియంను పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించి పంట బీమా చేసింది' అని అందులో స్పష్టంగా తెలియచేసింది. ఈ జాబితాలను సామాజిక తనిఖీల్లో భాగంగా ఆర్బీకేల్లో ప్రదర్శించి అభ్యంతరాలను పరిష్కరించి అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ బీమా పరిహారం అందచేసింది. ప్రీమియం రూపంలో రైతుల వాటాతో కలిపి 2019–24 మధ్య వైఎస్ జగన్ ప్రభుత్వం రూ.3,022.26 కోట్లు కంపెనీలకు చెల్లించింది. 2019–24 మధ్య 1.91 కోట్ల హెక్టార్లకు బీమా కవరేజీ కల్పించగా 2.04 కోట్ల మంది రైతులకు బీమా రక్షణ లభించింది.

రికార్డు స్థాయిలో పరిహారం..

2014–19 మధ్య 30.85 లక్షల మందికి రూ.3411.20 కోట్ల పరిహారం చెల్లిస్తే 2019–24 మధ్య 54.55 లక్షల మందికి రూ.7,802.05 కోట్ల బీమా పరిహారం అందింది. టీడీపీ హయాంలో 6.19 లక్షల మంది రైతులకు చంద్రబాబు ఎగ్గొట్టిన రూ.715.84 కోట్ల బకాయిలు కూడా చెల్లించి గత సర్కారు అండగా నిలిచింది. ఐదేళ్లలో టీడీపీ ప్రభుత్వం చెల్లించిన బీమా మొత్తం కంటే రూ.3,273.64 కోట్ల మేర అదనంగా లబ్ధి చేకూర్చగా 13.81 లక్షల మంది రైతులు అదనంగా ప్రయోజనం పొందారు.

ఏపీ బాటలో పలు రాష్ట్రాలు..

వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకాన్ని దేశంలోనే అత్యుత్తమ పంటల బీమా పథకంగా కేంద్రం గుర్తించింది. ఇన్నోవేషన్ కేటగిరి కింద ఉత్తమ బీమా పథకంగా ఎంపిక చేసింది. 2023 ఏప్రిల్ 14న కేంద్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి మనోజ్ అహూజా రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక ప్రశంసా పత్రాన్ని అందించారు. ఏపీ స్ఫూర్తిగా జాతీయ స్థాయిలో పీఎంఎఫ్‌బీవైలో పలుమార్పులు చేసినట్టుగా కేంద్రం ప్రకటించింది. ఏపీ తరహాలో మిగిలిన రాష్ట్రాలు కూడా అమలు చేయాలని సూచించింది. 2023–24 నుంచి మహారాష్ట్ర, మేఘాలయ, ఒడిశా, పుదుచ్చేరి తదితర రాష్ట్రాలు ఏపీ బాటలోనే రూపాయి ప్రీమియంతో పంటల బీమా అమలుకు శ్రీకారం చుట్టాయి. ఉచిత పంటల బీమా పథకాన్ని కేంద్రం సహా పలు రాష్ట్రాలు ప్రశంసించాయి.

రూ.1,278.80 కోట్ల ప్రీమియం చెల్లింపులకు ఎగనామం..

2023–24 సీజన్‌కు సంబంధించి బీమా కవరేజ్ పరిధిలోకి వచ్చిన అర్హుల జాబితాను గతంలోనే కేంద్రానికి పంపించారు. ఆ మేరకు రైతుల వాటాతో కలిపి రాష్ట్ర ప్రభుత్వం రూ.1,278.80 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఎన్నికల కోడ్ అమలులోకి రావడం, ప్రభుత్వం మారడంతో ప్రీమియం చెల్లించాల్సిన బాధ్యత టీడీపీ సర్కారుపై ఉంది. అయితే పాత పద్ధతిలోనే పంటల బీమా అమలు చేస్తామని ప్రకటించడం ద్వారా 2023–24 సీజన్ ప్రీమియం చెల్లింపులు జరపవద్దని అధికారులకు సీఎం చంద్రబాబు సంకేతాలిచ్చారు. దీంతో 2023–24 సీజన్‌లో వర్షాభావం, వైపరీత్యాల వల్ల పంటలు నష్టపోయిన రైతులకు బీమా పరిహారం అందే పరిస్థితి కనిపించడం లేదు. మరోవైపు 2024–25 సీజన్ నుంచి రైతులే చెల్లించేలా చూడాలంటూ మౌఖిక ఆదేశాలు ఇవ్వడంతో వారిపై పెనుభారం పడనుంది.

రైతులపై ఏటా రూ.800 కోట్లకుపైగా భారం

ఏ పంటైనా సరే జిల్లాలో కనీసం ఐదువేల ఎకరాల్లో సాగైతేనే నోటిఫై చేస్తారు. నోటిఫై చేసిన పంట పెట్టుబడి ఖర్చులను బట్టి బీమా కంపెనీలు ప్రీమియం నిర్దేశిస్తాయి. ఉదాహరణకు వరికి ఎకరాకు రూ.40 వేలు ఖర్చవుతుంటే కనీసం 8 శాతం అంటే రూ.3,200 చొప్పున ప్రీమియం చెల్లిస్తేనే బీమా కవరేజ్ కల్పిస్తుంది. ఈ మొత్తంలో ఖరీఫ్‌లో అయితే 2 శాతం, రబీలో 1.5 శాతం చొప్పున రైతులు గతంలో చెల్లించగా మిగతాది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరి సగం భరించేవి. ఈ లెక్కన నోటిఫై పంటలకు రైతులు తమ వాటాగా ఏటా కనీసం రూ.800 కోట్లకు పైగా ప్రీమియం రూపంలో భరించాల్సి ఉంటుంది. బ్యాంకుల నుంచి రుణాలు పొందని కౌలు రైతులు, సన్న, చిన్నకారు రైతులు సొంతంగానే ప్రీమియం చెల్లించాలి. వీరికి అవగాహన కల్పించకపోవడం, ఆర్థిక భారం కారణంగా బీమాకు ముందుకు రావడం లేదు. దీంతో పంట నష్టపోతే విపత్తుల వేళ బీమా పరిహారం అందని దుస్థితి నెలకొంటుంది. వైఎస్సార్ రైతు భరోసాను హడావుడిగా అన్నదాతా సుఖీభవగా మార్చేసి రూ.20 వేలు ఇవ్వకుండా ఇప్పటికే సీజన్‌లో అన్నదాతలను ముంచేసిన టీడీపీ సర్కారు ఇప్పుడు ఉచిత పంటల బీమాను కూడా రద్దు చేసే దిశగా అడుగులు వేయడం పిడుగుపాటుగా మారింది.

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

అండగా ఉంటాం.. ఆందోళనొద్దు

- వైఎస్సార్‌సీపీ శ్రేణులకు ధైర్యం చెప్పిన ఏపీ మాజీ సీఎం జగన్
- దుర్మార్గ సంప్రదాయానికి టీడీపీ బీజం వేస్తోంది
- హామీలను విస్మరించి దాడులను ప్రోత్సహిస్తోంది
- అధైర్య పడొద్దు.. బాధితులందరినీ కలుస్తా
- టీడీపీ దౌర్జన్యాలను దీటుగా ఎదుర్కొందాం
- మన కాలం వస్తుంది.. ఓపిగ్గా ఉండండి



పార్టీ నేతలతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్

సాక్షి ప్రతినిధి, కడప: 'టీడీపీ వర్గీయులు అరాచకాలు సృష్టిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులను టార్గెట్ చేస్తూ వ్యక్తిగత దాడులు చేస్తున్నారు. కట్టడి చేయాల్సిన ప్రభుత్వం మిన్నకుండిపోయింది. ఇలా ఐదేళ్లలో మనం ఎప్పుడూ దౌర్జన్యాలు చేయ లేదు' అంటూ అనంతపురం జిల్లాకు చెందిన బాధితులు వాపోతుంటే, అధైర్య పడొద్దని.. టీడీపీ దుర్మార్గాలను ధైర్యంగా ఎదుర్కొందామని మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ శ్రేణులకు భరోసా కల్పించారు. 'మీ ప్రాంతానికి వస్తా.. మీకు అండగా నిలుస్తా.. ఆందోళన పడొద్దు, అందర్నీ కలుస్తా.. టీడీపీ దుర్మార్గాన్ని దీటుగా ఎదుర్కొందాం' అని ఊరడించారు. ఆదివారం వైఎస్సార్ జిల్లా పులివెందుల క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్ జిల్లాతోపాటు వివిధ ప్రాంతాలకు చెందిన పార్టీ శ్రేణులు, నాయకులతో ఆయన మమేకమయ్యారు. అనంతపురం జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యేలు, నేతలు కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి, అనంత వెంకట్రామిరెడ్డి, వీరాంజనేయులు, మగ్బూల్ బాషా, సాంబశివారెడ్డి తదితరులు వైఎస్ జగన్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికల ఫలితాల అనంతరం ఆ జిల్లాలో చోటుచేసుకున్న పరిణామాల గురించి వివరించారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ మాట్లాడుతూ 'పోరాటాలు మనకు కొత్త కాదు. పోరాటం నుంచే పుట్టిన పార్టీ మనది. ఎంతో కాలం టీడీపీ దౌర్జన్యాలు నడవవు. మనోధైర్యం కోల్పోవద్దు. పార్టీ శ్రేణులకు అండగా ఉండండి. టీడీపీ బాధితులను నేను స్వయంగా కలుస్తా. అండగా నిలుస్తా. టీడీపీ దౌర్జన్యాలను సహించేది లేదు. మనందరం కలసికట్టుగా ఎదుర్కొందాం. మన కాలం వస్తోంది. అంత వరకూ కేడర్‌కు భరోసా ఇవ్వాలి' అని ఆయన పార్టీ నేతలకు దిశా నిర్దేశం చేశారు.

హామీలను విస్మరించి దాడులకు ప్రోత్సాహం


'ప్రజలకిచ్చిన హామీలను విస్మరించి, చంద్రబాబు సర్కార్ వైఎస్సార్‌సీపీ కేడర్‌ను టార్గెట్ చేసి దాడులను ప్రోత్సహిస్తోంది. గతంలో ఎన్నడూ ఇలాంటి సంస్కృతి లేదు. టీడీపీ సర్కార్ వ్యక్తిగత దాడులకు ఉసిగొల్పుతోంది. ప్రజలన్నీ గమనిస్తున్నారు. ధైర్యంగా ఉండండి. పార్టీ తరుపున అండగా ఉంటాం' అని మాజీ ఎమ్మెల్యేలు ఎస్ రఘురామిరెడ్డి, డాక్టర్ సుధీర్‌రెడ్డి తదితరులతో వైఎస్ జగన్ అన్నారు. చంద్రబాబునాయుడు ఇదివరకెన్నడూ లేని రీతిలో దుర్మార్గ సంప్రదాయానికి బీజం వేస్తున్నారని, పద్ధతి మార్చుకోకపోతే ఫలితం అనుభవించక తప్పదన్నారు.

మాజీ ఎంపీపీ కుటుంబానికి పరామర్శ

వైఎస్సార్‌సీపీ లింగాల మండల కన్వీనర్, మాజీ ఎంపీపీ పెద్ద సుబ్బారెడ్డి సతీమణి లక్ష్మీనరసమ్మ ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన నేపథ్యంలో వైఎస్ జగన్ ఆదివారం పెద్దకూడాల గ్రామంలో వారి కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబ సభ్యులందర్నీ పలుకరించి, ధైర్యం చెప్పారు. లింగాల మండలానికి చెందిన వివిధ గ్రామాలకు చెందిన నాయకుల్ని పేరుపేరునా పలుకరించారు. పులివెందుల క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. చక్రాయపేట మండలం గొంది గ్రామానికి చెందిన మబ్బు రామయ్య తన పట్టా భూమిలో దౌర్జన్యంగా టీడీపీ వర్గీయులు రోడ్డు వేస్తున్నారని వాపోయారు. అడ్డుకున్న తనపైనే తప్పుడు కేసు బనాయిస్తున్నారని వివరించారు. ఈ ఘటనపై వైఎస్ జగన్ స్పందిస్తూ.. బాధితుడికి అన్యాయం చేయొద్దని పోలీసు అధికారులకు సూచించారు. జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలు ఓపికగా విన్నారు. అవసరమైన చర్యలకు సిఫారసు చేశారు. ఈ కార్యక్రమంలో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కే సురేష్‌బాబు, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గోటూరు చిన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థపై ప్రభుత్వ నిర్లక్ష్యం

- రాజకీయ అంశాలే తప్ప ప్రజాప్రయోజనాలను పట్టించుకోవట్లేదు
- మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపాటు.. సీఎం రేవంత్‌కు బహిరంగ లేఖ



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం విద్యావ్యవస్థను తీవ్ర నిర్లక్ష్యం చేస్తోందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే టి. హరీశ్‌రావు ఆరోపించారు. రాజకీయ అంశాలే తప్ప ప్రజాప్రయోజనాలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆదివారం ఆయన బహిరంగ లేఖ రాశారు. కాంగ్రెస్ పాలనలో విద్యా సంస్థల్లో అరకొర వసతులు, టీచర్లకు, పాఠ్యపుస్తకాలకు, దుస్తులకు, తాగునీటికి కొరత ఏర్పడిందని.. వేతనాల చెల్లింపు ఆలస్యం వంటి సమస్యలు విద్యావ్యవస్థను పట్టిపీడిస్తున్నాయని విమర్శించారు. విద్యాశాఖ బాధ్యతలు కూడా నిర్వర్తిస్తున్న సీఎం రేవంత్ రాజకీయ అంశాలకు అధిక ప్రాధాన్యం ఇస్తూ ప్రజాసమస్యల పరిష్కారంపై దృష్టిపెట్టట్లేదని హరీశ్‌రావు లేఖలో విమర్శించారు.

ముక్కిపోయిన బియ్యంతో విద్యార్థులకు భోజనమా?

ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసేందుకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 'మన ఊరు–మన బడి'అనే కార్యక్రమాన్ని ప్రారంభిస్తే దాన్ని కొనసాగించకుండా సీఎం నిర్లక్ష్యం చేస్తున్నారని హరీశ్‌రావు తప్పుబట్టారు. పాఠశాలలో విద్యార్థులకు సన్నబియ్యానికి బదులు ముక్కిన బియ్యంతో భోజనం పెడుతున్నారని.. విద్యార్థుల పౌష్టికాహారం కోసం అందించే కోడి గుడ్ల బిల్లులు సైతం చెల్లించని పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. ఒక్క విద్యార్థి కూడా ఆకలితో అలమటించొద్దనే మానవతా దృక్పథంతో 27 వేల పాఠశాలల్లో తమ హయాంలో ప్రారంభించిన 'సీఎం బ్రేక్ ఫాస్ట్'పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అటకెక్కించడాన్ని తప్పుబట్టారు. మొత్తంగా కాంగ్రెస్ పాలన టీచర్లకు, విద్యార్థులకు, ప్రభుత్వ పాఠశాలలకు శాపంగా మారిందని హరీశ్ దుయ్యబట్టారు. ప్రభుత్వం ఇప్పటికైనా పాఠశాల విద్యను గాడినపెట్టేందుకు చర్యలు తీసుకోవాలని, సమస్యలను పరిష్కరించాలని బహిరంగ లేఖలో హరీశ్ డిమాండ్ చేశారు.

సీఎంకు బహిరంగ లేఖలో హరీశ్ ప్రస్తావించిన పలు డిమాండ్లు

- ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం కింద విధులు నిర్వర్తిస్తున్న 54,201 మంది కుక్ కమ్ హెల్పర్లకు ఏడు నెలల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలి.
- ఏడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న భోజన బిల్లులు, కోడిగుడ్ల బిల్లులను తక్షణమే విడుదల చేయాలి.
- ఎస్జీటీల బదిలీల నేపథ్యంలో ప్రాథమిక పాఠశాలల్లో ఏర్పడ్డ సుమారు 9 వేల ఉపాధ్యాయ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి.
- ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత కరెంట్ సరఫరా చేస్తామన్న హామీని నిలబెట్టుకోవాలి.
- పాఠశాలల్లో పారిశుద్ధ్య నిర్వహణ కోసం ఏర్పాటు చేస్తామన్న సిబ్బందిని నియమించాలి.
- విద్యార్థులకు రెండు జతల యూనిఫాం అందించాలి.
- 'సీఎం బ్రేక్ ఫాస్ట్'పథకాన్ని పునఃప్రారంభించాలి.
- సర్వశిక్షా అభియాన్, ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్స్ 4 నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలి.

గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష ఫలితాలు విడుదల

- వెబ్‌సైట్‌లో 1:50 నిష్పత్తిలో అభ్యర్థుల ఎంపిక జాబితా
- అక్టోబర్ 21 నుంచి గ్రూప్–1 మెయిన్స్ పరీక్షలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో 563 గ్రూప్–1 ఉద్యోగాల భర్తీకి సంబంధించి జూన్ 9న నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్ష ఫలితాలు ఆదివారం విడుదలయ్యాయి. ఈ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థుల జాబితా తెలంగాణ పబ్లిక్‌సర్వీస్ కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంది. మెయిన్ పరీక్షలకు అభ్యర్థుల ఎంపిక 1:50 నిష్పత్తిలో చేపట్టినట్టు టీజీపీఎస్సీ తెలిపింది. 563 ఉద్యోగాలకుగాను 31,382 మంది అభ్యర్థులు మెయిన్ పరీక్షలకు ఎంపికయ్యారు. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా, మల్టీజోన్లు, కమ్యూనిటీ రిజర్వేషన్ల వారీగా అభ్యర్థుల ఎంపిక చేపట్టారు. గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షకు సంబంధించి మార్కులు, కటాఫ్ మార్కులు తదితర వివరాలను కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్టు టీజీపీఎస్సీ కమిషన్ కార్యదర్శి ఇ.నవీన్‌నికోలస్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రూప్–1 మెయిన్స్ పరీక్షలు అక్టోబర్ 21 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు వెల్లడించారు. హాల్‌టికెట్లు పరీక్షలకు వారం రోజుల ముందు కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతామన్నారు.

టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌లో ఫైనల్ కీ కూడా

జూన్ 9న నిర్వహించిన గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష ఫైనల్ కీని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆదివారం వెబ్‌సైట్‌లో అందుబాటులో పెట్టింది. గత నెలలో రాష్ట్రవ్యాప్తంగా 31 జిల్లాల్లో ఈ పరీక్ష నిర్వహించిన కమిషన్... ప్రిలిమినరీ కీతో పాటు మాస్టర్ క్వశ్చన్ పేపర్‌ను అభ్యర్థుల లాగిన్‌లో అందుబాటులో ఉంచింది. ఆ తర్వాత అభ్యర్థుల నుంచి అభ్యంతరాలు స్వీకరించిన కమిషన్..విషయ నిపుణుల కమిటీని ఏర్పాటు చేసి వారితో చర్చించి తుది కీని తయారు చేసింది. ఈ కీని వెబ్‌సైట్‌లో అందుబాటులో పెట్టినట్టు కమిషన్ కార్యదర్శి ప్రకటనలో తెలిపారు. అభ్యర్థుల స్కాన్డ్ ఓఎంఆర్ పత్రాలు సైతం కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి.

అర్ధరాత్రి ఇండోర్ స్టేడియం కూల్చివేత

పుంగనూరులో కూటమి నేతల పైశాచిక ఆనందం

- హిటాచీలు, జేసీబీలతో విధ్వంసం
- దాదాపు రూ.కోటి విలువైన ఆస్తి నష్టం
- కులమతాలు, పార్టీలకు అతీతంగా నిర్మించిన స్టేడియం కూల్చివేతపై జనాగ్రహం

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి



ధ్వంసమైన ఇండోర్ స్టేడియం

మధ్యాహ్న భోజన బకాయిలు చెల్లించాం

హరీశ్‌రావు లేఖపై విద్యాశాఖ స్పందన

హైదరాబాద్: మధ్యాహ్న భోజన బిల్లులకు సంబంధించి గత డిసెంబర్ నాటికి ఉన్న రూ. 50 కోట్ల బకాయిలతోపాటు అదనంగా రూ. 50.45 కోట్లను విడుదల చేసినట్టు విద్యా శాఖ స్పష్టం చేసింది. మరో రూ. 53.07 కోట్లు త్వరలోనే విడుదల కానున్నాయని పేర్కొంది. విద్యాశాఖ సమస్యలపై స్పందించాలంటూ సీఎం రేవంత్‌కు మాజీ మంత్రి హరీశ్‌రావు రాసిన లేఖకు ఈ మేరకు స్పందించింది. రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా మొత్తం 26 వేల పాఠశాలల్లో తొలిరోజే విద్యార్థులందరికీ ఒక జత యూనిఫాం అందజేశామని, రెండో జత యూనిఫాం ఈ నెలాఖరుకు అందిస్తామని విద్యాశాఖ తెలిపింది. గత ప్రభుత్వం బడ్జెట్ కేటాయించకుండానే సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని ప్రారంభించిందని, అయినప్పటికీ మార్చి నాటికి పెండింగ్‌లో ఉన్న సీఎం బ్రేక్ ఫాస్ట్ బకాయిలు రూ. 3.5 కోట్లను విడుదల చేసినట్టు వెల్లడించింది.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
సోమవారం ॥ 8-7-2024

తెలంగాణలో ముఖ్యంగా హైదరాబాద్‌లో గ్రామదేవతలకు ప్రతియేటా ఆషాఢమాసంలో పూజలు జరిపి, బోనాలు సమర్పించే ఈ సంప్రదాయం ఎనిమిది వందల ఏళ్లుగా వస్తోంది. నగర వాతావరణంలో ఎన్ని హంగులు, ఆర్భాటాలు మార్పులు చేర్పులు చోటు చేసుకున్నా, కాలగమనంలో సంప్రదాయక పండుగలెన్నో పేరు తెలీకుండా అదృశ్యమై పోతున్నా, ఈ బోనాల వేడుకలు మాత్రం అలనాటి ఆచార సంప్రదాయాలతో వైభవోపేతంగా నేటికీ కొనసాగుతుండడం విశేషం.

ఆషాఢ బోనాలు

అమ్మా బైలెల్లినాదో...



మూసీ నది వరదల కారణంగా అంటువ్యాధులకు ఆలవాలమైన నగరంలో నాటి హైదరాబాద్ రాష్ట్ర ప్రధాని మహారాజా కిషన్‌ప్రసాద్ సలహా మేరకు నిజాం మీర్ మహబూబ్ అలీఖాన్ లాల్‌దర్వాజ సమీపంలోని అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించి చార్మినార్ వద్దకు చేరిన వరద నీటిలో పసుపు, కుంకుమ, గాజులు, పట్టువస్త్రాలు సమర్పించాడట. అప్పటికి అమ్మ తల్లి శాంతించి నగరంలో ప్రశాంత వాతావరణం నెలకొనడంతో నవాబులే బోనాల ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు.

ఎందుకు సమర్పిస్తారు?

ఆషాఢమాసమంటే వర్షాకాలం.. అంటే అంటువ్యాధులకు ఆలవాలమైన మాసం. కలరా, ప్లేగు, మశూచి, క్షయ, తట్టు, పొంగు, అమ్మవారు వంటి అంటువ్యాధుల బారిన పడకుండా గ్రామదేవతలు గ్రామాలను చల్లంగా చూసేందుకే బోనాలు సమర్పిస్తారు.

అచ్చ తెలంగాణ జానపదాలు బోనాలపాటలు

ఆడమగ, చిన్న పెద్ద, ధనిక బీద తారతమ్యం లేకుండా ఆనందంతో చిందులేస్తూ చెవులకింపైన అచ్చ తెలంగాణ జానపదాలు ''గండిపేట గండెమ్మా దండ బెడత ఉండమ్మా....., బోనాలంటే బోనాలాయే బోనాల మీద బోనాలాయే....., అమ్మా బైలెల్లినాదే....అమ్మా సల్లంగ సూడమ్మ..... మైసమ్మా మైసమ్మా.... వంటి పాటలు, పోతురాజుల నృత్యవిన్యాసాలు, శివసత్తుల చిందులు చూపరులను అలరిస్తాయి.

అమ్మవార్లకు సోదరుడు పోతురాజు

పోతురాజు అంటే అమ్మవారికి సోదరుడు. తమ ఇంటి ఆడపడుచును ఆదరించేందుకు, ఆమెకు సమర్పించే ఫలహారపు బండ్లకు కాపలా కాసేందుకు విచ్చేసే పోతురాజులు నృత్యవిన్యాసాలు చేస్తారు. చిన్న అంగవస్త్రాన్ని ధరించి ఒళ్ళంతా పసుపు రాసుకుని కాళ్ళకు మువ్వల గజ్జెలు, బుగ్గన నిమ్మపండ్లు, కంటికి కాటుక, నుదుట కుంకుమ దిద్దుకుని మందంగా పేనిన పసుపుతాడును కొరడాగా ఝళిపిస్తూ, తప్పెట్ల వాయిద్యాలకు అనుగుణంగా గజ్జెల సవ్వడి చేస్తూ లయబద్ధంగా పాదాలు కదుపుతూ కన్నుల పండుగ చేస్తారు.

బోనం అంటే...

భోజనం అని అర్థం కలిగిన బోనం దేవికి సమర్పించే నైవేద్యం. మహిళలు వండిన అన్నంతో పాటు పాలు, పెరుగు, బెల్లం, కొన్నిసార్లు ఉల్లిపాయలతో కూడిన బోనాన్ని మట్టి లేక రాగి కుండలలో తమ తలపై పెట్టుకుని, డప్పుగాళ్ళు, ఆటగాళ్ళు తోడ్కొని రాగా దేవి గుడికి వెళ్తారు. మహిళలు తీసుకెళ్ళే ఈ బోనాల కుండలను చిన్న వేప రెమ్మలతో, పసుపు, కుంకుమ లేక కడి (తెల్ల ముగ్గు) తో అలంకరించి, దానిపై ఒక దీపం ఉంచుతారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత బోనాలను రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్నారు.

గోల్కొండ జగదంబికదే తొలిబోనం

బోనాల మొదట వేడుకలు గోల్కొండ జగదాంబిక ఆలయంలో ఆరంభమవడం ఆచారం. తర్వాత ఉజ్జయినీ మహంకాళి ఆలయంలో. ఇక ఆ తర్వాత అన్నిచోట్లా బోనాల సంరంభం మొదలవుతుంది. సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో ఒక్కోరోజు ఆషాఢ ఘటోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఘటాల ఊరేగింపు తర్వాతే బోనాల వేడుకలు ప్రారంభమవుతాయి. గోల్కొండ జగదాంబిక ఆలయంలో మొదలైన ఉత్సవాలు తిరిగి ఆ అమ్మకు సమర్పించే తుదిబోనంతో ముగియడం ఆచారం.

ఇంటి ఆడబిడ్డ లెక్క

ఆషాఢ మాసంలో దేవి తన పుట్టింటికి వెళుతుందని నమ్మకం. అందుకే భక్తులు ఈ పండుగ సమయంలో దేవిని దర్శించుకుని తమ స్వంత కూతురు తమ ఇంటికి వచ్చిన భావనతో, భక్తి శ్రద్ధలతోనేగాక, ప్రేమానురాగాలతో బోనాలను ఆహార నైవేద్యంగా సమర్పిస్తారు. ఈ తంతును ఊరడి అంటారు. వేర్వేరు ప్రాంతాల్లో పెద్ద పండుగ, ఊరపండుగ వంటి పేర్లతో పిలిచేవారు. ఊరడే తర్వాతి కాలంలో బోనాలుగా మారింది.

బోనాల పండుగ సందోహం గోల్కొండ కోటలోని గోల్కొండ ఎల్లమ్మ ఆలయం వద్ద మొదలయ్యి లష్కర్ బోనాలుగా పిలువబడే సికింద్రాబాదులోని ఉజ్జయిని మహంకాళి ఆలయం, బల్కంపేట్ లోని ఎల్లమ్మ దేవాలయాల మీదుగా పాతబస్తీ ప్రాంతానికి చేరుకుంటుంది. ఆషాడంలోనే కాకుండా కొన్ని ప్రాంతాల్లో శ్రావణంలో కూడా జరుపుకుంటారు.

– డి.వి.ఆర్. భాస్కర్

ధర్మ జిజ్ఞాస



కలిపురుషుడు... కల్కి అవతారం

మనం ఏదైనా పూజాది కార్యక్రమాలలో సంకల్పం చెప్పుకునేప్పుడు కలియుగే, ప్రథమ పాదే అని చెప్పుకుంటాం. అంటే కలియుగం మొదటి నాలుగవ వంతులో అని అర్థం. కలియుగంపైన అధికారం కలిపురుషుడిది. అతడి పెత్తనంలో ఉండే కలియుగ లక్షణాలని కొద్దిగానో, విపులంగానో అన్ని పురాణాలు ప్రస్తావించాయి. ధర్మం ఒక పాదం అంటే నాలుగవ వంతు మాత్రమే ఉంటుంది, మూడు పాళ్ళు అధర్మమే ఉంటుంది. అది మరింత పెచ్చు పెరిగి సజ్జనులు బతక లేని పరిస్థితి వచ్చినప్పుడు శ్రీమహావిష్ణువు దుష్టసంహారం చేసి, శిష్టరక్షణ చేయటానికి భూమిపై అవతరిస్తాడు. ఆ అవతారం పేరు కల్కి.

శంబల అనే గ్రామంలో విష్ణుయశుడు అనే సదాచార సంపన్నుడైన నైష్ఠిక బ్రహ్మణుడికి, సుమతికి జన్మించి, పద్మావతి అనే సింహళ రాజకన్యని వివాహమాడి, తెల్లని గుర్రాన్ని అధిరోహించి ఖడ్గం ధరించి దుష్టసంహారం చేస్తాడు. భూ భారాన్ని తగ్గిస్తాడు – ఇదీ పురాణాలన్నింటి క్లుప్తసారాంశం. ఈ అవతారం కలియుగం చివరలో వస్తుంది. త్రేతాయుగం చివరలో రామావతారం, ద్వాపరయుగం చివరలో కృష్ణావతారం వచ్చినట్టు.

కల్కి ఎప్పుడు అవతరిస్తాడు? కలి విజృంభించినప్పుడు కల్కి అవతరిస్తాడు, యుగాంతంలో. యుగాంతం అనగానే సృష్టి అంతా జలమయం అయిపోయి ఏమీ లేని స్థితి అని అర్థం కాదు. కలి లక్షణాలు కలవారు, కలిప్రభావితులు నమసిపోతారు. కృతయుగంలో ఉండదగిన వారు మిగిలి ఉంటారు.

కలి లక్షణాలు: పరీక్షిత్తు పరిపాలన చేస్తున్న కాలంలో కురుజాంగల దేశాలలో పర్యటిస్తూ ఒంటికాలితో సంచరిస్తున్న వృషభరూపంలో ఉన్న ధర్మదేవుడు, గోరూపంలో ఉన్న భూమాతల సంభాషణ విన్నాడు. గోమాత కన్నీరు కార్చటానికి కారణం ధర్మదేవుడు అడిగాడు. ''దేహం వ్యాధిగ్రస్తమై, ముఖం వాడిపోయి ఉన్నాయి. బంధువులకి ఆపద కలిగిందా? మూడు కాళ్ళు లేని నన్ను పట్టుకుంటారని బాధపడుతున్నావా? ఇక ముందు లోకమెట్లా ఉంటుందో తలుచుకుని దుఃఖిస్తున్నావా?'' అని గోవు భయానికి కారణాలని అడుగుతాడు. అవి కలియుగ లక్షణాలు. 1. యజ్ఞాలు లేక దేవతలకి హవిస్సులు అందవు. 2. భర్తలు భార్యలను భరించరు. 3. పిల్లలు తల్లితండ్రులను పోషించరు. 4. సరస్వతి చెడ్డవారిని ఆశ్రయిస్తుంది. 5 ఉత్తమ విప్రులు రాజులకి సేవ చేస్తారు. 6. ఇంద్రుడు వానలు కురిపించడు. 7. దేశంలో న్యాయం నశించి పోతుంది. 8. మానవులు ఆహార నిద్రా భయ మైథునాదుల పట్ల మాత్రమే ఆసక్తి కలిగి ఉంటారు. 9. నీచులు పరిపాలిస్తూ ఉంటారు.

''ఇదంతా కృష్ణుడు శరీరం వదలటం వల్ల జరిగింది. నీవు కూడా ఒక్క కాలితో కుంటుతూ ఉన్నావు. కలిపురుషుడి ప్రేరణతో భయంకర పాపకృత్యాలని చేస్తున్న మానవులని చూస్తే దుఃఖం కలుగుతోంది. దేవతలకు, పితృదేవతలకు, ఋషులకు, నాకు, నీకు, నానా వర్ణాశ్రమాలకి, గోవులకి బాధ కలుగుతోంది.'' అని తన బాధకి కారణాన్ని చెప్పింది గోరూపధారి అయిన భూదేవి. ఇది కలి ప్రభావం యొక్క ఫలితం.

పరీక్షిత్తు ధర్మదేవుణ్ణి, భూదేవిని సముదాయించి, కలితో కఠినంగా మాట్లాడుతూ కత్తి తీశాడు. భయపడిన కలిపురుషుడు రాజచిహ్నాలని వదలి పరీక్షిత్తు కాళ్ళమీద పడి దయ తలచమని ప్రార్థించాడు. పరీక్షిత్తు అతడిని చంపక ధర్మవర్తనులు ఉండే తన రాజ్యం వదలి దూరంగా పొమ్మన్నాడు. కలిపురుషుడు తాను ఎక్కడ ఉండాలో చెప్పమని ప్రార్థించాడు. పరీక్షిత్తు అతడు ఉండటానికి నాలుగు ప్రదేశాలని సూచించాడు. అవి జూదం, మద్యపానం, ప్రాణివధ, స్త్రీ (పరస్త్రీ వ్యామోహం) ఉన్న చోట్లు. అవి చాలవు మరికొన్ని కావాలని అడిగాడు. బంగారం అనే ఐదో చోటు కూడా కలికి ఇచ్చాడు. బంగారంతో వచ్చే అసత్యం, గర్వం, కామం, హింస, వైరం అనే మరొక ఐదు స్థానాలు కలి నివాసాలు అయ్యాయి.

ఇప్పుడే ఇట్లా ఉంటే, చివరి నాలుగోవంతు సమయంలో ఎట్లా ఉంటుందో? అని భయం అక్కర లేదు. ధర్మమార్గంలో చరించే వారి దగ్గరకు కలిపురుషుడు రాడు. అధర్మమార్గంలో ఉండే వారిని చక్కజేసి, ప్రేరేపించే వారిని మట్టుపెట్టటానికి కల్కి రానే వస్తాడు.

కలి ఉంటే ప్రపంచం ఎట్లా ఉంటుందో గోవు మాటల్లో తెలిసింది. ఈ లక్షణాలు మానవులలో కొద్దిగానైనా ఉంటాయి. అవి కృతయుగంలో నామ మాత్రంగా ఉంటే, త్రేతాయుగంలో సగానికి సగం ఉంటే, ద్వాపరంలో మూడువంతులు ఉంటే, కలియుగంలో క్రమక్రమంగా పెరిగి అవి మాత్రమే ఉండే స్థితికి చేరుకోటం జరుగుతుంది. అప్పుడు కల్కి గుర్రమెక్కి వచ్చి, కత్తితో దుష్టసంహారం చేస్తాడు. అది ఎప్పుడు? గో వృషభ సంభాషణలో కలియుగం ఎప్పుడు మొదలైనది తెలిసింది కదా! కృష్ణ నిర్యాణంతో. కలియుగం ఆరంభం అయి 5,125 సంవత్సరాలు.

– డా.ఎస్. అనంతలక్ష్మి

సినిమా

డబ్బింగ్ ఆరంభం



● 'అల్లరి' నరేష్

'అల్లరి' నరేష్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'బచ్చల మల్లి' డబ్బింగ్ పనులు ఆరంభమయ్యాయి. 'సోలో బ్రతుకే సో బెటర్' ఫేమ్ సుబ్బు మంగదేవి దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో అమృతా అయ్యర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. హాస్య మూవీస్ బ్యానర్‌పై 'సామజవరగమన, ఊరుపేరు భైరవకోన' వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలను నిర్మించిన రాజేష్ దండా, బాలాజీ గుత్తా నిర్మిస్తున్న 'బచ్చల మల్లి' సెప్టెంబర్‌లో విడుదల కానుంది. కాగా తాజాగా ఈ సినిమా డబ్బింగ్‌ని ప్రారంభించారు మేకర్స్. ''వైవిధ్యమైన కథాంశంతో రూపొందుతోన్న చిత్రం 'బచ్చల మల్లి'. ఈ మూవీలో గతంలో ఎన్నడూ చూడని మాస్ క్యారెక్టర్‌లో నరేష్‌ని చూపించనున్నారు డైరెక్టర్ సుబ్బు'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: విశాల్ చంద్రశేఖర్, కెమెరా: రిచర్డ్ ఎం.నాథన్.



● అశ్విన్ రామ్, విశ్వక్ సేన్, చైతన్య, నభా నటేష్, ప్రియదర్శి

డార్లింగ్ విజయం సాధిస్తుంది – విశ్వక్ సేన్

''డార్లింగ్' మూవీ ట్రైలర్ చాలా బాగుంది. డైరెక్టర్ రామ్ అద్భుతంగా తీశారు. ఈ సినిమా తప్పకుండా మంచి విజయం సాధిస్తుంది. యూనిట్‌కి ఆల్ ది బెస్ట్'' అని హీరో విశ్వక్ సేన్ అన్నారు. ప్రియదర్శి, నభా నటేష్ జోడీగా అశ్విన్ రామ్ దర్శకత్వం వహించిన చిత్రం 'డార్లింగ్'. ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్‌పై కె.నిరంజన్ రెడ్డి, చైతన్య నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 19న విడుదలవుతోంది. ఈ సినిమా ట్రైలర్‌ను విశ్వక్ సేన్ విడుదల చేసి, మాట్లాడుతూ–''ఈ నగరానికి ఏమైంది?' సినిమా సమయంలో నన్ను వేదికపైకి ఆహ్వానించి సైకో వివేక్‌గా పరిచయం చేశాడు ప్రియదర్శి. 'మల్లేశం, బలగం' లాంటి సినిమాలు అందరికీ పడవు.. రాసి పెట్టి ఉండాలి. ఇప్పుడు తను 'డార్లింగ్' తో రావడం చాలా ఆనందంగా ఉంది. దర్శి గెలిస్తే నేను గెలిచినట్లు అనిపిస్తుంది'' అన్నారు. ''డార్లింగ్ అనగానే ప్రభాస్‌అన్న పేరు గుర్తొస్తుంది. అలాంటి టైటిల్ పెట్టుకోవాలంటే భయంగా ఉండేది. అయితే కథని నమ్మి 'డార్లింగ్' టైటిల్ పెట్టుకున్నాం'' అన్నారు ప్రియదర్శి. ''నేను ప్రమాదం నుంచి కోలుకున్న తర్వాత ఎలాంటి సినిమా చేయాలి? అని ఆలోచిస్తున్నప్పుడు 'డార్లింగ్' అవకాశం వచ్చింది'' అన్నారు నభా నటేష్. ''మూడేళ్ల ప్రయాణం 'డార్లింగ్'. వినోదాత్మకంగా రూపొందిన ఈ సినిమా ఫ్రెష్ ఫీలింగ్ ఇస్తుంది'' అన్నారు అశ్విన్ రామ్. ''కథని నమ్మి తీసిన ఈ మూవీకి ప్రేక్షకుల ప్రోత్సాహం కావాలి'' అన్నారు చైతన్య.

చారులత ఆన్ డ్యూటీ



● ప్రియాంక మోహన్

నాని హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'సరిపోదా శనివారం'. వివేక్ ఆత్రేయ దర్శకత్వం వహిస్తున్నారు. 'గ్యాంగ్ లీడర్' మూవీ తర్వాత నాని, ప్రియాంక మోహన్ జోడీగా నటిస్తున్న రెండో చిత్రం 'సరిపోదా శనివారం'. ఎస్‌జే సూర్య, సాయికుమార్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి నిర్మిస్తున్నారు. ఈ సినిమా నుంచి ప్రియాంక మోహన్ ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు మేకర్స్. ''యాక్షన్ అడ్వెంచర్‌గా రూపొందుతోన్న పాన్ ఇండియా చిత్రం 'సరిపోదా శనివారం'. ఈ మూవీలో చారులత అనే పోలీస్ కానిస్టేబుల్ పాత్రలో నటిస్తున్నారు ప్రియాంక మోహన్. ఆమె పాత్ర చాలా కీలకంగా ఉంటుంది. భారీ బడ్జెట్, ఉన్నత ప్రమాణాలతో నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ చివరి దశలో ఉంది. ఆగస్టు 29న ఈ మూవీ పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది'' అని చిత్రబృందం పేర్కొంది.



సూపర్ చాన్స్?

'సామజవరగమన' సినిమాలో మంచి నటన కనబరచి తెలుగు ప్రేక్షకుల మెప్పు పొందారు హీరోయిన్ రెబ్బా మోనికా జాన్. అయితే ఈ బ్యూటీకి తాజాగా ఓ సూపర్ చాన్స్ లభించిందట. రజనీకాంత్ హీరోగా లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో 'కూలీ' సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ మూవీలోని ఓ కీలక పాత్రకు రెబ్బా మోనికా జాన్‌ను లోకేష్ కనగరాజ్ ఎంపిక చేశారని కోలీవుడ్ సమాచారం. రజనీకాంత్‌తో స్క్రీన్ స్పేస్ అంటే ఆమెకు కెరీర్ పరంగా ఓ సూపర్‌చాన్స్ కావొచ్చు. ప్రస్తుతం 'కూలీ' చిత్రీకరణ హైదరాబాద్‌లో జరుగుతోంది. రజనీకాంత్, శ్రుతీహాసన్‌లపై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు మేకర్స్. సత్యరాజ్, మహేంద్రన్ ఇతర లీడ్ రోల్స్ చేస్తున్న ఈ సినిమాకు అనిరుధ్ సంగీతం అందిస్తున్నారు. సన్ పిక్చర్స్ సంస్థ నిర్మిస్తున్న 'కూలీ' వచ్చే ఏడాది విడుదల కానుంది.



● సిద్ధార్థ్, శంకర్, కమల్‌హాసన్, జాన్వీ నారంగ్, రకుల్‌ప్రీత్ సింగ్

ఇకపై నా లక్ష్యం అదే: కమల్‌హాసన్

''యాభై రెండేళ్ల క్రితం నేను హైదరాబాద్‌కు ఓ సాంకేతిక నిపుణుడిలా వచ్చాను. నటుడిగా మూడు తరాలుగా నన్ను అభిమానిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు. ఇంతకాలం నన్ను ప్రేక్షకులు స్టార్‌డమ్‌లో ఉంచారు. ఇక నాకు ఏదైనా లక్ష్యం ఉందా? అంటే బాలచందర్‌గారిలా చాలామందిని చిత్ర పరిశ్రమకు తీసుకురావాలి. నాలాంటి నటులను తయారు చేయాలి. అలా ప్రేక్షకుల రుణం తీర్చుకునే ప్రయత్నం చేస్తాను'' అని కమల్‌హాసన్ అన్నారు. శంకర్ దర్శకత్వంలో కమల్‌హాసన్ హీరోగా రూపొందిన తాజా చిత్రం 'ఇండియన్ 2' (తెలుగులో 'భారతీయుడు 2'). రకుల్‌ప్రీత్ సింగ్, సిద్ధార్థ్, ఎస్‌జే సూర్య, బ్రహ్మానందం, సముద్ర ఖని, బాబీసింహా, గుల్షన్ గ్రోవర్ ఇతర రోల్స్‌లో నటించారు. సుభాస్కరన్ నిర్మించిన ఈ మూవీ ఈ నెల 12న విడుదల కానుంది. 'భారతీయుడు 2' తెలుగు థియేట్రికల్ హక్కులను ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్మెంట్స్, శ్రీలక్ష్మి మూవీస్ దక్కించుకున్నాయి. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో కమల్‌హాసన్ మాట్లాడుతూ–''కమ్‌బ్యాక్ ఇండియన్' అంటే ఇండియన్ తాత గురించి కాదు.. మనవడు రావాలి.. వస్తాడు. 'ఇండియన్ 2'ను హిట్ చేయండి.. త్వరగా 'ఇండియన్ 3' చూస్తారు. 'భారతీయుడు' నిర్మించిన ఏఎయం రత్నంగారికి ధన్యవాదాలు. శంకర్‌గారిలాంటి విజన్ ఉన్న దర్శకులు ఇండియన్ సినిమాను ఇంటర్నేషనల్ స్థాయి సినిమా చేశారు. ఇందులో తెలుగు సినిమాకు పెద్ద భాగం ఉంది. కళాకారులు భాష సరిహద్దులను చేరిపేశారు. అలాంటి వారిలో కె.విశ్వనాథ్, బాలచందర్, శంకర్‌గార్ల వంటి దర్శకులు, ఆర్టిస్టులు ఉన్నారు'' అన్నారు. శంకర్ మాట్లాడుతూ–''లంచగొండి వార్తలను చదివిన ప్రతిసారి 'భారతీయుడు' మళ్లీ రావాలని నాకు అనిపించేది. కానీ స్టోరీ కుదరలేదు. '2.ఓ' తర్వాత కమల్‌గారికి 'భారతీయుడు' సీక్వెల్ కథ చెప్పాను. నేను రాసిన ఓ సన్నివేశాన్ని తన నటనతో పదింతలు గొప్పగా ఉండేలా చేస్తారు కమల్‌గారు. బ్రహ్మానందంగారికి నేను అభిమానిని. 'ఇండియన్ 2, గేమ్‌చేంజర్'లో ఆయన అతిథి పాత్ర చేశారు. ఈ సినిమాని తెలుగులో విడుదల చేస్తున్న సునీల్, తిరుపతి ప్రసాద్‌గార్లకు థ్యాంక్స్. రామ్‌చరణ్‌తో 'గేమ్ చేంజర్' చేస్తున్నాను. త్వరలోనే రిలీజ్ డేట్ లాక్ చేస్తాం'' అన్నారు. ''కమల్‌హాసన్‌గారితో నటించడం నాకు లభించిన ఆశీర్వాదంగా భావిస్తున్నాను'' అన్నారు'' అన్నారు ఎస్‌జే సూర్య. ''నా అభిమాన నటుడు కమల్‌గారితో నటించాలన్న నా కల నిజమైంది. కమల్‌హాసన్‌గారికి నేను ఎప్పటికీ విద్యార్థినే. యువతరానికి కోపం వస్తే ఏం జరుగుతుంది? అన్నది 'భారతీయుడు 2'లో ఉంటుంది'' అన్నారు సిద్ధార్థ్. ''కమల్‌హాసన్‌గారితో నటించడం హ్యాపీ'' అన్నారు రకుల్‌ప్రీత్ సింగ్. ''ఈ విశ్వంలో కమల్‌గారి లాంటి నటుడు మరొకరు లేరు. ఆయనతో నటించానని చెప్పడానికి గర్వపడుతున్నాను'' అన్నారు బ్రహ్మానందం. ఈ వేడుకలో నిర్మాతలు సునీల్ నారంగ్, జాన్వీ నారంగ్, నటులు బాబీసింహా, సముద్ర ఖని, గీత రచయితలు సుద్దాల అశోక్ తేజ, రామజోగయ్య శాస్త్రి, కాసర్ల శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.


తుఫాన్ వస్తోంది



● విజయ్ ఆంటోనీ, మేఘా ఆకాష్

విజయ్ ఆంటోనీ, మేఘా ఆకాష్ జంటగా నటించిన యాక్షన్ ఎంటర్‌టైనర్ మూవీ 'తుఫాన్'. విజయ్ మిల్టన్ దర్శకత్వంలో కమల్ బోరా, డి.లలితా, బి. ప్రదీప్, పంకజ్ బోరా నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 26న థియేటర్స్‌లో విడుదలకానుంది. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో జరిగిన 'తుఫాన్' సినిమా ట్రైలర్ ఇంట్రడక్షన్ ఈవెంట్‌లో విజయ్ ఆంటోనీ మాట్లాడుతూ– ''ఈ 'తుఫాన్' సినిమా నేపథ్యం కొత్తగా ఉంటుంది. ఇలాంటి చిత్రాన్ని నాకు ఇచ్చిన విజయ్ మిల్టన్‌కు ధన్యవాదాలు. హైదరాబాద్‌లో త్వరలో ఒక లైవ్ కాన్సర్ట్ చేస్తాను'' అన్నారు. ''తుఫాన్' సినిమా ప్రేక్షకులకు నచ్చుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు విజయ్ మిల్టన్. ''ఈ చిత్రాన్ని గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతున్నాం'' అన్నారు నిర్మాత ధనుంజయ. ''నా కెరీర్‌లో ఓ స్పెషల్ ఫిల్మ్ ఇది'' అన్నారు మేఘా ఆకాష్.

టైటానిక్ నిర్మాత కన్నుమూత



● జోన్ లండౌ

హాలీవుడ్‌లో తీవ్ర విషాదం నెలకొంది. యూనివర్సల్ బ్లాక్ బస్టర్ చిత్రాలైన 'టైటానిక్, అవతార్' వంటి సినిమాలు నిర్మించిన జోన్ లండౌ (63) కన్నుమూశారు. కొంతకాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న ఆయన లాస్ ఏంజిల్స్‌లో ఈ నెల 5న(శుక్రవారం) మృతి చెందారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జోన్ లండౌ 1980లో ప్రొడక్షన్ మేనేజర్‌గా సినీ కెరీర్‌ను ప్రారంభించారు. డైరెక్టర్ జేమ్స్ కామెరూన్‌తో కలిసి 'టైటానిక్'(1977), 'అవతార్'(2009) వంటి చిత్రాలు నిర్మించారు. జేమ్స్ కామెరూన్‌తో కలిసి ప్రస్తుతం 'అవతార్' ఫ్రాంచైజీ చిత్రాలను నిర్మిస్తున్నారు జోన్. ఇప్పటి వరకు ఆయన 8 సినిమాలు నిర్మించారు. మరో రెండు సినిమాలకు సహ నిర్మాతగా వ్యవహరించారు. జోన్ లాండౌ నిర్మించిన 'అవతార్' సిరీస్‌లో 3వ భాగం 2026లో, 4వ భాగం 2030లో విడుదలకానున్నాయి. జోన్ లాండౌకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

సైకలాజికల్ థ్రిల్లర్



● నాగ్ అశ్విన్, రాఘవేంద్రా రెడ్డి, గౌతమ్ వర్మ

ప్రిన్స్, నరేష్ అగస్త్య హీరోలుగా, నేహా కృష్ణన్ హీరోయిన్‌గా నటించిన చిత్రం 'కలి'. శివ శేషు దర్శకత్వం వహించారు. కథా రచయిత కె.రాఘవేంద్రా రెడ్డి సమర్పణలో రుద్ర క్రియేషన్స్‌పై లీలా గౌతమ్ వర్మ నిర్మించిన ఈ మూవీ త్వరలో రిలీజ్‌కు రెడీ అవుతోంది. 'కలి' టీజర్‌ను డైరెక్టర్ నాగ్ అశ్విన్ విడుదల చేసి, మాట్లాడుతూ–''టీజర్ ఆసక్తిగా ఉంది. ఒక కొత్త కాన్సెప్ట్‌ను తెలుగు ప్రేక్షకుల ముందుకు శివ శేషు తీసుకొస్తున్నట్లు టీజర్ చూస్తే తెలుస్తోంది'' అన్నారు. ''కలి పాత్ర నేపథ్యంతో సాగే ఇంట్రెస్టింగ్ సైకలాజికల్ థ్రిల్లర్ మూవీ ఇది'' అన్నారు కె. రాఘవేంద్రా రెడ్డి. ''మైథాలజీ, సైకలాజికల్ థ్రిల్లర్ జానర్స్ కలిపిన చిత్రమిది'' అన్నారు లీలా గౌతమ్ వర్మ, శివ శేషు.



సెమీఫైనల్లో ప్రియాన్షు పరాజయం

కెనడా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత ప్లేయర్ ప్రియాన్షు రజావత్ పోరాటం ముగిసింది. పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో ప్రపంచ 39వ ర్యాంకర్ ప్రియాన్షు 17-21, 10-21తో ప్రపంచ 37వ ర్యాంకర్ అలెక్స్ లేనియర్ (ఫ్రాన్స్) చేతిలో ఓడిపోయాడు. క్వార్టర్ ఫైనల్లో నాలుగో ర్యాంకర్ ఆంటోన్సెన్ (డెన్మార్క్)పై సంచలన విజయం సాధించిన ప్రియాన్షు సెమీఫైనల్లో మాత్రం తడబడ్డాడు. ప్రియాన్షుకు 6,090 డాలర్ల ప్రైజ్‌మనీ (రూ. 5 లక్షలు), 6,420 పాయింట్లు లభించాయి.

అభయ్ సింగ్ 'డబుల్' ధమాకా



ఆసియా డబుల్స్ స్క్వాష్ చాంపియన్‌షిప్‌లో భారత స్టార్ అభయ్ సింగ్ పురుషుల డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్‌లో విజేతగా నిలిచాడు. మలేసియాలో జరిగిన ఈ టోర్నీలో పురుషుల డబుల్స్ ఫైనల్లో అభయ్-వెలవన్ 11-4, 11-5తో ఒంగ్ సై హాంగ్-సిఫిక్ (మలేసియా)లపై నెగ్గారు. 'మిక్స్‌డ్' ఫైనల్లో అభయ్-జోష్నా చినప్ప (భారత్) 11-8, 10-11, 11-5తో టాంగ్ వింగ్-టాంగ్ హాంగ్ (హాంకాంగ్)లపై గెలిచారు.



20 ఏళ్ల తర్వాత సెమీఫైనల్లో నెదర్లాండ్స్

బెర్లిన్: యూరో కప్ ఫుట్‌బాల్ టోర్నీలో రెండు దశాబ్దాల తర్వాత నెదర్లాండ్స్ జట్టు సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. టర్కీ జట్టుతో ఆదివారం జరిగిన చివరి క్వార్టర్ ఫైనల్లో నెదర్లాండ్స్ 2-1 గోల్స్ తేడాతో గెలిచింది. 35వ నిమిషంలో సామెత్ అకెదిన్ గోల్‌తో టర్కీ ఖాతా తెరిచింది. 70వ నిమిషంలో డెవ్రిజ్ గోల్‌తో నెదర్లాండ్స్ స్కోరును 1-1తో సమం చేసింది. 76వ నిమిషంలో టర్కీ ప్లేయర్ మెర్ట్ ముల్డర్ 'సెల్ఫ్ గోల్' చేయడంతో నెదర్లాండ్స్ 2-1తో ఆధిక్యంలోకి వచ్చింది. ఆ తర్వాత ఈ ఆధిక్యాన్ని నెదర్లాండ్స్ కాపాడుకొని 2004 తర్వాత మళ్లీ యూరో టోర్నీలో సెమీఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. మంగళవారం జరిగే తొలి సెమీఫైనల్లో స్పెయిన్‌తో ఫ్రాన్స్; బుధవారం జరిగే రెండో సెమీఫైనల్లో ఇంగ్లండ్‌తో నెదర్లాండ్స్ తలపడతాయి.

బ్రెజిల్‌కు చుక్కెదురు



లాస్ వేగస్: కోపా అమెరికా కప్ ఫుట్‌బాల్ టోర్నీలో తొమ్మిదిసార్లు చాంపియన్ బ్రెజిల్ జట్టు కథ ముగిసింది. 'షూటౌట్' ద్వారా ఫలితం తేలిన క్వార్టర్ ఫైనల్లో ఉరుగ్వే 4-2తో బ్రెజిల్ జట్టును ఓడించి 2011 తర్వాత ఈ టోర్నీలో మళ్లీ సెమీఫైనల్లోకి అడుగు పెట్టింది. నిర్ణీత సమయంలో రెండు జట్లు గోల్స్ చేయలేదు. 'షూటౌట్'లో ఉరుగ్వే తరఫున నలుగురు ప్లేయర్లు వల్వెర్డె, బెంటాన్‌కర్, అరాసెటా, ఉగార్టె... బ్రెజిల్ తరఫున ఇద్దరు ప్లేయర్లు పెరీరా, మార్టినెల్లి గోల్స్ సాధించారు. మరో క్వార్టర్ ఫైనల్లో కొలంబియా 5-0తో పనామా జట్టును ఓడించింది. బుధవారం జరిగే తొలి సెమీఫైనల్లో కెనడాతో అర్జెంటీనా; గురువారం జరిగే రెండో సెమీఫైనల్లో ఉరుగ్వేతో కొలంబియా ఆడతాయి.

అభిషేక్ అదరహో...

'శత'క్కొట్టిన భారత ఓపెనర్

47 బంతుల్లో 7 ఫోర్లు, 8 సిక్స్‌లతో 100

రెండో టి20లో జింబాబ్వేపై 100 పరుగులతో టీమిండియా ఘనవిజయం



అభిషేక్ శర్మ



రుతురాజ్

హరారే: అంతర్జాతీయ వేదికపై తన ఆగమనాన్ని అదరగొట్టే ఇన్నింగ్స్‌తో అభిషేక్ శర్మ చాటుకున్నాడు. జింబాబ్వేతో ఆదివారం జరిగిన రెండో టి20 మ్యాచ్‌లో అభిషేక్ శర్మ సెంచరీ సాధించాడు. శనివారం జరిగిన తొలి టి20లో 'సున్నా'కే అవుటైన ఈ పంజాబ్ బ్యాటర్ రెండో టి20లో మాత్రం 'శత'క్కొట్టాడు. 47 బంతుల్లో 7 ఫోర్లు, 8 సిక్స్‌లతో చెలరేగిపోయిన అభిషేక్ సరిగ్గా 100 పరుగులు చేసి అవుటయ్యాడు. రుతురాజ్ గైక్వాడ్ (47 బంతుల్లో 77; 11 ఫోర్లు, 1 సిక్స్), రింకూ సింగ్ (22 బంతుల్లో 48 నాటౌట్; 2 ఫోర్లు, 5 సిక్స్‌లు) కూడా మెరిపించడంతో భారత జట్టు 100 పరుగుల తేడాతో జింబాబ్వేపై ఘనవిజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 234 పరుగులు చేసింది. టి20ల్లో జింబాబ్వేపై ఓ జట్టు చేసిన అత్యధిక స్కోరు ఇదే. అనంతరం 235 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన జింబాబ్వే 18.4 ఓవర్లలో 134 పరుగులకు ఆలౌటై ఓడిపోయింది. మధెవెరె (39 బంతుల్లో 43; 3 ఫోర్లు, 1 సిక్స్), జోంగ్వి (26 బంతుల్లో 33; 4 ఫోర్లు) మినహా మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. భారత బౌలర్లలో ముకేశ్ కుమార్ (3/37), అవేశ్ ఖాన్ (3/15), రవి బిష్ణోయ్ (2/11) రాణించారు. అభిషేక్ శర్మకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది.

మొదట బ్యాటింగ్‌కు దిగిన భారత జట్టుకు శుభారంభం లభించలేదు. కెప్టెన్ శుబ్‌మన్ గిల్ (2) వరుసగా రెండో మ్యాచ్‌లోనూ నిరాశపరిచాడు. గిల్ అవుటయ్యాక అభిషేక్, రుతురాజ్ భారత ఇన్నింగ్స్‌ను నడిపించారు. వ్యక్తిగత స్కోరు 27 పరుగుల వద్ద అభిషేక్ ఇచ్చిన క్యాచ్‌ను మసకద్జా వదిలేశాడు. ఆ తర్వాత అభిషేక్ చెలరేగిపోయాడు. మైర్స్ వేసిన ఇన్నింగ్స్ 11వ ఓవర్లో అభిషేక్ 2,4,6,4,6,4తో 28 పరుగులు సాధించాడు. దాంతో భారత స్కోరు 100 పరుగులు దాటింది. మసకద్జా వేసిన ఇన్నింగ్స్ 14వ ఓవర్లో అభిషేక్ వరుసగా 3 సిక్స్‌లు కొట్టి 46 బంతుల్లోనే తన అంతర్జాతీయ కెరీర్‌లో తొలి సెంచరీని పూర్తి చేసుకున్నాడు. ఆ వెంటనే మైర్స్‌కు క్యాచ్ ఇచ్చి అభిషేక్ పెవిలియన్ చేరుకున్నాడు. రుతురాజ్‌తో కలిసి అభిషేక్ రెండో వికెట్‌కు 137 పరుగులు జోడించాడు. అభిషేక్ నిష్క్రమించాక వచ్చిన రింకూ సింగ్ కూడా దూకుడుగా ఆడటంతో భారత స్కోరు 200 పరుగులు దాటింది. భారత్ చివరి 10 ఓవర్లలో 160 పరుగులు చేయడం విశేషం. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో రెండు జట్లు 1-1తో సమంగా ఉన్నాయి. మూడో మ్యాచ్ బుధవారం జరుగుతుంది.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: శుబ్‌మన్ గిల్ (సి) బెనెట్ (బి) ముజరబాని 2; అభిషేక్ శర్మ (సి) మైర్స్ (బి) మసకద్జా 100; రుతురాజ్ గైక్వాడ్ (నాటౌట్) 77; రింకూ సింగ్ (నాటౌట్) 48; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (20 ఓవర్లలో 2 వికెట్లకు) 234. వికెట్ల పతనం:** 1-10, 2-147. **బౌలింగ్:** బెనెట్ 2-0-22-0, ముజరబాని 4-1-30-1, చటారా 4-0-38-0, సికందర్ రజా 3-0-34-0, జోంగ్వి 4-0-53-0, మైర్స్ 1-0-28-0, మసకద్జా 2-0-29-1.

జింబాబ్వే ఇన్నింగ్స్: ఇన్నోసెంట్ కాయా (బి) ముకేశ్ కుమార్ 4; మధెవెరె (బి) రవి బిష్ణోయ్ 43; బెనెట్ (బి) ముకేశ్ కుమార్ 26; మైర్స్ (సి) రింకూ సింగ్ (బి) అవేశ్ ఖాన్ 0; సికందర్ రజా (సి) ధ్రువ్ జురేల్ (బి) అవేశ్ ఖాన్ 4; క్యాంప్‌బెల్ (సి) రవి బిష్ణోయ్ (బి) సుందర్ 10; మదాండె (ఎల్బీడబ్ల్యూ) (బి) రవి బిష్ణోయ్ 0; మసకద్జా (రనౌట్) 1; జోంగ్వి (సి) రుతురాజ్ (బి) ముకేశ్ కుమార్ 33; ముజరబాని (సి) సుందర్ (బి) అవేశ్ ఖాన్ 2; చటారా (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (18.4 ఓవర్లలో ఆలౌట్) 134. వికెట్ల పతనం:** 1-4, 2-40, 3-41, 4-46, 5-72, 6-73, 7-76, 8-117, 9-123, 10-134. **బౌలింగ్:** ముకేశ్ 3.4-0-37-3, అభిషేక్ శర్మ 3-0-36-0, అవేశ్ 3-0-15-3, రవి బిష్ణోయ్ 4-0-11-2, వాషింగ్టన్ సుందర్ 4-0-28-1, పరాగ్ 1-0-5-0.

రెండో టి20 వర్షార్పణం

- దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ ముగిశాక భారీ వర్షం
- సాధ్యపడని భారత ఇన్నింగ్స్



చెన్నై: భారీ వర్షం కారణంగా భారత్, దక్షిణాఫ్రికా మహిళల క్రికెట్ జట్ల మధ్య ఆదివారం రెండో టి20 మ్యాచ్ రద్దయింది. భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకోగా... తొలుత బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 177 పరుగులు సాధించింది. తజ్మీన్ బ్రిట్స్ (39 బంతుల్లో 52; 6 ఫోర్లు, 1 సిక్స్), అనెక్ బోష్ (32 బంతుల్లో 40; 6 ఫోర్లు) రాణించారు. భారత బౌలర్లలో పూజా వస్త్రకర్, దీప్తి శర్మ రెండు వికెట్ల చొప్పున తీశారు. దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ ముగియగానే వర్షం మొదలైంది. రాత్రి 10 దాటినా వాన తగ్గుముఖం పట్టకపోవడంతో అంపైర్లు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. తొలి టి20లో నెగ్గిన దక్షిణాఫ్రికా 1-0తో ఆధిక్యంలో ఉంది. చివరిదైన మూడో టి20 మ్యాచ్ మంగళవారం జరుగుతుంది.

స్కోరు వివరాలు

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: లౌరా వొల్‌వార్ట్ (సి) రాధా యాదవ్ (బి) పూజా వస్త్రకర్ 22; తజ్మీన్ బ్రిట్స్ (స్టంప్డ్) ఉమా ఛెత్రి (బి) దీప్తి 52; మరిజన్ కాప్ (సి) సజన (బి) దీప్తి శర్మ 20; అనెక్ బోష్ (బి) శ్రేయాంక 40; చోల్ ట్రైరన్ (సి అండ్ బి) రాధా యాదవ్ 12; నదినె డి క్లెర్క్ (సి) సజన (బి) పూజా వస్త్రకర్ 14; డెర్సెక్సన్ (నాటౌట్) 12; ఎలీజ్ మార్క్స్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 177. వికెట్ల పతనం:** 1-43, 2-75, 3-113, 4-131, 5-164, 6-164. **బౌలింగ్:** పూజా వస్త్రకర్ 4-0-37-2, సజన సజీవన్ 1-0-13-0, అరుంధతి రెడ్డి 4-0-37-0, శ్రేయాంక పాటిల్ 4-0-37-1, రాధా యాదవ్ 3-0-31-1, దీప్తి శర్మ 4-0-20-2.

క్వార్టర్ ఫైనల్లో అల్‌కరాజ్



లండన్: వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీ పురుషుల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్ అల్‌కరాజ్ (స్పెయిన్), ప్రపంచ నంబర్‌వన్ యానిక్ సినెర్ (ఇటలీ) క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టారు. ఆదివారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో మూడో సీడ్ అల్‌కరాజ్ 6-3, 6-4, 1-6, 7-5తో ఉగో హంబెర్ట్ (ఫ్రాన్స్)పై, టాప్ సీడ్ సినెర్ 6-2, 6-4, 7-6 (11/9)తో బెన్ షెల్టన్ (అమెరికా)పై గెలుపొందారు. మరోవైపు ఏడుసార్లు చాంపియన్, రెండో ర్యాంకర్ జొకోవిచ్ (సెర్బియా) ఈ టోర్నీలో 16వసారి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. శనివారం అర్ధరాత్రి దాటాక ముగిసిన మూడో రౌండ్ మ్యాచ్‌లో జొకోవిచ్ 4-6, 6-3, 6-4, 7-6 (7/3)తో పాపిరిన్ (ఆస్ట్రేలియా)పై నెగ్గాడు.

హామిల్టన్ రికార్డు



సిల్వర్‌స్టోన్ (ఇంగ్లండ్): ప్రపంచ మాజీ చాంపియన్ లూయిస్ హామిల్టన్ 945 రోజుల తర్వాత ఫార్ములావన్ (ఎఫ్1) రేసులో మళ్లీ విజయం అందుకున్నాడు. ఆదివారం జరిగిన బ్రిటిష్ గ్రాండ్‌ప్రిలో ఈ బ్రిటన్ డ్రైవర్ విజేతగా నిలిచాడు. చివరిసారి హామిల్టన్ 2021 డిసెంబర్ 5న సౌదీ అరేబియా గ్రాండ్‌ప్రిలో గెలుపొందాడు. సిల్వర్‌స్టోన్ సర్క్యూట్‌పై ఆదివారం జరిగిన 52 ల్యాప్‌ల రేసును హామిల్టన్ (మెర్సిడెస్) అందరికంటే వేగంగా ఒక గంటా 22 నిమిషాల 27.059 సెకన్లలో ముగించి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. ఈ క్రమంలో ఫార్ములావన్ చరిత్రలో ఒకే సర్క్యూట్‌పై అత్యధికంగా 9 సార్లు విజేతగా నిలిచిన డ్రైవర్‌గా హామిల్టన్ రికార్డు నెలకొల్పాడు. మైకేల్ షుమాకర్ (జర్మనీ) ఫ్రాన్స్‌లోని మాగ్నీ కోర్స్ సర్క్యూట్‌లో అత్యధికంగా 8 సార్లు గెలిచాడు. తాజా గెలుపుతో షుమాకర్ రికార్డును హామిల్టన్ సవరించాడు. 24 రేసుల తాజా సీజన్‌లో 12 రేసులు ముగిశాక వెర్‌స్టాపెన్ (రెడ్‌బుల్) 255 పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. సీజన్‌లోని తదుపరి రేసు హంగేరి గ్రాండ్‌ప్రి ఈనెల 21న జరుగుతుంది.

భవిత

గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- ఇండియన్ పాలిటీ కోసం | ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఐబీపీఎస్‌లో 6,128 క్లర్క్ పోస్టులు

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్(ఐబీపీఎస్).. దేశ వ్యాప్తంగా 11 ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో క్లర్క్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. 2025-26 సంవత్సరానికి సంబంధించి కామన్ రిక్రూట్‌మెంట్ ప్రాసెస్(సీఆర్పీ) -XIV ద్వారా నిర్వహించనుంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 6,128 (ఆంధ్రప్రదేశ్‌లో 105, తెలంగాణలో 104 ఖాళీలు).
» **అర్హత:** ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలి.
» **వయసు:** 20 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** ప్రిలిమినరీ, మెయిన్స్ రాతపరీక్షల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **బ్యాంకులు:** బ్యాంక్ ఆఫ్ బరోడా, కెనరా బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, యూకో బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పంజాబ్ నేషనల్ బ్యాంక్, పంజాబ్ అండ్ సిండికేట్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, ఇండియన్ బ్యాంక్.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరితేది:** 21.07.2024.
» **ఆన్‌లైన్ ప్రిలిమినరీ పరీక్ష:** ఆగస్ట్, 2024.
» **ఆన్‌లైన్ మెయిన్ పరీక్ష:** అక్టోబర్, 2024.
» **వెబ్‌సైట్:** www.ibps.in

కొచ్చిన్ షిప్‌యార్డ్‌లో వివిధ ఉద్యోగాలు

కేరళలోని కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌లో ప్రాజెక్ట్ ఆఫీసర్ (మెకానికల్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 03.
» **అర్హత:** సంబంధిత విభాగంలో 60 శాతం మార్కులతో బీటెక్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 12.07.2024 నాటికి 30 ఏళ్లు మించకూడదు. ఎస్సీ అభ్యర్థులకు ఐదేళ్లు, పీడబ్ల్యూబీడీ/ఎక్స్ సర్వీస్‌మెన్ అభ్యర్థులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ టెస్ట్, షార్ట్‌లిస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 12.07.2024.
» **వెబ్‌సైట్:** https://cochin-shipyard.in

ఇండియన్ బ్యాంక్, చెన్నైలో 102 స్పెషలిస్ట్ క్యాడర్ ఆఫీసర్ పోస్టులు

చెన్నైలోని ఇండియన్ బ్యాంక్.. ఒప్పంద ప్రాతిపదికన స్పెషలిస్ట్ క్యాడర్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 102.
» **పోస్టుల వివరాలు:** డిప్యూటీ వైస్ ప్రెసిడెంట్-30, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్-72.
» **విభాగాలు:** క్రెడిట్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎంఎస్ఎంఈ, రిస్క్ మేనేజ్‌మెంట్.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బ్యాచిలర్స్ డిగ్రీ, సీఏ, ఎంబీఏ, సర్టిఫికేట్ కోర్సు, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** డిప్యూటీ వైస్ ప్రెసిడెంట్ పోస్టుకు 40 ఏళ్లు, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ పోస్టుకు 38 ఏళ్ల లోపు ఉండాలి.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష/ఆన్‌లైన్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 14.07.2024.
» **వెబ్‌సైట్:** www.indianbank.in

డిగ్రీతో కేంద్ర కొలువు

కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని నియామక సంస్థ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ).. ఉద్యోగార్థులకు స్వాగతం పలుకుతోంది! కేంద్ర ప్రభుత్వ పరిధిలోని వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాల్లో.. మొత్తం 17,727 గ్రూప్-బి, సి పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ ఉద్యోగాలకు బ్యాచిలర్ డిగ్రీతోనే పోటీ పడే అవకాశం ఉంది. రెండు దశల రాత పరీక్షలో విజయం సాధిస్తే.. కేంద్ర ప్రభుత్వ కొలువు సొంతమవుతుంది. ఈ నేపథ్యంలో.. ఎస్ఎస్‌సీ కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్ ఎగ్జామినేషన్ (సీజీఎల్) 2024 నోటిఫికేషన్ వివరాలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, సిలబస్ విశ్లేషణ, ప్రిపరేషన్ తదితర వివరాలు..

» 17,727 పోస్టులతో ఎస్ఎస్‌సీ సీజీఎల్ఈ నోటిఫికేషన్
» కేంద్ర ప్రభుత్వ విభాగాల్లో గ్రూప్-బి, సి పోస్టులు
» పే లెవల్ 4, 5, 6, 7లతో ప్రారంభ వేతన శ్రేణి
» బ్యాచిలర్ డిగ్రీ అర్హతతో పోటీ పడే అవకాశం



ఎస్ఎస్‌సీ సీజీఎల్-2024

మొత్తం పోస్టులు 17,727

- సీజీఎల్ఈ-2024 ద్వారా భారీ సంఖ్యలో కొలువుల భర్తీకి ఎస్ఎస్‌సీ ఉపక్రమించింది. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాల్లో మొత్తం 17,727 గ్రూప్-బి, సి పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసింది.
- గ్రూప్ బీలో.. అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్, అసిస్టెంట్/అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్, ఇన్‌స్పెక్టర్, అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్, సబ్ ఇన్‌స్పెక్టర్, ఇన్‌స్పెక్టర్ పోస్టులు, ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్, రీసెర్చ్ అసిస్టెంట్, డివిజన్ అకౌంటెంట్, సబ్ ఇన్‌స్పెక్టర్/జూనియర్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్, జూనియర్ స్టాటిస్టికల్ ఆఫీసర్ పోస్టులు.
- గ్రూప్ సీలో.. ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఇన్‌కమ్ ట్యాక్స్, ఆడిటర్, అకౌంటెంట్, అకౌంటెంట్/జూనియర్ అకౌంటెంట్, పోస్టల్ అసిస్టెంట్/సార్టింగ్ అసిస్టెంట్, సీనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్/అప్పర్ డివిజన్ క్లర్క్, సీనియర్ అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్, ట్యాక్స్ అసిస్టెంట్, సబ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులు ఉన్నాయి.

విద్యార్హతలు

- అన్ని ఉద్యోగాలకు డిగ్రీ ఉత్తీర్ణతను అర్హతగా నిర్దేశించారు. జూనియర్ స్టాటిస్టికల్ ఆఫీసర్ పోస్టులకు ఇంటర్మీడియెట్ స్థాయిలో మ్యాథమెటిక్స్‌లో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి.. ఆ తర్వాత డిగ్రీ పూర్తి చేసుకుని ఉండాలి. లేదా డిగ్రీ స్థాయిలో స్టాటిస్టిక్స్ ఒక సబ్జెక్ట్‌గా చదివుండాలి. స్టాటిస్టికల్ ఇన్వెస్టిగేటర్ గ్రేడ్-2 పోస్టులకు స్టాటిస్టిక్స్ ఒక సబ్జెక్ట్‌గా బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.
- ఎన్‌హెచ్ఆర్‌సీలో రీసెర్చ్ అసిస్టెంట్స్ పోస్టులకు కనీసం ఏడాది రీసెర్చ్ అనుభవం ఉన్న వారికి, అదే విధంగా న్యాయ శాస్త్రంలో డిగ్రీ లేదా హ్యూమన్ రైట్స్‌లో డిగ్రీ పూర్తి చేసిన వారికి ప్రాధాన్యం ఉంటుంది. నిర్దిష్ట విద్యార్హతలను ఆగస్ట్ 1, 2024 లోపు పొంది ఉండాలి.

వయసు

దాదాపు అన్ని పోస్టులకు గరిష్ఠ వయో పరిమితి 30 ఏళ్లుగా ఉంది. జూనియర్ స్టాటిస్టికల్ ఆఫీసర్ పోస్టులకు 32 ఏళ్లు, గ్రూప్-సి పోస్టులకు 27 ఏళ్లుగా ఉంది. రిజర్వేషన్ వర్గాలకు వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.

వేతనం

పే లెవల్ 4, 5, 6, 7లతో ప్రారంభ వేతనం అందనుంది. కనిష్ఠ ప్రారంభ వేతన శ్రేణి రూ.25,500-రూ.81,100; గరిష్ఠ ప్రారంభ వేతన శ్రేణి రూ.44,900-రూ.1,42,400.

రెండు దశల్లో ఎంపిక ప్రక్రియ

ఎస్ఎస్‌సీ సీజీఎల్ఈ ఎంపిక ప్రక్రియను రెండు దశల్లో నిర్వహిస్తారు. రెండు దశల్లోనూ రాత పరీక్ష ఉంటుంది. ఆ వివరాలు..

200 మార్కులకు టైర్-1 పరీక్ష

తొలిదశలో టైర్-1 పరీక్షను 100 ప్రశ్నలు-200 మార్కులతో నిర్వహిస్తారు. జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్ (25 ప్రశ్నలు), జనరల్ అవేర్‌నెస్ (25 ప్రశ్నలు), క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ (25 ప్రశ్నలు), ఇంగ్లిష్ కాంప్రహెన్షన్ (25 ప్రశ్నలు) నుంచి ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు రెండు మార్కులు కేటాయిస్తారు. పరీక్ష సమయం ఒక గంట.

రెండో దశ టైర్-2

- టైర్-1లో నిర్దిష్ట కటాఫ్ మార్కుల శ్రేణితో ఉత్తీర్ణత సాధించి.. మెరిట్ జాబితాలో నిలిచిన వారికి తదుపరి దశలో టైర్-2 పరీక్ష నిర్వహిస్తారు. టైర్-2 పరీక్ష మొత్తం నాలుగు పేపర్లలో జరుగుతుంది. వివరాలు..
- **పేపర్-1:** పేపర్-1ను సెషన్-1, సెషన్-2లుగా నిర్వహిస్తారు. అదే విధంగా ప్రతి సెషన్‌ను రెండు సెక్షన్‌లుగా పేర్కొన్నారు. సెషన్-1 (సెక్షన్-1)లో మ్యాథమెటికల్ ఎబిలిటీస్ (మాడ్యూల్-1), రీజనింగ్ అండ్ జనరల్ ఇంటెలిజెన్స్ (మాడ్యూల్-2) విభాగాల నుంచి 30 ప్రశ్నలు చొప్పున మొత్తం 60 ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు మూడు మార్కులు చొప్పున 180 మార్కులు ఉంటాయి.
సెషన్-1 (సెక్షన్-2)లో.. మాడ్యూల్-1 పేరుతో ఇంగ్లిష్ లాంగ్వేజ్ అండ్ కాంప్రహెన్షన్‌లో 45 ప్రశ్నలు, మాడ్యూల్-2 పేరిట జనరల్ అవేర్‌నెస్ విభాగాల్లో 25 ప్రశ్నలు ఉంటాయి. మొత్తం 70 ప్రశ్నలకు 210 మార్కులు ఉంటాయి.
సెషన్-1 (సెక్షన్-3)లో మాడ్యూల్-1 పేరుతో కంప్యూటర్ నాలెడ్జ్ నుంచి 20 ప్రశ్నలు- 60 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. సెషన్-2లో సెక్షన్-3 పేరుతో డేటాఎంట్రీ స్పీడ్ టెస్ట్ (మాడ్యూల్-3) 15 నిమిషాల వ్యవధిలో ఉంటుంది.
- పేపర్-2ను స్టాటిస్టిక్స్ సబ్జెక్ట్‌తో 100 ప్రశ్నలు-200 మార్కులకు నిర్వహిస్తారు.
- పేపర్-3ని జనరల్ స్టడీస్ (ఫైనాన్స్ అండ్ ఎకనామిక్స్)తో 200 మార్కులకు 100 ప్రశ్నలతో నిర్వహిస్తారు. అన్ని పోస్టుల అభ్యర్థులు పేపర్-1కు తప్పనిసరిగా హాజరు కావాలి. పేపర్-2 జూనియర్ స్టాటిస్టికల్ ఆఫీసర్ పోస్టుల అభ్యర్థులకు మాత్రమే ఉంటుంది. అదేవిధంగా పేపర్-3ని అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్/అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ పోస్టుల అభ్యర్థులకు నిర్వహిస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2024, జూలై 24
- **ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ:** ఆగస్ట్ 10, 11 తేదీల్లో
- **టైర్-1 పరీక్ష:** సెప్టెంబర్/అక్టోబర్‌లో నిర్వహించే అవకాశం.
- **టైర్-2 పరీక్ష:** డిసెంబర్‌లో నిర్వహించే అవకాశం.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://ssc.gov.in

రాత పరీక్షలో రాణించేలా

రెండు దశలుగా, పలు సెషన్స్, మాడ్యూల్స్‌లో ఆయా సబ్జెక్ట్‌లలో జరిగే పరీక్షల్లో విజయానికి అభ్యర్థులు సబ్జెక్ట్ వారీగా ప్రిపరేషన్ సాగించాలి.

రీజనింగ్ అండ్ జనరల్ ఇంటెలిజెన్స్

అభ్యర్థుల్లోని విశ్లేషణ నైపుణ్యాలను పరీక్షించే ఈ విభాగంలో రాణించాలంటే.. కోడింగ్, డీ-కోడింగ్, అనలిటికల్ పజిల్స్, క్రిటికల్ రీజనింగ్ బాగా ప్రాక్టీస్ చేయాలి. ఇంగ్లిష్ అక్షర క్రమాన్ని ముందు నుంచి వెనుకకు, వెనుక నుంచి ముందుకు ప్రాక్టీస్ చేయాలి. దీంతోపాటు ఏ అక్షరం ఎన్నో స్థానంలో ఉందో సులువుగా గుర్తించాలి. అదే విధంగా అనలిటికల్ రీజనింగ్, సిలాజిజమ్స్, ఇనీక్వాలిటీస్, ఇన్‌పుట్- అవుట్‌పుట్, డేటా సఫిషియెన్సీ విభాగాలపై అవగాహన పొందాలి.

జనరల్ అవేర్‌నెస్

జనరల్ అవేర్‌నెస్/జనరల్ స్టడీస్‌లో రాణించేందుకు హిస్టరీ, జాగ్రఫీ, ఎకానమీ, సైన్స్ అండ్ టెక్నాలజీ, కరెంట్ అఫైర్స్ అంశాలపై పట్టు సాధించాలి. అదే విధంగా స్టాక్ జీకేపైనా అవగాహన పెంచుకోవాలి.

క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్

హైస్కూల్ స్థాయి మ్యాథమెటిక్స్‌లోని ప్రాథమిక అంశాలపై పట్టు సాధించాలి. అర్థమెటిక్‌కు సంబంధించి పర్సంటేజ్, యావరేజెస్, రేషియో-ప్రపోర్షన్, ప్రాఫిట్-లాస్, సింపుల్-కాంపౌండ్ ఇంట్రెస్ట్, టైమ్-వర్క్, టైమ్-డిస్టెన్స్, పర్ముటేషన్స్-కాంబినేషన్స్, ప్రాబబిలిటీ, మిక్చర్ అండ్ అలిగేషన్స్, పార్టనర్‌షిప్‌పై దృష్టిపెట్టాలి. భాగహారాలు, కూడికలు, తీసివేతలు వంటి ప్రాథమిక అంశాలను నోటితో గణించే విధంగా ప్రాక్టీస్ చేయాలి. సింప్లిఫికేషన్స్‌కు సంబంధించి బోడ్‌మస్ రూల్స్‌ను ఎక్కువగా ప్రాక్టీస్ చేయాలి. సంఖ్యల వర్గాలు, ఘనాలు గుర్తించుకోవాలి.

ఇంగ్లిష్ కాంప్రహెన్షన్

అభ్యర్థులు బేసిక్ గ్రామర్‌పై అవగాహన పెంచుకోవాలి. దీంతోపాటు ఫిల్ ఇన్ ది బ్లాంక్స్, రీడింగ్ కాంప్రహెన్షన్, యాంటానిమ్స్, సినానిమ్స్, స్పాటింగ్ ద ఎర్రర్స్, స్పెల్లింగ్స్, కరెక్షన్ ఆఫ్ సెంటెన్సెస్, టెన్సెస్, ప్రిపోజిషన్స్, యాక్టివ్ అండ్ ప్యాసివ్ వాయిస్, వొకాబులరీ, రీ రైటింగ్ ద సెంటెన్స్, సెంటెన్స్ రీ అరేంజ్‌మెంట్, ఆల్ఫా బెటికల్ ఆర్డర్, ప్రెసిస్ రైటింగ్, బేసిక్ ఇంగ్లిష్ గ్రామర్‌పై పట్టు సాధించాలి. టెన్సెస్, సెంటెన్స్ ఫార్మేషన్, యాక్టివ్-ప్యాసివ్ వాయిస్, కాంప్లెక్స్ సెంటెన్స్ వంటి ముఖ్యాంశాలపై దృష్టి సారించాలి. రీడింగ్ కాంప్రహెన్షన్, వొకాబ్యులరీల్లోనూ పూర్తి స్థాయిలో నైపుణ్యం పొందాలి.

డేటా ఇంటర్‌ప్రెటేషన్

టేబుల్స్, చార్ట్‌లు, గ్రాఫ్‌ల ద్వారా సమాచారమిస్తూ ప్రశ్నలు అడిగే విభాగం ఉంది. డేటా ఇంటర్‌ప్రెటేషన్ ప్రశ్నలను సాధించాలంటే.. పర్సంటేజెస్, యావరేజెస్, రేషియోలపై అవగాహన ఉండాలి. వివిధ రకాల గ్రాఫ్‌లను సాధన చేయాలి. ఈ విభాగంలో పట్టు కోసం టేబుల్స్, బార్ చార్ట్స్, పై చార్ట్స్ మొదలైన వాటిని బాగా ప్రాక్టీస్ చేయాలి.

కంప్యూటర్ నాలెడ్జ్

ఈ విభాగంలో రాణించేందుకు కంప్యూటర్ ఫండమెంటల్స్, బేసిక్ కంప్యూటర్ స్ట్రక్చర్, ఆపరేటింగ్ సిస్టమ్, నెట్‌వర్క్, ఇంటర్నెట్, సాఫ్ట్‌వేర్ కాన్సెప్ట్స్, డీబీఎంఎస్, ఎంఎస్ ఆఫీస్‌లకు సంబంధించి బేసిక్ టెర్మినాలజీపై పట్టు సాధించాలి. సిస్టమ్‌కు సంబంధించి హార్డ్‌వేర్ టూల్స్, వాటి ఉపయోగాలు వంటి వాటిపైనా అవగాహన ఏర్పరచుకోవాలి.

పేపర్-2, పేపర్-3

జూనియర్ స్టాటిస్టికల్ ఆఫీసర్ పోస్టుల అభ్యర్థులకు నిర్వహించే పేపర్-2, అదే విధంగా అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్/అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ పోస్టుల అభ్యర్థులకు జరిపే పేపర్-3లలో రాణించేందుకు అభ్యర్థులు బ్యాచిలర్ డిగ్రీ స్థాయిలో అకడమిక్ పుస్తకాలను అభ్యసనం చేయాలి. అదే విధంగా గత ప్రశ్న పత్రాలు, నమూనా ప్రశ్న పత్రాలను సాధన చేయడం కూడా ఉపయుక్తంగా ఉంటుంది.

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ △
53	22
79,997	24,314

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు

నాస్‌డాక్	18,353	△	164
డోజోన్స్	39,376	△	68
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,203	▽	37
డాక్స్	18,475	△	25
షాంఘై	2,949	▽	8
నికాయ్	40,912	▽	1

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బిఐ	83.06	84.08
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బిఐ	105.44	107.80
€	యూరో	ఎస్‌బిఐ	89.27	91.64
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బిఐ	51.47	52.60
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బిఐ	55.30	57.28
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.50	64.16
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.35	22.92
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.85	23.63
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.36	12.44

పాలసీ సరెండర్ చేస్తే.. ఇక ఊరట!



- నిబంధనల్లో తాజాగా మార్పులు..
- తొలి నాళ్లలో రద్దు చేసుకుంటే అధిక మొత్తం
- సెప్టెంబర్ నాటికి అమలు చేయాలన్న ఐఆర్‌డీఏఐ
- ప్రీమియం భారమైతే సరెండర్ ఒక మార్గం
- తప్పుడు పాలసీ అంటగట్టినా వదిలించుకోవచ్చు..



ప్రతి కుటుంబానికి జీవిత బీమా రక్షణ ఎంతో అవసరం. జీవిత బీమాను పెట్టుబడి సాధనంగా చూసే ధోరణి మన సమాజంలో ఎక్కువగానే ఉంది. నేటికీ సంప్రదాయ బీమా పాలసీలు (ఎండోమెంట్, మనీబ్యాక్/జీవించి ఉన్నా రాబడులు వచ్చేవి) ఎక్కువగా విక్రయమవుతుండడం దీనికి నిదర్శనం. నిజానికి ఈ తరహా ప్లాన్లలో తక్కువ రక్షణకే ఎక్కువ ప్రీమియం చెల్లించాల్సి వస్తుంది. దీంతో ప్రీమియం భారంగా మారి కట్టలేని పరిస్థితుల్లో అర్ధాంతరంగా విడిచిపెట్టేసేవారు ఉన్నారు. ఇక పాలసీ వద్దనుకుని వెనక్కి ఇచ్చేస్తే (సరెండర్) బీమా సంస్థలు నిబంధనల మేరకు కొంత మొత్తాన్ని వెనక్కి ఇస్తుంటాయి. పాలసీ తీసుకున్న తొలినాళ్లలో రద్దు చేసుకుంటే చేతికి వచ్చేది పిసరంతే. ఇది గమనించిన బీమారంగ నియంత్రణ, అభివృద్ధి సంస్థ (ఐఆర్‌డీఏఐ) పాలసీదారుల ప్రయోజనాల పరిరక్షణకు వీలుగా నిబంధనల్లో మార్పులు తీసుకొచ్చింది. కనుక పాలసీని సరెండర్ చేస్తే ఎంత మొత్తం వెనక్కి వస్తుందన్న దానిపై పాలసీదారులు అవగాహన కలిగి ఉండడం అవసరం. ఆ వివరాలే ఈ వారం ప్రాఫిట్ ప్లస్ కథనం.

సరెండర్ వేల్యూ?

జీవిత బీమాలో సరెండర్ వేల్యూ అంటే.. గడువు తీరకుండానే పాలసీని రద్దు చేసుకుంటే పాలసీదారుకు బీమా సంస్థ తిరిగి చెల్లించే మొత్తం. పాలసీ కాల వ్యవధి మధ్యలో వైదొలిగితే కట్టిన ప్రీమియంల నుంచి కొంత మొత్తాన్ని బీమా సంస్థ వెనక్కి ఇస్తుంది. సరెండర్ చార్జీల (స్వాధీనపు చార్జీలు) పేరుతో కొంత మినహాయించుకుంటుంది. సరెండర్ చేయడం కంటే పాలసీని కొనసాగించడమే నయమనే విధంగా, పాలసీ ముందస్తు రద్దును నిరుత్సాహపరిచే స్థాయిలో సరెండర్ చార్జీలు ఇంతకుముందు అమల్లో ఉండేవి. ఇది అసమంజసమని భావించిన ఐఆర్‌డీఏఐ పాలసీదారుల ప్రయోజనాల కోణంలో నిబంధనలు మార్చింది. సరెండర్ వేల్యూ అన్నది.. గ్యారంటీడ్ సరెండర్ వ్యాల్యూ (జీఎస్‌వీ), స్పెషల్ సరెండర్ వ్యాల్యూ (ఎస్ఎస్‌వీ) అని రెండు రకాలుగా ఉంటుంది. గ్యారంటీడ్ అంటే పాలసీ రద్దుతో బీమా సంస్థ చెల్లించాల్సిన కనీస మొత్తం. ఇందులో పాలసీ గడువు తీరినప్పుడు ఇచ్చే బోనస్‌లను కలపరు. అదే స్పెషల్ సరెండర్ వేల్యూలో అప్పటి వరకు సమకూరిన బోనస్‌లు, ఇతర ప్రయోజనాలు కూడా కలుస్తాయి. బీమా సంస్థలతో సంప్రదింపుల మీదట ఐఆర్‌డీఏఐ కొత్త నిబంధనలు తీసుకొస్తూ జూన్ 12న జీవిత బీమా సంస్థలకు మార్గదర్శకాలు జారీ చేసింది. ప్రధానంగా స్పెషల్ సరెండర్ వ్యాల్యూ నిబంధనల్లో కీలకమైన మార్పును ఐఆర్‌డీఏఐ తీసుకొచ్చింది.

ఎంతొస్తుంది..?



పాలసీ తీసుకున్న ఏడాది తర్వాత వైదొలిగితే గతంలో ఏమీ వచ్చేది కాదు. కానీ, ఇక మీదట కొంత మొత్తం చెల్లించక తప్పదు. అలాగే పాలసీ తీసుకున్న మొదటి ఐదేళ్లలో సరెండర్ చేస్తే గతంలో పెద్దగా తిరిగొచ్చేది కాదు. కానీ ఇప్పుడు బీమా సంస్థలు అధిక మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుంది. పాలసీ వారీగా గ్యారంటీడ్ సరెండర్ వేల్యూ, స్పెషల్ సరెండర్ వేల్యూ, చెల్లింపుల సరెండర్ వేల్యూ గురించి పాలసీ ఇలస్ట్రేషన్ (ప్రయోజనాల) పత్రంలో పేర్కొనాలని ఐఆర్‌డీఏఐ నిర్దేశించింది. ఈ పత్రంపై పాలసీ కొనుగోలుదారు, బీమా ఏజెంట్ లేదా బీమా సంస్థ అధీకృత మధ్యవర్తి లేదా పంపిణీ ఉద్యోగి సంతకం కూడా చేయాల్సి ఉంటుంది.

సంప్రదాయ ఎండోమెంట్ పాలసీని సరెండర్ చేస్తే ఎంతొస్తుందన్నది ఉదాహరణ ద్వారా సులభంగా తెలుసుకునే ప్రయత్నం చేద్దాం. రవికిరణ్ రూ.5 లక్షల సమ్ అష్యూర్డ్ (బీమా కవరేజీ)తో పదేళ్ల కాలానికి (టర్మ్) పాలసీ తీసుకున్నాడని అనుకుందాం. ఏటా రూ.50,000 ప్రీమియం చెల్లించాలి. నాలుగేళ్లపాటు ఏటా రూ.50,000 చొప్పున ప్రీమియం చెల్లించిన తర్వాత అతడు పాలసీని సరెండర్ చేద్దామనుకున్నాడు. అప్పటి వరకు ప్రీమియం రూపంలో అతడు బీమా సంస్థకు రూ.2,00,000 చెల్లించాడు. ఏటా రూ.10,000 చొప్పున బోనస్ అతడికి జమ అయింది. గత నిబంధనల ప్రకారం పాలసీ తీసుకున్న తర్వాత నాలుగో ఏడాది నుంచి ఏడో ఏడాది మధ్య సరెండర్ చేస్తే అప్పటి వరకు తాము వసూలు చేసిన ప్రీమియంలలో 50 శాతాన్ని బీమా సంస్థలు వెనక్కి ఇచ్చేవి. 'అంటే పాత నిబంధనల ప్రకారం రవికిరణ్ నాలుగేళ్ల తర్వాత పాలసీని సరెండర్ చేస్తే వచ్చే మొత్తం రూ.1,20,000 అవుతుంది. చెల్లించిన ప్రీమియంతోపాటు బోనస్‌లు కూడా కలుపుకుని చూస్తే అప్పటికి రూ.2,40,000 సమకూరింది. అంటే ఇందులో సగం కోల్పోవాల్సి వచ్చేది. కానీ, నూతన స్పెషల్ సరెండర్ వేల్యూ నిబంధనల కింద నాలుగేళ్ల తర్వాత సరెండర్ చేస్తే ఇదే ఉదాహరణ కింద రవికిరణ్‌కు రూ.1.55 లక్షలు వెనక్కి వస్తాయి' అని సెబీ నమోదిత ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్, సహజ్‌మనీ వ్యవస్థాపకుడు అభిషేక్ కుమార్ వివరించారు. ఆయా అంశాలకు సంబంధించి నిపుణుల సలహాలు తీసుకోవడం అవసరమన్నారు.

ఒకవేళ ఇదే పాలసీని మొదటి ఏడాది ప్రీమియం రూ.50,000 చెల్లించిన తర్వాత రవికిరణ్ సరెండర్ చేస్తే పాత నిబంధనల కింద రూపాయి కూడా వెనక్కి రాదు. కానీ, కొత్త నిబంధల కింద రూ.31,295 వెనక్కి వస్తుంది. అంటే చెల్లించిన ప్రీమియంలో 62.59 శాతానికి సమానం. ఇలా ఏటా పెరుగుతూ వెళుతుంది. రెండో ఏడాది సరెండర్ చేస్తే అప్పటికి చెల్లించిన ప్రీమియంలో 67.28 శాతం వెనక్కి వస్తుంది. మూడో ఏట 72.33 శాతం, నాలుగో ఏట 77.76 శాతం, ఐదో ఏటా 83.59 శాతం, ఆరో ఏట 89.86 శాతం, ఏడో ఏట 96.60 శాతం, ఎనిమిదో ఏడాది ప్రీమియం చెల్లించిన తర్వాత అప్పటికి చెల్లించిన ప్రీమియంపై 103.84 శాతం, తొమ్మిదో ఏట 111.63 శాతం బీమా సంస్థ వెనక్కి ఇస్తుంది. లిమిటెడ్ ప్రీమియం పేమెంట్ పాలసీలు, సింగిల్ ప్రీమియం పాలసీల్లోనూ ఒక్కసారి ప్రీమియం చెల్లించినా సరే స్పెషల్ సరెండర్ వేల్యూ వెనక్కి ఇవ్వాల్సిందేనని ఐఆర్‌డీఏఐ కొత్త నిబంధనల్లో నిర్దేశించింది.

ఎప్పటి నుంచి..?

స్పెషల్ సరెండర్ వేల్యూ కొత్త నిబంధనలను ఈ ఏడాది సెప్టెంబర్ 30 నాటికి అమలు చేయాలని ఐఆర్‌డీఏఐ ఆదేశించింది. స్పెషల్ సరెండర్ వేల్యూ నిబంధనలు కొత్తగా తీసుకునే ఎండోమెంట్ పాలసీలకే వర్తిస్తాయని బంధన్ లైఫ్ ఇన్సూరెన్స్ ఎండీ, సీఈవో బి.సతీశ్వర్ తెలిపారు. నూతన నిబంధనలు అమల్లోకి వచ్చిన తర్వాత తీసుకునే పాలసీలకే ఐఆర్‌డీఏఐ తీసుకొచ్చిన స్పెషల్ సరెండర్ వేల్యూ నిబంధనలు అమలవుతాయి.

ప్రత్యామ్నాయాలు...

ఎండోమెంట్ ప్లాన్లను తీసుకుని కొన్నేళ్లపాటు ప్రీమియం చెల్లించిన తర్వాత, ఆపై కొనసాగించడం భారంగా మారిన వారికి సరెండర్ చేయడం ఒక్కటే ఆప్షన్ కాదు. ఆ పాలసీని పెయిడప్‌గా మార్చుకోవచ్చు. పెయిడప్‌గా మార్చుకోవడం వల్ల బీమా రక్షణ కొనసాగుతుంది. అప్పటి నుంచి పాలసీ ముగిసే వరకు ఏటా ప్రీమియం కూడా చెల్లించనక్కర్లేదు. అప్పటి వరకు ఎన్నేళ్లపాటు, ఎంత మేర ప్రీమియం చెల్లించారన్న దాని ఆధారంగా బీమా కవరేజీని నిర్ణయిస్తారు. ఉదాహరణకు రూ. 5 లక్షల సమ్ అష్యూర్డ్ పాలసీని 20 ఏళ్ల కాలానికి తీసుకుని, ఏటా రూ. 50వేల చొప్పున ఐదేళ్లపాటు ప్రీమియం చెల్లించారని అనుకుందాం. ఆ తర్వాత ఇక కొనసాగించడం వీలు కాని వారు పెయిడప్‌గా మార్చుకుంటే, అదే పాలసీ రూ.5 లక్షలకు బదులు రూ.1-1.5 లక్షల సమ్ అష్యూర్డ్‌తో 20 ఏళ్ల వరకు కొనసాగుతుంది. గడువు తీరిన తర్వాత నిబంధనల మేరకు, అప్పటి వరకు సమకూరిన బోనస్ ప్రయోజనాలతో కలిపి చెల్లింపులు లభిస్తాయి.

మరో మార్గంగా పెయిడప్‌గా మార్చి, సమ్ అష్యూర్డ్ తగ్గించుకుని, అప్పటి నుంచి తక్కువే ప్రీమియం చెల్లిస్తూ వెళ్లొచ్చు. దీనివల్ల పెయిడప్ సమ్ అష్యూర్డ్ కవరేజీ కొంత పెరుగుతుంది. కాకపోతే పెయిడప్ చేసేందుకు బీమా సంస్థలు చార్జీలు వసూలు చేయడమే ప్రతికూలం. ఒకవేళ నిధుల అవసరం ఏర్పడి, పాలసీని సరెండర్ చేస్తే తిరిగొచ్చే మొత్తం ఆదుకుంటుందని భావిస్తే అప్పుడు అదే ఆప్షన్‌ను పరిశీలించొచ్చు.



ప్రయోజనాలు

నూతన నిబంధనలు పాలసీదారులకు ప్రయోజనమన్నది నిపుణుల విశ్లేషణ. ఏజెంట్ చెప్పిన మాటలు విని లేదా తెలిసిన వారు చెప్పారనో ఏదైనా పాలసీ కొనుగోలు చేసిన తర్వాత.. అది తమకు సరిపడేది కాదని గుర్తించిన సందర్భాల్లో దాన్ని సరెండర్ చేసి బయటకు రావచ్చు. తమ అవసరాలకు తగిన మరో ప్లాన్‌ను కొనుగోలు చేసుకోవచ్చని చెబుతున్నారు. అనుచిత వ్యాపార విధానాలపై (బీమా కంపెనీలకు సంబంధించి) పాలసీదారుల నుంచి వచ్చే ఫిర్యాదులు 1.5 శాతం పెరిగినట్టు ఐఆర్‌డీఏఐ 2022-23 నివేదిక సైతం తెలియజేస్తోంది. ముఖ్యంగా ప్రైవేటు బీమా కంపెనీలకు సంబంధించిన ఫిర్యాదులే ఎక్కువగా ఉన్నాయి. పాలసీదారులను తప్పుదోవ పట్టించి, వారితో పాలసీలు కొనుగోలు చేయించే అనైతిక ధోరణలకు చెక్ పెట్టడం కూడా సరెండర్ వేల్యూ పెంచడంలోని ఉద్దేశమని నిపుణులు చెబుతున్నారు.

సంప్రదాయ పాలసీలు / టర్మ్ ప్లాన్లు



ఎండోమెంట్ ప్లాన్లలో పాలసీదారు కాల వ్యవధి ముగియక ముందే మరణించినట్టయితే సమ్ అష్యూర్డ్ (బీమా కవరేజీ) తోపాటు అప్పటి వరకు సమకూరిన బోనస్‌లు చెల్లిస్తారు. పాలసీ కాల వ్యవధి ముగిసే వరకు పాలసీదారు జీవించి ఉన్నప్పటికీ.. ఈ ప్లాన్లలో నిర్దేశిత మొత్తం తిరిగొస్తుంది. ఇది సమ్ అష్యూర్డ్ కంటే ఎక్కువే ఉంటుంది. అంటే ఒకవైపు బీమా రక్షణతోపాటు, రాబడి ప్రయోజనం కూడా ఈ ప్లాన్లలో భాగంగా ఉంటుంది. అందుకే ఈ ప్లాన్ల ప్రీమియం ఎక్కువగా ఉంటుంది. అయినా సరే తాము అప్పటి వరకు కట్టిన దానికంటే ఎక్కువే వస్తుందని చాలా మంది ఈ తరహా ప్లాన్లకే మొగ్గు చూపిస్తుంటారు. కానీ, 20 ఏళ్లు, అంతకు మించిన కాలవ్యవధి గల ఎండోమెంట్ ప్లాన్లలో వచ్చే నికర వార్షిక రాబడి 5 శాతంగానే ఉంటుందని అంచనా. అంటే ద్రవ్యోల్బణం రేటుకు సమానం. కనుక పాలసీదారులకు ఈ ప్లాన్లపై వచ్చే నికర రాబడి సున్నాయే అవుతుంది. టర్మ్ ఇన్సూరెన్స్ ప్లాన్లు వీటికి భిన్నం. ఇవి అచ్చమైన బీమా రక్షణకే పరిమితం అవుతాయి. అంటే పాలసీ కాల వ్యవధిలో (టర్మ్) పాలసీదారు మరణించినట్టయితే సమ్ అష్యూర్డ్ మొత్తం నామినీ లేదా వారసులకు లభిస్తుంది. ఒకవేళ పాలసీ కాల వ్యవధి ముగిసే వరకు పాలసీదారు జీవించి ఉంటే ఏమీ రాదు. పాలసీదారు జీవించి ఉన్నా, అప్పటి వరకు చెల్లించిన ప్రీమియంలను వెనక్కిచ్చే టర్మ్ ప్లాన్లు కూడా వచ్చాయి. కాకపోతే అచ్చమైన టర్మ్ ప్లాన్లతో పోలిస్తే వీటి ప్రీమియం 50-100 శాతం ఎక్కువే ఉంటుంది. 30 ఏళ్ల వ్యక్తి రూ.కోటి జీవిత బీమా కవరేజీని కేవలం రూ.10 వేల వార్షిక ప్రీమియానికే టర్మ్ ప్లాన్‌తో సొంతం చేసుకోవచ్చు.

స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ ఎఫ్‌డీ సురక్షితమేనా?

Q & A



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్



రిటైర్మెంట్ సమయంలో ప్రావిడెంట్ ఫండ్ ద్వారా నాకు రూ.కోటి సమకూరింది. ఆదాయపన్ను రిటర్నుల దాఖలు సమయంలో ఈ మొత్తాన్ని వెల్లడించాలా?

– ఘని వాణి

మీరు చెప్పింది నిజమే. ప్రావిడెంట్ ఫండ్ (భవిష్యనిధి) మొత్తంపై పన్ను మినహాయింపు ఉంటుంది. అయినా కానీ, ఈ మొత్తాన్ని ఆదాయపన్ను రిటర్నుల్లో తప్పకుండా వెల్లడించాలి. ఎందుకూ? అన్న సందేహం రావచ్చు. ఇలా వచ్చిన మొత్తాన్ని మీరు పెట్టుబడిగా పెడితే దానిపై వచ్చే రాబడులు పన్ను పరిధిలోకే వస్తాయి. మరి ఆ పెట్టుబడి ఎక్కడి నుంచి వచ్చిందో (మూలం) రిటర్నుల్లో వెల్లడించకపోతే, ఆ తర్వాత పలు సమస్యలు ఎదుర్కోవాల్సి రావచ్చు. లేదంటే పెనాల్టీ కూడా చెల్లించాల్సి రావచ్చు. రిటర్నుల్లో పీఎఫ్ మొత్తాన్ని ఎక్కడ చెల్లించాలన్న సందేహం రావచ్చు. పన్ను మినహాయింపు ఉన్న ఆదాయం ఏదైనా సరే దానిని 'షెడ్యూల్ ఈఐ'లో వెల్లడించాలి. ఈ షెడ్యూల్ కింద వెల్లడించిన మొత్తం సిస్టమ్ ఆటోమేటిక్‌గా పన్ను బాధ్యత లెక్కింపు సమయంలో మినహాయిస్తుంది. దాంతో పన్ను చెల్లించాల్సిన అవసరం రాదు.

స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌ల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్లు డెట్ మ్యూచువల్ ఫండ్స్ కంటే సురక్షితమేనా? డెట్ ఫండ్స్‌కు ఉన్న అదనపు ప్రయోజనాలు ఏమిటి?

– జబీర్

స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌ల ఫిక్స్‌డ్ డిపాజిట్లు (ఎఫ్‌డీలు), డెట్ మ్యూచువల్ ఫండ్స్ రెండూ దాదాపు సురక్షితమైనవే. కాకపోతే పెట్టుబడుల వైవిధ్యం పరంగా డెట్ మ్యూచువల్ ఫండ్స్ కాస్తంత అధిక రక్షణతో ఉంటాయి. స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌లను ఆర్‌బీఐ సునిశితంగా పర్యవేక్షిస్తుంటుంది. భద్రతా ప్రమాణాలు పాటించినప్పుడే ఆర్‌బీఐ లైసెన్స్ జారీ చేస్తుంది. స్మాల్ ఫైనాన్స్ బ్యాంకుల్లోనూ రూ.5 లక్షల వరకు ఎఫ్‌డీలకు డిపాజిట్ ఇన్సూరెన్స్ అండ్ క్రెడిట్ గ్యారంటీ కార్పొరేషన్ (డీఐసీజీసీ) కింద బీమా రక్షణ ఉంటుంది. దీన్ని అదనపు భద్రతగా భావించొచ్చు. డెట్ మ్యూచువల్ ఫండ్స్‌లో ప్రయోజనాలను గమనించినట్టయితే.. ప్రధానమైనది వైవిధ్యం. రూ.5లక్షలను డెట్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేశారనుకుంటే.. మీ పెట్టుబడి 50 వేర్వేరు డెట్ సెక్యూరిటీల మధ్య విస్తరించి ఉంటుంది. ఈ డెట్ సెక్యూరిటీల్లో ఏదైనా చెల్లింపుల్లో వైఫల్యం చెందినా, దాని ప్రభావం మొత్తం పెట్టుబడుల్లో 3-4 శాతం మించదు. డెట్ మ్యూచువల్ ఫండ్స్ అయితే పన్ను బాధ్యతను వాయిదా వేసుకోవచ్చు. డెట్ మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులను విక్రయించినప్పుడే లాభాలు పన్ను పరిధిలోకి వస్తాయి. కానీ, ఎఫ్‌డీల్లో అలా కాకుండా వడ్డీపై ఏటా పన్ను పడుతుంది. ఇక డెట్ మమ్యూచువల్ ఫండ్స్‌లో లిక్విడిటీ (కోరుకున్నప్పుడు వెంటనే నగదుగా మార్చుకోవడం) మెరుగ్గా ఉంటుంది. ఎఫ్‌డీలను ముందుగా రద్దు చేసుకుంటే పెనాల్టీ విధించొచ్చు. డెట్‌లో ఇది ఉండదు. కాకపోతే ఎఫ్‌డీల మాదిరిగా డెట్ ఫండ్స్ హామీపూర్వక రాబడులను ఆఫర్ చేయవు.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
మార్కెట్ స్థిరీకరణ అంచనాలు | హిండెన్‌బర్గ్ నివేదిక దురుద్దేశమే!

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

8-7-2024	
విశాఖ	570-00
చిత్తూరు	573-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	550-00
విజయవాడ	550-00
హైదరాబాద్	530-00
వరంగల్	532-00

కుటుంబానికి రూ.10 వేలకే హెల్త్ ఇన్సూరెన్స్

నారాయణ హెల్త్ వినూత్న పాలసీ

Narayana Health Insurance

న్యూఢిల్లీ: ఆరోగ్య బీమా ప్రీమియం సామాన్యులకు భారంగా మారిన తరుణంలో.. ప్రముఖ వైద్య సేవల సంస్థ 'నారాయణ హెల్త్' చౌక ప్రీమియంతో ఒక ప్లాన్‌ను ఆవిష్కరించింది. ఈ ఆరోగ్య బీమా పాలసీకి 'అతిథి' పేరు పెట్టింది. దంపతులు, ఇద్దరు పిల్లలు (గరిష్ఠంగా) కలిగిన నలుగురు సభ్యుల కుటుంబానికి ఏడాదికి ప్రీమియం కేవలం రూ.10,000గా నిర్ణయించింది. ఇంటిపెద్ద వయసు 45ఏళ్లకు మించకుండా ఉంటేనే ఈ ప్రీమియం. ఇంతకంటే అధిక వయసులోని వారికి ప్రీమియం (అది కూడా ఇతర బీమా సంస్థల కంటే తక్కువే) వేరుగా ఉంటుంది. నలుగురు సభ్యుల కుటుంబానికి ఒక ఏడాదిలో రూ.కోటి రూపాయల వరకు సర్జరీలకు ఈ పాలసీలో చెల్లింపులు లభిస్తాయి. ఇతర హాస్పిటల్ చికిత్సలకు (జ్వరం, ఇన్ఫెక్షన్ తదితర) రూ.5లక్షల వరకు కవరేజీ ఉంటుంది. కాకపోతే ప్రస్తుతానికి ఈ పాలసీ కింద సేవలు నారాయణ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లోనే లభిస్తాయి. ఈ సంస్థకు దేశవ్యాప్తంగా 21 హాస్పిటళ్లు ఉన్నాయి. బెంగళూరులో ఏడు ఆస్పత్రులతోపాటు, మూడు క్లినిక్‌లు ఉన్నాయి.

షేర్స్ స్టాక్స్

ఎస్‌బీఐ | బ్రోకరేజ్: జేఎమ్ ఫైనాన్షియల్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 860 టార్గెట్: రూ. 1,050

ఎందుకంటే: ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్‌బ్యాంక్(ఎస్‌బీఐ) తాజా వార్షిక నివేదిక ప్రకారం గతేడాది(2023-24) పలు అంశాలలో పటిష్ట పనితీరును ప్రదర్శించింది. ప్రధానంగా నాణ్యత, వృద్ధి, లాభదాయకతలో ఉత్తమ ఫలితాలు సాధించింది. క్లిష్టతర లిక్విడిటీ పరిస్థితుల్లోనూ రుణ విడుదలలో 15.8 శాతం, డిపాజిట్లలో 11.1 శాతం వృద్ధిని అందుకుంది. ఈ బాటలో కరెంట్, పొదుపు ఖాతాల(కాసా)ను 41.1 శాతం స్థాయిలో నిర్వహిస్తోంది. ఈ అంశాలన్నీ తీవ్రతర పోటీ పరిస్థితుల్లోనూ బ్యాంక్ మార్కెట్ వాటాకు రక్షణను కల్పిస్తున్నాయి. ఇక క్రెడిట్ వ్యయం 0.23 శాతానికి తగ్గింది. వార్షిక ప్రాతిపదికన 0.27 శాతం క్షీణించింది. 2019-20లో ఇది 1.87 శాతంగా నమోదుకావడం గమనార్హం! మరోవైపు వార్షికంగా చూస్తే 2008-09 తదుపరి ఆర్‌వోఏ 1 శాతాన్ని అధిగమించింది. వేతన సవరణ, పెన్షన్ బకాయిలు(లయబిలిటీస్)కు ప్రొవిజన్ల(వన్‌టైమ్) ప్రభావం అధిక నిర్వహణ వ్యయాలకు(ఒపెక్స్) కారణమైంది. దీంతో వార్షికంగా 1.87 శాతం నుంచి 2.02 శాతానికి పెరిగింది. పటిష్ట రుణ వృద్ధి, నికర వడ్డీ మార్జిన్ల(3.28 శాతం)లో నిలకడ, తగ్గిన ప్రొవిజన్లు నికర లాభం మరింత(వార్షికంగా 22 శాతం) బలపడేందుకు దోహదం చేశాయి. 2023 నవంబర్‌లో ఆర్‌బీఐ తప్పనిసరి చేయడంతో పెరిగిన రిస్క్ వెయిట్స్ నేపథ్యంలోనూ మూలధన(సీఈటీ-1) నిష్పత్తి 9 బేసిస్ పాయింట్లు పుంజుకుని 10.36 శాతానికి చేరింది. ఇది మూలధన నిర్వహణలో ఎస్‌బీఐ సమర్థతను ప్రతిఫలిస్తోంది. స్టాండెలోన్ ప్రాతిపదికన బ్యాంక్ సీఏఆర్ 14.25 శాతాన్ని తాకింది. బలపడుతున్న క్రెడిట్ డిమాండ్(ప్రధానంగా హోల్‌సేల్ విభాగంలో), ప్రయివేట్ రంగంలో పెట్టుబడి వ్యయాలు పెరగనున్న అంచనాలు సమీప భవిష్యత్‌లో మరింత మెరుగైన పనితీరుకు మార్గం చూపనున్నాయి.



మేదాంతా | బ్రోకరేజ్: యాక్సిస్ సెక్యూరిటీస్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 1,267 టార్గెట్: రూ. 1,475

ఎందుకంటే: మేదాంతా పేరుతో ఆరోగ్య పరిరక్షణ సర్వీసులందిస్తున్న గ్లోబల్ హెల్త్ లిమిటెడ్ పటిష్ట బ్రాండ్ ఈక్విటీని కలిగి ఉంది. అంతర్జాతీయంగా సుప్రసిద్ధులైన కార్డియోవాస్కులర్, కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ త్రెహాన్ ఏర్పాటు చేసిన సంస్థ ఇది. రోగుల ఆరోగ్య పరిరక్షణలో అత్యున్నత ప్రమాణాలను నెలకొల్పడంతోపాటు, అత్యంత క్లిష్టమైన చికిత్సలలో ప్రత్యేకతను చాటుకుంటూ సంస్థ మార్కెట్లో బాగా బలపడింది. ప్రధానంగా గుండె సంబంధ వ్యాధుల చికిత్స(కార్డియాక్)సహా.. డైజెస్టివ్, అంకాలజీ, న్యూరో విభాగాలు కంపెనీకి ఆర్థికంగా బలిమినిస్తున్నాయి. మొత్తం ఆదాయంలో ఈ విభాగాల వాటా 59 శాతంకాగా.. వీటికి అదనంగా లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్(కాలేయ మార్పిడి), కిడ్నీ, యూరాలజీ, ఆర్థోపెడిక్స్, విభిన్న చికిత్సలతోకూడిన ఇంటర్నెల్ మెడిసిన్ తదితర సేవలను అందిస్తోంది. వెరసి ఇవన్నీ మేదాంతా ఆదాయ వృద్ధికి దన్నుగా నిలుస్తున్నాయి. భారీ వృద్ధికి వీలు కల్పిస్తూ వ్యూహాత్మకంగా ఏర్పాటైన సంస్థ వేగవంత విస్తరణకు ప్రణాళికలు అమలు చేస్తోంది. దీనిలో భాగంగా నిర్వహణలోగల ఆసుపత్రుల పైనే దృష్టి పెట్టింది. తద్వారా ప్రస్తుతమున్న 2,823 పడకల(బెడ్స్) సామర్థ్యాన్ని భారీ స్థాయిలో విస్తరించనుంది. రానున్న మూడేళ్ల కాలంలో అదనంగా 1,394 బెడ్స్‌ను జత చేసుకునే ప్రణాళికలకు తెరతీసింది. ఫ్రీ క్యాష్‌ఫ్లో- నిర్వహణ లాభ(ఎఫ్‌సీఎఫ్‌ఎఫ్/ ఇబిటా) నిష్పత్తిలో ఆరోగ్య పరిరక్షణ రంగంలోకెల్లా అత్యధికంగా 60 శాతం మార్పిడిని సాధిస్తోంది. ఇకపై అమలుకానున్న విస్తరణ ప్రణాళికలకు అవసరమయ్యే పెట్టుబడులను.. అంతర్గత వనరుల నుంచే సమకూర్చుకునేందుకు ఇది దారి చూపనుంది. వెరసి వార్షికంగా రూ. 900-1,000 కోట్ల ఎఫ్‌సీఎఫ్‌ఎఫ్ సాధించేందుకు వీలు కలగనుంది. అదికూడా రానున్న మూడేళ్లలో ప్రతీ ఏడాది రూ. 300 కోట్ల కనీస పెట్టుబడి వ్యయాలతోనే సాధించేందుకు వీలుంది.



గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

యాదాద్రిలో శఠారి ఆశీర్వచనం ప్రారంభం



ప్రధానాలయంలోని ఆళ్వార్ మండపంలో భక్తులకు శఠారి ఆశీర్వచనం చేస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో శఠారి ఆశీర్వచనంను ఆదివారం అర్చకులు ప్రారంభించారు. ప్రధానాలయ పునర్నిర్మాణానికి ముందు పాత ఆలయంలో ఆండాళ్ అమ్మవారి ఆలయం వద్ద శఠారి పెట్టి, తీర్థం ఇచ్చే వారు. కానీ ప్రధానాలయ పునర్నిర్మాణంలో భాగంగా బాలాలయంతో పాటు ప్రధానాలయ ఉద్ఘాటన తరువాత ఈ సంప్రదాయం ప్రారంభం కాలేదు. ఇటీవల కాలంలో భక్తుల కోరిక, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సూచనతో ఈఓ భాస్కర్‌రావు ఆదేశాలతో ఆళ్వార్ మండపం వద్ద తీర్థం ఇచ్చి, శఠారి ఆశీర్వచనం భక్తులకు కల్పిస్తున్నారు. దీంతో భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


వర్షాల కోసం వరద పాయసం



బండపై పోసిన వరదపాయసం తింటున్న బాలురు

ఆత్మకూర్(ఎస్)(సూర్యాపేట): వరుణదేవుడు కరుణించి వర్షాలు కురిపించాలని కోరుతూ సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండలం నసీంపేట గ్రామంలో మహిళలు చుట్టుకాముడు ఆడారు. మహిళలంతా పసుపుతో గంగమ్మను తయారు చేసి.. మధ్యలో పెట్టి చుట్టూ తిరుగుతూ పాటలు పాడారు. అనంతరం ప్రత్యేకంగా తయారు చేసిన పాయసాన్ని.. గ్రామస్తులంతా డప్పు చప్పుళ్ల మధ్య కట్ట మైసమ్మ ఆలయం వద్దకు తీసుకెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చెరువు తూము వద్ద గల బండపై ఆ పాయసం (వరద పాయసం) కుమ్మరించారు. దీనిని గ్రామంలోని బాలురు నాలుకతో తిన్నారు. ఇలా చేస్తే వర్షాలు కురుస్తాయని గ్రామస్తుల నమ్మకం.

టుడేస్ గ్రాఫిక్



మణుగూరు సమీపంలోని వెన్నెల జలపాతం



విరబూసిన వెన్నెల

మణుగూరు టౌన్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండల పరిధిలోని ఆంజనేయ స్వామి ఆలయ సమీపంలో రథంగుట్టపై వెన్నెల జలపాతానికి పర్యాటకుల తాకిడి పెరిగింది. స్థానిక యువత, ప్రజలు కుటుంబసభ్యులతో ఆదివారం ఇక్కడికి వచ్చి సేదదీరుతున్నారు. వారం రోజులుగా అడపాదడపా కురుస్తున్న వర్షాలతో జలపాతం కనువిందు చేస్తోంది. అటవీ అధికారులు రెండేళ్ల క్రితం రూ.80 లక్షలు వెచ్చించి పగోడాలు, మహిళలకు టాయిలెట్లతో పాటు చుట్టూ కంచె, జలపాతానికి రోడ్డు ఏర్పాటు చేయించారు.

పిల్లలమర్రికి పూర్వవైభవం

నాడు 60% వరకు ఎండిపోయిన 700 ఏళ్ల మహా వృక్షం

- పునరుజ్జీవానికి చర్యలు చేపట్టిన అధికారులు
- సెలైన్ ట్రీట్‌మెంట్, రక్షణ చర్యలతో సత్ఫలితాలు
- అటవీ శాఖ కృషితో చిగురించిన కొత్త ఊడలు
- ప్రస్తుతం 90 శాతం వరకు పచ్చని ఆకులతో కళ కళ
- ఈ వారంలో మళ్లీ పర్యాటకులకు అనుమతి



నాడు సెలైన్లతో.. నేడు కళకళలాడుతూ..

స్టేషన్ మహబూబ్‌నగర్: పురాతన పిల్లలమర్రి పూర్వస్థితికి తిరిగొచ్చేలా అటవీ శాఖ చేసిన కృషి ఫలించింది. సుమారు 700 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన ఈ చెట్టు మళ్లీ పూర్వ వైభవం సంతరించుకుంటోంది. నాడు 60 శాతం వరకు ఎండిపోయి నిలువ నీడనిచ్చే పరిస్థితి లేకుండా పోయిన మహావృక్షం ప్రస్తుతం 90 శాతం వరకు చిగురించిన ఆకులతో మళ్లీ కనులకు విందు చేస్తోంది.

ఇదీ చరిత్ర: 700 ఏళ్ల క్రితం మొలకెత్తిన మర్రి మొలక క్రమేణా శాఖోపశాఖలుగా విస్తరించి క్రమేణా మొదలెక్కడో అంతు చిక్కని మహా వృక్షంగా ఎదిగింది. జిల్లా కేంద్రం నుంచి ఐదు కిలోమీటర్ల దూరంలో నాలుగు ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ మర్రి చెట్టును పర్యాటకులను అలరించేది. దాని చల్లని నీడన ప్రజలు సేద తీరేవారు. పిల్లలతో పాటు యువత ఊడల్ని పట్టుకుని ఊగేవారు. మొత్తం మీద ఓ పర్యాటక ప్రదేశంగా ఈ చెట్టు దేశ, విదేశీయుల్ని ఆకర్షించింది. అయితే సుమారు ఏడేళ్ల క్రితం (2017న డిసెంబర్ 16)ఈ మహా వృక్షానికి సంబంధించిన భారీ కొమ్మ ఒకటి విరిగిపడింది. ఆ తర్వాత క్రమంగా మరికొన్ని కొమ్మలు విరిగిపడే దశకు చేరుకున్నాయి. దీంతో అటవీ అధికారులు దీనిపై దృష్టి సారించారు.

ప్రత్యేక ట్రీట్‌మెంట్‌తో.. భారీ కొమ్మ విరిగిపడిన నేపథ్యంలో పిల్లలమర్రి పునరుజ్జీవం కోసం మెరుగైన చికిత్స అందించే బాధ్యతను అప్పటి కలెక్టర్ రొనాల్డ్ రోస్ అటవీ శాఖకు అప్పగించారు. 2017న డిసెంబర్ 20నే పర్యాటకులు ఊడలపై కూర్చోకుండా, వాటికి వేలాడకుండా ప్రధాన ద్వారాన్ని మూసివేశారు. అటవీ శాఖ పరిశోధనా నిపుణుల సలహాలు, సూచనలతో ప్రత్యేక ట్రీట్‌మెంట్‌ను ప్రారంభించారు.

పిల్లర్ల రక్షణలో పిల్లల మర్రి

కొమ్మలు, ఊడలు విరిగిపోకుండా, కిందికి పడకుండా అధికారులు వాటికి సహాయంగా పిల్లర్లు నిర్మించారు. 2018 ఫిబ్రవరి నుంచి సెలైన్ బాటిళ్లతో పిల్లలమర్రికి ప్రాణం పోసే చర్యలకు ఉపక్రమించారు. ఒక బాటిల్ నీళ్లలో 20 ఎంఎల్ క్లోరోఫైరిపస్ మందును కలిపి పడిపోతున్న ఊడలకు కట్టారు. లీటర్ నీళ్లలో 5 ఎంఎల్ క్లోరోఫైరిపస్ మందును కలిపి ఊడల కింది భాగంలో పిచికారీ చేశారు. చెదలు పట్టిన భాగాన్ని తీసివేసి సల్ఫర్ ఫాస్ఫేట్ చల్లారు. ప్రతి 15 రోజులకోసారి పంచగవ్య, హ్యూబ్రిక్ యాసిడ్ కూడా పిచికారీ చేశారు. ఈ నేపథ్యంలో చిగురిస్తున్న ఊడలు త్వరగా పెరిగి చెట్లకు ఆధారంగా నిలిచేలా ఊడలకు ప్లాస్టిక్ పైపులు (రూట్ ట్రైనర్) బిగించారు. అందులో ఎర్రమట్టి, వర్మీ కంపోస్టు, కోకోపెట్, మాస్ (నాచు) నింపారు. దీంతో చెట్టుకు కొత్త ఊడలు వచ్చాయి.

అయిదడుగుల కంచె.. సీసీ కెమెరాలు

పిల్లలమర్రి మహావృక్షాన్ని సంరక్షించేందుకు అధికారులు అన్ని చర్యలూ తీసుకుంటున్నారు. చెట్టు వద్దకు ఎవరూ వెళ్లకుండా, తాకకుండా చుట్టూ దాదాపు ఐదు అడుగుల ఎత్తున కంచె ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ప్రత్యేకంగా వాచర్లను నియమించారు. ఎవరైనా ఫెన్సింగ్ దూకి చెట్టు వద్దకు వెళ్లి తాకినా, ఆకులను తెంపినా ఫైన్ వేయనున్నారు. 2017 డిసెంబర్ తర్వాత మళ్లీ ఈ వారంలో పర్యాటకులను అనుమతించనున్నారు.

రూ.40 లక్షల వ్యయం

పిల్లలమర్రి చెట్టు ట్రీట్‌మెంట్‌కు, చుట్టూ ఉన్న ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు సుమారు రూ.40 లక్షలు వ్యయం చేశాం. సందర్శనకు వచ్చేవారు పిల్లలమర్రి చెట్టును ఫెన్సింగ్ అవతలి నుంచే చూడాలి. చెట్టును తాకడానికి వీల్లేదు. ఎవరైనా తాకితే జరిమానా విధిస్తాం.

– సత్యనారాయణ, డీఎఫ్‌ఓ

సజీవ సమాధికి స్వామీజీ యత్నం

- అఖండ భజన చేయాలంటూ భక్తులకు సూచన
- విషయం తెలియడంతో బయటకు రప్పించిన పోలీసులు
- నారాయణపేట జిల్లా రెనివట్లలో ఘటన



స్వామీజీ హనుమంతును సమాధి నుంచి బయటకు తీసుకొచ్చిన పోలీసులు

మద్దూరు: ఓ స్వామీజీ ఐదురోజులు సమాధికి ప్రయత్నించగా.. విషయం తెలుసుకున్న పోలీసులు నిలువరించారు. నారాయణపేట జిల్లా మద్దూరు మండలం రెనివట్లలో ఈ ఘటన ఆదివారం వెలుగుచూసింది. పోలీసుల కథనం ప్రకారం.. రెనివట్ల గ్రామానికి చెందిన సత్యానందస్వామి అలియాస్ హనుమంతు కొద్దిరోజులుగా వీరబ్రహ్మేంద్ర స్వామి భక్తుడిగా చెలామణి అవుతున్నాడు. ఈయన భార్య ఏడాది క్రితం పొలంలో ఎద్దు పొడవడంతో మృతిచెందింది. దీంతో ఆమెకు పొలంలోనే సమాధి కట్టించి పూజిస్తున్నాడు.అక్కడే ఆశ్రమం ఏర్పాటు చేసుకొని కొంతమందిని శిష్యులుగా చేసుకున్నాడు. శుక్రవారం అమావాస్య రోజున 'తాను ఐదు రోజులు సమాధిలోకి వెళతానని.. బయట అఖండభజనలు చేయాలని' భక్తులకు చెప్పి సమాధిలోకి వెళ్లాడు. ఆదివారం ఉదయం విషయం పోలీసులకు తెలియడంతో డీఎస్పీ లింగయ్య ఆధ్వర్యంలో అక్కడకు చేరుకొని సమాధిలో ఉన్న స్వామీజీని బయటకు రప్పించారు. అనంతరం డాక్టర్ స్వామీజీకి వైద్య పరీక్షలు చేయగా, ఆరోగ్యం నిలకడగా ఉంది. కొన్నేళ్ల క్రితం స్వగృహంలోనే ఒక అమావాస్య రోజు హనుమంతు మౌనదీక్ష చేపట్టారు. ఈ క్రమంలోనే కర్ణాటక చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు వస్తుండటంతో సొంత పొలంలోనే జీవ సమాధి కోసం ఒక ఆలయం నిర్మించినట్టు గ్రామస్తులు చెప్పారు.

ఔటర్‌పై కార్లు, ఇతర వాహనాలకు వేర్వేరు మార్గాలు

ఫాస్ట్‌ట్యాగ్ లేని మార్గంలోకి ప్రవేశిస్తే రెండింతలు పెనాల్టీ: నిర్వాహకులు



పుప్పాలగూడ టోల్‌గేట్ వద్ద ఫాస్టాగ్ ఉన్న కార్లకు ఏర్పాటు చేసిన ప్రత్యేక ద్వారాలు

మణికొండ: ఔటర్ రింగ్‌రోడ్డుపై పెరుగుతున్న ట్రాఫిక్‌తో టోల్‌గేట్ల వద్ద వాహనదారుల పడిగాపులు పెరిగిపోతున్నాయి. వాటిని నివారించే ఉద్దేశంతో అధిక రద్దీ ఉండే పుప్పాలగూడ టోల్‌గేట్ వద్ద నిర్వాహకులు ప్రత్యేక దారులను ఏర్పాటు చేసి రద్దీ నివారణ చర్యలు చేపట్టారు. ఆదివారం నుంచి శంషాబాద్ వైపు నుంచి వచ్చే వాహనాల కోసం ఉన్న మూడు టోల్ వసూలు కౌంటర్లలోకి కార్లను మాత్రమే అనుమతించారు. గచ్చిబౌలి నుంచి శంషాబాద్ వెళ్లే మార్గంలో కార్లకు ప్రత్యేక మార్గం ఏర్పాటు చేశారు. ఫాస్ట్‌ట్యాగ్ ఉన్న వాహనదారులే ప్రవేశించాలని సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఫాస్ట్‌ట్యాగ్ లేకుండా ఆయా మార్గాల్లోకి ప్రవేశిస్తే చెల్లించాల్సిన డబ్బుకు రెండితలు వసూలు చేస్తున్నామని టోల్‌గేట్ నిర్వాహకులు తెలిపారు. ఫాస్టాగ్‌లకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మార్గాల్లోకి ఇతర వాహనదారులు రావొద్దని బోర్డులు ఏర్పాటు చేసినా వారు ప్రవేశించి నగదు రూపంలో టోల్ చెల్లిస్తుండటంతో రద్దీ పెరిగిపోతోందన్నారు. అందుకే కచ్చితంగా ఫాస్టాగ్ ఉన్న కార్లను ఆయా మార్గాల్లో.. మిగతా వాహనాలను ఇతర కౌంటర్లలోకి అనుమతిస్తున్నామన్నారు. దాంతో ఆదివారం ఎక్కువగా ట్రాఫిక్ స్తంభించలేదని చెప్పారు. రాబోయే రోజుల్లో అధిక రద్దీ ఉండే మరిన్ని టోల్ కేంద్రాల వద్ద ఇలాంటి ఏర్పాట్లను చేస్తామని వారు తెలిపారు.

మూతపడిన వసతి గృహం

గుండాల: పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లల భవిష్యత్తు కోసం రూ.లక్షలు కేటాయించి నిర్మించిన ఎస్సీ బాలుర వసతి గృహం విద్యార్థుల్లేక నిరుప యోగంగా మారింది. యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం సీతారాంపురం గ్రామంలో ఎస్సీ సబ్ ప్లాన్ కింద 2013లో రూ.80 లక్షలతో వసతి గృహాన్ని నిర్మించారు. గ్రామంలో ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సుమారు 130 మంది విద్యార్థులున్నారు. గతంలో పరిసర గ్రామాలకు చెందిన విద్యార్థులు కూడా హాస్టల్‌లో ఉంటూ స్థానిక పాఠశాలలో చదువుకునేవారు. గత సంవత్సరం 40 మంది వరకు విద్యార్థులు ఈ హాస్టల్‌లో ఉండేవారు. వారు కూడా ఈసారి హాస్టల్‌కు రాకపోగా.. ఈ విద్యా సంవత్సరం ఇప్పటి వరకు ఒక్క విద్యార్థి కూడా చేరలేదు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు హాస్టల్‌ను మూసివేశారు. గ్రామాల్లోని విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను వివరించి.. విద్యార్థులు వసతి గృహంలో చేరేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు.

దేశంలోనే పెద్ద ప్రైవేటు పశువైద్య ఆస్పత్రి ప్రారంభం

బుర్జుగడ్డ తండాలో దాతల సాయంతో 'మా సరస్వతి'ఆస్పత్రి ఏర్పాటు



బుర్జుగడ్డ తండాలో 'మా సరస్వతి'పశు వైద్య ఆస్పత్రిని ప్రారంభిస్తున్న నిర్వాహకులు

శంషాబాద్ రూరల్: రంగారెడ్డి జిల్లాలో జంతు ప్రేమికులు, దాతల సహాయంతో ఏర్పాటు చేసిన ప్రైవేటు పశువైద్య ఆస్పత్రి ఆదివారం ప్రారంభమైంది. శంషాబాద్ మండలంలోని బుర్జుగడ్డ తండా వద్ద 'సత్యం శివం సుందరం'గోశాల ఆవరణలో రూ.3 కోట్లతో 'మా సరస్వతి'పేరుతో నిర్మించిన ఈ ఆస్పత్రి నేటి నుంచి అందుబాటులోకి వస్తుందని నిర్వాహకులు తెలిపారు. దేశంలోనే ఇది పెద్ద ప్రైవేటు పశువైద్య ఆస్పత్రి అని వారు వెల్లడించారు. ప్రముఖ జంతు ప్రేమికుడు, పలు గోశాలల నిర్వాహకుడు ధరమ్‌రాజ్ రాంఖా నేతృత్వంలో ఈ ఆస్పత్రిని నెలకొల్పారు. ఈ ఆస్పత్రిలో అంబులెన్స్, ఆపరేషన్ థియేటర్, ఇంటెన్సివ్ కేర్ యూనిట్, డయాగ్నోస్టిక్ సదుపాయాలు, మెడికల్ డిస్పెన్సరీ అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు వివరించారు. రోజూ 10 శస్త్రచికిత్సలు, 100 జంతువులకు చికిత్స చేసే సామర్థ్యం ఆస్పత్రికి ఉందన్నారు. ఏడాదికి మూడు వేల జంతువులకు శస్త్ర చికిత్స, 36 వేల జంతువులకు వైద్యం చేయాలని భావిస్తున్నట్లు డాక్టర్ నిషితా రాంఖా తెలిపారు. గగన్‌పహాడ్, బుర్జుగడ్డ తండాలో ఉన్న సత్యం శివం సుందరం గోశాలల్లోని పశువులతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల్లోని గొర్రెలు, మేకలు, కుక్కలకు కూడా వైద్య సేవలందిస్తామని చెప్పారు.

గీసుగొండలో మట్టి పూసల పనిముట్టు!

గుర్తించిన చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి





మట్టిపూసలు తయారు చేసే రాతి పనిముట్టు

సాక్షి ప్రతినిధి, వరంగల్: వరంగల్ జిల్లా గీసుగొండ గ్రామంలోని లక్ష్మీనరసింహస్వామి గుట్ట దిగువన 'దీపగడ్డ'గా పిలిచే పాటిగడ్డలో శిలా యుగం, శాతవాహనుల కాలంలో మట్టిపూసల తయారీకి వాడిన రాతి పనిముట్టును చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి గుర్తించారు. ఈ పనిముట్లకు సాధారణంగా ప్రవాహంలో నునుపుదేలిన పెబ్బల్ రాయిని ఉపయోగిస్తారని, అరచేతితో పట్టుకోవడానికి వీలుగా ఉంటాయన్నారు. మధ్యలో గ్లాస్ ఫినిషింగ్ చేసిన చిన్నబద్ది (కప్ మార్క్) ఉంటుందని చెప్పారు. నాటి గీసుగొండ ప్రాంతంలో మెత్తటి బంక మట్టిని చిన్నచిన్న గోలీలుగా చేసి పూసల పనిముట్టుపై ఉన్న వృత్తాకార, నునుపైన బద్దిలో పెట్టి అదిమేవారని.. వాటిని గుండ్రంగా తిప్పి రంధ్రం చేసి ఎండలో పెట్టేవారని భావిస్తున్నట్లు చెప్పారు. తర్వాత కాల్చి పూసలను తయారు చేసి పూసలన్నీ ఒకే పరిమాణంలోకి వచ్చేలా రాతి పనిముట్లు ఉపయోగించినట్లు తమ పరిశోధనలో తేలిందన్నారు. అయితే రైతులు రాతి పనిముట్ల విలువ తెలియక వాటిని మామూలు బండలు భావించి పారేస్తున్నారని.. దీనివల్ల విలువైన చరిత్రను కోల్పోతున్నామని రత్నాకర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో గ్రంథాలయాల కు అనుబంధంగా పురావస్తు మ్యూజియాలను నిర్మించుకోవాలని.. ముఖ్యంగా గీసుకొండ పరిధిలో గడ్డ మీద లభించే ప్రతి కుండ పెంకు, రాతి పనిముట్లను భద్రపరచాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.